॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ నవమోఽ ధ్యాయః - రాజవిద్యారాజగుహ్యాయోగః

## (తొమ్మిదవ అధ్యాయము - రాజవిద్యారాజగుహ్యాయోగము)

వేదాంతం ముఖ్య ఉద్దేశ్యం నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందటం. ఆధ్యాత్మిక రంగంలో ఒక సాధకుని ప్రయాణం ఎలా సాగాలి?

**కర్మయోగం + ఉపాసన యోగం + జ్ఞానయోగం = మోక్షం.**

అంటే ఒక సాధకుడు కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసన యోగానికి వచ్చి, చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలుచేసి మోక్షం పొందాలి. వీటిలో ఒక్కొక్క దశనూ వివరించుకుంటూ వస్తున్నాడు కృష్ణపరమాత్మ. మొదటి షట్కంలో కర్మయోగం గురించి వివరంగా చూశాము. ఎనిమిదవ అధ్యాయంలో కర్మరుడు పుణ్యలోకాలకు వెళతాడు కాని మోక్షం పొందడని చూశాము. ఇది కర్మయోగి పరిస్థితి.

ఇప్పుడు ఉపాసకుని విషయం చూస్తే, సకామ ఉపాసకుడు, నిష్కామ ఉపాసకుడు అని రెండు రకాలు ఉన్నారు. సకామ ఉపాసకుని గురించి మాట్లాడలేదు కృష్ణపరమాత్మ. నిష్కామ ఉపాసకునిలో కూడా రెండు రకాలు ఉన్నారు. సగుణ ఉపాసనచేసి చిత్త ఏకాగ్రత పొంది, నిర్గుణబ్రహ్మజ్ఞానానికి వస్తారు కొందరు. అలా రావాలి. కాని ఎనిమిదవ అధ్యాయంలో దీనికి రాకుండా జీవితాంతం సగుణ ఉపాసనే చేసిన వ్యక్తిని స్తుతించాడు కృష్ణపరమాత్మ. అది తప్పేం కాదు. అలా నిష్కామ ఉపాసన చేసిన వ్యక్తి క్రమముక్తి పొందుతాడు.

నిష్కామ ఉపాసకుణ్ణి, క్రమముక్తిని స్తుతించినా, నిజానికి కృష్ణపరమాత్మ అంతిమలక్ష్యం అది కాదు. దాని గురించి కూడా తెలియాలి కాబట్టి, దాని గురించిన జ్ఞానం ఇచ్చాడు తప్పితే, అది మధ్యమ అధికారికి వర్తిస్తుంది. అర్జునుడు దానికన్నా ఎదగాలి అని కృష్ణపరమాత్మ ఆశిస్తున్నాడు. అర్జునుడే కాదు, మనమంతా ఉపాసననుంచి, జ్ఞానమార్గానికి రావాలి, ఉత్తమ అధికారిగా ఎదగాలి.

జ్ఞానం పొందితే ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి పొంది, మరణించాక విదేహముక్తి పొందుతాము. ఒకవేళ ఇప్పుడే జ్ఞానం పొందకుండా మరణిస్తే, మళ్ళీ మనుష్యులుగా పుడతామో లేదో తెలియదు, పుట్టినా వేదాంతంమీద శ్రద్ధ కలుగుతుందో లేదో తెలియదు.

అందువల్ల జ్ఞానమార్గానికి రావాలి. అంటే సగుణ ఉపాసన కొన్నాళ్ళు చేసి, జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొంది, నిర్గుణ ఈశ్వరజ్ఞానానికి రావాలి. వేదాంతజ్ఞానం అంటే వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే జీవాత్మ-పరమాత్మల ఐక్యజ్ఞానం ఈ జన్మలోనే పొందుతాము. ఆ జ్ఞాననిష్ఠలో ఉంటే ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి

పొందుతాము. అందువల్ల రాబోయే అధ్యాయాల్లో అంటే 9, 10, 11, 12 అధ్యాయాల్లో ఉపాసననుంచి వేదాంత విచారణకు రావాలని చెపుతున్నాడు కృష్ణపరమాత్మ.

వేదాంత విచారణద్వారా ఏ జ్ఞానం పొందాలి? అది కూడా చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి, తొమ్మిదవ అధ్యాయంలో ప్రధానంగా వేదాంతవిచారణ లేదా నిర్గుణ ఈశ్వరజ్ఞానం గురించి చెప్పబోతున్నాడు. దానివల్ల ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందుతాడని కూడా చెపుతాడు. నిర్గుణ ఈశ్వరజ్ఞానానికి రావటానికి తొలి అడుగు సగుణ ఈశ్వర ఉపాసన అని చూపించబోతున్నాడు. ఇదీ ఈ అధ్యాయం సారాంశం.

ఈ అధ్యాయం ఒక అద్భుతమైన, పరిపూర్ణమైన అధ్యాయం. ఇది వేదాంతం గురించి ఒక విహంగ వీక్షణాన్ని ఇస్తుంది. ఇది ఏడవ అధ్యాయానికి చాలా దగ్గరగా ఉంటుంది. నిజానికి తొమ్మిదవ అధ్యాయాన్ని అధ్యయనం చేస్తుండగానే, దీన్ని ఏడవ అధ్యాయంతో పోల్చి చూడవచ్చు. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడతాము.

### 1. ఉపోద్ఘాతం: శ్లోకాలు 1-3

మొదటి మూడు శ్లోకాల్లో విషయాన్ని ప్రవేశపెడుతున్నాడు కృష్ణపరమాత్మ. విషయం – ఈశ్వరజ్ఞానం. ఎటువంటి ఈశ్వరజ్ఞానం? ఏడవ అధ్యాయంలో ఈశ్వరుని స్వరూపం రెండుగా ఉంటుందని చూశాము. అవి అపరాప్రకృతి, పరాప్రకృతి.

**అపరాప్రకృతి:** సగుణరూపంలో మనం కొలిచే ఇష్టదేవతలు అపరాప్రకృతిలోకి వస్తారు. నిజానికి విశ్వరూప ఈశ్వరుడు కూడా అపరాప్రకృతిలోకే వస్తాడు. ఎందుకంటే దానికి కూడా నామం, రూపం ఉంటుంది. నామం, రూపం ఉండి, మార్పుకు లోనయ్యేదైనా అపరాప్రకృతి కిందకే వస్తుంది. సగుణ సవికార సవికల్ప అచేతనస్వరూపం అపరాప్రకృతి. అంటే గుణాలు ఉన్న, వికారాలకు లోనయ్యే, భాగాలు ఉన్న వస్తుస్వరూపం అపరాప్రకృతి.

**పరాప్రకృతి:** దేశానికి, కాలానికీ అతీతంగా ఉన్న ఈశ్వరుని ఉన్నతస్వరూపం పరాప్రకృతి. దాన్ని చైతన్యస్వరూపం అంటారు.

నిర్గుణనిర్వికారనిర్వికల్ప చేతనస్వరూపం పరాప్రకృతి. గుణాలు లేని, వికారాలు లేని, భాగాలు లేని శుద్ధచైతన్యం పరాప్రకృతి.

కృష్ణపరమాత్మ అర్జునునితో చెపుతున్నాడు, 'హే అర్జునా, నీకు ఈ అధ్యాయంలో అపరాప్రకృతి, పరాప్రకృతుల స్వరూపాన్ని వివరిస్తాను.' ఏడవ అధ్యాయంలో చూశాము – అపరాప్రకృతి గురించి తెలుసుకోవటం జ్ఞానం; పరాప్రకృతి గురించి తెలుసుకోవటం విజ్ఞానం అవుతుంది. అందువల్లనే ఏడవ అధ్యాయం పేరు జ్ఞానవిజ్ఞాన యోగము అయింది. అంటే సగుణ ఈశ్వరజ్ఞానం, నిర్గుణ ఈశ్వర విజ్ఞానం.

సగుణ ఈశ్వరజ్ఞానం పొందితే, ద్వైతజ్ఞానం పొందుతాము. ఈశ్వరుడు వేరు, నేను వేరు అనుకుంటాము. భగవంతుడు పరిపూర్ణుడు, నేను అసంపూర్ణుణ్ణి; భగవంతుడు సర్వజ్ఞుడు, నేను అల్పజ్ఞుణ్ణి; పరమాత్మ అసంసారి, నేను సంసారిని. ఇలా ఎన్నైనా భేదాలు చెప్పుకుంటూ పోవచ్చు. కాని విజ్ఞానానికి వస్తే, అది అభేదజ్ఞానాన్ని లేదా అద్వైతజ్ఞానాన్ని ఇస్తుంది.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 1 **ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే ।**
**జ్ఞానం విజ్ఞానసహితం యద్జ్ఞాత్వా మోక్ష్యసేఽ శుభాత్ ॥**
ఇదమ్, తు, తే, గుహ్యతమమ్, ప్రవక్ష్యామి, అనసూయవే,
జ్ఞానమ్, విజ్ఞానసహితమ్, యత్, జ్ఞాత్వా, మోక్ష్యసే, అశుభాత్ ॥

| | | |
|---|---|---|
| యత్, తు | = | ఏది |
| జ్ఞాత్వా | = | తెలిసికొనుటవలన |
| అశుభాత్ | = | దుఃఖరూపసంసారమునుండి |
| మోక్ష్యసే | = | ముక్తుడవుతావో |
| (తత్) | = | అటువంటి |
| ఇదమ్ | = | ఈ |
| గుహ్యతమమ్ | = | పరమరహస్యమైన |
| విజ్ఞానసహితమ్ | = | విజ్ఞానసహితమైన |
| జ్ఞానమ్ | = | జ్ఞానమును |
| అనసూయవే | = | దోషదృష్టిలేని వాడవైన |
| తే | = | నీకు |
| ప్రవక్ష్యామి | = | మళ్ళీ పూర్తిగా వివరించెదను |

**యత్ జ్ఞాత్వా (త్వం) అశుభాత్ మోక్ష్యసే, (తత్) తు ఇదమ్**
**గుహ్యతమమ్ విజ్ఞాన-సహితమ్ జ్ఞానమ్ అనసూయవే తే ప్రవక్ష్యామి॥**

తా: ఏది తెలిసికొనుటవలన దుఃఖరూపసంసారమునుండి ముక్తుడవుతావో అటువంటి ఈ పరమరహస్యమైన విజ్ఞానసహితమైన జ్ఞానమును దోషదృష్టిలేని వాడవైన నీకు మళ్ళీ పూర్తిగా వివరించెదను.

నేను నీకు రెండు రకాల జ్ఞానాన్ని గురించి చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఇదం విజ్ఞాన సహితం జ్ఞానమ్ (అహం) ప్రవక్ష్యామి** – నేను నీకు స్పష్టంగా జ్ఞాన, విజ్ఞానాల గురించి బోధిస్తాను. కృష్ణపరమాత్మకు తన బోధమీద ఎంత నమ్మకమో చూడండి! నేను స్పష్టంగా చెబుతాను అంటున్నాడు. ఈ బోధయొక్క గొప్పతనం ఏమిటి? దేనికైనా ప్రకటనలు కావాలి. అప్పుడే మనుష్యులు ఆకర్షింపబడతారు. కాని భగవంతుడుచేసే ప్రకటనలో అబద్ధాలు ఉండవు.

**గుహ్యతమమ్** – ఈ బోధ చాలా రహస్యమైనది. ఎందుకంటే ఇది చాలా అపురూపమైన జ్ఞానం. ఎక్కడపడితే అక్కడ దొరకదు. నిజానికి ఈశ్వరజ్ఞానానికి వచ్చేవారు చాలా అరుదుగా ఉంటారు.

మీరే గమనించండి. రోడ్డుమీద మనుష్యులు కిటకిటలాడుతూ, ఒకరిని ఒకరు గుద్దుకోందే నడవలేని వీధుల్లో కూడా, ఒక గుడి ఉంటే అది మాత్రం నిర్మానుష్యంగా ఉంటుంది. ఒక్కడు కూడా ఉండడు. మనుష్యులకు పరుగులు పెట్టటమే సరిపోతుంది; ఆ వీధిలోనే ఉన్న గుడిలోకి అడుగుపెట్టి దేవుణ్ణి కొలిచే తీరికా, ఓపికా ఉండదు. అంత పెద్దగుడిలో, ఒంటరిగా, భక్తుల రాకకోసం ఎదురుచూస్తూ భగవంతుడు నిలుచుని ఉంటాడు.

అందువల్ల ఈశ్వరస్వరూపం గురించి తెలుసుకోవాలనే తపనే ఉండదు ఎవరికీ. ఒకవేళ పొరపాటున ఉన్నా కూడా సగుణ ఈశ్వరుని గురించి మాట్లాడతారు తప్ప నిర్గుణబ్రహ్మజ్ఞానానికి రావాలనుకోరు. అందువల్ల ఇది గుహ్యతమం అయింది. అత్యంత గొప్ప రహస్యం అయింది. ఇది అత్యంత అరుదైన, గొప్ప జ్ఞానమే కాదు,

**యత్ జ్ఞాత్వా అశుభాత్ మోక్ష్యసే** – ఈ జ్ఞానం పొందితే అమంగళంనుంచి ముక్తి పొందుతావు. మామూలుగా అందరూ ఇది చేస్తే నాకేమిటి లాభం అంటారు. అందుకని ఫలం చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అశుభం అంటే అమంగళం; అమంగళం అంటే సంసారం. సంసారంనుంచి విముక్తి పొందుతావు. అంటే జీవన్ముక్తి పొందుతావు. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలనుంచి; రాగద్వేషాలనుంచి; అన్ని రకాల బాధలనుంచి విముక్తి పొందుతావు. అంటే మనస్సు శాంతిస్తుంది.

ఈ అధ్యాయం అర్జున ఉవాచతో మొదలవలేదు. కృష్ణపరమాత్మ తనంతట తానే చెప్పుకొస్తున్నాడు. దానికి కారణం కూడా చెబుతున్నాడు.

**అనసూయవే తే (అహం ప్రవక్ష్యామి)** – నీకు విద్యాగర్వం లేదు కాబట్టి నేను నీకు చెబుతాను. అసూయ అంటే మనకు తెలిసిన ఈర్ష్య కాదు. అసూయ అంటే గురువు చెప్పినదాన్ని విమర్శనాత్మకంగా వినటం, కొంతమంది గురువును ఎంతసేపూ తప్పుపడదామని చూస్తారు; లేదా గురువుకు తెలుసో లేదోనని పరీక్ష చెయ్యటానికి వింటారు. అది మంచి అలవాటు కాదు. కొంతమందికి కొంత విద్య రాగానే ఆ విద్యాగర్వం వస్తుంది.

బృహదారణ్యకోపనిషత్తులో గార్గ్య అనే విద్యార్థిని దృప్తబాలాకీ అంటారు. అంటే అతనికి విద్యాగర్వం ఉంది. అలా గర్వం ఉంటే నష్టపోయేది ఎవరు? శిష్యుడే! అందువల్ల గురువు దగ్గరకు వెళ్ళేటప్పుడు వినయంగా వెళ్ళాలి. బోధలో దేన్నైనా స్వీకరించలేకపోయినా కూడా, సరియైన దృక్పథం ఉండాలి. ఎన్నడూ శాస్త్రాన్ని కాని, ఆచార్యుణ్ణి కాని తప్పు పట్టకూడదు. నాకే సరిగ్గా అర్థం కాలేదేమో అనుకోవాలి. అంటే మనం అర్థం చేసుకునే శక్తిని ప్రశ్నించుకోవాలి కాని బోధను ప్రశ్నించకూడదు. ఇటువంటి దృక్పథాన్ని శ్రద్ధ అన్నాడు కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలో.

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః।** – 4.39

ఓ అర్జునా, నీకా శ్రద్ధ ఉంది అంటున్నాడు. అందువల్ల అతనిని అనసూయ అన్నాడు.

**పర గుణేషు దోష ఆవిష్కరణమ్ అసూయా**

ఎదుటివారిలో తప్పులెన్నటం అసూయ. అసూయ అంటే ఈర్ష్య కాదు అని చూశాము. సంస్కృతంలో ఈర్ష్యను మాత్సర్యం అంటారు. దయానంద స్వామీజీ అలా ఎదుటివారిలో తప్పులెన్నేవారిని **ప్రూఫ్‌రీడర్స్ ఇంటలెక్ట్** అంటారు. ప్రూఫ్‌రీడర్లకు డబ్బులిచ్చేది అచ్చుతప్పులు వెతకటానికి. కాని మనం శాస్త్రాన్ని ఆ విధంగా అధ్యయనం చెయ్యకూడదు. అనసూయ అంటే అసూయ లేని వ్యక్తి అంటే శ్రద్ధ ఉన్న వ్యక్తి.

శ్లో. 2 **రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ॥**
రాజవిద్యా, రాజగుహ్యమ్, పవిత్రమ్, ఇదమ్, ఉత్తమమ్,
ప్రత్యక్షావగమమ్, ధర్మ్యమ్, సుసుఖమ్, కర్తుమ్, అవ్యయమ్ ॥

ఇదమ్ = ఈ విజ్ఞానసహిత జ్ఞానము
రాజవిద్యా = అన్ని విద్యలకును
రాజగుహ్యమ్ = తలమానికము, సమస్త రహస్య విషయములకును శిరోభూషణము
పవిత్రమ్ = మిక్కిలి పవిత్రమైనది
ఉత్తమమ్ = అత్యుత్తమము
ప్రత్యక్షావగమమ్ = ప్రత్యక్షముగా ఫలములను ఇచ్చునది
ధర్మ్యమ్ = ధర్మయుక్తము
కర్తుమ్ = సాధన చేయుటకు
సుసుఖమ్ = మిక్కిలి సుగమమైనది
అవ్యయమ్ = శాశ్వతమైనది

**ఇదమ్ (జ్ఞానం) రాజ-విద్యా, రాజ-గుహ్యమ్, ఉత్తమమ్, పవిత్రమ్,**
**అవ్యయమ్, ప్రత్యక్ష-అవగమమ్, కర్తుమ్ సుసుఖమ్, ధర్మ్యమ్ చ (అస్తి) ॥**

తా: ఈ విజ్ఞానసహిత జ్ఞానము అన్ని విద్యలకును తలమానికము, సమస్త రహస్యవిషయములకును శిరోభూషణము, మిక్కిలి పవిత్రమైనది, అత్యుత్తమము, ప్రత్యక్షముగా ఫలములను ఇచ్చునది, ధర్మయుక్తము, సాధన చేయుటకు మిక్కిలి సుగమమైనది, శాశ్వతమైనది.

ఇందులో కూడా కృష్ణపరమాత్మ ఈశ్వరజ్ఞాన మహిమ కొనసాగిస్తున్నాడు.

**రాజవిద్యా** – ఈశ్వరజ్ఞానం అన్ని జ్ఞానాలలోకి తలమానికం అయినది. దీన్నే ముండకోపనిషత్తులో పరావిద్య అంటారు. దీన్ని రాజవిద్య అని ఎందుకు అన్నాడు కృష్ణపరమాత్మ? దీనికి అనేక కారణాలు చెప్పవచ్చు.

1. ఇది అత్యున్నతమైన నిర్గుణస్వరూపం గురించి చెపుతుంది. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని బోధిస్తుంది. ఆ జగత్‌లో సగుణబ్రహ్మ కూడా వస్తాడు. ఇదొక్కటే సత్యం గురించి చెపుతుంది.
2. ఇది ఒక్కటే మోక్షాన్ని ఇస్తుంది. అది కూడా అన్ని స్థాయిల్లోనూ ఇస్తుంది.

ఎ) **శరీరపరంగా:** కొందరు ఉన్న శరీరంతో తృప్తి చెందరు. వీలుంటే దానికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయించు కుంటారు.

బి) **మనస్సు పరంగా:** నన్ను మా పిల్లలు పట్టించుకోవటం లేదు, ఫలానావారు నన్ను ప్రేమించటం లేదు అనుకుంటారు. కొంతమందికి అన్నీ ఉంటాయి. లంకంత ఇల్లు, కావాల్సినంత ఆస్తి, అన్నీ సమయానికి అమర్చిపెట్టే పిల్లలు ఉంటారు. అయినా వారు మానసికంగా కృంగిపోతారు. పిల్లలు నాతో మనస్సు విప్పి మాట్లాడి చాలా రోజులయింది అంటారు; లేదా నా పక్కన వచ్చి కూర్చునే తీరికే వీరికి లేదు అంటారు.

సి) **బుద్ధి పరంగా:** కొంతమందికి బుద్ధిపరంగా అసహనం ఉంటుంది. ఎన్నో తెలుసుకోవాలని ఉంటుంది. ముఖ్యంగా శాస్త్రజ్ఞులకు ఎన్ని తెలుసుకున్నా ఇంకా ఎన్నో తెలుసుకోవాలనే తపన ఉంటుంది.

బ్రహ్మజ్ఞానంపైన చెప్పిన మూడు స్థాయిల్లోనూ మోక్షాన్ని ఇస్తుంది.

**యద్‌జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే**

దాన్ని తెలుసుకుంటే, ఇంక ఈ జగత్తులో తెలుసుకోవాల్సింది ఏదీ మిగలదు. అందువల్ల అది రాజవిద్య అయింది.

**రాజగుహ్యమ్** – అత్యంత గొప్ప రహస్యవిద్య.

**శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః శృణ్వన్తోఽపి బహవో యం న విద్యుః ।**
**ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః ॥** – కఠ 1.2.7

ఇదే భావాన్ని రెండవ అధ్యాయంలో కూడా చూస్తాము.

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥** – 2.29

ఈ బోధ చాలామందికి అందుబాటులో ఉండదు. పైగా ఇది ఒక అద్భుతం. చాలామంది అనేక సంవత్సరాలు నేర్చుకున్నా కూడా అర్థం చేసుకోకుండా ఉండగలరు. ఇంకా గొప్ప ఆశ్చర్యం – విన్నాక కూడా రహస్యం రహస్యంగానే ఉండిపోతుంది. అంతకన్నా గొప్ప రహస్యం ఏముంటుంది? అంటే ఈ విద్య, విద్యల్లోకెల్లా రాజులాంటిది; రహస్యాల్లోకెల్లా రాజులాంటిది. అందువల్ల రాజవిద్య, రాజగుహ్యం అయింది.

**పవిత్రమ్** – అత్యంత పవిత్రమైనది. అన్ని పాపాలనూ తొలగిస్తుంది. కర్మరూపంలో ఉన్న అశుద్ధాలను కడుగుతుంది. అంటే పుణ్యపాప కర్మలను తొలగిస్తుంది; మనస్సు స్థాయిలో ఉన్న అశుద్ధాలను అంటే రాగద్వేషాలను, కామక్రోధాలను తొలగిస్తుంది. అన్నిటికన్నా ముఖ్యమైన అశుద్ధం – అజ్ఞానం. అజ్ఞానాన్ని తొలగిస్తుంది. అందువల్ల అది పవిత్రం.

**న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే** – 4.38

అందువల్ల ఇది మామూలు పవిత్రం కాదు, ఉత్తమం పవిత్రం. ఎందుకంటే ఇటువంటి పవిత్రం ఉపయోగిస్తే, ఉన్న అశుద్ధం పోవటమే కాక, భవిష్యత్తులో కూడా కొత్తగా అశుద్ధం ఏర్పడదు. అదే గంగాస్నానం చేస్తే పాతపాపాలు తొలగుతాయి కాని మనం చేసే కొత్తపాపాలు మళ్ళీ వచ్చి చేరతాయి.

**ప్రత్యక్షావగమమ్** – ఇక్కడే, ఇప్పుడే దొరుకుతుంది. ఇది మరణం తర్వాత ఫలం వస్తుంది అనటం లేదు. ఆ ఫలం వస్తుందో లేదో మనకు ఖచ్చితంగా తెలియదు. కాని జ్ఞానం పొందితే మనశ్శాంతి వస్తుంది. దాన్ని ఇప్పుడే, ఇక్కడే అనుభవించవచ్చు. అందువల్ల ప్రత్యక్షం,

**ధర్మ్యమ్** – ఇది ధర్మయుక్తం అంటే వేదాంతబోధను ఆధారం చేసుకుని చెప్పబడింది. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే మన వేదాలు ప్రాథమిక గ్రంథాలు. ఏ బోధ చేసినా, అది వేదాన్ని ఆధారంగా చేసుకుని చెయ్యాలి. భగవద్గీతను స్మృతి గ్రంథం అంటారు. అది ఉపనిషత్తుల సారం అని ప్రతి అధ్యాయం చివర్లో చెబుతారు. అందువల్ల వేదాలను ఆధారంగా చేసుకోని బోధ నిలవదు. మనకు ఆరు ఆస్తిక దర్శనాలు, ఆరు నాస్తిక దర్శనాలు ఉన్నాయి. నాస్తిక దర్శనం అంటే భగవంతుణ్ణి నమ్మకపోవటం కాదు; వేదాలను నమ్మకపోవటం. ఆరు నాస్తిక దర్శనాలలో నాలుగు బౌద్ధమతదర్శనాలే ఉన్నాయి. ఇప్పటి తరానికి వేదప్రామాణ్యత అంతగా తెలియకపోవచ్చు కాని, కృష్ణపరమాత్మ బోధచేసిన కాలంలో దానికి చాలా విలువ ఉంది. అందువల్ల కృష్ణపరమాత్మ సాక్షాత్తూ అవతారమూర్తే అయినా, తను వేదప్రమాణాన్ని ఆధారం చేసుకుని చెపుతున్నానని స్పష్టం చేశాడు నాలుగవ అధ్యాయంలోనే.

**ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।**
**వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽ బ్రవీత్ ॥** – 4.1

**ఏవం పరంపరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।**
**స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥** – 4.2

**స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।**
**భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥** – 4.3

తను స్వంతంగా బోధిస్తున్నానని గొప్ప చెప్పుకోలేదు కృష్ణపరమాత్మ. నేను అవతారమూర్తిని కాబట్టి నా బోధ వినమనటం లేదు నిన్ను. ఇది వేదాన్ని ఆధారం చేసుకుని చెప్పబడింది. అందుకని ఇక్కడ కూడా కృష్ణపరమాత్మ ధర్మ్యమ్ పదం వేశాడు. ధర్మ్యం అంటే వేదాలను అనుసరించి ఉంది ఈ బోధ.

**సుసుఖం కర్తుమ్** – ఈ జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందటం చాలా తేలిక. సుఖం అంటే తేలిక; సుసుఖం అంటే చాలా తేలిక. క్రమముక్తి పొందటంకన్నా ఈశ్వరజ్ఞానం, జీవన్ముక్తి పొందటం చాలా తేలిక. ఎందుకు? ఎనిమిదవ అధ్యాయంలో చూశాము.

జీవించి ఉన్నన్నాళ్ళూ ఇష్టదైవధ్యానం చెయ్యాలి, మరణకాలంలో కూడా ఆ దైవాన్నే తలుచుకోవాలి. అది కూడా ఎలా? సరియైన పద్ధతిలో కూర్చోవాలి (ఇప్పుడే కూర్చోవటం కష్టం, ఇంక అప్పుడు నిటారుగా కూర్చోగలగాలి), ప్రాణాలను, ఇంద్రియాలను వెనక్కులాగి, హృదయంలోకి చేర్చి, భృకుటిమీద దృష్టి నిలపాలి. ఎందుకంటే సుషుమ్నానాడి ద్వారా ప్రాణాలు ప్రయాణం చేసి, బ్రహ్మరంధ్రంద్వారా ప్రయాణం చేసి బ్రహ్మలోకం చేరుకోవాలి. అక్కడ కూడా బ్రహ్మలోకం చేరుకోగానే మోక్షం వచ్చేయదు. బ్రహ్మగారిద్వారా జ్ఞానబోధ వినాలి. అంటే క్రమముక్తికి షరతులు వర్తిస్తాయి. బ్రహ్మలోకానికి వెళ్ళగలగాలి, వెళ్ళినా జ్ఞానం పొందగలగాలి. అది మన చేతిలో లేదు. కాని ఇక్కడ జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందటం చాలా తేలిక.

**అవ్యయమ్** – ఫలం దష్ట్వా అవ్యయమ్. అంటే జ్ఞానం పొందిన వ్యక్తి పొందే ఫలం శాశ్వతం. జ్ఞానంవల్ల పొందే ఫలం మోక్షం. అది ఉన్నత లోకాలకు వెళ్ళే ఫలాల లాగా కాదు. అది శాశ్వతం. ఉన్నత లోకాలకు వెళ్ళి కూడా కర్మఠుడు తిరిగి వస్తాడని చూశాము.

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – 9.21

అందువల్ల చాలా తేలికగా పొందగలిగే, శాశ్వతమైన ఫలాన్ని ఇచ్చే – కర్తుం సుసుఖమ్ అవ్యయమ్ – జ్ఞానబోధను నీకు చెయ్యబోతున్నాను అర్జునా, చాలా జాగ్రత్తగా విను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ముందే బోధ చెయ్యకుండా, అతను ఏకాగ్రతను చూపేలాగా, అతని మనస్సును సంసిద్ధం చేస్తున్నాడు.

శ్లో. 3 **అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప ।**
**అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥**
అశ్రద్ధధానాః, పురుషాః, ధర్మస్య, అస్య, పరంతప,
అప్రాప్య, మామ్, నివర్తంతే, మృత్యుసంసారవర్త్మని ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ పరంతపా! | మామ్ | = నన్ను |
| అస్య | = ఈ | అప్రాప్య | = పొందక |
| ధర్మస్య | = ధర్మమార్గమునందు | మృత్యుసంసార | = మృత్యురూపసంసార |
| అశ్రద్ధధానాః | = శ్రద్ధారహితులైన | వర్త్మని | చక్రమున |
| పురుషాః | = పురుషులు | నివర్తంతే | = తిరుగుచుందురు |

**హే పరన్తప! అస్య ధర్మస్య అశ్రద్ధధానాః పురుషాః మామ్**
**అప్రాప్య మృత్యు–సంసార–వర్త్మని నివర్తన్తే ॥**

తా: ఓ పరంతపా! ఈ ధర్మమార్గమునందు శ్రద్ధారహితులైన పురుషులు నన్ను పొందక మృత్యురూప సంసారచక్రమున తిరుగుచుందురు.

ఈ జ్ఞానం ఇంత గొప్పదైనా కూడా, శాస్త్రమే దీని గురించి ఇంత గొప్పగా చెప్పినా కూడా, దురదృష్టవశాత్తూ ఎక్కువమంది ఈశ్వరజ్ఞానం పొందటానికి రారు. ఇది అత్యంత శ్రేష్ఠమైన జ్ఞానం, ఉచితంగా లభ్యమవుతుంది కూడా. ఎన్నో ఆశ్రమాల్లో, ఎందరో గురువులు ఈ బోధను ఉచితంగా చేస్తారు. అయినా ఎవరూ పెద్దగా శ్రద్ధ చూపరు. అదే జావా నేర్పిస్తాము, వారానికి రెండు క్లాసులు – 60000 రూపాయలు చెల్లించాలి అంటే అక్కడ పెద్ద క్యూలో నిలబడిపోతారు అంతా.

ఏదైనా ఉచితంగా ఇస్తామంటే చాలామందికి అనుమానం. అందులో ఏ లోపం ఉందో అనుకుంటారు. అంతదాకా ఎందుకు? ఎవరైనా పెళ్ళికొడుకు ఉదారంగా నాకు కట్నం అవసరం లేదు అంటే అతనిలో ఏ లోపం ఉందో అనేవారే ఎక్కువగా ఉంటారు. అలాగే ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతావు అంటే వెంటనే నమ్మలేరు మనుష్యులు.

**పురుషాః అశ్రద్ధధానాః** – చాలామంది మనుష్యులకు ఈ బోధయొక్క ఫలితంమీద శ్రద్ధ ఉండదు.

**ధర్మస్య అస్య** – ఈశ్వరజ్ఞానంమీద శ్రద్ధ ఉండదు. ఇక్కడ ధర్మం అంటే ధర్మార్థకామాలలోని ధర్మం కాదు; పుణ్యం కూడా కాదు; ధర్మం అంటే వేదాంతబోధ లేదా బ్రహ్మవిద్య లేదా ఈశ్వరజ్ఞానం. దీనిమీద శ్రద్ధ ఉండదు. అలాంటి వారికి ఏమవుతుంది? కృష్ణపరమాత్మ అలాంటివారిమీద జాలి చూపుతున్నాడు.

**అప్రాప్య మామ్** – అలాంటివారు నన్ను పొందలేరు అంటున్నాడు. నన్ను అంటే సత్యం, జ్ఞానం అనంతం బ్రహ్మను. నేను అనంతమైన ఆనందాన్ని, అనంతమైన భద్రతను, అనంతమైన శాంతిని. అటువంటి నన్ను వారు పొందలేరు, అంటే మోక్షాన్ని పొందలేరు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఇహ చేదవేదీదథ సత్యమస్తి న చేదిహావేదీన్మహతీ వినష్టి** – కేన 2.5

**మహతీ వినష్టి** – వారు చాలా నష్టపోతారు. ఎందుకంటే అనంతాన్ని పొందలేకపోవటం అనంతమైన నష్టం. అయినా చెక్కు చెదరరు కొంతమంది. ఇవాళ చెయ్యాల్సిన పనిని రేపటికి వాయిదా వెయ్యటంలో ఆరితేరినవారు ఉన్నారు. వారు ఈ జన్మ కాకపోతే వచ్చే జన్మలో చూసుకుందాము అంటారు. కాని ఇప్పుడు తప్పితే, మరుజన్మ ఎలా వస్తుందో? కృష్ణపరమాత్మ పుణ్యం నశిస్తే, భూలోకానికి తిరిగి వస్తామని మృదువుగా చెబుతాడు కాని ఉపనిషత్తులు నగ్నసత్యాన్ని చెపుతాయి –

**ఇమం లోకం హీనతరం వా విశంతి** – ముండకం

అందువల్ల ఆంగ్ల సామెతను గుర్తు తెచ్చుకోవాలి – **నౌ ఆర్ నెవ్వర్!** ఇప్పుడు కాకపోతే ఎన్నటికీ కాదు! అందువల్ల వారు నన్ను పొందలేరు అన్నాడు కృష్ణపరమాత్మ.

**నివర్తంతే** – నిశ్చయేన వర్తంతే. మామూలుగా నివర్తంతే అంటే వెనక్కి వస్తారు. కాని ఇక్కడ నిశ్చయంగా కొనసాగుతారు. ఎందులో?

**మృత్యుసంసారవర్త్మని** – మృత్యురూపసంసారచక్రంలో తిరుగుతారు. అంటే పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటారు. అది ఒక అంతులేని కథగా కొనసాగుతుంది. మృత్యుసంసారం అంటే మృత్యువు ముఖ్యసమస్యగా ఉన్న సంసారం. మృత్యుయుక్తమైనది సంసారం. సంసారంలో అనేక సమస్యలు ఉంటాయి. అవి అనారోగ్యం, క్షీణించటం, ఎడబాటు, కోల్పోవటం లాంటివి. కాని అన్నింటికన్నా దారుణమైన సమస్య మరణం. ఇది నిరంతరం బాధించే అభద్రతా భావన. జ్ఞానమార్గానికి రానివారు ఈ మరణభయంతో కొట్టుమిట్టాడుతుంటారు.

**2. నిర్గుణ ఈశ్వర స్వరూపం: శ్లోకాలు 4-10**

ముందు శ్లోకంతో ఉపోద్ఘాతం ముగిసింది. మొదటి మూడు శ్లోకాల్లో విషయాన్ని, ఫలాన్ని, అర్హతను గురించి చెప్పాడు. విషయం – ఈశ్వరజ్ఞానం; ఫలం – ఇక్కడే ఇప్పుడే మోక్షం; అర్హత – శ్రద్ధ. శ్రద్ధను అనసూయగా వర్ణించాడు కృష్ణపరమాత్మ.

అత్రిమహర్షి భార్య పేరు అనసూయ. సంస్కృతంలో ప్రతి పేరుకూ అర్థం ఉంటుంది. అత్రి అంటే – న విద్యతే త్రిః యస్య – మూడింటికి అతీతంగా ఎదిగినవాడు. ఆ మూడింటినీ మూడు శరీరాలుగా అంటే స్థూల, సూక్ష్మ, కారణశరీరాలుగా తీసుకోవచ్చు. మూడు శరీరాలకు విలక్షణం. లేదా మూడు గుణాలు – సత్త్వ, రజః, తమో గుణాలుగా తీసుకోవచ్చు. అంటే గుణాతీతుడు. అలాంటి వ్యక్తికి అసూయ ఉండదు. అందువల్ల అతని భార్య అనసూయ అయింది.

4-10 శ్లోకాల్లో విషయాన్ని అంటే ఈశ్వరజ్ఞానాన్ని బోధిస్తాడు. ఈ అధ్యాయానికి ఆయువుపట్టులాంటి శ్లోకాలు ఈ శ్లోకాలు. నిజానికి భగవద్గీతలోనే చాలా ముఖ్యమైన భాగం ఇది. ఎందుకంటే ఈ భాగంలో ఉపనిషత్తుల సారమంతా వస్తుంది. ఇక్కడ కృష్ణపరమాత్మ ఈశ్వరునియొక్క ఉన్నతస్థాయి గురించి చెప్పబోతున్నాడు. ఈ ఉన్నతస్థాయికి అనేక పేర్లు ఉన్నాయి. ముందు ఆ పేర్లను చూద్దాము. నిర్గుణబ్రహ్మ, అవ్యక్తమూర్తి, బింబచైతన్యం, పరాప్రకృతి, బ్రహ్మ, చైతన్యం, విజ్ఞానం. కృష్ణపరమాత్మ పరాప్రకృతి అన్నాడు ఏడవ అధ్యాయంలో. ఉపనిషత్తులు బ్రహ్మ అంటాయి.

ఈ బ్రహ్మ ఇంద్రియ అగోచరం. సగుణబ్రహ్మ ఇంద్రియ గోచరం. బ్రహ్మకు శబ్దగుణం ఉంటే చెవులద్వారా వినవచ్చు; రూపం ఉంటే కళ్ళద్వారా చూడవచ్చు; స్పర్శగుణం ఉంటే చర్మంద్వారా తెలుసుకోవచ్చు; రసగుణం ఉంటే నాలుకద్వారా తెలుసుకోవచ్చు; గంధగుణం ఉంటే నాసికద్వారా తెలుసుకోవచ్చు. కాని నిర్గుణబ్రహ్మకు శబ్దస్పర్శరూపరసగంధాలు లేవు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగన్ధవచ్చ యత్ ।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే ॥** – కఠ 1.3.15

భగవంతునికి గుణాలు లేవు. నాకు భగవద్దర్శనం అయింది అని ఎవరైనా అంటే అది భగవంతునియొక్క సగుణరూపం. మనం సగుణరూపాన్ని అనేక విధాలుగా వర్ణిస్తాము. నీలమేఘశ్యాముడు అంటాము, శంఖచక్రగదాధారి అంటాము శ్రీకృష్ణుణ్ణి. భగవద్దర్శనం అయితే మీరు చాలా అదృష్టవంతులు, అందులో సందేహం లేదు; కాని ఉపనిషత్తుల ప్రకారం భగవంతుడు అపరాప్రకృతి కాదు, పరాప్రకృతి.

**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన 1.5

నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు అంటుంది కేనోపనిషత్తు. అయితే నిర్గుణబ్రహ్మను ఎలా అనుభవించాలి? నిర్గుణబ్రహ్మ అవ్యక్తం. కొన్ని గుణాలను నాలుగవ శ్లోకంలో చూస్తాము.

శ్లో. 4 **మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।**
**మత్‌స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥**
మయా, తతమ్, ఇదమ్, సర్వమ్, జగత్, అవ్యక్తమూర్తినా,
మత్‌స్థాని, సర్వభూతాని, న, చ, అహమ్, తేషు, అవస్థితః ॥

| | | | |
|---|---|---|---|
| అవ్యక్తమూర్తినా | = నిరాకార పరబ్రహ్మనైన | సర్వభూతాని | = ప్రాణులన్నియును |
| మయా | = నాచేత | మత్‌స్థాని | = నాయందే అంతర్గతములై యున్నవి కాని |
| ఇదమ్ | = ఈ | అహమ్ | = నేను |
| సర్వమ్ | = సమస్తమైన | తేషు | = వాటియందు |
| జగత్ | = జగత్తు | న, అవస్థితః | = వాస్తవముగా స్థితుడను కాను |
| తతమ్ | = వ్యాపించియున్నది | | |
| చ | = ఇంకా | | |

**అవ్యక్త–మూర్తినా మయా ఇదమ్ సర్వమ్ జగత్ తతమ్ ।**
**సర్వ–భూతాని మత్–స్థాని (సన్తి), అహమ్ చ తేషు న అవస్థితః (అస్మి) ॥**

తా: నిరాకార పరబ్రహ్మనైన నాచేత ఈ సమస్తమైన జగత్తు వ్యాపించియున్నది. ఇంకా ప్రాణులన్నియును నాయందే అంతర్గతములై యున్నవి కాని నేను వాటియందు వాస్తవముగా స్థితుడను కాను.

**ఎ) అవ్యక్తం**

**అవ్యక్తమూర్తినా** – నిర్గుణబ్రహ్మకు గుణాలు లేవు. బ్రహ్మను (ఆబ్జెక్టుగా)ఒక స్థూలవస్తువుగా చూడలేము. అందువల్ల ఈశ్వరుని మొదటి అంశం అవ్యక్త రూపం.

భగవంతునికి రూపం లేదు అనేసరికి, ఆయన ఎక్కడ ఉంటాడు అనకూడదు. రూపం లేకపోతే దేశం కూడా లేదు, కాలం కూడా లేదు. ఆ దేవుడు ఎప్పుడు వస్తాడు అనకూడదు. ఎప్పుడూ రాలేదు – ఎందుకంటే ఆయన కాలాతీతుడు. అంతేకాదు ఎప్పుడూ వెళ్ళలేదు కూడా. కాని మనమేం చేస్తాము? **అస్మిన్ హరిద్రా బింబే సుముఖం మహాగణపతిం ధ్యాయామి, ఆవాహయామి** అంటాము. పసుపు ముద్ద చేసి అందులో గణపతిని ఆవాహన చేస్తాము. పూజ అవగానే – **యథాస్థానం ప్రతిష్ఠాపయామి** అని వెనక్కి పంపించేస్తాము. రమ్మని, పొమ్మని చెప్పగలిగేది సగుణబ్రహ్మకు, నామరూపాలున్న బ్రహ్మకు. భక్తి మొదలు పెట్టటానికి సగుణబ్రహ్మతో మొదలు పెట్టవచ్చు తప్పులేదు, కాని అక్కడితో ఆగిపోకుండా నిర్గుణ ఈశ్వరజ్ఞానానికి రావాలి. రాకపోకలు లేని సర్వవ్యాపకమైన దేవుని గురించి తెలుసుకోవాలి. అటువంటి దేవుని గురించి తెలుసుకుంటే దేవుడు వచ్చాడన్న ఆనందమూ ఉండదు; అయ్యో వెళ్ళిపోయాడే అనే విరహమూ ఉండదు. అవ్యక్తం అంటే నామరూపాలు లేని భగవంతుడు.

**బి) సర్వవ్యాపకం**

**ఇదం సర్వం తతమ్** – సర్వవ్యాపకుడు. తతమ్ అంటే వ్యాప్తం. సర్వవ్యాపకం. మొదటి అంశం నిర్గుణం, రెండవ అంశం సర్వవ్యాపకం. నిర్గుణం పదానికి అవ్యక్తం అనీ, సర్వవ్యాపకానికి తతమ్ అనీ పదాలు ప్రయోగించాడు కృష్ణపరమాత్మ. రూపం లేని వస్తువుకు సరిహద్దులు ఉండవు. ఒక హాలు నలుచదరంగా ఉందా, వృత్తాకారంలో ఉందా అని తెలుసుకోవాలంటే, ఆ హాలు సరిహద్దులు చూడాలి. భగవంతునికి రూపం లేదు, ఆయన సర్వవ్యాపకం. ఆయన సర్వవ్యాపకం కనుక రూపం లేనివాడు.

ఎవరైనా భగవంతుడు వైకుంఠములో ఉన్నాడా అని అడిగితే, ఏం జవాబు చెప్పాలి? వైకుంఠములో ఉన్నాడు అని చెపితే అది తప్పు అవుతుంది. ఎందుకు? వైకుంఠములో ఉన్నాడని చెపితే, వైకుంఠములోనే ఉన్నాడు, భూలోకంలో లేడని అర్థం వస్తుంది. అందువల్ల దీనికి జవాబు భగవంతుడు వైకుంఠంలో **కూడా** ఉన్నాడు అని చెప్పాలి. సర్వవ్యాపకుడైన భగవంతుడు వైకుంఠంలో కూడా ఉంటాడు. అందువల్ల భగవంతునితో ఐక్యం అంటే ఎక్కడికో వెళ్ళి ఐక్యం అవనవసరం లేదు. ఐక్యం అంటే భగవంతుడు ఎక్కడో నాకు దూరంగా లేడు అనే జ్ఞానం పొందటం.

ఐక్యం అంటే ద్వైతభావనను వదలటం. అందువల్ల తతం అంటే వ్యాప్తం.

**సి) మిథ్యా జగదధిష్ఠానం**

**మత్స్థాని సర్వభూతాని** – నాలో అన్ని ప్రాణులు నెలకొనివున్నాయి. సర్వభూతాని అంటే అన్ని వస్తువులు, అన్ని ప్రాణులు; మత్స్థాని అంటే నాలో నెలకొని ఉన్నాయి. నేను విశ్వాధారుణ్ణి.

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం విశ్వాధారం గగనసదృశం**

భుజగశయనం అంటే భగవంతునికి ఒక దేశం నిర్ణయిస్తున్నాము. దయానందస్వామి చెపుతారు – శేషతల్పం ప్రపంచంలో మొట్టమొదటి స్ప్రింగ్‌కాట్ అని. భగవంతుడు పాలసముద్రంలో ఆదిశేషువుమీద పడుకుని ఉన్నాడు అంటాము. ఇది ప్రారంభదశలో ఉన్న భక్తునికి.

విశ్వాధారం పదం పరిపక్వత చెందిన భక్తునికి. ఇది మొదటి పదానికి పూర్తిగా భిన్నం. భుజగశయనంలో ఆదిశేషువు పరమాత్మకు ఆధారం. విశ్వాధారంలో ఆదిశేషువుకే కాదు, సర్వవిశ్వానికి పరమాత్ముడే ఆధారం. అటువంటి భగవంతుడు గగనసదృశం. ఆకాశంలా సర్వవ్యాపకం. అదే భావన ఈ మత్స్థాని సర్వభూతానిలో చూస్తాము. నేను ఈ విశ్వానికి ఆధారాన్ని.

**న చాహం తేష్వవస్థితః** – నాకు విశ్వం ఆధారం కాదు. నేను విశ్వానికి ఆధారం కాని, నాకు విశ్వం ఆధారం కాదు. నేను ఆధారం అవసరం లేని ఆధారాన్ని. మూడవ అంశం **జగదాధారం** లేదా **జగదధిష్ఠానం**.

ఈ శ్లోకంలో చైతన్యంయొక్క మూడు అంశాలు చూశాము – అవ్యక్తం, సర్వవ్యాపకం, జగదధిష్ఠానం.

శ్లో. 5 **న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥**

న, చ, మత్స్థాని, భూతాని, పశ్య, మే, యోగమ్, ఐశ్వరమ్,
భూతభృత్ న, చ, భూతస్థః, మమ, ఆత్మా, భూతభావనః ॥

| | | | |
|---|---|---|---|
| భూతాని | = ఆ ప్రాణులన్నియును | మమ, ఆత్మా | = నిజానికి నేను |
| మత్స్థాని, న | = నాలో నెలకొని లేవు, కాని | భూతభావనః | = భూతములను సృష్టించువాడను |
| మే | = నాయొక్క | చ | = ఇంకా |
| ఐశ్వరమ్ | = ఈశ్వరీయమైన | భూతభృత్, చ | = భూతములకు స్థితికారకుడను |
| యోగమ్ | = యోగశక్తిని | భూతస్థ, న | = జగత్తుమీద నేను ఆధారపడను |
| పశ్య | = చూడుము | | |

**భూతాని చ మత్–స్థాని న (సన్తి), మే ఐశ్వరమ్ యోగమ్ పశ్య ।**
**(అహం) భూత–భృత్ (అపి) భూత–స్థః న । మమ ఆత్మా చ భూత–భావనః (అస్తి) ॥**

తా: ఆ ప్రాణులన్నియును నాలో నెలకొని లేవు, కాని నాయొక్క ఈశ్వరీయమైన యోగశక్తిని చూడుము. నిజానికి నేను భూతములను సృష్టించువాడను ఇంకా భూతములకు స్థితికారకుడను. నేను జగత్తుమీద ఆధారపడను. నేను జగత్తుకు అధిష్ఠానమును.

**భూతాని న మత్స్థాని** – సర్వప్రాణులు నాలో నెలకొని లేవు. సరిగ్గా ముందు శ్లోకంలోనే అన్ని ప్రాణులు నాలో నెలకొని ఉన్నాయి అన్నాడు. మరీ వెంటనే సర్వప్రాణులు నాలో నెలకొని లేవు అన్నాడు. అలా భిన్నవాక్యాలు ఎందుకు చెప్పాడు కృష్ణపరమాత్మ? గీతను బోధించే వారందరికీ ఇది క్లిష్టమైన సందిగ్ధం. అందువల్ల ఇక్కడ రకరకాల వివరణలు వస్తాయి. ఇలాంటి సందర్భాలలో శంకరులవారు మనను ఆదుకుంటారు. శంకరులవారి భాష్యం లేకపోతే ఇలాంటి భిన్నవాక్యాలను అర్థం చేసుకోవటం కష్టం.

కృష్ణపరమాత్మ ముందేమో అన్ని భూతాలూ నాలో ఉన్నాయని చెప్పి మరుక్షణమే అన్ని భూతాలూ నాలో లేవు అని చెప్పాడంటే కృష్ణపరమాత్మకు బోధ చెయ్యటం రాదనా? తెలివైన భాష్యకారుడు కృష్ణపరమాత్మను తప్పు పట్టడు. ఆయన చెప్పిన మాటలో ఉన్న గూఢార్థాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. ఒక తెలివైన గురువు 'x' ఉంది అని చెప్పి, వెంటనే 'x' లేదు అంటే రెండు వాక్యాలనూ సత్యాలుగానే తీసుకోవాలి. 'x' ఉందనీ అనాలి, 'x' లేదనీ అనాలి. అదెలా సాధ్యం? 'x' ఉన్నట్టుగా ఉంది, నిజంగా లేదు.

అంటే ఒక కోణంలోంచి చూస్తే 'x' ఉంది కాబట్టి దాని ఉనికిని ఒప్పుకు తీరాలి. కాని దాన్ని లోతుగా విశ్లేషిస్తే, దానికి ఉనికి ఉన్నట్టుగా ఉంది కాని నిజంగా లేదు. అందువల్ల ఏదైనా ఉనికి ఉన్నట్టుగా అనిపిస్తే అది ఈ మధ్యరకం దానిలోకి వస్తుంది. అంటే ఉండీ, లేనట్టు అనిపిస్తుంది.

అలా ఉండీ, లేనట్టు అనిపించేవి ఏమైనా ఉన్నాయా? ఎందుకు లేవు? చాలా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది మనం రోజూ కనే కలే. స్వప్నం నిజంగా ఉందా, లేదా? రెండూనూ. స్వాప్నికునికి నిజంగా ఉంది. అది చాలా దగ్గరగా, చాలా స్పష్టంగా, చాలా భీకరంగా కూడా ఉంటుంది. ఒక పులి వెంటాడుతున్నట్టు కల వస్తే, శరీరమంతా చెమట పట్టేస్తుంది, పరుగులు తీస్తాడు. రక్షించండి అని కేకలు వేస్తాడు. కాని ఆ కలనుండి లేస్తే అది పీడకల అని తెలుస్తుంది. దానికి భిన్నంగా కలలో కోటి రూపాయలు గెలిచినట్టు వస్తుంది. కలలో ఉన్నంతసేపూ ఆ డబ్బు చూసి మురిసిపోతాడు, అనేక ప్రణాళికలు వేస్తాడు. కాని లేచాక, ఆ డబ్బును నిజజీవితంలో వాడుకోగలడా? లేదే!

అందువల్ల స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. అది నిజంగా ఉన్నట్టే అనిపిస్తుంది. దాన్ని ప్రాతిభాసిక సత్యం అంటారు. ఆ స్వప్నంనుంచి లేచాక, అది స్వప్నం అని తెలుస్తుంది. స్వప్నంనుంచి లేవటం, వ్యావహారిక సత్యానికి లేస్తాడు. అంటే ప్రాతిభాసిక సత్యంలో సత్యంగా ఉన్నది, వ్యావహారిక సత్యంలో లేదు. తక్కువ స్థాయిలో నిజంగా ఉన్నట్టుగా ఉన్నది, దానికన్నా ఎక్కువ స్థాయి సత్యంలో ఉండదు. ఇలా ఒక స్థాయిలో ఉండి, ఇంకొక స్థాయిలో లేనిదాన్ని వేదాంతంలో మిథ్య అంటారు. ఈ మిథ్యను అర్థం చేసుకోవటానికి మనం మూడు పదాలను అర్థం చేసుకోవాలి. అవి సత్యం, తుచ్ఛం, మిథ్య.

**సత్యం:** సత్యం అంటే త్రికాలేపి తిష్ఠతి. మూడు కాలాల్లోనూ ఉండేది. ఉదా. కుండ, మట్టి తీసుకుంటే మట్టి మూడు కాలాల్లోనూ ఉంటుంది. కుండ పుట్టకముందూ ఉంది, కుండలోనూ ఉంది, కుండ పగిలిపోయాకా ఉంటుంది.

**తుచ్ఛం:** ఏ కాలంలోనూ ఉండనిది. శాస్త్రం ఇచ్చే ఉదాహరణలు – వంధ్యాపుత్రుడు (గొడ్రాలి కొడుకు), ఆకాశపుష్పాలు. లౌకిక ఉదాహరణ – నాలుగు భుజాలు ఉన్న త్రికోణం.

**మిథ్య:** మూడు కాలాల్లోనూ ఉండేది సత్యం, మూడు కాలాల్లోనూ లేనిది తుచ్ఛం అయితే ఒక కాలంలో ఉండి, ఒక కాలంలో లేనిది మిథ్య అవుతుంది. కుండ–మట్టి ఉదాహరణలో మట్టి సత్యం అయినప్పుడు, కుండ ఏమవుతుంది? మిథ్య అవుతుంది. ఎందుకు? కుండ ఒక కాలంలో వచ్చి, ఇంకొక కాలంలో వెళ్ళిపోతుంది. అంటే దానికి పుట్టుక తేదీ, మరణం తేదీ ఉంటాయి. దాన్ని మిథ్య అంటారు.

**సత్ అసత్భ్యామ్ అనిర్వచనీయం మిథ్యా**

సత్ కాదు, అసత్ కాదు, అది మిథ్య. దీన్నే ఇంకో విధంగా చూడాలంటే వ్యావహారిక సత్యం అంటారు. దీన్ని అర్థం చేసుకోవటానికి మూడు రకాల సత్యాలను చూద్దాము. అవి ప్రాతిభాసిక సత్యం, వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యం.

1. **ప్రాతిభాసిక సత్యం** – స్వప్నప్రపంచం ప్రాతిభాసిక సత్యం. స్వప్నంలో ఉన్నంతసేపూ స్వప్నం నిజం అనిపిస్తుంది. అందులో జరిగే అనుభవాలు నిజంగా జరిగినట్టుగా అనిపిస్తాయి. స్వప్నంలో ఉండగా, ఒక స్వాప్నికునికి ఎవరైనా ఇది స్వప్నం అని చెపితే అతను ఒప్పుకోడు.

2. **వ్యావహారిక సత్యం** – జాగ్రత్ ప్రపంచం వ్యావహారిక సత్యం. స్వప్నంనుంచి వ్యావహారిక స్థాయికి లేస్తే స్వప్నం కరిగిపోతుంది. అది ఇంక నిజం అనిపించదు. అంటే దానికన్నా ఉన్నతస్థాయికి లేస్తే ప్రాతిభాసిక సత్యం వీగిపోయింది. వ్యావహారిక సత్యం కూడా అంతే. మనం జాగ్రదావస్థలో ఉన్నంతసేపూ అది నిజమనిపిస్తుంది. అందులో భయాలు, బెంగలు వేధిస్తాయి.

3. **పారమార్థిక సత్యం** – నిర్గుణబ్రహ్మ పారమార్థిక సత్యం. అద్వైతప్రపంచం అనకూడదు. ఉన్నదొకటే అద్వైతం. జగత్, జీవుడు, ఈశ్వరుడు అని మూడు భిన్నంగా ఉండవు. వ్యావహారిక సత్యంనుంచి ఈ పారమార్థిక సత్యానికి ఎదిగితే అప్పుడు ఈ వ్యావహారిక సత్యం వీగిపోతుంది. స్వప్నంగా కరిగిపోతుంది. అందువల్ల వ్యావహారిక సత్యాన్ని మిథ్య అనీ, స్వప్నం–2 అనీ అంటారు.

ఈ నేపథ్యంతో కృష్ణపరమాత్మ చెప్పిన వాక్యాలను మళ్ళీ చూద్దాము.

**మత్‌స్థాని సర్వభూతాని** – నాలో అన్ని భూతాలూ ఉన్నాయి అన్నప్పుడు వ్యవహారిక స్థాయినుంచి చెప్పాడు. అంటే అప్పుడు ప్రపంచం ఉంది.

**న చ మత్స్థాని భూతాని** – నాలో అన్ని భూతాలూ లేవు అన్నప్పుడు వ్యవహారిక స్థాయినుంచి పారమార్థిక స్థాయికి వెళ్ళాడు. అంటే బ్రహ్మపరంగా చెప్పాడు. పారమార్థిక స్థాయిలో అద్వైతబ్రహ్మ ఒక్కటే ఉంది; బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య అని చూశాము. అప్పుడు బ్రహ్మ మిథ్యా జగత్తుకు అధిష్టానం. లలితా సహస్రనామంలో మిథ్యా జగదధిష్టానం అని వస్తుంది. అంటే ఈ వాక్యం పారమార్థికసత్యానికి చెందినది. ఈ వాక్యంద్వారా వేదాంతసారం చెప్పాడు. అది –

**బ్రహ్మ సత్యం, జగత్ మిథ్యా**

అంతేకాదు, ముందు శ్లోకంలో బ్రహ్మ మూడవ నిర్వచనం జగదాధారం అని చూశాము కదా. దానికి **బ్రహ్మ మిథ్యా జగదధిష్ఠానం** అని కలుపుకోవాలి.

**డి) సృష్టి–స్థితి–లయ కారణం**

**మమ ఆత్మా భూతభావనః భూతభృన్న చ** – నేను ఈ జగత్తు మొత్తానికి సృష్టి, స్థితి, లయకారకుడిని అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మన స్వప్నప్రపంచానికి మనమే సృష్టి, స్థితి, లయకారణం. కాని తమాషా ఏమిటంటే, మనం సృష్టించిన స్వప్నప్రపంచంలో మనమే భయపడతాము. పులిని సృష్టించి పులిని చూసి భయపడతాము. మనం నిద్ర లేచాక పులి ఏమయింది? అడవిలోకి పారిపోయిందా? మొత్తం స్వప్నప్రపంచం మనలోనే లయమవుతుంది.

అదే విధంగా బ్రహ్మస్థాయినుంచి చూస్తే, అంటే పారమార్థికస్థాయినుంచి చూస్తే ఈ జగత్తు ఆయన కలలాగ ఆయననుంచి వచ్చింది, ఆయనలోనే స్థితి పొందుతుంది, ఆయనలోనే లయమవుతుంది. మమ ఆత్మలో ఆత్మ అంటే పరాప్రకృతి; భూతభావనః. భావనః అంటే సృష్టికారణం, భూత అంటే మొత్తం జగత్తు. నేను సృష్టికర్తను

అన్నాడు. భూతభృత్ అంటే స్థితికర్త. స్వప్నప్రపంచం కొనసాగాలంటే, జాగ్రద్ పురుషుడు అక్కడ పడుకుని ఉండాలి. కల కొనసాగుతుండగా నేను ఆఫీసుకి వెళ్ళివస్తాను అనలేడు. పైగా ఒకసారి నిద్ర లేస్తే, స్వప్నం కొనసాగదు. అందువల్ల కలకు మనం స్థితికర్తలం. అలాగే బ్రహ్మ కూడా జగత్తుకు స్థితికర్త.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి,**
**యత్ప్రయన్త్యభి సంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ తత్ బ్రహ్మేతి॥** – తైత్తిరీయం

ఈ భావన ఇక్కడ చెప్పబడింది. ఇక్కడ సృష్టికారణం, స్థితికారణం మాత్రం చెప్పబడ్డాయి. మూడవది మనం కలుపుకోవాలి. నేను లయకారకుణ్ణి కూడా అని కృష్ణపరమాత్మ చెప్పినట్టుగా తీసుకోవాలి. లయకారకుడు అంటే కాలం, దేశం కూడా లయమయిపోతాయి.

**యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః।**
**మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః॥** – కఠ 1.2.25

నేను కాలాన్ని, దేశాన్ని కూడా లయం చేస్తాను అన్నాడు అందులో. అంటే బ్రహ్మ దేశ, కాలాలకు అతీతుడు. ఒకవేళ భగవంతుడు దేశంలో, కాలంలో ఉండి ఉంటే, భగవంతుడు కాలాన్ని లయం చెయ్యటం కాదు, కాలమే భగవంతుణ్ణి లయం చేసివుండేది.

**(న భూతస్థః)** – జగత్తుమీద నేను ఆధారపడను అంటున్నాడు కృష్ణపరమాత్మ. బ్రహ్మ లేకుండా జగత్తుకు ఉనికి విడిగా లేదు; కాని జగత్తు లేకుండా బ్రహ్మ ఉంటాడు. దీన్ని సత్యం, మిథ్యల సంబంధం అంటారు. అంటే సత్యబ్రహ్మ లేకుండా మిథ్యా జగత్తుకు ఉనికి లేదు; కాని మిథ్యా జగత్తు లేకుండా సత్యబ్రహ్మకు ఉనికి ఉంది. దీన్నే సాంకేతికపరంగా అధిష్ఠాన–అధ్యాస సంబంధం అంటారు ఉపనిషత్తుల పరిభాషలో.

ఈ శ్లోకంలో బ్రహ్మ సృష్టి–స్థితి–లయ కారణం అని చూశాము.

శ్లో. 6 **యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥**
యథా, ఆకాశస్థితః, నిత్యమ్, వాయుః, సర్వత్రగః, మహాన్,
తథా, సర్వాణి, భూతాని, మత్స్థాని, ఇతి, ఉపధారయ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వత్రగః | = అంతటను సంచరించునట్టి | | భూతాని | = | నా సంకల్పమువలననే ఉత్పన్నములైన ప్రాణులు |
| మహాన్ | = మిక్కిలి విస్తృతమైన | | సర్వాణి | = | అన్నియును |
| వాయుః | = వాయువు | | మత్స్థాని | = | నాయందే స్థితమైయున్నవి |
| యథా | = ఏ విధంగా | | ఇతి | = | అని |
| నిత్యమ్ | = నిరంతరము | | ఉపధారయ | = | తెలుసుకొనుము |
| ఆకాశస్థితః | = ఆకాశమునందే స్థితమైయుండునో | | | | |
| తథా | = అలాగే | | | | |

**యథా సర్వత్రగః మహాన్ వాయుః నిత్యమ్ ఆకాశ-స్థితః (అస్తి),**
**తథా సర్వాణి భూతాని మత్-స్థాని (సన్తి), ఇతి (త్వం) ఉపధారయ ॥**

తా: అంతటను సంచరించునట్టి మిక్కిలి విస్తృతమైన వాయువు ఏ విధంగా నిరంతరము ఆకాశమునందే స్థితమైయుండునో అలాగే నా సంకల్పమువలననే ఉత్పన్నములైన ప్రాణులు అన్నియును నాయందే స్థితమై యున్నవి అని తెలుసుకొనుము.

**ఇ) అసంగం** - దేనితోనూ సంగత్వం లేదు. ముందు శ్లోకాల్లో నేను జగదాధారం అన్నాడు; మొత్తం జగత్తు నాలో ఉంది అన్నాడు. అందువల్ల సహజంగా మనకు ఒక సందేహం కలుగుతుంది. ఏమిటది? జగత్తుకు ఆయన ఆధారమై, జగత్తు ఆయనలో ఉంటే, జగత్తులో ఉండే అశుద్ధం బ్రహ్మకు అంటదా?

మనం కొత్త దుస్తులు వేసుకుని, మన ఒడిలో ఒక మురికి వస్తువును పెట్టుకుంటే, ఆ మురికి వెంటనే మన కొత్త దుస్తులకు అంటుకుంటుంది. మనుష్యులలో అనేక అశుద్ధాలు ఉన్నాయి; వారు అనేక పుణ్యపాపాలు చేస్తారు. ఈ పుణ్యపాపాలు ఆ భగవంతుడికి అంటుతాయేమో! ఆ భయం లేదంటున్నాడు కృష్ణపరమాత్మ. నాలో అన్నీ ఉన్నాయి కాని నాకేమీ అంటదు. దీన్ని అసంగత్వం అంటారు.

దీనికి కృష్ణపరమాత్మ ఆకాశం ఉదాహరణ ఇస్తున్నాడు. ఆకాశానికి కూడా రూపు లేదు; ఆకాశం కూడా సర్వవ్యాపకం. ఆకాశం కూడా అన్నిటికి ఆధారం. కాని ఆకాశం కూడా అసంగం. ఆకాశాన్ని అగ్ని దహించలేదు, నీరు తడపలేదు.

**అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ** - 2.24

ఆకాశాన్ని ముక్కలు చెయ్యలేము, కాల్చలేము. అదే విధంగా భగవంతుడు అన్నిటికీ ఆధారమయినా కూడా ఆయన అసంగం.

**అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మః అన్యత్ర అస్మాత్ కృతాకృతాత్** - కఠ 1.2.14

ప్రపంచంలోని మంచీ అంటదు, చెడూ అంటదు భగవంతునికి. భగవంతుడు మంచివాడా, చెడ్డవాడా? సకల గుణాభిరాముడు అంటాము కాని పారమార్థిక స్థాయిలో బ్రహ్మ గుణాతీతుడు, అసలు ద్వైతమే లేనప్పుడు, మంచీ చెడు ప్రసక్తి ఎక్కడ వస్తుంది? ద్వంద్వాలు వ్యావహారిక స్థాయిలోనే వస్తాయి. పారమార్థిక స్థాయిలో ద్వంద్వాతీతుడు. గగనసదృశుడు. పుణ్యమూర్తీ కాదు, పాపాత్ముడూ కాదు.

**నిత్యం వాయుః ఆకాశస్థితః** - ఆకాశం ఉదాహరణ ఇస్తున్నాడు ఈ శ్లోకంలో. ఆకాశంలో వాయువు ఉంది. నిజానికి ఆకాశంలో అనేకం ఉన్నాయి. కాని ఇక్కడ కృష్ణపరమాత్మ వాయువును మాత్రమే తీసుకున్నాడు. ఎటువంటి వాయువు? వాయువు కొన్ని చోట్ల నుంచి సుగంధాన్ని మోసుకువస్తే, మరికొన్ని చోట్లనుంచి దుర్గంధాన్ని మోసుకువస్తుంది ఆకాశానికి. కాని ఆకాశం సుగంధంగానూ మారదు; దుర్గంధంగానూ మారదు. పైగా వాయువు ఆకాశంలో నిత్యమూ ఉంది.

**సర్వత్రగః (వాయుః)** – అంతటా సంచరిస్తుంది ఈ వాయువు.

**మహాన్** – చాలా విస్తృతమైనది అవటంవల్ల. కాని వాయువు ఏ గంధాన్ని మోసుకువచ్చినా, ఆ గంధం ఆకాశానికి అంటదు.

**తథా** – అదే విధంగా;

**సర్వాణి భూతాని మత్స్థాని** – నాలో అందరు ప్రాణులూ ఉన్నారు. అంటే మంచివాళ్ళూ ఉన్నారు; చెడ్డవారూ ఉన్నారు. కాని నాకేం అంటదు.

**ఇతి ఉపధారయ** – ఈ విషయం నువ్వు గట్టిగా అర్థం చేసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 7 **సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ ।**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥**
సర్వభూతాని, కౌంతేయ, ప్రకృతిమ్, యాంతి, మామికామ్,
కల్పక్షయే, పునః, తాని, కల్పాదౌ, విసృజామి, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కౌంతేయా! | కల్పాదౌ | = ఇంకా కల్పాదియందు |
| కల్పక్షయే | = కల్పాంతమునందు | తాని | = వాటిని |
| సర్వభూతాని | = భూతములన్నియును | పునః | = మళ్ళీ |
| మామికామ్, ప్రకృతిమ్ | = నా ప్రకృతినే | అహమ్ | = నేను |
| యాంతి | = చేరును | విసృజామి | = సృష్టించుచుందును |

**హే కౌన్తేయ! సర్వ–భూతాని కల్ప–క్షయే మామికామ్ ప్రకృతిమ్ యాన్తి ।**
**పునః కల్ప–ఆదౌ తాని విసృజామి ॥**

తా: ఓ కౌంతేయా! కల్పాంతమునందు భూతములన్నియును నా ప్రకృతినే చేరును. ఇంకా కల్పాదియందు వాటిని మళ్ళీ నేను సృష్టించుచుందును.

ఐదవ శ్లోకంలో కృష్ణపరమాత్మ తాను జగత్తుయొక్క సృష్టి స్థితి లయ కారకుడినని చెప్పాడు. ఆ విషయాన్నే 7, 8 శ్లోకాల్లో వివరిస్తున్నాడు.

జగత్తును సృష్టించేముందు, ఆ జగత్తు తనలో ముందే అవ్యక్తరూపంలో ఉందని కృష్ణపరమాత్మ చెపుతున్నాడు. విజ్ఞానశాస్త్రం ప్రకారం కూడా పదార్థాన్ని కొత్తగా సృష్టించనూ లేము, నాశనం చెయ్యనూ లేము. అలాగే వేదాంతపరంగా కూడా బ్రహ్మ కొత్తగా జగత్తును సృష్టించడు. తనలో అవ్యక్తరూపంలో ఉన్నదానికి వ్యక్తరూపాన్ని ఇస్తాడు అంతే. ఒక విత్తనంలో ఒక మహావృక్షం అవ్యక్తరూపంలో ఉన్నట్టు, ఒక తల్లిగర్భంలో శిశువు అవ్యక్తరూపంలో ఉన్నట్టు, జగత్తు బ్రహ్మలో అవ్యక్తరూపంలో ఉంది. అవ్యక్తరూపంలో ఉంటే మాయ లేదా ప్రకృతి అంటాము; వ్యక్తరూపంలోకి వస్తే జగత్తు అంటాము. ఈ విషయం రెండవ అధ్యాయంలో కూడా చూశాము, ఎనిమిదవ అధ్యాయంలో కూడా చూశాము.

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥** – 8.18

ప్రపంచం అవ్యక్తంలోంచి వ్యక్తమవుతుంది; మళ్ళీ వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది.

ఇదెలా సాధ్యం? మళ్ళీ మీ స్వప్నప్రపంచమే దీనికి ఉదాహరణ. ఇవాళ రాత్రి మీరు కనబోయే కల, మీలో అవ్యక్తరూపంలో ఉంటుంది. నాకు కలలు రావు అనకండి; అది ఒక కల. అందరూ కలలు కంటారని విజ్ఞానశాస్త్రం నిరూపించింది. కొంతమంది గుర్తిస్తారు, కొంతమంది గుర్తించరు. అంతే.

దేని గురించి కల కంటారు? మీరు మీ పరిశీలనాశక్తితో, మీ అనుభవంతో పోగేసిన విషయాల గురించే కలలు కంటారు. మీరు ఎన్నడూ చూడని, మీరు ఎన్నడూ అనుభవించని విషయం గురించి కల కనలేరు. కాకపోతే ఆ కలలో రకరకాల పర్ముటేషన్లు, కాంబినేషన్లు రావచ్చు. మనిషి శరీరం గేదె తల రావచ్చు. అంటే మీరు ఒక మనిషిని, ఒక గేదెను చూసారు; వారితో ఏదో అనుభవం పొందారు.

లేదు, నేనలాంటి అనుభవం పొందలేదని మీరంటే, మీరు పొందారు కాని మర్చిపోయుంటారు అంటాము. లేదు నాకు అఖండమైన జ్ఞాపకశక్తి ఉంది, నేను మర్చిపోలేదు, నేను అటువంటి అనుభవాన్ని ఎన్నడూ పొందలేదు అని మీరంటే అయితే అది మీ పూర్వజన్మ వాసనలనుంచి వచ్చింది అంటాము. అందువల్ల ఈ రాత్రి కల మీ మనస్సులో అవ్యక్తరూపంలో ఉంది. పగలు మీ మనస్సు వి.సి.ఆర్.లా పనిచేస్తుంది. అందులో అన్ని రకాల అనుభవాలనూ రికార్డు చేస్తుంది. రాత్రి మీ మనస్సు వి.సి.పి.లా పనిచేస్తుంది. వి.సి.పి తనలో రికార్డు చేయని దాన్ని మీకు మళ్ళీ చూపలేదు. మీ కల కూడా అంతే. మీ మనస్సులో రికార్డు అవనిదాన్ని చూపించలేదు.

ఎలాగైతే మీ స్వప్నప్రపంచం మీ మనస్సులో అవ్యక్తరూపంలో ఉందో, అలా ఈ జాగ్రద్ ప్రపంచం బ్రహ్మలో అవ్యక్తరూపంలో ఉంది. దాన్నే ప్రకృతి లేదా మాయ అంటాము. కృష్ణపరమాత్మ ఈ సృష్టి మొత్తం నానుంచి వచ్చి, నాలో లయమవుతుంది అంటున్నాడు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**సర్వభూతాని ప్రకృతిం యాంతి** – అన్ని ప్రాణులు నాలోకే వస్తాయి. ఏ రూపంలో? ప్రకృతి రూపంలో.

**మామికామ్** – నామీదే ఆధారపడుతుంది. ఎలాగైతే వ్యక్తప్రపంచం నామీదే ఆధారపడుతుందో, అలాగే అవ్యక్త ప్రకృతి కూడా నామీదే ఆధారపడుతుంది.

ఎలాగైతే వ్యక్త స్వప్నప్రపంచం జాగ్రద్ పురుషునిమీద ఆధారపడుతుందో, అలాగే అవ్యక్త వాసనలు కూడా జాగ్రద్ పురుషునిమీదే ఆధారపడతాయి. వాసనలు కలలుగా మారతాయి, కలలు మళ్ళీ వాసనలలోకి వెళ్ళిపోతాయి. అలాగే బ్రహ్మనుంచే వ్యక్తప్రపంచం వస్తుంది, బ్రహ్మలోకే అవ్యక్తంగా వెళ్ళిపోతుంది. అంటే రెండూ బ్రహ్మమీదే ఆధారపడతాయి. ఎప్పుడు జరుగుతుంది ఇది?

**కల్పక్షయే** – కల్పం ముగిసినప్పుడు. బ్రహ్మదేవుని ఒకరోజు రెండువేల చతుర్యుగాలు అని చూశాము. కల్పాంతంలో అంటే చాలా సమయం ఉంది.

**కల్పాదౌ అహం విసృజామి** – కొత్త కల్పం వచ్చినప్పుడు మళ్ళీ సృష్టి జరుగుతుంది. వెయ్యి చతుర్యుగాల తర్వాత బ్రహ్మదేవుడు లేచినప్పుడు కొత్త సృష్టి వస్తుంది.

శ్లో. 8 **ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః ।**
**భూతగ్రామమిమం కృత్స్నమ్ అవశం ప్రకృతేర్వశాత్ ॥**
ప్రకృతిమ్, స్వామ్, అవష్టభ్య, విసృజామి, పునః, పునః,
భూతగ్రామమ్, ఇమమ్, కృత్స్నమ్, అవశమ్, ప్రకృతేః, వశాత్ ॥

| | | | |
|---|---|---|---|
| (అహమ్) | = నేను | కృత్స్నమ్ | = సమస్తమైన |
| స్వామ్, ప్రకృతిమ్ | = స్వీయప్రకృతిని | భూతగ్రామమ్ | = భూతసముదాయమును |
| అవష్టభ్య | = స్వీకరించి | పునః, పునః | = మాటిమాటికిని |
| ప్రకృతేః, వశాత్ | = తమతమ స్వభావవశమున | విసృజామి | = వాటి వాటి కర్మానుసారము సృష్టించుచుందును |
| అవశమ్ | = పరతంత్రమైయున్న | | |
| ఇమమ్ | = ఈ | | |

**(అహమ్) స్వామ్ ప్రకృతిమ్ అవష్టభ్య ప్రకృతేః వశాత్**
**అవశమ్ ఇమమ్ కృత్స్నమ్ భూత–గ్రామమ్ పునః పునః విసృజామి ॥**

తా: నేను స్వీయప్రకృతిని (నా మూలప్రకృతిని) స్వీకరించి తమతమ స్వభావవశమున పరతంత్రమైయున్న ఈ సమస్తమైన భూతసముదాయమును మాటిమాటికిని వాటి వాటి కర్మానుసారము సృష్టించుచుందును.

ఇందులో కూడా ఇదే భావన కొనసాగుతున్నది.

**(అహం) పునః పునః విసృజామి** – నేను ఈ జగత్తును మళ్ళీ, మళ్ళీ వృత్తాకారంలో సృష్టిస్తున్నాను. ఈ వాక్యం చాలా ముఖ్యమైన వాక్యం. వేదాంతంలో సృష్టిక్రమం ఒక సరళరేఖలా జరగలేదనీ, వృత్తాకారంలో జరిగిందని వస్తుంది. సరళరేఖలా సృష్టి క్రమం జరిగితే, మొదటిసృష్టి ఉన్నట్టు వస్తుంది. మొదటిసృష్టి ఉందంటే, తర్కపరంగా అనేక సమస్యలు వస్తాయి.

సృష్టి వృత్తాకారంలో జరిగింది. అంటే ఇది మొదటిసృష్టి అని చెప్పలేము. అవ్యక్తం, వ్యక్తం వృత్తం కొనసాగుతుంది. వృత్తానికి మొదలు, చివర లేనట్టే సృష్టికి కూడా మొదలు, చివర లేవు. సృష్టి ఎప్పుడు మొదలయింది అని అడిగితే, అది తర్కానికి అందదు. దానికి తర్కసమ్మతమైన జవాబును ఇవ్వలేము.

ఆగకుండా దూసుకెళ్ళే తుపాకీగుండు ఏదీ దూరలేని గోడకి వెళ్ళి తగిలితే ఏమవుతుంది అని ఎవరైనా అడిగితే, అది అర్థం లేని ప్రశ్న. ఆగకుండా దూసుకెళ్ళే తుపాకీగుండును గోడ ఆపలేదు. ఏదీ దూరలేని గోడ అయితే, తుపాకీగుండును ఆపకుండా ఉండదు. ఇటువంటి ప్రశ్నలను కుతర్కం అంటారు. వీటికి తర్కసమ్మతమైన జవాబులు ఉండవు. అలాగే సృష్టిప్రకరణం ఎప్పుడు మొదలయ్యింది అనే ప్రశ్న కూడా అసంబద్ధమైన ప్రశ్నే! పునః పునః అన్నాడు కృష్ణపరమాత్మ. మళ్ళీ మళ్ళీ జరుగుతూనే ఉంది. అది అనాది, అనంతం.

**ప్రకృతిం స్వామ్ అవష్టభ్య** – కాని నేను సృష్టి చెయ్యాలంటే, ప్రకృతి సహాయం తీసుకోవాలి. ప్రకృతి అంటే అవ్యక్తరూపంలో ఉన్నది అని చూశాము. ఎలాగైతే స్వప్నప్రపంచం సృష్టించాలంటే వాసనలు ఉండాలో, అలాగే జగత్తును సృష్టించాలంటే అవ్యక్తంగా జగత్తు ఉండాలి. అందువల్ల ప్రకృతి సహాయం తీసుకుని,

**ఇమం కృత్స్నం భూతగ్రామమ్** – మొత్తం జీవరాశులన్నిటినీ సృష్టిస్తున్నాను. గ్రామం అంటే పల్లెటూరు కాదు. సముదాయాన్ని గ్రామం అంటారు. భూతసముదాయాన్ని సృష్టిస్తున్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అవశమ్** – ఆ భూతసముదాయం నిస్సహాయంగా ఉంది. అందువల్ల వాటిని సృష్టించకుండా ఆపలేను నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. కొంతమంది, వారి సమస్యలకు పరిష్కారం దొరకక ఆత్మహత్య చేసుకుంటారు. నిజానికి వారికి మరుజన్మ ఇంకా కష్టంగా ఉంటుంది. ఆత్మహత్య మహాపాపం, అందువల్ల వారు కొత్తగా ఇంకొక పాపం మూటకట్టుకుంటారు. ఈ జననమరణచక్రంనుంచి బయట పడాలంటే మోక్షం ఒక్కటే మార్గం. ఆగకుండా తిరుగుతున్న రంగులరాట్నంనుంచి ఎలా బయటపడాలి? దాన్నించి కిందకి దూకాలి. ఈ జననమరణవృత్తంనుంచి బయటపడి ఎలా మోక్షం పొందాలి? భగవద్గీత చివరిదాకా నేర్చుకోవాలి.

శ్లో. 9 **న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ ।**
**ఉదాసీనవదాసీనమ్ అసక్తం తేషు కర్మసు ॥**
న, చ, మామ్, తాని, కర్మాణి, నిబధ్నంతి, ధనంజయ,
ఉదాసీనవత్, ఆసీనమ్, అసక్తమ్, తేషు, కర్మసు ॥

| | | | |
|---|---|---|---|
| ధనంజయ! | = ఓ అర్జునా! | ఉదాసీనవత్ | = ఉదాసీనుని వలె |
| తేషు, కర్మసు | = ఆ కర్మలయందు | ఆసీనమ్, మామ్ | = ఉన్నట్టి నన్ను |
| అసక్తమ్ | = అభిమానములేనివాడనైన | తాని, కర్మాణి | = ఆ కర్మలు |
| చ | = ఇంకా | న, నిబధ్నంతి | = బంధింపవు |

**హే ధనంజయ! తేషు కర్మసు అసక్తమ్ ఉదాసీనవత్ ।**
**ఆసీనమ్ మామ్ తాని కర్మాణి చ న నిబధ్నన్తి ॥**

తా: ఓ అర్జునా! ఆ కర్మలయందు అభిమానములేనివాడనైన ఇంకా ఉదాసీనుని వలె ఉన్నట్టి నన్ను ఆ కర్మలు బంధింపవు.

**ఎఫ్) అకర్తా అభోక్తా**

మనకు కలగబోయే సందేహానికి జవాబుగా కృష్ణపరమాత్మ చెప్పిన ఇంకొక లక్షణం భగవంతుడు అకర్తా, అభోక్తా. భగవంతుడు తను సృష్టికర్త అని చెపితే, ఆయన కర్మ చేసినట్టు వస్తుంది. జగత్తును సృష్టించటం ఒక కర్మ అయితే, ఆయన సృష్టికర్త అయితే, కర్తృత్వం ఉండాలి; కర్త అయితే భోక్తృత్వం కూడా ఉండాలి. కర్త తను చేసిన కర్మఫలం అనుభవించాలి. దాన్ని భోక్తృత్వం అంటారు.

మనకు ఏదైనా కష్టం వచ్చినప్పుడు దేవుణ్ణి నిందిస్తాము. ఆయన ఆనందించటంకోసం మనను సృష్టించి, మనం అవస్థలు పడుతుంటే చూసి నవ్వుకుంటున్నాడనీ, ఆయనకు మనస్సు లేదనీ నిందిస్తాము. దీనికి కృష్ణపరమాత్మ ఇక్కడ జవాబు చెపుతున్నాడు. నేను అకర్తను, అభోక్తను. నేను ఏదీ సృష్టించనూ లేదు, దేన్నీ నాశనమూ చెయ్యలేదు. అందువల్ల ఏ కర్మను కాని, కర్మఫలాన్ని కాని నాకు ఆపాదించలేరు.

**ధనంజయ** – ఓ అర్జునా;

**తాని కర్మాణి మాం న నిబధ్నంతి** – నేను కర్మలు చేస్తున్నా కూడా ఆ కర్మలు నన్ను అసలు బంధించవు. భగవంతుడు సృష్టి, స్థితి, లయ కారకుడని చూశాము. అదెలా సాధ్యం? కర్మ చెయ్యటం మానలేదు. కర్మ చేస్తూనే ఉన్నాడు. కాని కర్మకు బద్ధుడు కావటం లేదు. దాని రహస్యం ఇక్కడ చెపుతున్నాడు.

**కర్మసు అసక్తం** – ఆ కర్మలతో నేను బంధం పెంచుకోవటం లేదు. అంటే కర్తృత్వ అభిమానం లేదు. అందువల్ల కర్మయొక్క బంధాలనుంచి ఎలా తప్పుకోవాలి? దానికోసం కర్మను మాననవసరం లేదు, కర్మమీద అభిమానం మానుకోవాలి. అహంకారమమకారాలు వదులుకోవాలి. దీన్ని కర్మసు అసక్తం అంటారు. అలా చేస్తే ఏమవుతుంది?

**ఉదాసీనవత్ ఆసీనమ్** – ఉదాసీనుడిలా ఉండవచ్చు. అంటే కర్మమీద బంధం పెంచుకోకుండా, దానితో మమేకం చెందకుండా ఉండాలి. పనిచేస్తూ, దానిలో మమేకం చెందకూడదని ఐదవ అధ్యాయంలోనే చెప్పాడు కృష్ణపరమాత్మ.

> **నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
> **పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥** – 5.8

అభిమానత్యాగమే కర్తృత్వభోక్తృత్వాలనుంచి బయటపడే మార్గం. కర్మ మాననవసరం లేదు; కర్మ మానుకోలేము కూడా; కర్మ అభిమానం వదులుకుంటే చాలు. కర్మ అభిమానం వదులుకుంటే, దానంతట అదే భోక్తృత్వభావన కూడా పోతుంది.

శ్లో. 10 **మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।**
**హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే ॥**
మయా, అధ్యక్షేణ, ప్రకృతిః, సూయతే, సచరాచరమ్,
హేతునా, అనేన, కౌంతేయ, జగత్, విపరివర్తతే ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | సూయతే | = సృష్టించుచున్నది |
| అధ్యక్షేణ | = అధ్యక్షుడనైయున్న | అనేన | = ఈ |
| మయా | = నాచేత | హేతునా | = కారణమున |
| ప్రకృతిః | = ప్రకృతి | జగత్ | = సంసారచక్రము |
| సచరాచరమ్ | = ఈ చరాచరజగత్తును | విపరివర్తతే | = పరిభ్రమించుచున్నది |

**హే కౌన్తేయ! మయా అధ్యక్షేణ ప్రకృతిః సచర-అచరమ్ సూయతే,**
**అనేన హేతునా జగత్ విపరివర్తతే ॥**

తా: ఓ కుంతీసుతా! అధ్యక్షుడనైయున్న నాచేత ప్రకృతి ఈ చరాచరజగత్తును సృష్టించుచున్నది. ఈ కారణమున సంసారచక్రము పరిభ్రమించుచున్నది.

**జి) సాక్షీభూతం**

కర్మ అభిమానం వదులుకోవటం అంటే సాక్షీభూతంగా చూడటం. ఆ సాక్షీభూతం అంటే ఏమిటో ఇక్కడ వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. నేను ఏమీ ప్రయత్నపూర్వకంగా చెయ్యను, కాని నా సమక్షంలో పనులు అవుతాయి. ఒక గదిలో కాంతి ఉంటే, ఆ గదిలో జరిగే పనులన్నిటినీ కాంతి ప్రకాశింపజేస్తుంది. అంటే కాంతి ఉండటం వల్లనే ఆ గదిలో అనేక పనులు జరుగుతున్నాయి. కాని కాంతి ఇలాంటి పని చెయ్యండి అని ఏమీ చెప్పదు. ఆ గదిలో మంచిపనులు జరగవచ్చు, చెడుపనులు జరగవచ్చు. కాని ఆ పనులయొక్క మంచి కాని, చెడు కాని కాంతికి అంటదు.

కాంతి ఏమీ పని చెయ్యటం లేదంటే, ఆ గదిలో లైటు ఎందుకు, దండగ, అని లైటును ఆపేయవచ్చా? కాంతి లేకపోతే పనులు జరగవు, కాని కాంతికి కర్మఫలం అంటదు. దీన్ని సాక్షీభూతం అంటారు.

**మయా అధ్యక్షేణ** - నా అధ్యక్షతలో అంటున్నాడు కృష్ణపరమాత్మ. నా అంటే ఏమిటి? ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. నా అంటే కృష్ణశరీరంతో ఉన్న భగవంతుడు కాదు. కృష్ణపరమాత్మ సగుణరూపం అనీ, తను అపరాప్రకృతిలోకి వస్తాడనీ చూశాము. అందువల్ల నా అంటే నిర్గుణచైతన్యం, శుద్ధచైతన్యం, సర్వవ్యాపకమైన చైతన్యం. ఆ నిర్గుణచైతన్యం సన్నిధిలో,

**ప్రకృతిః సూయతే సచరాచరమ్** - ప్రకృతి ఈ చరాచరప్రపంచాన్ని సృష్టిస్తున్నది. ప్రకృతి అంటే మాయ. ఈ మాయను అపరాప్రకృతి అన్నాడు ఏడవ అధ్యాయంలో.

విద్యుచ్ఛక్తి సమక్షంలో ప్రతి ఒక వస్తువూ పనిచేస్తుంది కాని విద్యుచ్ఛక్తి నువ్వు తిరుగు, నువ్వు వెలుగు అని ఏ వస్తువునూ నిర్దేశించదు. విద్యుచ్ఛక్తి సమక్షంలో ఫ్యాను తిరుగుతుంది, బల్బు వెలుగుతుంది. విద్యుచ్ఛక్తిని సామాన్య కారణం అనీ; బల్బు, ఫ్యానులను విశేషకారణం అనీ అంటారు. అలాగే చైతన్యం సమక్షంలో రాజసికమనస్సు రాజసిక పనులను, తామసికమనస్సు తామసిక పనులను, సాత్త్వికమనస్సు సాత్త్విక పనులను చేస్తుంది. ఇది ఇంకొక సందేహాన్ని తీరుస్తుంది.

భగవంతుడు అందరిలోనూ ఉంటే కొందరిలో నేరప్రవృత్తి ఎందుకుంటుంది? నేరప్రవృత్తి వారి మనస్సు మీద, మనస్సులోని ఆలోచనలమీద ఆధారపడి వుంటుంది. చైతన్యం ఆ మనస్సుకు చేతనత్వాన్ని ఇస్తుంది అంతే. చరాచరమ్ అంటే కదిలే వస్తువులను, కదలని వస్తువులను మాయ సృష్టించింది. అంటే వస్తువులు, ప్రాణులు ఉన్న మొత్తం జగత్తును సృష్టించింది.

**హేతునా అనేన** – కేవలం నా సమక్షంవల్లనే, మొత్తం జీవితమనే నాటకం నడుస్తున్నది. కాంతి సమక్షంలోనే గురువు బోధించగలడు; శిష్యుడు నేర్చుకోగలడు. అందువల్ల కాంతి ప్రత్యక్షంగా పని చెయ్యకపోయినా, కాంతి ఉండితీరాలి.

ఈ విషయాన్ని పంచదశిలో విద్యారణ్యులవారు నాటకదీపప్రకరణం అనే అధ్యాయంలో వివరంగా చెబుతారు. నాటకం జరగటానికి అక్కడ దీపం కావాలి. కాని దీపం ఏ పాత్ర వెయ్యదు; పాత్రధారులను చూపిస్తుంది. వారు చేసే పనులను చూపిస్తుంది. అలాగే హేతునా అనేన అంటే నా సమక్షంలో –

**జగద్విపరివర్తతే** – మొత్తం ప్రపంచం పరిభ్రమిస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. సౌరకుటుంబంలో అన్నీ వాటి కక్ష్యల్లో తిరుగుతున్నాయంటే భగవంతునివల్లనే. ఈ శ్లోకంలో ఈశ్వరుడు అకర్తా, అభోక్తా అని చూపించాడు. ఇక్కడితో ఈశ్వరస్వరూపవివరణ అయిపోయింది.

ఈశ్వరుడు అకర్తా, అభోక్తా అని తెలిస్తే, మన సమస్యలకు ఈశ్వరుణ్ణి నిందించలేము. భగవంతుడు ఎవరికీ అన్యాయం చెయ్యటం లేదు. ఎందుకంటే భగవంతుని ప్రణాళికప్రకారమో, ఆయన కోరిక ప్రకారమో, ఆయన ప్రయత్నంవల్లనో ఏపనీ జరగటం లేదు. ఆయన దేనిలోనూ కలుగజేసుకోడు. అయితే మరి మనం ఎందుకు కష్టాలు పడుతున్నాము?

అవి మనం కోరి తెచ్చుకున్న కష్టాలు. ఇవాళ మనం కష్టపడుతుంటే, అది మన పూర్వజన్మ కర్మలఫలం. పూర్వజన్మలో కర్తలం, ఇప్పుడు భోక్తలం. అందువల్ల భగవంతునికి మనస్సు లేదు, నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తున్నాడు లాంటి నీలాపనిందలు వేసి లాభంలేదు. చాలా గొప్ప భక్తులు కూడా, జీవితంలో అనుకోకుండా పెద్ద కష్టం వస్తే, నాస్తికులుగా మారిపోతారు. భగవంతుడు లేనే లేడు; నేను ఆయనకు పూజ చెయ్యను అంటారు.

ఒకావిడ ఎన్నాళ్ళో భగవంతునికి పూజలు చేసింది. ఎన్ని పూజలు చేసినా వాళ్ళమ్మాయికి పెళ్ళి కుదరటం లేదని కోపం వచ్చి, తను అపురూపంగా చూసుకునే పూజా పుస్తకాలన్నిటినీ తీసుకువెళ్ళి చెత్తబుట్టలో పడేసి వచ్చింది. పేపరువాడికి తూకానికి అమ్మాలని కూడా అనిపించలేదుట. అంత కోపం వచ్చింది ఆవిడకు భగవంతునిమీద. భగవంతుడు లేడు పొమ్మంది! ఎంత దారుణం! భగవంతుడు అక్కడ ఆ అమ్మాయి పెళ్ళి చెయ్యటానికే కూర్చున్నాడా? పెళ్ళి చేస్తేనే ఆయన ఉన్నట్టా? ఇలా మనకు కష్టం రాగానే భగవంతుని నిందించి, పూజలు మానేస్తాము.

మనం పూజలు చెయ్యటంవల్ల కొంత పుణ్యం వస్తుంది, కాని పాపఫలం చాలా ఎక్కువగా ఉంటే, ప్రార్థనవల్ల వచ్చిన పుణ్యం దాన్ని అధిగమించలేదు. **ప్రార్థన ఎన్నడూ వృథా పోదు.** కాని మన ప్రారబ్ధకర్మ ప్రబలంగా ఉంటే, ఈ పుణ్యం ఆ పాపాన్ని తగ్గించలేదు. రెండున్నర నిముషాలసేపు చేసే పూజవల్ల, ఆ కాసేపట్లో కూడా చలించే మనస్సు పెట్టుకుని, గొప్ప ఫలం రావాలంటే ఎలా వస్తుంది? అంటే పూజ ఎక్కువసేపు చెయ్యటం లేదు, చేసిన కాసేపు నిర్మలభక్తితో చెయ్యటం లేదు, కాని ప్రపంచంలో ఉన్నవన్నీ కావాలి, లేదా కోరికలన్నీ తీరిపోవాలి. అదెలా సాధ్యం?

అందువల్ల ప్రార్థనయొక్క సూత్రాన్ని అర్థం చేసుకోవాలి. ప్రార్థన బలంగా ఉండి, ప్రారబ్ధకర్మ బలహీనంగా ఉంటే ప్రార్థన నెరవేరుతుంది. కాని ప్రార్థన బలహీనంగా ఉండి, ప్రారబ్ధకర్మ ప్రబలంగా ఉంటే ప్రార్థన నెరవేరదు. ఈ విషయం తెలియకుండా పాపం మనం భగవంతుణ్ణి నిందిస్తాము. ఆయన అకర్తా, అభోక్తా.

4-10 శ్లోకాల వరకూ ఈశ్వరుని స్వరూపం చూశాము. దానికి ఆరు అంశాలు చూశాము. అవి అవ్యక్తం, సర్వవ్యాపకం, మిథ్యా జగదధిష్ఠానం, సృష్టి-స్థితి-లయ కారణం, అసంగం, అకర్తా అభోక్తా, సాక్షీభూతం.

**3. సంసార కారణం: శ్లోకం 11**

శ్లో. 11 **అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥**
అవజానంతి, మామ్, మూఢాః, మానుషీమ్, తనుమ్, ఆశ్రితమ్,
పరమ్, భావమ్, అజానంతః, మమ, భూతమహేశ్వరమ్ ॥

| | | | |
|---|---|---|---|
| మమ | = నాయొక్క | మానుషీమ్ | = మనుష్య |
| పరమ్, భావమ్ | = పరమస్వరూపమును | తనుమ్ | = శరీరమును |
| అజానంతః | = తెలుసుకొననివారై | ఆశ్రితమ్ | = ఆశ్రయించిన |
| మూఢాః | = అజ్ఞానులు | మామ్ | = నన్ను |
| భూత మహేశ్వరమ్ | = సకలప్రాణులకును మహేశ్వరుడను | అవజానంతి | = తక్కువగా ఊహింతురు |

**భూత-మహేశ్వరమ్ మమ పరమ్ భావమ్ అజానన్తః మూఢాః ।**
**మానుషీమ్ తనుమ్ ఆశ్రితమ్ మామ్ అవజానన్తి ॥**

తా: నాయొక్క పరమస్వరూపమును తెలుసుకొననివారై అజ్ఞానులు సకలప్రాణులకును మహేశ్వరుడను లోకహితముకోసం మనుష్యశరీరమును ఆశ్రయించిన నన్ను తక్కువగా ఊహింతురు.

పదవ శ్లోకం వరకూ పరాప్రకృతిని వర్ణించాక, ఇప్పుడు తను చెప్పే అంశాన్ని మారుస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు చెప్పబోయేది సంసారకారణం. ఎందుకు మనకు సమస్యలు వస్తున్నాయి? **మనం ఆశించేది తప్పు.** శాశ్వతం కాని వస్తువులనుంచి శాశ్వతత్వాన్ని కోరుకుంటున్నాము; తనకే భద్రత లేని వస్తువునుంచి భద్రత కోరుకుంటున్నాము; శాశ్వతం కాని వస్తువునుంచి పూర్ణత్వం కోరుకుంటున్నాము.

మనిషి శాంతి, భద్రత, ఆనందాలకోసం వెంపర్లాడతాడు. అవి దొరకకపోవటంవల్ల, సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటాడు. అవి ఎందుకు దొరకవు? శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో ఉన్నాయనుకుని నిరంతరం వాటి వెంట పరుగులు తీస్తాడు. అంటే జగత్తుమీద ఆధారపడతాడు.

జగత్తుమీద ఆధారపడే దశ నుంచి భగవంతునిమీద ఆధారపడే దశకు చేరుకోవాలి. భగవంతుడు అంటే సగుణబ్రహ్మనా, నిర్గుణబ్రహ్మనా? నిర్గుణబ్రహ్మ లేదా పరాప్రకృతి. ఇది ఎవరూ అర్థం చేసుకోలేక, నా అపరాప్రకృతిలోనే ఆగిపోతున్నారు అని కృష్ణపరమాత్మ అంటున్నాడు. అలా ఆగిపోయినందుకు చాలా కోపం వస్తున్నది.

**మూఢాః** – అలాంటి వారిని మూఢులు అంటున్నాడు. ఎలాంటి వారిని? నిత్యానిత్యవస్తువివేకం చెయ్యలేని అవివేకులను, అజ్ఞానులను మూఢులు అంటున్నాడు.

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజమూఢమతే** – భజగోవిందం

శంకరాచార్యులు కూడా అలాగే వారిని మూఢమతులు అన్నారు. ఉపనిషత్తు అయితే ప్రమూఢా అని ఇంకా గట్టిగా తిడుతుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః** – కైవల్యం 3

కర్మ, పిల్లలు, ధనం – ఇవేవీ అమృతత్వాన్ని ఇవ్వవు. అమృతత్వం అంటే శాశ్వతత్వం. లేదు అవే శాశ్వతత్వాన్ని ఇస్తాయంటే, సరే ప్రయత్నించి చూడండి, అవస్థపడి, వెనక్కి రండి, అప్పటి వరకూ వేచివుంటాము అంటుంది శాస్త్రం.

**(మూఢాః) మమ పరం భావం అజానంతః**– ఈ మూఢులు నా నిర్గుణస్వరూపాన్ని తెలుసుకోరు; పరం భావం అంటే పరాప్రకృతి. పరాప్రకృతి స్వరూపాన్ని తెలుసుకోరు. ఎందుకు తెలియదు?

ఎందుకు తెలియదో చాలామందికి తెలియదు. నిజానికి మనకు ఏమీ తెలియదు. మనం అజ్ఞానంతో పుట్టాము. పరాప్రకృతి గురించిన అజ్ఞానం మాత్రమే కాదు, అన్ని విషయాల్లోనూ అజ్ఞానం మెండుగా ఉంది మనకు. ఇంగ్లీషు తెలియదు, మాతృభాష తెలియదు. అందువల్ల అజ్ఞానం అనే పెట్టుబడితో పుట్టాము. అది మనం కొత్తగా పెంపొందించుకున్నది కాదు. మనం పెరుగుతున్న కొద్దీ ఒక్కొక్క విషయంలోనూ మనకున్న అజ్ఞానాన్ని పారద్రోలుకుంటూ వస్తాము. ఎలా? ప్రయత్నపూర్వకంగా.

అందువల్ల అజ్ఞానం ఉండటం పాపం కాదు. కాని ఆ అజ్ఞానాన్ని పెంచి పోషించటం పాపం. భగవంతునియొక్క పరాప్రకృతిమీద మన అజ్ఞానం కొనసాగుతోందంటే దానికి కారణం మనం ఆ అజ్ఞానాన్ని తొలగించటానికి ప్రయత్నించక పోవటమే. అజ్ఞానాన్ని ఎలా తొలగించుకోవాలి? జ్ఞానం పొందటంద్వారా. జ్ఞానాన్ని ఎలా పొందాలి? కళ్ళు మూసుకుని ధ్యానం చెయ్యటానికి ప్రయత్నం చేస్తే నిద్ర వస్తుంది అంతే. ఖాళీగా కూర్చుంటే నిర్గుణస్వరూపం గురించి తెలియదు. నిర్గుణస్వరూపాన్ని తెలుసుకోవటానికి సరియైన ప్రమాణాన్ని వాడాలి. అంటే వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. కాని వేదాంతం నేర్చుకోవటం ఇష్టం ఉండదు కొందరికి. అనవసరమైన కాలయాపన, వృథా శ్రమ అనుకుంటారు కొందరు. అందువల్ల వారు బ్రహ్మ అజ్ఞానంలో ఉంటారు. వారికి పరాప్రకృతి గురించి తెలియకపోవటం వల్ల అపరాప్రకృతే అసలు దేవుడు అనుకుంటారు. అపరాప్రకృతి అంటే ఏమిటి?

**మానుషీం తనుమాశ్రితమ్** – అపరాప్రకృతి అంటే నా సగుణరూపం. మనిషిరూపంలో ఉన్న దైవస్వరూపం, అంటే రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వరుడు, దేవీ.

నిర్గుణ బ్రహ్మ స్వరూపంలో మొట్టమొదట చూసిన అంశం – అవ్యక్తం. అవ్యక్తం అంటే ఇంద్రియ అగోచరం. ఈ అపరాప్రకృతి ఇంద్రియ గోచరం. ఇంద్రియగోచరమే కాదు కాలపరిమితి, దేశపరిమితి ఉన్న నామరూపాల భగవంతుడు. అందువల్ల రామునికి కాని, కృష్ణునికి కాని ఒక పుట్టిన తేదీ ఉంది. శ్రీరామనవమి, కృష్ణాష్టమి అంటాము. వారు అవతారం చాలించిన రోజుని స్వర్గారోహణం అంటాము. అందువల్ల సగుణరూపానికి పరిమితులు ఉంటాయి. కాని ఈ మూఢులు నా మానవరూపాన్ని తీసుకుని, అదే నా అసలు స్వరూపం అనుకుని నన్ను క్రిందకి దింపేస్తున్నారు. వారు నన్ను స్తుతిస్తున్నామనుకుంటున్నారు కాని నా స్థాయిని క్రిందకి దింపేస్తున్నారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శంకరాచార్యులు **పరాపూజ** అని ఒక అద్భుతమైన శ్లోకం రాశారు. అందులో, ఓ దేవా, నీకు షోడశ ఉపచారాలు చేస్తున్నాననుకుని, నిజానికి షోడశ అపచారాలు చేస్తున్నాను అంటారు. అది కేవలం అజ్ఞానంవల్ల అలా చేస్తున్నాము.

**ఆయాతు వరదాదేవీ అక్షరం బ్రహ్మ సమ్మితమ్**
**గాయత్రీం ఛందసాం మాతేదం బ్రహ్మ జుషస్వ నః**

**ఆయాతు** – ఆయాతు అంటే ఆవాహనం చేస్తాము. అంటే భగవంతుడు ఉన్న స్థానంనుంచి మన విగ్రహంలోకి ఆహ్వానిస్తున్నాము. అంటే భగవంతుడు ఎక్కడో ఉన్నాడు, ఇక్కడ లేడు. ఇది మొదటి అపచారం.

**ఆసనం సమర్పయామి** – మొత్తం జగత్తుకే ఆసనం లేదా ఆధారం అయిన భగవంతునికి, ఒక చిన్న ఆసనం చూపించి అందులో కూర్చోమంటున్నాము. ఇది రెండవ అపచారం.

**అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి** – చేతులు, కాళ్ళు కడుగుతున్నాము. రూపమే లేని భగవంతునికి రూపాలు ఇస్తున్నాము. ఇది మూడవ అపచారం. పాదాలు కాని, చేతులు కాని ఎప్పుడు కడుగుతాము? అవి అశుద్ధంగా ఉన్నప్పుడు. భగవంతుడు నిత్యశుద్ధస్వరూపుడు, ఆయనకు అశుద్ధం ఎక్కడ? ఇది ఇంకొక అపచారం.

ఆ విధంగా మనం షోడశ ఉపచారాల పేరిట, షోడశ అపచారాలు చేస్తున్నాము. ఇది విని వెంటనే షోడశ ఉపచార పూజలు చెయ్యటం మానకూడదు. అసలే పూజలు ఎలా ఎగ్గొట్టాలా అని కారణాలు వెతుకుతాము మనం. ఎందుకు చెప్పారో అర్థం చేసుకోవాలి.

ఇక్కడ మనం సగుణపూజను విమర్శించటం లేదు, సగుణపూజ చెయ్యవద్దనీ అనటం లేదు. జగత్తుమీద ఆధారపడే స్థితినుంచి భగవంతునిమీద ఆధారపడే స్థాయికి రావాలి. అక్కడ అది సగుణరూపమే. కాని వేదం, శాస్త్రం, గీత – అన్నీ చెప్పేది ఒక్కటే. సగుణ రూపం దగ్గరే ఆగిపోకూడదు.

నిర్గుణబ్రహ్మను ఊహించుకోలేరు కాబట్టి, ముందు అర్థం కావటానికి ఒక ఆకారం ఇచ్చింది శాస్త్రం. లేదా ఇష్టదైవరూపంలో అనేక ఆకారాలు ఇచ్చింది. కాని అక్కడే ఆగిపోకుండా నిర్గుణ బ్రహ్మజ్ఞానానికి ఎదగమని చెపుతున్నది ఎక్కడికక్కడ. కర్మకన్నా ఉపాసన గొప్పదనీ, సకామ ఉపాసనకన్నా నిష్కామ ఉపాసన గొప్పదనీ ఇప్పటిదాకా చూశాము.

ఈ అధ్యాయంనుంచి నిష్కామ ఉపాసనకన్నా కూడా నిర్గుణబ్రహ్మజ్ఞానం పొంది పరాప్రకృతి గురించి జ్ఞానం పొందాలని కృష్ణపరమాత్మ తపన. పరాప్రకృతి గురించి జ్ఞానం పొందితే నామీదే ఆధారపడటం నేర్చుకుంటాను నేను. ఎందుకంటే నేను బ్రహ్మను.

ఆ విధంగా నా ప్రయాణం జగత్తుమీద ఆధారపడటంనుంచీ భగవంతునిమీద ఆధారపడటానికి రావాలి; తర్వాత భగవంతునిమీద ఆధారపడటంనుంచి నామీదే ఆధారపడే స్థాయికి రావాలి. నామీద అంటే చైతన్యతత్త్వం మీద.

**సాధకుని ప్రయాణం = కర్మయోగం + ఉపాసన యోగం + జ్ఞానయోగం.**

అందువల్ల కృష్ణపరమాత్మ, ఈ అజ్ఞానులు అసలు బ్రహ్మ స్వరూపం తెలుసుకోలేక, నన్ను క్రిందకు దింపుతున్నారు అంటున్నాడు.

పరాప్రకృతి గురించి తెలియకపోతే, కలిగే నష్టం ఏమిటి? వారు కోరుకున్న శాంతి, భద్రత, ఆనందాలు దొరకవు. ఒక్క నిర్గుణబ్రహ్మవల్లనే అవి దొరుకుతాయి. ఎందుకు? నిర్గుణబ్రహ్మ కానిది ప్రతిదీ సగుణమాయ. సగుణమాయ అంటే పదార్థం. పదార్థమైన ప్రతిదానికీ వికారాలు ఉంటాయి. శరీరానికి షడ్వికారాలు ఉంటాయని చూశాము. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. ఒకరోజు నాశనమైపోతుంది. మనకు ఆత్మీయులు మరణించగానే, భగవంతునికి చెవులు లేవా, కన్నులు లేవా, నా ప్రార్థనను ఆలకించలేడా అని తిడతాము.

ఇప్పుడు కృష్ణపరమాత్మ జవాబు చెప్పగలడు. నేను భగవద్గీతలో అన్నిసార్లు చెప్పాను. మీకు చెవులు లేవా, కన్నులు లేవా, నా మొరను మీరు ఆలకించలేరా, ఇదేమి అక్రమం అని తిడుతున్నాడు. మీరు నా బోధను వినకండి, నేను మాత్రం మీ బాధను అర్థం చేసుకోవాలా అని ఎదురు ప్రశ్నిస్తున్నాడు. నా అపరాప్రకృతిలో నిలవకండి; శాంతి, భద్రత, ఆనందం కావాలంటే నా ఉన్నతస్థాయి గురించి తెలుసుకోండి. జగత్తులో ఉన్నదంతా నాశనమయ్యేదే. ఏదీ శాశ్వతం కాదు.

వినకపోతే ఏం జరుగుతుంది? మీరే నష్టపోతారు. కార్డుబోర్డు ఛెయిర్ ఉదాహరణ మర్చిపోకండి. కార్డుబోర్డు ఛెయిర్ చూడటానికి అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది కాని, దానిమీద కూర్చోలేరు. అలాగే జగత్తు అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. భిన్నత్వం ఉంటుంది, కాని దానిమీద ఆధారపడలేరు. సంసారకారణం, ఈ మారుతున్న జగత్తుమీద ఆధారపడటమే.

పరం భావమ్ అజానన్తః అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటా పరంభావం?

**మమ భూతమహేశ్వరమ్** – సర్వప్రాణులకు మహేశ్వరుణ్ణి అంటే ఆధారాన్ని. అంటే నిర్గుణబ్రహ్మ అయిన నా పరంభావం తెలుసుకోలేకుండా ఉన్నారు కొంతమంది మూఢులు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అలా ఈ శ్లోకంలో నిర్గుణబ్రహ్మను తెలుసుకోకపోవటమే సంసారకారణం అని చెప్పాడు.

**పరాప్రకృతి అజ్ఞానమ్ ఏవ సంసారస్య కారణమ్.**

## 4. సంసార నివృత్తి ఉపాయం: శ్లోకాలు 12–19

12 నుంచి 19వ శ్లోకాల వరకూ కృష్ణపరమాత్మ రకరకాల మనుష్యులను గురించి చెబుతున్నాడు. కొంతమంది వారి సమస్యను తెలుసుకుంటారు. సమస్య తెలిస్తే పరిష్కారం తేలిక. సమస్య ఏమిటి? పరాప్రకృతి గురించిన అజ్ఞానం. పరిష్కారం ఏమిటి? పరాప్రకృతి జ్ఞానమ్ ఏవ. జ్ఞానమే పరిష్కారం అని అర్థమయితే, జ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హతను పొందటం తక్షణకర్తవ్యం అవుతుంది. తక్షణకర్తవ్యం – సాధనచతుష్టయసంపత్తిని పొందటం. సాధనచతుష్టయసంపత్తి పొందటానికి కర్మయోగం, ఉపాసనయోగం పాటించాలి. అంతకు ముందు కూడా ఒక సాధకుని ప్రయాణం ఎలా ఉండాలో చూశాము.

కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది; ఉపాసన యోగానికి వచ్చి చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి, జ్ఞానం పొందితే మోక్షం పొందుతారు. అంటే సంసారబంధంనుంచి విముక్తి పొందుతారు.

అలా కొంతమంది వారి లక్ష్యమేమిటో స్పష్టంగా తెలుసుకుని, ఆ మార్గంలో పయనిస్తారు. కాని కొంతమందికి వారికేం కావాలో, వారికే తెలియదు. కొన్నాళ్ళు ఒక లక్ష్యాన్ని పాటిస్తారు; వారు కోరుకున్నది పొందకపోయే సరికి, ఇదికాదు మన లక్ష్యం అనుకుని ఇంకొక లక్ష్యానికి మారిపోతారు. అలాంటివారిని దురదృష్టవంతులు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కఠోపనిషత్తులో రథకల్పనను చూస్తాము. అందులో శరీరాన్ని రథంతో, ఇంద్రియాలను గుర్రాలతో, మనస్సును పగ్గాలతో, బుద్ధిని రథసారథితో పోలుస్తారు. రథసారథికి ఎటు వెళ్ళాలో సరిగ్గా తెలిస్తే అతని ప్రయాణం సాఫీగా సాగుతుంది. అర్జునునికి కృష్ణపరమాత్మ మార్గదర్శకత్వం చూపినట్టుగా, మనం కూడా శాస్త్రానికి వస్తే, మనకూ శాస్త్రం మార్గం చూపిస్తుంది. కాని మనం శాస్త్రానికి వస్తే కదా, మార్గం దొరికేది? మనకు కోరికలు తప్పుగా ఉంటే, మన మార్గం తప్పు మార్గం అయి, మనం సంసారంలో అవస్థ పడుతుంటాము.

మన జీవితాన్ని మూడు దశలు నిర్దేశిస్తాయి – జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి. వాటినే జానాతి, ఇచ్ఛతి, యతతి అంటారు.

1. **జ్ఞానశక్తి:** ఏదైనా పని చెయ్యాలంటే, ముందు మనకు దాని గురించిన జ్ఞానం ఉండాలి. ఎవరైనా నీకు బంధం కావాలా అని అడిగితే, ముందు బంధం అంటే ఏమిటి అని అడుగుతాము. అందువల్ల మనం కోరేదాని గురించిన జ్ఞానం మనకు ఉండాలి. మనకు జ్ఞానం ఉన్న వస్తువులన్నీ కోరము. విషం గురించిన జ్ఞానం ఉంది, కాని దాన్ని కోరుతామా? కోరము. అందువల్ల మనం కోరుకునే విషయం మనకు తెలిసిన విషయమై ఉంటుంది.

2. **ఇచ్ఛాశక్తి:** జ్ఞానశక్తి ఇచ్ఛాశక్తికి దారితీస్తుంది.
3. **క్రియాశక్తి:** ఇచ్ఛాశక్తి క్రియాశక్తికి దారితీస్తుంది.

అందువల్ల జ్ఞానశక్తి సరిగ్గా లేకపోతే, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తులు తప్పుదోవను పట్టిస్తాయి. మనం సమస్యల్లో పడతాము. అంటే దీనంతటకీ మూలకారణం తప్పు ఆలోచనలు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలు చూద్దాము.

శ్లో. 12 **మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।**
**రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥**
మోఘాశాః, మోఘకర్మాణః, మోఘజ్ఞానాః, విచేతసః,
రాక్షసీమ్, ఆసురీమ్, చ, ఏవ, ప్రకృతిమ్, మోహినీమ్, శ్రితాః ॥

| | | | |
|---|---|---|---|
| మోఘాశాః | = వ్యర్థములైన ఆశలు గలవారును | రాక్షసీమ్ | = రాక్షసీ |
| మోఘకర్మాణః | = వ్యర్థములైన కర్మలను ఆచరించువారును | ఆసురీమ్ | = ఆసురీ |
| | | చ | = ఇంకా |
| మోఘజ్ఞానాః | = విపరీత జ్ఞానము గలవారును | మోహినీమ్ | = మోహినీ |
| విచేతసః | = విక్షిప్తములైన మనస్సులు గలవారును అగు అజ్ఞానులు | ప్రకృతిమ్, ఏవ | = స్వభావములనే |
| | | శ్రితాః | = ఆశ్రయింతురు. |

**(తే) మోఘ-ఆశాః మోఘ-కర్మాణః మోఘ-జ్ఞానాః విచేతసః**
**మోహినీమ్ రాక్షసీమ్ ఆసురీమ్ ప్రకృతిమ్ చ ఏవ శ్రితాః ।**

తా: వ్యర్థములైన ఆశలు గలవారును, వ్యర్థములైన కర్మలను ఆచరించువారును, విపరీత జ్ఞానము గలవారును, విక్షిప్తములైన మనస్సులు గలవారును అగు అజ్ఞానులు రాక్షసీ, ఆసురీ ఇంకా మోహినీ స్వభావములనే ఆశ్రయింతురు.

**విచేతసః** – అవివేకులు. వారికి వివేకబుద్ధి లేదు. నిజానికి మనమందరము అవివేకులమే. మనకు నిత్యానిత్యవస్తువివేకము లేదు. శాస్త్రం 'మే ఐ హెల్ప్ యూ?' బోర్డు పట్టుకుని నిల్చుంటుంది కాని మనకు స్వంతంగానూ తెలియదు, శాస్త్రం సహాయం తీసుకునే మంచి లక్షణమూ లేదు.

**ఇష్టాపూర్తం మన్యమానా వరిష్ఠం నాన్యచ్ఛ్రేయో వేదయన్తే ప్రమూఢాః ।**
**నాకస్య పృష్ఠే తే సుకృతేఽనుభూత్వా ఇమం లోకం హీనతరం వా విశన్తి॥** – ముండకం 1.2.10

వారికి తెలియదు, వారు శాస్త్రంనుంచి నేర్చుకోరు. అంతా వారికే తెలుసు అనుకునే అహంభావం. అటువంటి వారిని ముందు శ్లోకంలో కృష్ణపరమాత్మ మూఢులు అంటే ఉపనిషత్తు ఇంకో అడుగు ముందుకు వేసి ప్రమూఢులు అంది.

**మోఘజ్ఞానాః** – వారి జ్ఞానం తప్పుడు జ్ఞానం. అశాశ్వతమైన వాటిని శాశ్వతం అనుకుంటారు.

**మా కురు ధనజనయౌవనగర్వం, హరతి నిమేషాత్కాలస్సర్వమ్ ।** – భజగోవిందం

ధనం, జనం, యౌవనం, పదవి, హోదా – ఏదీ శాశ్వతం కాదు. అది తెలియదు వారికి.

**మోఘాశాః** – వ్యర్థమైన జ్ఞానంవల్ల వారి ఆశలు కూడా వ్యర్థమైన ఆశలుగానే ఉంటాయి. దానివల్ల వారి కర్మలు ఎలా ఉంటాయి?

**మోఘకర్మాణః** – వారు చేసే కర్మలు కూడా వ్యర్థమైన కర్మలుగానే ఉంటాయి. అంటే వారు కోరుకున్న ఫలాలు రావు. ముందే చూశాము కదా అశాశ్వతమైన వస్తువులనుంచి శాశ్వతమైన ఫలాలు రావు. అలా జరిగితే ఏమవుతుంది?

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥** – 3.37

కోరికలు సరియైనవి కానప్పుడు ఎన్ని కోరికలు తీరినా ఇంకా ఇంకా కోరికలు పుట్టుకొస్తూనే ఉంటాయి. కోరికలు దురాశకూ, దురాశ మరిన్ని కామ్యకర్మలకూ దారితీస్తాయి.

**రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః** – అందువల్ల వారి కర్మలు అన్నీ కామప్రధానంగానో, క్రోధప్రధానంగానో ఉంటాయి. ఇంకో మాటలో చెప్పాలంటే వారి రాగద్వేషాలమీద ఆధారపడివుంటాయి. రాగంవల్ల కామం ఏర్పడుతుంది; ద్వేషంవల్ల క్రోధం ఏర్పడుతుంది. వీటినే రాక్షసీగుణం, ఆసురీగుణం అన్నాడు కృష్ణపరమాత్మ. ఒకటి రాగప్రధానం, ఇంకొకటి ద్వేషప్రధానం.

ఎప్పుడైతే కోరికలు రాగప్రధానంగా అంటే కామప్రధానంగా ఉంటాయో, అప్పుడే అవి తీరటానికి, అవసరమైతే అడ్డదారులు తొక్కటానికి కూడా వెనుకాడరు కొంతమంది. ఎంత డబ్బున్నా ఇంకా కావాలనే దురాశవల్ల ఆగడాలకు దారితీస్తారు. ఇది రాక్షసీప్రకృతి అవుతుంది.

కాని ఒక వస్తువుమీద విపరీతమైన రాగం ఉన్నప్పుడు, వారి దారికి ఎవరైనా అడ్డు వస్తున్నట్టు అనిపిస్తే వారిని నాశనం చేసినా చేస్తారు. అంటే రాగంగా మొదలయిన అంశం ఎదుటివారిమీద ద్వేషంగా మారుతుంది. కామంగా మొదలయిన పని క్రోధంగా మారుతుంది. మొదట స్వార్థంతో మొదలయిన పని, హానికరమైన చర్యలకు దారితీస్తుంది. అప్పుడు అది ఆసురీ ప్రకృతికి దారి తీస్తుంది. ఆ విధంగా రాగద్వేషప్రధానకర్మలు వారి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి.

ఇటువంటి వారు పంచమహాయజ్ఞాలు చెయ్యరు; నిత్యనైమిత్తికకర్మలు కూడా చెయ్యరు. ఎందుకంటే ఆ సమయాన్ని కూడా వారు డబ్బు సంపాదనకే కేటాయిస్తారు. అటువంటివారిని రాక్షసీమాసురీం చైవ ప్రకృతిమ్ అన్నాడు కృష్ణపరమాత్మ. ప్రకృతిమ్ అంటే స్వభావం.

శ్రితాః మోహినీమ్ – వీరు ఈ మార్గంలో పడిపోతారు. అంటే ఆ మోహంలో పడిపోతారు. అంటే వారు ఒక చెడు వృత్తంలో పడిపోతారు. వారికి వివేకం లేకపోవటంవల్ల కామ్యనిషిద్ధకర్మలు పెరుగుతాయి; కామ్యనిషిద్ధకర్మలు

పెరగటంవల్ల వివేకం ఇంకా కుంటుబడుతుంది. వివేకం తగ్గటంవల్ల కామ్యనిషిద్ధకర్మలు ఇంకా పెరుగుతాయి. అంటే ఈ వృత్తంలో పడి తిరుగుతారు. అవివేకం వల్ల కామ్యనిషిద్ధకర్మలు చేస్తే, కామ్యనిషిద్ధకర్మలు చెయ్యటం వల్ల ఇంకా ఇంకా అవివేకం పెరుగుతుంది. దానివల్ల వారి అంతరాత్మ కూడా నోరు నొక్కేసుకుంటుంది.

నేరస్థుల విషయం అలాగే ఉంటుంది. వారు మొదట్లో ఏదైనా తప్పు చేస్తే, వారిని వారి అంతరాత్మ నిలదీస్తుంది. కాని వారు పదేపదే అదే తప్పు చేస్తూ రావటంవల్ల, అంతరాత్మ బలహీనమై పోతుంది. మొదటిసారి చెపుతుంది, రెండవసారి చెపుతుంది, మూడవసారి బలహీనంగా చెపుతుంది, నాలుగవసారి నోరు మూసుకుంటుంది, ఐదవసారి వారినే సమర్థిస్తుంది. కలియుగంలో ఇలా చెయ్యక తప్పదు అంటుంది. ఇంక అలాంటివారిని ఎవరూ బాగుచెయ్యలేరు. అదృష్టం బాగుంటే వచ్చే జన్మలో పాటుపడాల్సిందే. బుద్ధి నాశాత్ ప్రణశ్యతి.

**వనాని దహతో వహ్నే సఖా భవతి మారుతః ।**
**స ఏవ దీపనాశాయ కృశేకస్యాస్తి సౌహృదమ్ ॥**

అడవిలో అగ్ని కార్చిచ్చులా వ్యాపించినప్పుడు, గాలి దానికి నేస్తం అయిపోతుంది. అదే అగ్ని చిన్నగా ఉన్నప్పుడు అదే గాలి దానికి శత్రువుగా ఉండి దాన్ని ఆర్పేస్తుంది. కాని అగ్నిజ్వాల ఎక్కువైనప్పుడు వాయువు కూడా దానితో చేతులు కలిపేస్తుంది. అగ్నికి వాయువు తోడైనట్టు అంటారు. ఇది ప్రకృతి సూత్రం – శత్రువును జయించలేకపోతే, శత్రువుతో చేతులు కలుపు.

అలాగే మొదట్లో కామ్యనిషిద్ధకర్మలను చేపడతారు కొందరు. అవి రాక్షస, ఆసురీకర్మలు. వారి బుద్ధి మొదట్లో వారికి నచ్చచెప్పటానికి చూస్తుంది. కాని దాని నోరు నొక్కితే ఏం చేస్తుంది? శత్రువుతో చేతులు కలుపుతుంది. అవును ఇలాగే చెయ్యాలి అని పైపెచ్చు సమర్థిస్తుంది.

శ్లో. 13 **మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః ।**
**భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥**
మహాత్మానః, తు, మామ్, పార్థ, దైవీమ్, ప్రకృతిమ్, ఆశ్రితాః,
భజంతి, అనన్యమనసః, జ్ఞాత్వా, భూతాదిమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | భూతాదిమ్ | = సకలప్రాణులకును మూలముగను |
| పార్థ! | = ఓ పార్థా! | అవ్యయమ్ | = అక్షరస్వరూపునిగను |
| దైవీమ్ ప్రకృతిమ్ | = దైవీప్రకృతిని | జ్ఞాత్వా | = గ్రహించి |
| ఆశ్రితాః | = ఆశ్రయించిన | అనన్యమనసః | = నిశ్చలమైన మనస్సులు గలవారై |
| మహాత్మానః | = మహాత్ములు | భజంతి | = నిరంతరము భజింతురు |
| మామ్ | = నన్ను | | |

**హే పార్థ! దైవీమ్ ప్రకృతిమ్ ఆశ్రితాః మహాత్మానః తు**
**మామ్ భూతాదిమ్ అవ్యయమ్ జ్ఞాత్వా, అనన్య-మనసః (మాం) భజన్తి ।**

తా: కాని ఓ పార్థా! దైవీప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములు నన్ను సకలప్రాణులకును మూలముగను, అక్షరస్వరూపునిగను గ్రహించి నిశ్చలమైన మనస్సులు గలవారై నిరంతరము భజింతురు.

ముందు శ్లోకంలో అవివేకులు ఎలా సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నారో వర్ణించాడు. ఇప్పుడు పూర్వజన్మ పుణ్యంవల్ల మంచిదారిలో పడి నిత్యనైమిత్తికకర్మలు, పుణ్యకర్మలు చేసేవారి గురించి చెపుతున్నాడు.

**మహాత్మనః** – పుణ్యవంతులు. సత్త్వప్రధానగుణం ఉన్నవారు. ప్రార్థన క్రమం తప్పకుండా చేసేవారు.

**దైవీం ప్రకృతిమాశ్రితాః** – దైవీ ప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములు. వీరు పంచమహాయజ్ఞాలు చేసి తీరతారు. వీళ్ళ జీవితం ధార్మికంగా, శాస్త్రబద్ధంగా ఉంటుంది. వీరికి నిత్యానిత్యవస్తువివేకం ఉంటుంది. అంటే భగవంతుడు కాని ప్రతిదీ నాశనమవుతుందని తెలుసు వీరికి.

**శశ్వన్నశ్వరమేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచాగురో**
**ర్నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా నిర్వ్యాజ శాంతాత్మానా** – మనీషా పంచకం 3

ఈ నిత్యానిత్యవివేకం చెయ్యటానికి ఎంతోకాలం పట్టదు. మనం ధార్మికజీవితం గడిపితే, జీవితంలో మనకు ఎదురైన ప్రతి ఒక్క అనుభవమూ విలువైన పాఠాన్ని నేర్పిస్తుంది. మనం శాంతి, భద్రత, ఆనందాలు ప్రపంచంనుంచి కాదు భగవంతునినుంచి కోరాలి అని తెలుస్తుంది. అందువల్ల అలాంటి వివేకులను మహాత్మానః అన్నాడు కృష్ణపరమాత్మ.

ఈ వివేకం ఎలా వచ్చింది? దైవీం ప్రకృతిమాశ్రితాఃవల్ల వచ్చింది. అంతకుముందు అవివేకులను రాక్షసీమాసురీం శ్రితాః అన్నాడు. రాక్షస, ఆసురీగుణాలు రజోగుణాన్ని, తమోగుణాన్ని సూచిస్తే, దైవీగుణం సత్త్వగుణాన్ని సూచిస్తుంది. దైవీసంపత్తి ఉన్నవారు కామ్యకర్మలు, నిషిద్ధకర్మలు చెయ్యరు; చేసినా చాలా తక్కువ చేస్తారు; నిష్కామకర్మలు ఎక్కువ చేస్తారు.

**మాం జ్ఞాత్వా** – నన్ను తెలుసుకుంటారు. నేను వారి అంతిమలక్ష్యంగా తెలుసుకుంటారు. నేను అంటే ఎవరు?

**భూతాదిమ్** – భూతాది అంటే జగత్కారణం. నేను అన్ని జీవులకు కారణాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే అనాది.

**అవ్యయమ్** – అనంతం కూడా. ఆది లేదు, అంతం లేదు. శాశ్వతం. భగవంతుడు కాక తక్కినవన్నీ అశాశ్వతమే. కార్డుబోర్డు ఛెయిర్ ఉదాహరణను జీర్ణించుకోవాలి. ఎలా ఆ కుర్చీలో కూర్చోలేరో, అలా జగత్తుమీద ఆధారపడలేరు. అనుభవం గొప్పగురువు అంటారు పెద్దలు. ఆ అనుభవం మీ అనుభవమే కానవసరం లేదు. తెలివైనవారు, ఎదుటివారి అనుభవంనుంచి పాఠం నేర్చుకుంటే, తెలివితక్కువవారు, తాము ఎదురు దెబ్బలు తింటేగానీ భగవంతునివైపు తిరగరు.

భీష్మద్రోణుల మరణం ఊహించుకునే భయపడిపోయాడు అర్జునుడు. వారు నిజంగా మరణించలేదు. కాని ఆ ఆలోచననుంచే భగవంతునివైపు తిరిగాడు. అలాంటి సంఘటన ఎదురవ్వాలి కొంతమందికి. కాని తెలివైనవారు అలాంటి సంఘటన రాకముందే, అలాంటి ఘర్షణను ఎదుర్కోక ముందే భగవంతునిమీద ఆధారపడతారు.

**భజంతి** – అందువల్ల జ్ఞాత్వా భూతాదిమవ్యయం భజంతి. భగవంతుని గురించి తెలుసుకుని, ఆయనను ప్రార్థిస్తారు. ఎలా ప్రార్థిస్తారు?

**అనన్యమనసః** – నిశ్చల మనస్సుతో. దీన్ని వ్యవసాయాత్మికా బుద్ధి అంటారు. ఎటువంటి జీవనం నడుపుతున్నా, సంసారంలో ఉన్నా, వానప్రస్థానికి వెళ్ళినా, డబ్బు సంపాదిస్తున్నా ధర్మమోక్షాలు వారి ప్రాథమిక లక్ష్యాలు. అర్థకామాలమీద కోరిక లేదు. అవి కూడా తీరతాయి కాని వారు వాటితో మమేకం చెందరు. దీన్ని అవ్యభిచారిణిభక్తి అని కూడా అంటారు. వారు భగవంతుణ్ణి ఎలా ప్రార్థిస్తారు? రాబోయే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 14 **సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః ।**
**నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥**
సతతమ్, కీర్తయంతః, మామ్, యతంతః, చ, దృఢవ్రతాః,
నమస్యంతః, చ, మామ్, భక్త్యా, నిత్యయుక్తాః, ఉపాసతే ॥

| | | | |
|---|---|---|---|
| దృఢవ్రతాః | = అట్టి దృఢనిశ్చయము గల భక్తులు | మామ్ | = నన్ను గూర్చి |
| సతతమ్ | = నిరంతరము | నమస్యంతః | = నమస్కరించుచుందురు |
| కీర్తయంతః, చ | = నా నామగుణములను కీర్తించుచుందురు | నిత్యయుక్తాః | = నా ధ్యానమునందే నిమగ్నులగుచుందురు |
| యతంతః, చ | = నన్ను చేరుటకు ప్రయత్నించుచుందురు | భక్త్యా | = అనన్యభక్తితో |
| | | మామ్ | = నన్ను |
| | | ఉపాసతే | = ఉపాసించుచుందురు |

**(తే) నిత్య–యుక్తాః భక్త్యా మామ్ సతతమ్ కీర్తయన్తః యతన్తః చ**
**దృఢ–వ్రతాః నమస్యన్తః చ మామ్ ఉపాసతే ।**

తా: అట్టి దృఢనిశ్చయము గల భక్తులు నిరంతరము నా నామగుణములను కీర్తించుచుందురు, నన్ను చేరుటకు ప్రయత్నించుచుందురు. నాకు నమస్కరించుచుందురు, నా ధ్యానమునందే నిమగ్నులగు చుందురు. అనన్యభక్తితో నన్ను ఉపాసించుచుందురు.

ఈశ్వరుణ్ణి లక్ష్యంగా ఎలా చేసుకోవాలి?

**దృఢవ్రతాః** – దృఢసంకల్పం ఉన్నవారు అంటే తీవ్ర ముముక్షువులు.

చాలాసార్లు మనం గట్టి నిర్ణయం తీసుకున్నా, కొన్ని రోజులకు అది వీగిపోతుంది. నూతన సంవత్సరపు నిర్ణయాలలాగే అవుతుంది. నూతన సంవత్సరంలో కొత్త ఉత్సాహంతో ఏవో కొత్త నిర్ణయాలు తీసుకుంటాము. కాని ఆ వేడి వారంలోపే కరిగిపోతుంది. మళ్ళీ మొదటికి వస్తాము. నిజానికి అలా దృఢసంకల్పం పెంపొందించటానికి మన మతంలో, ప్రత్యేకించి అనేక వ్రతాలు చెప్పబడ్డాయి. ఏకాదశి వ్రతం, శివరాత్రి జాగరణలాంటివి దృఢసంకల్పాన్ని పెంపొందిస్తాయి. ఈ ముముక్షువులు అటువంటి దృఢసంకల్పంతో ఉంటారు.

**సతతం కీర్తయంతః మామ్** – ఎప్పుడూ నన్నే కీర్తిస్తుంటారు. వారి ప్రాథమిక లక్ష్యం గురించే ఎప్పుడూ చెపుతూ ఉంటారు. ఎప్పుడూ ముముక్షువులతోనే కలిసివుంటారు. 'నీ స్నేహితుల గురించి చెప్పు, నీ గురించి చెపుతాను,' అని సామెత ఉంది. అలా ఎవరికి ఎటువంటి విషయంమీద ఆసక్తి ఉంటే, అటువంటి వారితో స్నేహం చేస్తారు. అందువల్ల ఎప్పుడూ సత్సంగం చెయ్యాలి.

**యతంతః** – వారిని సిద్ధం చేసుకుంటారు. ఒలింపిక్స్‌లో ఆడి గెలిచేవారు, రాబోయే ఒలింపిక్స్‌కి ఇప్పటినుంచే వారిని సిద్ధం చేసుకుంటూ ఉంటారు. ఇక్కడ సిద్ధం చేసుకోవాలంటే సాధనచతుష్టయసంపత్తి పొందాలి. నిజానికి జ్ఞానం పొందటం తేలిక, దానికి కావాల్సిన అర్హత పొందటమే కష్టం. కృష్ణపరమాత్మే చెప్పాడు సుసుఖం కర్తుమ్ అవ్యయమ్. అందువల్ల అర్హత పొందటానికి ఇప్పటినుంచే ప్రయత్నం చెయ్యాలి. దానికి కర్మయోగం, ఉపాసనయోగం, విలువలు పెంచుకోవటంలాంటివన్నీ తోడ్పడతాయి.

**భక్త్యా మాం నమస్యంతః** – అంతేకాదు, వారు నాకు భక్తితో నమస్కరిస్తారు. ముముక్షువులకు వారి ప్రయత్నం మాత్రం చాలదని తెలుసు. ఏదైనా పని చెయ్యాలంటే, దాని వెనుక అనేక తెలియని ఆటంకాలు ఉంటాయి. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక ఆటంకాల్లో ఏవైనా రావచ్చు. మంచిపనులు చెయ్యాలంటే ఎన్నో ప్రతిబంధకాలు ఏర్పడుతుంటాయి. అందువల్ల మానవప్రయత్నం ఒకటీ ఉంటే చాలదు; దానికి ఈశ్వర అనుగ్రహం తోడవ్వాలి. ముముక్షువులకు ఆ విషయం తెలుసు. అందువల్ల వారు భగవంతుణ్ణి శరణు వేడుతారు.

ఈ షట్కం ఉపోద్ఘాతంలో ఒక విషయం చూశాము. భగవద్గీత మొదటి షట్కంలో మానవప్రయత్నాన్ని కీర్తిస్తే, ఈ షట్కంలో ఈశ్వరకృపను కీర్తిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ప్రయత్నమూ ఉండాలి, అనుగ్రహమూ ఉండాలి. రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటేనే, మనం విజయం సాధించగలము. అందువల్లనే గీతాపారాయణం ధ్యానశ్లోకాలతో మొదలవుతుంది. ఈ రెండు అంశాలు ఈ ఒక్క శ్లోకంలోనే వచ్చాయి. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. **యతంతః నమస్యంతః** పదాలు ఈ రెండు అంశాలనూ సూచిస్తాయి. యతంతః అంటే ప్రయత్నం లేదా ఫ్రీవిల్, నమస్యంతః అంటే ఈశ్వరకృప లేదా అనుగ్రహం.

ఫ్రీవిల్ ముఖ్యమా, అనుగ్రహం ముఖ్యమా? రెండూ ముఖ్యమే. ఫ్రీవిల్ లేదంటే, మీరు విధిరాతను నమ్మినవారు అవుతారు. అనుగ్రహం లేదంటే అహంకారం చూపిన వారవుతారు. విధిరాతనూ పూర్తిగా నమ్మకూడదు, అహంకారాన్నీ చూపకూడదు. రెండింటినీ – అంటే ప్రయత్నాన్ని, అనుగ్రహాన్ని – సమతుల్యం చెయ్యాలి. కొండమీదకు ఎక్కే రైలుకు ముందు, వెనక రెండు ఇంజన్లు ఉంటాయనీ, ఆ రెండూ మనిషి విషయంలో ప్రయత్నం, అనుగ్రహం అనీ ఇంతకు ముందు కూడా చూశాము.

**నిత్యయుక్తా ఉపాసతే** – ఎప్పుడూ నన్నే తలచుకుంటూ ఉంటారు. (నిరంతరం భగవంతుణ్ణే ధ్యానిస్తారు.) క్రీడాకారులను తీసుకోండి, వారి మనస్సు నిరంతరం ఆటమీదే లగ్నమై ఉంటుంది. అంతేకాదు వారి ఆహారనియమాలను సూచించేవారు ఉంటారు, వారు మానసిక వత్తిడికి లోనుగాకుండా చూసే మానసికశాస్త్రవేత్త ఉంటాడు. అవికాక వారు ఎవరితో ఆడతారో వారి గురించిన పూర్తి అవగాహన కలగటానికి, నిరంతరం వారి గురించి తెలుసుకుంటూ ఉంటారు. వారి బలాబలాలు తెలుసుకుంటారు. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే వారి అన్ని కోశాలూ ఆట ఆట అంటూ ఉంటాయి. అలా ముముక్షువుకు అన్నమయ కోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం కూడా ఒక్కదానిమీదే దృష్టి నిలుపుతాయి. అది మోక్షం, మోక్షం, మోక్షం.

శ్లో. 15 **జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే ।**
**ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ॥**
జ్ఞానయజ్ఞేన, చ, అపి, అన్యే, యజంతః, మామ్, ఉపాసతే,
ఏకత్వేన, పృథక్త్వేన, బహుధా, విశ్వతోముఖమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అన్యే | = మరికొందరు జ్ఞానయోగులు | అపి, చ | = ఇంకా కొందరు |
| మామ్ | = నిర్గుణ నిరాకార బ్రహ్మనైన నన్ను | బహుధా | = అనేక విధములుగా నున్న |
| జ్ఞానయజ్ఞేన | = జ్ఞానయజ్ఞముద్వారా | విశ్వతోముఖమ్ | = నా విరాట్ స్వరూపమును |
| ఏకత్వేన | = అభేదభావముతో | పృథక్త్వేన | = ఇంకా ఇష్టరూపదైవమును |
| యజంతః | = పూజింతురు | ఉపాసతే | = ఉపాసింతురు |

**అన్యే చ అపి జ్ఞాన–యజ్ఞేన యజన్తః ఏకత్వేన, పృథక్త్వేన,**
**బహుధా విశ్వతోముఖమ్ మామ్ ఉపాసతే ।**

తా: మరికొందరు జ్ఞానయోగులు నిర్గుణనిరాకారబ్రహ్మనైన నన్ను జ్ఞానయజ్ఞముద్వారా అభేదభావముతో పూజింతురు. ఇంకా కొందరు అనేక విధములుగా నున్న నా విరాట్ స్వరూపమును, ఇంకా ఇష్టరూప దైవమును ఉపాసింతురు.

భగవంతుణ్ణి లక్ష్యంగా పెట్టుకుంటే, భగవంతునిమీద భక్తి స్థాయి కూడా క్రమేపీ పెరుగుతూ వస్తుంది. భక్తి మూడు స్థాయిల్లో ఉంటుంది. అది ఏకరూప భక్తి, అనేకరూప భక్తి, అరూప భక్తి.

1. **ఏకరూపభక్తి:** మొదటి స్థాయిలో భగవంతుణ్ణి సృష్టికర్తగా చూస్తాము. శాస్త్ర పరిభాషలో భగవంతుడు నిమిత్త కారణం. కుమ్మరి కుండ చేసినట్టుగా, కంసాలి ఆభరణాలు చేసినట్టుగా, భగవంతుడు జగత్తును సృష్టించాడు. ఇంగ్లీషులో ఇంటెలిజెంట్ కాజ్ అంటారు. అటువంటి భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయివుండాలి. అది సూచించటానికి భగవంతుణ్ణి చతుర్ముఖునిగా, పంచముఖునిగా, షణ్ముఖిగా కొలుస్తాము. బ్రహ్మను చతుర్ముఖబ్రహ్మ అంటాము. ఆయన నాలుగు ముఖాలు నాలుగు వేదాలను సూచిస్తాయి అంటారు. విష్ణుమూర్తిని పాలకడలిలో శేషశాయి పైన పడుకున్నట్టుగా కొలుస్తాము. **క్షీరోదన్వత్ ప్రదేశే.**

2. **అనేకరూపభక్తి:** ఈ భక్తిలో నిలిచాక, శాస్త్రం ఇంకొక మెట్టు ఎక్కమంటుంది. ఏకరూపభక్తిలో దేవునికి ఒక నామం, రూపం ఇచ్చి ఆయనకు దేశ, కాల పరిమితులు విధిస్తున్నాము. భగవంతుడు వైకుంఠంలో ఉన్నాడు అంటే ఇంకోచోట లేనట్టు అర్థం వస్తుంది. అందువల్ల శాస్త్రం ఇప్పుడు భగవంతుణ్ణి ఉపాదానకారణంగా వర్ణిస్తుంది. భగవంతుడు జగత్తును సృష్టించాడు అనకుండా, భగవంతుడు తానే **జగత్తు అయ్యాడు** అంటుంది శాస్త్రం.

**సోఽకామయత। బహుస్యాం ప్రజాయేయేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా ఇదగ్ం సర్వమసృజత। యదిదం కించ। తద్ సృష్ట్వా। తదేవానుప్రావిశత్। తదనుప్రవిశ్య। సచ్చ త్యచ్చాభవత్।** – తైత్తిరీయం

అంటే భగవంతుడు అంతా తానే అయ్యాడు. ఉపాదానకారణం అంటే ఇంగ్లీషులో మెటీరియల్ కాజ్. ఒక కుండకు కుమ్మరి నిమిత్త కారణం, మట్టి ఉపాదానకారణం. ఉపాదానకారణం, కార్యం అంతటా ఉంటుంది. కుండలో మట్టి ఎక్కడ ఉంది అంటే కుండ అంతటా ఉంది. అదే విధంగా ఉపాదానకారణంగా భగవంతుడు కార్యజగత్తు అంతటా ఉన్నాడు. ఈ దశలో భగవంతుడు ఎక్కడ ఉన్నాడంటే వైకుంఠంలో ఉన్నాడు అనకూడదు. అది మొదటిస్థాయి భక్తిలో అంటాము. ఇప్పుడు జవాబు చెప్పకుండా, ఎదురు ప్రశ్నించగలగాలి. భగవంతుడు ఎక్కడ ఉన్నాడంటే – భగవంతుడు ఎక్కడ లేడు అనగలగాలి. నిజానికి నానాత్వంగా కనిపిస్తున్న ఈ జగత్తు ఈశ్వరుడు తప్ప వేరే కాదు. ఈ ఈశ్వరుణ్ణి విశ్వరూప ఈశ్వరుడు లేదా అనేకరూప ఈశ్వరుడు అంటారు. అనేకరూప ఈశ్వరుడు అంటే అనేక భిన్నదేవుళ్ళు కాదు. మనం కొలిచే ఇష్టదేవుడే జగత్తంతా నిండియున్నాడు. ఉదాహరణకు పాలసముద్రంమీద ఉన్నాడని విష్ణుమూర్తి గురించి ముందు కొలిస్తే, ఇప్పుడు ఇంకొక అడుగు ముందుకు వెళతాము.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్ర సూర్యౌ చ నేత్రే – విష్ణుసహస్రనామం ధ్యానశ్లోకమ్**

భూమి ఆయన పాదాలు, ఆకాశం శరీరం, స్వర్గం ఆయన తల, సూర్యచంద్రులు ఆయన నేత్రాలు అంటున్నాము. అంటే ఉన్నదంతా భగవంతుడే.

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాఽస్మి శశిసూర్యయోః** – 7

ఇంగ్లీషులో 'వాట్ ఈజ్ గాడ్' అని అడిగితే, ఎవరో 'వాట్ ఈజ్, ఈజ్ గాడ్' అన్నారుట. ఏది ఉందో అదంతా భగవంతుడే.

3. **అరూప భక్తి:** రెండవ స్థాయి భక్తిలో కొన్నాళ్ళు ఉన్నాక అరూప ఈశ్వరుని స్థాయికి ఎదగాలి అంటుంది శాస్త్రం. అనేకరూప ఈశ్వరుడు అన్నప్పుడు కొంతమందికి ఒక సందేహం రావచ్చు. ఏమిటది? భగవంతుడు అంతటా ఉన్నాడు అంటే, దుర్గంధంలోనూ ఉండాలి, నేరస్థునిలోనూ ఉండాలి, అనారోగ్యంలోనూ ఉండాలి. కాని భగవంతునికి వ్యతిరేక గుణాలు ఎలా ఉంటాయి? సరే భగవంతునికి వ్యతిరేక గుణాలు లేవు, మంచి గుణాలే ఉన్నాయి అంటే భగవంతునికి పరిమితి విధించినట్టవుతుంది. కాని భగవంతుడు పరిచ్ఛిన్నుడు కాదు. భగవంతునికి ప్రతికూల గుణాలు ఉన్నాయంటే బుద్ధి ఒప్పుకోదు; భగవంతునికి సానుకూల గుణాలే ఉన్నాయంటే భగవంతుడు అనేకరూప ఈశ్వరుడు కాలేడు. దీనికి జవాబు ఏమిటి?

శాస్త్రం దీనికి జవాబు చెపుతుంది. భగవంతుడు కార్యకారణవిలక్షణం బ్రహ్మ అంటుంది. ముందేమో భగవంతుడు సృష్టించాడు అంది, తర్వాత ఆయనే అనుప్రవేశం చేశాడు అంది, తర్వాత భగవంతుడు అనేకంగా అయినట్టు అనిపిస్తాడు కాని నిజానికి ఆయనకు రూపం లేదు. ఆయన పరంభావం, ఆయన అరూప ఈశ్వరుడు.

ఆ విధంగా భగవంతుడు మూడు రూపాల్లో ఉన్నాడు – ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. మీ స్థాయిభేదాలనుబట్టి కొలవండి కాని ఏదో ఒకనాటికి, అరూప ఈశ్వరభక్తిస్థాయికి అందరూ రావాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అన్యే మామ్ ఏకత్వేన ఉపాసతే** – ఏకత్వేన అంటే అరూప ఈశ్వరునిగా నన్ను కొంతమంది తెలుసుకుంటారు.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యం 6.1.7

**జ్ఞానయజ్ఞేన** – జ్ఞానమార్గానికి రావటంద్వారా, వేదాంతవిచారణ చేయటంద్వారా తెలుసుకుంటారు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగన్ధవచ్చ యత్ ।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే ॥** – కఠ 1. 3.15

అరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకునే స్థాయికి రానివారు ఉంటారు.

**బహుధా విశ్వతోముఖమ్ (ఉపాసతే)** – అటువంటివారు అనేకరూప ఈశ్వరుణ్ణి ధ్యానం చేస్తారు.

**ఓం సహస్రశీర్ష పురుషః సహస్రాక్షః సహస్రపాత్**

కొంతమందికి అది కూడా కష్టమే. వారికి భగవంతునికి ప్రత్యేకించి ఒక రూపం ఉండాలి.

**పృథక్త్వేన** – ద్వైతభావముతో ఒక ప్రత్యేకరూపంతో కొలుస్తారు. ఇష్టరూపదైవమును ఉపాసిస్తారు. అటువంటివారు ఏకరూపభక్తికి పరిమితమవుతారు. దానివల్ల వారు ఇంకొక రూపాన్ని అంగీకరించరు. ఫర్వాలేదు, ముందు అలాగే మొదలు పెట్టండి, కాని క్రమంగా అరూపభక్తికి రండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అరూపభక్తితో కొలుస్తున్నారు అంటే నిజంగా కొలవటం కాదు. జ్ఞానయోగంద్వారా తెలుసుకుంటున్నారు. ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. భగవంతుణ్ణి జీవితలక్ష్యంగా ఎన్నుకోవాలి అంటే భగవంతునియొక్క ఉన్నతస్థాయి గురించి తెలుసుకోవాలి అని అర్థం. ఉన్నతస్థాయిని నిర్గుణబ్రహ్మ అనీ, పరాప్రకృతి అనీ అంటారు. నిర్గుణబ్రహ్మను జ్ఞానంద్వారా తెలుసుకోవాలి.

భగవంతుణ్ణి ధ్యానం చెయ్యాలి అంటే అక్కడ మనం భగవంతునియొక్క వ్యావహారిక స్థాయి గురించి మాట్లాడుతున్నాము. వ్యావహారిక స్థాయిని సగుణబ్రహ్మ అనీ, అపరాప్రకృతి అనీ అంటారు. పరిమితి ఉన్న దేవుడు ఎన్నటికీ సాధకునియొక్క లక్ష్యం కాలేదు. ఉపనిషత్తు ఈ విషయం స్పష్టంగా చెపుతుంది.

**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన

కేనోపనిషత్తు పదేపదే చెపుతుంది. నువ్వు ఉపాసనచేసే నామరూపాలున్న భగవంతుడు పరాప్రకృతి కాదు. ఆ సగుణబ్రహ్మద్వారా నిర్గుణబ్రహ్మ స్థాయికి ఎదగాలి. అందువల్ల ఈ అధ్యాయం మొదట్లోనే అరూపబ్రహ్మ అంటే అవ్యక్తం అని చెప్పాడు కృష్ణపరమాత్మ.

ఇది తెలియకపోతే సంసారవృత్తంలో తిరుగుతారనీ, ఈశ్వరజ్ఞానం, తద్వారా ఈశ్వరప్రాప్తి మాత్రమే మహాలక్ష్యంగా ఉండాలనీ చెపుతూ వచ్చాడు. ఇది తెలియని వారిని మూఢులన్నాడు. వేదాంతం అర్థం కానివారు 'వేదాంతం అంటే ఒక గుడ్డివాడు చీకటిగదిలో అక్కడ లేనేలేని నల్లపిల్లికోసం వెతికినట్టు ఉంటుంది,' అంటారు. కాని కొందరు మహాత్ములు మాత్రము పరావిద్యకు వస్తారు.

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే** – 7.3

ఏడవ అధ్యాయంలో విషయాలు ఇందులో కూడా చూస్తామని ముందే చూశాము. వారు త్వరగా అరూప ఈశ్వరునికి వస్తారు. భగవంతుడు అనంతం కాబట్టి, అన్ని రూపాలూ ఆయనలోనే ఇమిడిపోతాయి.

ఏకరూపభక్తి ఉంటే అది ద్వైతం. అందులో దేవుడు వేరు, భక్తుడు వేరు. అనేకరూపభక్తి ఉంటే అది విశిష్టాద్వైతం. భగవంతుడు అంతటా ఉన్నాడు కాబట్టి, నేను కూడా అందులో భాగం కాబట్టి, నేను భగవంతుడిలో ఒక భాగాన్ని అంటారు విశిష్టాద్వైతులు. అరూపభక్తిలో భాగాలు లేవు; ఉన్నదంతా ఒక్కటే. అది అద్వైతం.

**అద్వైతం చతుర్థం మన్యంతే సఃఆత్మా సః విజ్ఞేయః** – మాండూక్యం 1.7

అరూపభక్తికి వస్తే అద్వైతానికి వచ్చినట్టే.

ఈ శ్లోకంలో ఈ మూడు స్థాయిల భక్తుల గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. ఏకత్వేన, విశ్వతోముఖత్వేన, పృథక్త్వేన అన్నాడు. ఏకత్వేన అంటే అరూపంగా బహుధా విశ్వతోముఖత్వేన అంటే అనేకరూపంగా, పృథక్త్వేన అంటే ఏకరూపంగా కొలుస్తారు.

శ్లో. 16 **అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।**
**మంత్రోఽహమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్ ॥**
అహమ్, క్రతుః, అహమ్, యజ్ఞః, స్వధా, అహమ్, అహమ్, ఔషధమ్,
మంత్రః, అహమ్, అహమ్, ఏవ, ఆజ్యమ్, అహమ్, అగ్నిః, అహమ్, హుతమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహమ్, ఏవ | = | నేనే | అహమ్ | = | నేనే |
| క్రతుః | = | క్రతువును | ఔషధమ్ | = | ఔషధమును |
| అహమ్ | = | నేనే | అహమ్ | = | నేనే |
| యజ్ఞః | = | యజ్ఞమును | మంత్రః | = | మంత్రమును |
| అహమ్ | = | నేనే | అహమ్, ఏవ | = | నేనే |
| స్వధా | = | పితృదేవతల ఆహుతులను | ఆజ్యమ్ | = | ఘృతమును |

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేనే | అహమ్ | = నేనే |
| అగ్నిః | = అగ్నిని | హుతమ్ | = హోమక్రియను |

**అహమ్ క్రతుః, అహమ్ యజ్ఞః, అహమ్ స్వధా, అహమ్ ఔషధమ్,**
**అహమ్ మన్త్రః, అహమ్ ఏవ ఆజ్యమ్, అహమ్ అగ్నిః, అహమ్ హుతమ్.**

తా: నేనే క్రతువును, నేనే యజ్ఞమును, నేనే పితృదేవతలకు ఇచ్చే ఆహుతులను, నేనే ఔషధమును, నేనే మంత్రమును, నేనే ఘృతమును, నేనే అగ్నిని, నేనే హోమక్రియను.

భక్తిలో మూడు రకాలను చూపినా, 16–19 వరకూ కృష్ణపరమాత్మ విశ్వరూపభక్తిని విడమర్చి చెప్పటానికి నిశ్చయించుకున్నాడు. భక్తిలో మూడు రకాలు ఎలా ఉన్నాయో, అలా ఆ మూడు రకాల భక్తిమార్గాలను పాటించే భక్తులను కూడా మూడు రకాలుగా విభజించవచ్చు. ఏకరూపభక్తిని చూపించే వ్యక్తిని మంద అధికారి అనీ, అనేకరూపభక్తిని చూపించే వ్యక్తిని మధ్యమ అధికారి అనీ, అరూపభక్తిని చూపించే వ్యక్తిని ఉత్తమ అధికారి అనీ అంటారు.

కృష్ణపరమాత్మ మధ్యమ అధికారులను ఉద్దేశించి బోధిస్తున్నాడు. మంద అధికారి విషయం పట్టించుకోవటం లేదు. శంకరాచార్యులు షణ్మతస్థాపన చేసిన ఉద్దేశం, ఒక దేవుడు గొప్పవాడు, ఇంకొక దేవుడు తక్కువ అని గొడవలు పడకుండా ఉండటానికి. మీ ఇష్టదేవత ఎవరుంటే వారిని కొలవండి, వారిని అనేకరూప ఈశ్వరులుగా కొలవండి, అంతేకాని ఇంకొక దేవుని భక్తులను చిన్నచూపు చూడకండి. దీనిని అనేకరూపభక్తి అంటారు. దీని గురించి ఇప్పుడు కృష్ణపరమాత్మ వివరించబోతున్నాడు. అనేకరూపభక్తి అన్నా, విశ్వరూపభక్తి అన్నా ఒక్కటే.

విశ్వరూపభక్తి అంటే ఏమిటి? ఈ జగత్తులో ఉన్న ప్రతిదీ భగవంతుని వ్యక్తరూపంగా చూడగలగటం. అన్నింటినీ భగవంతునిగా చూడాలి అంటే తేలులో, బొద్దింకలో కూడా భగవంతుడు ఉన్నాడు. కాని మనం ద్వేషించే వాటిలో భగవంతుణ్ణి చూడటానికి ప్రయత్నిస్తే భగవంతుణ్ణి కూడా ద్వేషించటం మొదలుపెడతాము. అందువల్ల మనం ప్రేమించేవారితో మొదలుపెట్టాలి. తల్లి, తండ్రి, గురువు, దైవాలు. తర్వాత ఆవు. ఆ రోజుల్లో ఆవు వారి జీవితాలలో ఒక భాగంగా ఉండేది. అందువల్ల ఆవును కూడా పూజించేవారు.

దాని తర్వాత ఆ రోజుల్లో యజ్ఞయాగాదులకు విలువనిచ్చేవారు. అందువల్ల ఆ యజ్ఞయాగాదులకు సంబంధించినవన్నీ నేనే అని చెపుతున్నాడు కృష్ణపరమాత్మ. పూర్వం జీవితం కర్మకాండతో మొదలయ్యేది. వారి జీవితం యజ్ఞాలలో మునిగిపోయి ఉండేది. అందువల్ల అదుగో ఆ యాగాలను చూడండి, అవన్నీ నేనే అంటున్నాడు. ఈ శ్లోకంలో విశ్వరూపవర్ణన వస్తుంది. ఇక్కడ విశ్వరూపవర్ణనకు బీజం వేశాడు, తర్వాత పదకొండవ అధ్యాయంలో విశ్వరూపదర్శనంతో పరాకాష్ఠకు చేరుకుంటుంది. ఇందులో అది ఎలా ఉంటుందో కొంచెం రుచి చూపిస్తున్నాడు.

**అహం క్రతుః** – నేను క్రతువును అంటే నేను శ్రౌతకర్మను. శ్రుతిని ప్రాథమిక గ్రంథాలు అంటారు. వాటిలో చెప్పిన కర్మలను శ్రౌతకర్మలు అంటారు. కృష్ణపరమాత్మ నేనే క్రతువును అంటున్నాడు. మామూలుగా క్రతువుద్వారా భగవంతుణ్ణి పూజిస్తాము అని అంటాము. ఇక్కడ క్రతువుద్వారా భగవంతుణ్ణి పూజిస్తున్నాము అనకుండా, భగవంతుడే యజ్ఞం అంటున్నాము.

**అహం యజ్ఞః** – శాస్త్రాల్లో రెండవ స్థాయి వాటిని స్మృతి గ్రంథాలు, ఇతిహాసాలు, పురాణాలు అంటారు. శ్రుతి అంటే వేదాలు. అవి అపౌరుషేయాలు. సాక్షాత్తూ భగవంతుడినుంచే వచ్చాయి. ఈ తక్కినవి వేదాలను ఆధారంగా చేసుకుని వచ్చినవి. ఇవి పౌరుషేయాలు. గీత స్మృతి గ్రంథంలోకి వస్తుంది. అది కూడా వేదాలనుంచి వచ్చింది. అందువల్ల కృష్ణపరమాత్మ చెపుతాడు, అర్జునా! భగవద్గీతను నేను చెప్పినందువల్ల నువ్వు స్వీకరించవద్దు, ఇది వేదప్రమాణం అంటాడు. వేదాలు భగవంతునితో సమానం. వేదాలవల్ల మనం భగవంతుని గురించి తెలుసుకుంటున్నాము. యజ్ఞాలు అంటే స్మార్తకర్మలు. స్మార్త కర్మలు అంటే ద్వితీయస్థాయికి చెందిన గ్రంథాలలో పేర్కొన్న కర్మలు.

**స్వధా అహమ్** – పితృదేవతలకు ఇచ్చే ఆహుతులను స్వధా అంటారు. శ్రాద్ధం పెట్టేటప్పుడు ఇచ్చే దాన్ని స్వధా అంటారు. దేవతలకు ఆహుతులు ఇచ్చేటప్పుడు స్వాహా అంటారు, కాని పితృదేవతలకు తర్పణాలు వదిలేటప్పుడు స్వధా అంటారు.

**అహమ్ ఔషధమ్** – మానవాళి తినే ఆహారాన్ని ఔషధం అంటారు. ఆహారం చెట్లనుంచి వస్తుంది; చెట్లను ఓషధులు అంటారు. ఆయుర్వేదంలో మందులను చెట్లనుంచి తయారుచేస్తారు కాబట్టి మందులకు ఔషధులు అనే పేరు వచ్చింది. అందువల్ల ఔషధమ్ అంటే మందు, అన్నం. ఇక్కడ అన్నం.

అన్నం కూడా భగవంతుడు అంటే, దాన్ని వడ్డించగానే గుటుక్కున మింగకుండా ఉంటాము. కొన్ని పెళ్ళి భోజనాలలో ఈ మూలనుంచి ఆ మూలకు వడ్డించుకు వెళ్ళేసరికి, మొదట్లో కూర్చున్న వ్యక్తులు విస్తరి ఖాళీ చేసేస్తారు. అందువల్ల అన్నం తినేముందు ప్రార్థన చెయ్యాలి.

**అన్నం న నింద్యాత్ అన్నం న పరిచక్షీత** – తైత్తిరీయం

అన్నాన్ని నిందించకూడదు, పారేయకూడదు.

**అన్నం బ్రహ్మ రసో విష్ణుః భోక్తా దేవో మహేశ్వరః**
**ఏవం జ్ఞాత్వా తు యో భుంక్తే అన్న దోషో న లిప్యతే**

అన్నం పరబ్రహ్మస్వరూపం; అన్నంలో ఉన్న ప్రొటీనులు, కొవ్వుపదార్థాలు విష్ణుమూర్తి; అన్నాన్ని అరిగించే జీర్ణకోశరసం మహేశ్వరుడు. బ్రహ్మ, విష్ణువులు బయట వుంటే భోక్తగా శివుడు లోపల ఉన్నాడు. ఆ విధంగా ప్రతిదీ దైవమే.

**మంత్రః అహమ్** – దేవతలకు ఆహారాన్ని శ్రౌతస్మార్తకర్మలద్వారా అర్పించినా, పితృదేవతలకు అన్నాన్ని పితృకర్మలద్వారా అర్పించినా, మీకు మీరే ఆహారాన్ని అర్పించుకున్నా (భోజనం చెయ్యటంద్వారా) ఇవన్నీ దైవకార్యాలు. వాటితో పాటు మంత్రాలు ఉంటాయి. ఛాందోగ్యోపనిషత్తులో మనం తినే అన్నం మనలో ఉన్న వైశ్వానర అగ్నికి అర్పిస్తున్నామని వస్తుంది. అందువల్ల శాస్త్రంలో భోజనం చెయ్యటాన్ని ప్రాణాగ్నిహోత్రం అంటారు.

యజ్ఞాల్లో బయటవున్న అగ్నికి ఆహుతులు వేస్తే, భోజనం విషయంలో లోపలవున్న అగ్నికి అంటే వైశ్వానర అగ్నికి ఆహుతులు వేస్తాము. అందువల్ల మనం ప్రాణాగ్నిహోత్రం చేస్తున్నట్టు అవుతుంది. అందువల్ల అహం మంత్రః అన్నాడు కృష్ణపరమాత్మ. అన్నం తినేముందు ప్రాణాయ స్వాహా, అపానాయ స్వాహా అంటారు. ఆ మంత్రం కూడా నేనే, అంటే భగవంతుడు.

**అహమ్ ఏవ ఆజ్యమ్** – యజ్ఞాల్లో వేసే నేతిని నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. నేతిని ఘృతం అంటారు.

**అహమ్ అగ్నిః** – ఏ అగ్నిలో ఆహుతులు వేస్తారో, ఆ అగ్ని కూడా నేనే. శాస్త్రప్రకారం అగ్ని కూడా దేవతే. అగ్నిదేవతకు ప్రత్యక్షంగా పూజ చేసేటప్పుడు అగ్నయే స్వాహా అంటాము. అగ్ని దూతలాగా కూడా పనిచేస్తుంది. ఇప్పటి కొరియర్ సర్వీస్‌లాగా అన్నమాట. ఏ దేవునికి పూజ చేస్తే, ఆ దేవునికి మనం వేసిన ఆహుతులను తీసుకెళ్ళి ఇస్తుంది అగ్ని. ప్రజాపతయే స్వాహా, పరమేష్ఠినే స్వాహా, ఇంద్రాయ స్వాహా, వరుణాయ స్వాహా అంటూ అగ్నిలో ఆహుతులు వేస్తాము.

**అగ్నిం దూతమ్ వృణీమహే హోతారమ్ విశ్వవేదసమ్**
**అస్య యజ్ఞస్య సుక్రతుమ్ అగ్నయే నమః**

**అగ్నిం దూతమ్ వృణీమహే** – అగ్నిదూత. అగ్నిద్వారా అనేక దేవతలకు పూజ చెయ్యవచ్చు. అందువల్ల అగ్నికి హుతవాహనుడు అని ఇంకో పేరు కూడా ఉంది. ఆహుతులను తీసుకువెళ్ళే దేవత అని అర్థం. ఆ అగ్నిదూతను కూడా నేనే.

**అహం హుతమ్** – హోమక్రియ కూడా నేనే.

ఒక్కముక్కలో చెప్పాలంటే అన్నీ నేనే. అలాగే అన్నీ నేనే అని చెప్పచ్చు కదా, ఇంత వివరంగా చెప్పటం ఎందుకంటే అలా చెపితే కాని మన మనస్సుకు అర్థం కాదు.

శ్లో. 17 **పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః ।**
**వేద్యం పవిత్రమోంకార ఋక్సామ యజురేవ చ ॥**
పితా, అహమ్, అస్య, జగతః, మాతా, ధాతా, పితామహః,
వేద్యమ్, పవిత్రమ్, ఓంకారః, ఋక్, సామ, యజుః, ఏవ, చ ॥

| | | | |
|---|---|---|---|
| అస్య | = ఈ | పవిత్రమ్ | = పవిత్రమైన వాడను |
| జగతః | = జగత్తునకు | ఓంకారః | = ఓంకారమును |
| ధాతా | = ధాతయు – ధరించువాడను, కర్మఫలముల నిచ్చువాడను | ఋక్ | = ఋగ్వేదమును |
| | | సామ | = సామవేదమును |
| పితా | = తండ్రియు | చ | = ఇంకా |
| మాతా | = తల్లియు | యజుః | = యజుర్వేదమును |
| పితామహః | = తాతయు | అహమ్, ఏవ | = నేనే |
| వేద్యమ్ | = తెలిసికొనదగినవాడను | | |

**అహమ్ అస్య జగతః మాతా, పితా, ధాతా, పితామహః, వేద్యమ్ (వస్తు), పవిత్రమ్ (వస్తు), ఓంకారః, ఋక్, సామ, యజుః, ఏవ చ (అస్మి) ।**

తా: ఈ జగత్తునకు ధాతయు, ధరించువాడను, కర్మ ఫలముల నిచ్చువాడను, తండ్రియు, తల్లియు, తాతయు, తెలిసికొనదగిన వాడను, పవిత్రమైన వాడను, ఓంకారమును, ఋగ్వేదమును, సామవేదమును ఇంకా యజుర్వేదమును నేనే.

అదే భావన కొనసాగుతున్నది. అంటే విశ్వరూప ఈశ్వర వర్ణన.

**అహమ్ అస్య జగతః పితా** – నేను ఈ సమస్త జగత్తుకు తండ్రిని. నానుంచే మొత్తం జగత్తు వచ్చింది.

**మాతా** – తల్లిని కూడా నేనే. భగవంతుడు అర్ధనారీశ్వరుడు. నిమిత్త కారణమూ నేనే, ఉపాదాన కారణమూ నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అభిన్న నిమిత్త ఉపాదాన కారణమ్ అహమ్ అస్మి**

ఆయన జగత్తుకు తండ్రి అయితే, ఆయనకు తండ్రి ఎవరు?

**పితామహః (అపి అహమ్ ఏవ)** – నేనే తాతను కూడా. నేను జగత్తుకు తండ్రిని కాని నాకు తండ్రి లేడు. నేను తండ్రి లేని తండ్రిని అంటే నాకు పుట్టుక లేదు.

**ధాతా** – జీవులందరికీ కర్మఫలదాతను నేనే. మరుజన్మలో ఏ శరీరం ఇవ్వాలి, ఎటువంటి శరీరం ఇవ్వాలి, ఎన్నాళ్ళు జీవించాలి, ఇవన్నీ నిర్ణయించేది ఈశ్వరుడు. మళ్ళీ ఒక విషయం మర్చిపోకూడదు. ఇవన్నీ ఈశ్వరుడు తన ఇచ్ఛానుసారం ఇవ్వటం లేదు. అలా ఒకవేళ ఈశ్వరుడు తన ఇచ్ఛానుసారం ఇచ్చేటట్టయితే, ఏదోవిధంగా ఆయనను కాకాపట్టి, అది మార్పించుకుంటాము. అంతటి ఘనులమే మనం.

అందువల్ల ఈశ్వరుడు కర్మఫలదాత. మనం చేసిన అనేక కర్మల ఫలంగా ఇస్తాడు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి, ఏ అనుభవం ఇవ్వాలో, భగవంతునికి తెలుసు. అంటే మనం అనుభవిస్తున్న ప్రతిదీ మనం చేసుకున్న కర్మల ఫలితమే. భగవంతుని లీలలు అర్థం కావు అనుకుంటాము కాని అది పొరపాటు. ఆయన ఎన్నడూ అన్యాయం

చెయ్యడు, మనమే అది సరిగ్గా అర్థం చేసుకోలేక పోతున్నాము. నేను చీమకు కూడా అపకారం చెయ్యలేదు, నాకే ఎందుకు ఈ కష్టం అనుకుంటాము. ఇది ఒక పెద్ద అబద్ధం. వారం కిందట ఏమయిందో గుర్తుండదు మనకు, అలాంటిది పదేళ్ళ కిందట ఏం చేశామో ఎలా గుర్తుంటుంది? ఒకవేళ గుర్తుందే అనుకుందాము, అప్పుడు కూడా మనం అనుభవిస్తున్న ఈ కర్మఫలం ఒక్క ఈ జన్మలోదే కాదు, జన్మజన్మలనుంచీ వస్తున్న కర్మల ఫలం.

అందువల్ల దేవుని నిర్ణయాన్ని ప్రశ్నించటానికి మనమెవరం? నేనే పాపం చెయ్యలేదు, నన్నే ఎందుకు శిక్షిస్తున్నావు అని అడిగితే మనం కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేదని అర్థం. పైగా మనం చేసే ఇంకో తప్పు తక్కినవారందరూ హాయిగా ఉన్నారు, నేనే కష్టపడి పోతున్నాను అనుకోవటం. అందువల్లనే మన పెద్దవారు మనకు చెప్పారు, మనకు లేదని ఏడిస్తే ఒక కన్ను పోతుంది; ఎదుటివారికి ఉందని ఏడిస్తే ఇంకో కన్ను పోతుందని.

మనకు జీవితంలో రెండు బాధలు. ఒకటి నేను అవస్థ పడుతున్నాను; ఇంకొకటి ఎదుటివారు సుఖపడి పోతున్నారు. అది మన అపోహ మాత్రమే. ఎవరి కర్మకు తగ్గ ఫలం వారు పొందుతారు. అందువల్ల అమాయకులు అవస్థ పడటం చూస్తుంటాము. ఇప్పుడు ఈ కర్మసిద్ధాంతం విని, అయితే వారు అవస్థ పడాలని రాసి ఉందన్న మాట అనుకుని వారికి మనం చెయ్యాలనుకున్న సహాయం చెయ్యటం మానకూడదు. వారి అవస్థకి కారణం వారి కర్మ. చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా అని ఊరికే అనలేదు. అలా భగవంతుడు ధాతా అంటే మన కర్మఫలదాత.

**వేద్యమ్** – తెలుసుకోవాల్సినది నా గురించే. ఇదే అర్థంతో పదమూడవ అధ్యాయంలో జ్ఞేయం అన్నాడు కృష్ణపరమాత్మ. మాండూక్యంలో విజ్ఞేయం అని వస్తుంది. ఏది తెలుసుకుంటే సర్వం తెలుసుకున్నట్టు అవుతుందో అది బ్రహ్మజ్ఞానం. మనకు ఎలా ఆకలి ఉంటుందో, అలా మానసిక ఆకలి కూడా ఉంటుంది. నలుగురూ మనని ప్రేమించాలనే మానసిక ఆకలి ఉంటుంది. అదికాక బుద్ధిపరంగా కూడా ఆకలి ఉంటుంది. అంటే ఏదో తెలుసుకోవాలనే తపన ఉంటుంది.

ఈ జగత్తు ఎందుకు సృష్టించబడింది, నేను ఎవరు, దేవుడనేవాడు ఉన్నాడా, ఉంటే ఎక్కడ ఉంటాడు, ఇలాంటి అనేక ప్రశ్నలు వస్తూవుంటాయి. నిజానికి చిన్న వయస్సులో ఈ తపన చాలా ఉంటుంది. నేను ఎక్కడినుంచి వచ్చాను, నేను ఎలా వచ్చాను అనే ప్రశ్న పిల్లలు తరచూ వేస్తూవుంటారు. **కస్త్వం కోఽహం కుత ఆయాతః** – కాని వీటికి పెద్దవాళ్ళకే జవాబులు తెలియక దాటేస్తూవుంటారు. వేద్యమ్ అంటే బ్రహ్మజ్ఞానం.

**పవిత్రమ్** – శుద్ధి చేసేది పవిత్రం. ఏవైనా క్రతువులు చేసేటప్పుడు దర్భను వేలికి చుడతారు. దాన్ని పవిత్రం అంటారు. దానివల్ల ఆ చేసే వ్యక్తి శుద్ధి పొందినట్టు అర్థం. అలా అన్నారని స్నానం చెయ్యటం మానకూడదు. స్నానం చేసేది స్థూలశరీరానికి, శుద్ధి పొందేది సూక్ష్మశరీరం. అలా భగవంతుడు పవిత్రమ్.

**ఓంకారః** – ఓంకారాన్ని నేనే. వేదాలసారం ఓంకారం. ఇంకొకచోట వేదాలను గాయత్రీ మంత్రంలోకి కుదించారని వస్తుంది. వేదాలు బ్రహ్మవిద్య బోధిస్తాయి కాబట్టి వేదాలను బ్రహ్మ అని కూడా అంటారు. బ్రహ్మచారి పేరు

అందుకు వచ్చింది. బ్రహ్మ గురించి నేర్చుకునే జీవనవిధానం గడుపుతాడు కాబట్టి బ్రహ్మచారి. బ్రహ్మ అంటే వేదాలు అని చూశాము కదా. అలాగే గాయత్రీ మంత్రం వేదాలసారం కాబట్టి, గాయత్రిని కూడా బ్రహ్మ అంటారు. అందువల్ల బ్రహ్మచారికి గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించినప్పుడు అతనికి బ్రహ్మోపదేశం అయింది అంటారు.

| | |
|---|---|
| **వేదాలను కుచించితే వచ్చింది** | **– గాయత్రీ మంత్రం** |
| **గాయత్రీ మంత్రాన్ని కుంచిస్తే వచ్చాయి వ్యాహృతులు** | **– భూః, భువః, సువః** |
| **వ్యాహృతులను కుంచిస్తే వచ్చాయి మూడు అక్షరాలు** | **– అ, ఉ, మ** |
| **అ ఉ మ లను కలిపితే వచ్చింది** | **– ఓం.** |

నేటి సాంకేతిక రంగంలో ఎంతో సమాచారాన్ని ఒక చిన్న చిప్‌లో దాచినట్టుగా, మన వేదాల సారమంతా ఓంకారంలో దాగివుంది. ఇప్పుడు ఓంకారంనుంచి వెనక్కి వెళితే ఓంకారం అంటే అ+ఉ+మ; అ, ఉ, మలు మూడు వ్యాహృతులకు సంకేతం. ఆ మూడు వ్యాహృతులు భూః, భువః, సువఃలు. ఆ మూడు వ్యాహృతులు గాయత్రీ మంత్రంయొక్క సారం. గాయత్రీ మంత్రం వేదాల సారం. ఇప్పుడు మొదటిదీ, ఆఖరిదీ కలిపితే ఓంకారం, వేదాల సారం.

కొంతమంది ఓంకారంలో అ ఉ మ అక్షరాలు ఉన్నాయని దాన్ని ఔమ్ అని పలుకుతారు. అది తప్పు. మనం చిన్నప్పుడు గుణసంధి నేర్చుకున్నాము. అకారానికి ఉకారం కలిపితే ఓ వస్తుంది అ+ఉ=ఓ. ఉదాహరణ మహ+ఉన్నతి=మహోన్నతి. ఆ విధంగా దీన్ని ఏకాక్షరంగా అంటే ఓంకారంగా తీసుకోవాలి. రస్నాలాంటి పాకెట్టు ఒకటి బోలెడు నీళ్ళలో కలిపితే, బోలెడు పండ్లరసం వస్తుంది. అలా ఓంకారాన్ని పల్చన చేస్తే వేదాలు వస్తాయి; వేదాలను చిక్కగా చేస్తే ఓంకారం వస్తుంది.

**ఋక్సామ యజురేవ చ** – అందువల్ల వేదాలను కూడా నేనే. ఇక్కడ కృష్ణపరమాత్మ ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదాలను మాత్రమే చెప్పాడు. మనం అధర్వణ వేదం కూడా కలుపుకోవాలి. ఋగ్వేదం కవితరూపంలో అంటే పద్యరూపంలో ఉంటుంది, యజుర్వేదం వచనరూపంలో అంటే గద్యరూపంలో ఉంటుంది, సామవేదం సంగీతరూపంలో ఉంటుంది. అందువల్ల వాటిని ఋగ్వేద పారాయణం, యజుర్వేద పారాయణం అని, సామవేదాన్ని మాత్రం సామగానం అని అంటారు. అధర్వణవేదంలో ఎక్కువగా లౌకిక విషయాలు వస్తాయి, అంతగా యజ్ఞాల గురించి ఉండదు. అందువల్ల చాలాచోట్ల మూడు వేదాలనే పేర్కొంటారు. కాని అది కూడా కలుపుకోవాలి. భగవంతుడు నాలుగు వేదాలు నేనే అన్నాడు.

శ్లో. 18 **గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్ ।**
**ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్ ॥**
గతిః, భర్తా, ప్రభుః, సాక్షీ, నివాసః, శరణమ్, సుహృత్,
ప్రభవః, ప్రలయః, స్థానమ్, నిధానమ్, బీజమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| గతిః | = పరమగతియైన పరంధామమును | సుహృత్ | = అందరి శ్రేయస్సును కోరేవాడను |
| భర్తా | = భరించి, పోషించువాడను | ప్రభవః, | = అందరి ఉత్పత్తి, |
| ప్రభుః | = అందరికిని ప్రభువును | ప్రలయః | ప్రళయములకు హేతువును |
| సాక్షీ | = అందరి మంచిచెడ్డలను చూచువాడను | స్థానమ్ | = వారి స్థితికి ఆధారమును |
| | | నిధానమ్ | = పెన్నిధిని |
| (అహమ్, ఏవ) | = నేనే | అవ్యయమ్ | = శాశ్వతమైన |
| నివాసః | = నివాసస్థానమును | బీజమ్ | = కారణమును |
| శరణమ్ | = శరణు పొందదగినవాడను | (అహమ్, ఏవ) | = నేనే |

**(అహం) గతిః, భర్తా, ప్రభుః, సాక్షీ, నివాసః, శరణమ్, సుహృత్,**
**ప్రభవః, ప్రలయః, స్థానమ్, నిధానమ్, అవ్యయమ్ బీజమ్ (చ అస్మి) ।**

తా: పరమగతియైన పరంధామమును భరించి పోషించువాడను అందరికిని ప్రభువును, అందరి మంచిచెడ్డలను చూచువాడను నేనే. నివాసస్థానమును శరణు పొందదగినవాడను, అందరి శ్రేయస్సును కోరేవాడను, అందరి ఉత్పత్తి, ప్రళయములకు హేతువును, వారి స్థితికి ఆధారమును, పెన్నిధిని, శాశ్వతమైన కారణమును నేనే.

ఇంకా విశ్వరూపవివరణ కొనసాగుతున్నది.

**గతిర్భర్తా ప్రభుః సాక్షీ** – కృష్ణపరమాత్మ నేనే గతి, భర్త, ప్రభుః, సాక్షీ అంటున్నాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే సర్వం కృష్ణమయం జగత్. మీరు రామభక్తులు అయితే సర్వం రామమయం జగత్; శివభక్తులు అయితే సర్వం శివమయం జగత్. ఒక దేవుడు ఎక్కువ, ఒక దేవుడు తక్కువ అనటం లేదు. ఏ దేవునిగా కొలిచినా, ఆయనే అంతటా ఉన్నాడు. దేవుడు అనంతం అన్నాక, ఇద్దరు దేవుళ్ళు అనంతం అనలేము. అంటే ఇద్దరూ ఒకటే అని దానర్థం – నామం, రూపమే భేదం. ఇప్పుడు ఒక్కొక్క పదాన్నీ చూద్దాము.

గతిః – అంటే గమ్యం. ఇక్కడ కర్మఫలం అని చెప్పవచ్చు. ఎందుకు? ఎవరైనా కర్మఫలాన్ని ఆశించే ఒక కర్మను చేస్తారు. ఫలానా లక్ష్యం పొందాలని ఫలానా కర్మ చేస్తారు. ఏ లక్ష్యం కోరితే దానికి తగ్గ కర్మఫలం. గమ్యాన్ని గతి అంటారు. గతి అంటే కర్మఫలం అని చూశాము. కర్మఫలం రెండు రకాలుగా రావచ్చు. విజయం రావచ్చు, అపజయం కూడా రావచ్చు.

కృష్ణపరమాత్మ ధైర్యంగా నేను కర్మఫలాన్ని అని ప్రకటించుకుంటున్నాడు. అంటే విజయమూ భగవంతుడే, ఓటమీ భగవంతుడే. అందువల్ల ఎన్నడూ ఓటమిని తిరస్కరించకూడదు. ఓటమిని తిరస్కరిస్తే, భగవంతుణ్ణి తిరస్కరించినట్టు అవుతుంది. విజయంకోసం ప్రయత్నించండి, కష్టపడండి; కాని ఓటమి వచ్చినా చిరునవ్వుతో స్వీకరించండి. ఇదే విషయాన్ని రెండవ అధ్యాయంలో చెప్పాడు కృష్ణపరమాత్మ.

**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే** – 2.48

**సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ** – 2.38

అందువల్ల జయాపజయాలను, లాభనష్టాలను సమానంగా స్వీకరించటం నేర్చుకోవాలి. అనారోగ్యం విషయం తీసుకుంటే శారీరక నొప్పులు ఉంటాయి. వాటిని తప్పించుకోలేము. కాని వాటికి మనం మానసిక వ్యధను తోడు చేస్తాము. నాకే ఎందుకు వచ్చింది అని వాపోతాము. ఇప్పుడు అంతటా భగవంతుడే ఉన్నాడని అర్థం చేసుకుని, శారీరక బాధలను కూడా చిరునవ్వుతో స్వీకరించటం నేర్చుకుంటాము. నాకే ఎందుకు వచ్చింది అని మనం కొనితెచ్చుకున్న బాధ పోతుంది. ఆ విధంగా గతి ఈశ్వరుడు.

భర్తా – భర్తా అంటే అక్షరాలా చూస్తే స్థితికర్త. కాని ఇక్కడ కర్మఫలదాత. తనే కర్మఫలం అని ఎందుకన్నాడు? కర్మఫలాన్ని ఇవ్వటానికి ప్రకృతి సూత్రాలను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రతి ఒక్క చర్యకూ ఫలితం ఉంటుంది. కాని ఆ ఫలితం అనేక అంతులేని అంశాలమీద ఆధారపడివుంటుంది.

వాతావరణ సూచన చేసేటప్పుడు ఆ శాస్త్రజ్ఞులు రేపు వాన వస్తుందని చెపుతారు. మనం నవ్వుకుంటాము, అయితే ఖచ్చితంగా వాన రాదు అంటాము. అలాగే వారు చెప్పే వాతావరణ సూచన నేను కూడా చెపుతాను, ఇవాళ వాన కురవవచ్చు, కురవక పోవచ్చు; ఉరుములు ఉరమవచ్చు, ఉరమక పోవచ్చు అని అంటాము. కాని వాతావరణశాస్త్రం నేర్చుకుంటే అది ఎంత కష్టమో అర్థమవుతుంది. వారు కనీసం 160 అంశాలను దృష్టిలో పెట్టుకుని వాన వస్తుందనో, రాదనో చెపుతారు. అయినా వాళ్ళ సూచన నిజం కాలేదంటే, ఇంకా వారికి తెలియని, వారికి అందుబాటులో లేని ఎన్నో అంశాలు ఉన్నాయన్నమాట. అందువల్ల కేవలం సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు మాత్రమే కర్మఫలాన్ని నిశ్చయించగలడు. అటువంటి సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు ఒక్కడే ఉన్నాడు. ఆయనే ఈశ్వరుడు. అందువల్ల జీవి ఎన్నడూ కర్మఫలదాత కాలేడు.

ముందేమన్నాడు? నేనే కర్మఫలాన్ని అన్నాడు; ఇప్పుడు నేనే కర్మఫలదాతను అని కూడా అన్నాడు. అది తెలిస్తే కర్మఫలాన్ని ఎలా తిరస్కరించగలము?

ఇప్పుడు ఈశ్వరుడే కర్మఫలమూ, కర్మఫలదాతా అని తెలిస్తే నాకే ఎందుకు వచ్చింది, నా పొరుగువారికి ఎందుకు రాలేదు అనే ప్రశ్న ఉదయించదు. భగవంతుడు ఎన్నడూ పక్షపాతం చూపించడు. ఆయన భర్తా–స్థితికర్తా, కర్మఫలదాతా.

ప్రభుః – అందరికీ యజమాని, రాజు. కర్మఫలదాత సర్వజ్ఞుడే కాక సర్వశక్తిమంతుడు కూడా అయివుండాలి. అందువల్ల ప్రభువు. ప్రభవతి ఇతి ప్రభుః. ప్రభవతి అంటే శక్తిమంతుడు. ఏది చెయ్యటానికి? కర్మఫలం ప్రసాదించటానికి.

సాక్షీ – అనేక రకాల కర్మఫలాలు ఇస్తున్నా కూడా నేను సాక్షిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ప్రకృతి వైపరీత్యాలు సృష్టించినా కూడా, అందులో కూడా అందరూ సమానంగా కష్టపడటం లేదు. భూకంపం వచ్చినా అందరూ మరణించటం లేదు. దీనికి కారణం ఒకటే. వారు చేసుకున్న పుణ్యపాపాల భేదం!

అందువల్ల రకరకాల కర్మఫలాలను ఇస్తున్నా, నా పరాప్రకృతి దృష్ట్యా నేను సాక్షిచైతన్యాన్ని. మాయాశక్తి దృష్ట్యా అన్ని పనులు చేస్తున్నా, పరాప్రకృతి దృష్ట్యా నేను సాక్షిని. ఇదే విషయాన్ని ఏడవ అధ్యాయంలో పరాప్రకృతి, అపరాప్రకృతి పేర్లతో చూశాము.

**సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ** – శ్వేతాశ్వతరోపనిషత్తు 6.11

**నివాసః** – నేను అందరికీ నివాసస్థానాన్ని. అంటే సర్వాధారాన్ని.

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**
**విశ్వాధారం గగన సదృశం**

ఇంతకుముందు చూసినట్టుగా ఒకే శ్లోకంలో రెండు భిన్న అంశాలు వచ్చాయి. అవి భుజగశయనం, విశ్వాధారం. భుజగశయనం అంటే ఆదిశేషువుమీద పడుకున్న విష్ణుమూర్తి. అంటే ఆయనకు ఆధారం ఆదిశేషువు అయ్యాడు. కాని విశ్వాధారం పదంలో మొత్తం పరిస్థితి తారుమారు అవుతుంది. ఆదిశేషువుకు మాత్రమే కాదు, మొత్తం విశ్వానికే ఆయన ఆధారం. అందువల్ల నివాసః – నివాసతి అస్మిన్ సర్వమ్ ఇతి నివాసః.

**శరణమ్** – అందరూ నన్ను శరణు వేడుతారు. ప్రపంచంలో అన్ని మార్గాలూ మూసుకుపోయి, ఎటునుంచీ సహాయం అందక, దిక్కుతోచని పరిస్థితిలో భగవంతుడు తప్ప వేరే ఎవరూ సహాయపడలేరని గ్రహిస్తారు.

**నీవే తప్ప ఇతఃపరంబెరుగ** – గజేంద్రమోక్షం

అలా ఎలుగెత్తి పిలిచారు గజేంద్రుడు, ప్రహ్లాదుడు, ద్రౌపది. అలాంటి నిస్సహాయస్థితిలో అర్జునుడు శరణు వేడాడు కృష్ణపరమాత్మను. అలా పిలిస్తే పలుకుతాడనే భగవంతుణ్ణి ఆర్తత్రాణ పరాయణుడు అంటారు. భగవంతుడు దీనులను రెండు రకాలుగా రక్షిస్తాడు. తక్షణసమస్య నుంచీ రక్షిస్తాడు; అంతిమసమస్య అయిన సంసారంనుంచీ రక్షిస్తాడు. గజేంద్రమోక్షంలో గజేంద్రుణ్ణి మొసలి బారినుంచి రక్షించాడు. సంసారం విషయంలో సంసారమనే మొసలినుంచి రక్షిస్తాడు. మొసలికి సుదర్శనచక్రం పంపినట్టే మనకు కూడా సుదర్శనచక్రం పంపిస్తాడు. దర్శనం అంటే జ్ఞానం; అహం బ్రహ్మ అస్మి జ్ఞానం. తత్త్వమసిలాంటి మహావాక్య ఉపదేశంద్వారా సంసారమనే మొసలిని నాశనం చేస్తాడు.

**శీర్యతే దుఃఖమ్ అస్మిన్ ఇతి శరణం**

శరణం అంటే ఎవరి సమక్షంలో ఉంటే మన సమస్యలు తొలుగుతాయో వారు.

**సుహృత్** – మంచి కోరేవాడు. ఆరవ అధ్యాయంలో సుహృత్‌కు, మిత్రమ్‌కు మధ్య చిన్న సూక్ష్మభేదాన్ని చూశాము. మిత్రుడు అంటే అతను మనకు తెలుసు, అతనికి మనం ఇప్పుడు సహాయం చేస్తే, భవిష్యత్తులో అతను మనకు సహాయం చేస్తాడనే ఆశతో చేస్తాము. అంటే ప్రత్యుపకారం ఆశించి చేస్తాము. సుహృత్ అంటే మనకు ఎదుటివ్యక్తి

తెలియకపోయినా సహాయం చేస్తాము. అతనికి సహాయం అవసరం అని చేస్తాము. పైపెచ్చు అతనినుంచి ఎదురు ఏమీ ఆశించము. అంటే ప్రత్యుపకారం ఆశించకుండా చేస్తాము.

భగవంతుడు సుహృత్‌లోకి వస్తాడు. ఆయన మననుంచి ఏమీ ప్రత్యుపకారం ఆశించకుండా చేస్తాడు. మనం కూడా భగవంతుడు ఏమీ ప్రత్యుపకారం ఆశించకుండా చెయ్యాలని ఆశిస్తాము.

ఒక భక్తుడు తనకు ఏదో కష్టం ముంచుకువస్తే దాన్ని భగవంతుడు తీరిస్తే రాజభవనం లాంటి తన ఇల్లును భగవంతునికి ఇచ్చేస్తానని మొక్కుకున్నాడు. భగవంతుడు తీర్చలేడనుకున్నాడు (మనలాంటి వాడే భగవంతుడు కూడా అనుకున్నాడు). పొరపాటునో, ఎలాగో అతని సమస్య పరిష్కారం అయిపోయింది. కాని కొత్త సమస్య వచ్చిపడింది. ఎలా ఈ సమస్యనుంచి బయటపడటం? అతనికి ఒక పిల్లి కూడా ఉంది. అతను పిల్లినీ, ఇంటినీ రెండింటినీ కలిపి బేరానికి పెట్టాడు. ఇల్లు ధర ఒక రూపాయి, పిల్లి ధర 9,99,999 రూపాయలు. రెండూ కలిపి కొనాలి కొనేవారు. రెండూ కలిపి 10 లక్షలు. అతనికి వచ్చింది పదిలక్షలు, కాని ఇంటి ధర రూపాయే. భగవంతునికి ఆ విధంగా అతను ఇంటి ధర చెల్లించుకున్నాడు. మనిషి బుద్ధి ఎలా ఉంటుందో చూడండి. కానీ భగవంతుడు సహాయం చెయ్యటానికి వెనుకాడడు. అందువల్ల సుహృత్.

**ప్రభవః ప్రలయః స్థానమ్** – ప్రభవః అంటే సృష్టికారణం; స్థానం అంటే స్థితికారణం; ప్రలయః అంటే ప్రళయ కారణం. ఈ మూడూ కలిపితే భగవంతుడు సృష్టి స్థితి లయ కారణం. భగవంతుని నుంచే ఈ జగత్తు పుట్టి, ఆయన వల్లనే స్థితి పొంది, ఆయనలోనే లయమవుతుంది.

**నిధానమ్** – పెన్నిధిని. ఈ జగత్తులో ఉన్నవన్నీ ఉన్న భాండాగారాన్ని. వస్తువులే కాదు, జ్ఞానం కూడా ఉన్న పెన్నిధిని. నిజానికి జ్ఞానం కొత్తగా సృష్టించబడదు. ఉన్నదాన్నే కనుగొంటారు. ఉన్నది, ఎక్కడ ఉంది? భగవంతునిలో.

**అవ్యయం బీజమ్** – నేను ఈ జగత్తుకు శాశ్వతమైన బీజాన్ని. ఈ బీజంలోంచి అనంతమైన వస్తువులు వస్తాయి. నిధానం, బీజం మధ్య వ్యత్యాసం ఏమిటంటే నిధానం అంటే సంచిత రూపంలో ఉన్న కర్మఫలం; అవ్యయం బీజమ్ అంటే సృష్టిలో ఉన్న అన్ని జీవరాశులు. ఒక్కముక్కలో చెప్పాలంటే అన్నీ నేనే. నేనే అంటే భగవంతుడు.

శ్లో. 19 **తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ ।**
**అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున ॥**

తపామి, అహమ్, అహమ్, వర్షమ్, నిగృహ్ణామి, ఉత్సృజామి, చ,
అమృతమ్, చ, ఏవ, మృత్యుః, చ, సత్, అసత్, చ, అహమ్, అర్జున ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | ఉత్సృజామి చ | = ఇంకా వర్షించుచున్నాను |
| అహమ్ | = నేను | అహమ్, ఏవ | = నేనే |
| తపామి | = సూర్యరూపమున ఉష్ణాన్నిస్తున్నాను | అమృతమ్ | = అమృతమును |
| | | చ | = ఇంకా |
| వర్షమ్ | = సముద్రములనుండి వర్షజలములను | మృత్యుః, చ | = మృత్యువును |
| | | సత్, అసత్, చ | = సత్తును, అసత్తును గూడ |
| నిగృహ్ణామి చ | = ఆకర్షించుచున్నాను కూడా | అహమ్ (ఏవ) | = నేనే |

**హే అర్జున! అహమ్ తపామి, అహమ్ వర్షమ్, నిగృహ్ణామి ఉత్సృజామి చ,**
**అహమ్ ఏవ అమృతమ్ మృత్యుః చ, (అహమ్ ఏవ) సత్ అసత్ చ (అస్మి)।**

తా: ఓ అర్జునా! నేను సూర్యరూపమున ఉష్ణాన్నిస్తున్నాను, సముద్రములనుండి వర్షజలములను ఆకర్షించుచున్నాను ఇంకా వర్షించుచున్నాను. నేనే అమృతమును ఇంకా మృత్యువును, సత్తును, అసత్తును గూడ నేనే.

ఇప్పుడు కృష్ణపరమాత్మ అందరికీ తెలిసినదాని గురించి చెప్పబోతున్నాడు. ఏమిటది?

**సూర్యః** – సూర్యభగవానుడు. సూర్యునివల్లనే భూమికి మనుగడ ఉంది; సూర్యునినుంచే సమస్త జీవకోటికి ప్రాణశక్తి అందుతున్నది. మనకు మరీ దగ్గరగా వస్తే మాడి మసైపోతాము. మనకు ఉండాల్సినంత దూరంలో ఉండి వేడిని, కాంతిని ఇస్తున్నాడు. ఋతువులు సూర్యునివల్లనే ఏర్పదుతున్నాయి. అందువల్లనే సూర్యుణ్ణి భగవానుడనీ, ప్రత్యక్షదైవమనీ కొలుస్తాము.

**ఓం మిత్రస్య చర్షణీ ధృతః శ్రవో దేవస్య**
**సాన సిం సత్యం చిత్రశ్ర వస్తమం** – సంధ్యావందనం

మధ్యాహ్నం చేసే ప్రార్థనలో

**ఓం ఆ సత్యేన రజసా వర్తమానో నివేశయన్నమృతం**
**మర్త్యంచ। హిరణ్యయేన సవితా రథేనాఽదేవోయాతి భువనా నిపశ్యన్**

ఇవన్నీ అద్భుతమైన మంత్రాలు. సంధ్యావందనంలో వస్తాయి. సూర్యునినుంచే మనకు సౌరశక్తి వస్తుంది. తక్కిన శక్తులు తగ్గిపోతాయేమో గానీ, సూర్యుని శక్తి తగ్గదు. అటువంటి సూర్యుణ్ణి నేను. ఏది చూసినా నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అహం తపామి** – సూర్యుని రూపంలో శక్తినిస్తాడు అని చూశాము. ఇప్పుడు వేడిని కూడా ఇస్తాడు. ఒక గది వేడి చెయ్యాలంటేనో, నీటిని వేడి చెయ్యాలంటేనో ఎంత గ్యాసు అవసరం ఉంటుందో ఆలోచించండి. అలాంటిది

పైసా ఖర్చు లేకుండా, సముద్రం నీటిని వేడి చేసి, ఆవిరి చేసి, మేఘాల్లోకి వెళ్ళేలా చేస్తున్నాడు. కొంచెం ఎండ రాగానే అమ్మో ఎండ దంచేస్తోంది అని విలవిలలాడి పోతాము. నిజానికి సూర్యుని విలువ తెలియాలంటే హిమాలయాలకో, మానససరోవరంకో వెళ్ళాలి. ఆ విధంగా వేడి, కాంతి కూడా సూర్యుడు ఇస్తాడు.

సూర్యుడు సముద్రపు నీటిని మేఘాల్లో నింపి, మళ్ళీ పైసా ఖర్చు లేకుండా వాన కురిపిస్తున్నాడు. తమాషా చూడండి, వెళ్ళేది సముద్రం నీరు, కాని వానగా వచ్చే నీరు ఏమాత్రం ఉప్పగా ఉండదు. అది స్వచ్ఛమైన నీరు. అదీకాక సముద్రంనుంచి పైకి లేచిన నీరు, మళ్ళీ సముద్రంలోనే పడినా కూడా వృథాయే అవుతుంది కదా.

**వృథా వృష్టిః సముద్రేషు, వృథా తృప్తేషు భోజనమ్**

కడుపునిండా భోజనం చేసిన వానికి మళ్ళీ భోజనం పెడితే ఎలా వృథానో, అలాగే సముద్రంలోనే మళ్ళీ వాన కురిస్తే అది కూడా వృథా అవుతుంది. అందువల్ల వాయుదేవత రూపంలో మేఘాలను ప్రయాణం చేయించి, సరియైన సమయంలో, సరియైన ప్రాంతంలో వాన కురిసేలా చేస్తాడు.

ఋతువులు మారుతుంటే, వాటిని పట్టించుకోకుండా ఉండకండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎండాకాలంలో ఎండ కాస్తే దాన్ని ఆస్వాదించండి; అలాగే వానాకాలంలో వాన కురిస్తే, దాన్నీ మెచ్చుకోండి. భగవంతుణ్ణి మెచ్చుకోండి.

**అహం వర్షం నిగృహ్ణామి** – నేను సూర్యకాంతిద్వారా లేదా వేడిద్వారా వాననీటిని ఆకర్షిస్తున్నాను.

**ఉత్సృజామి చ** – తర్వాత ఆ నీటిని వదులుతాను. నిగృహ్ణామి అంటే స్వీకరిస్తాను; ఉత్సృజామి అంటే వదులుతాను. సూర్యుడు, వాయువులద్వారా చేస్తాను.

**అమృతం చైవ మృత్యుశ్చ** – దీనికి రెండు అర్థాలు చెప్పవచ్చు. ఒకటి వ్యావహారిక అర్థం, ఇంకొకటి పారమార్థిక అర్థం.

**వ్యావహారిక అర్థం:** నేను జీవించటానికి ఆధారం. వానలు కురిపించటంద్వారా పంటలు పండిస్తాను, పంటలు పండటంద్వారా ప్రజలకు ఆహారం సమకూరుతుంది. అన్నం రూపంలో అమృతం ఇస్తాను. అంటే జీవనాధారాన్ని ఇస్తాను. ముందు చెప్పినట్టుగా నిగృహ్ణామి, ఉత్సృజామి పనులు చెయ్యకపోతే వానలు కురవవు. వానలు కురవకపోతే కరువు కాటకాలు ఏర్పడి, ఆకలిచావులు సంభవిస్తాయి. ఆ విధంగా నేను మృత్యువును కూడా. వానలు కురిపించటంద్వారా జీవితాన్ని ఇస్తున్నాను; వానలు కురవనివ్వకుండా కరువుద్వారా జీవితాన్ని తీసేసుకుంటున్నాను. అలా జీవితానికి, మృత్యువుకు కూడా నేనే కారణం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**పారమార్థిక అర్థం:** శాశ్వతత్వానికి, అశాశ్వతత్వానికి కూడా నేనే కారణం అంటున్నాడని కూడా అర్థం తీసుకోవచ్చు. అమృతం అంటే శాశ్వతత్వం, అది జ్ఞానం పొందితే కలుగుతుంది. మృత్యువు అంటే అజ్ఞానం. అది అశాశ్వతత్వానికి కారణం.

**సత్ అసత్ చ అహమ్ (ఏవ)** – సత్, అసత్‌లకు అనేక అర్థాలు ఉన్నాయి. ఇక్కడ తేలికైన అర్థం తీసుకుందాము. సత్ అంటే వ్యక్తప్రపంచం, అసత్ అంటే అవ్యక్తప్రపంచం. ఉదాహరణకు స్థూలశరీరం వ్యక్తరూపం; సూక్ష్మశరీరం అవ్యక్తాలు. వ్యక్త, అవ్యక్తప్రపంచాలు రెండూ నేనే.

**సాధనరూపభక్తి శ్లోకాలు 12-19**: ఇక్కడితో మోక్షాన్నిచ్చే భక్తి గురించిన వివరణ అయిపోయింది. ఈ శ్లోకాలను సంసార నివృత్తి ఉపాయం అంటారు. ఇంకో విధంగా చెప్పాలంటే మోక్ష ఉపాయం. సంసారనివృత్తికి భగవంతుడు వాడిన పదం భక్తి.

భక్తి వల్ల మోక్షం కలుగుతుంది అంటే ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. అందువల్ల మళ్ళీ కొన్ని విశేషాలు చూద్దాము. భక్తికి సంబంధించి రెండు అంశాలు గుర్తుంచుకోవాలి. అవి – సాధనరూపభక్తి, భావనారూపభక్తి. ఈ భాగానికి సంబంధించి భక్తి అంటే ఏదో ఒక విధమైన భక్తి కాదు, మూడు స్థాయిల్లో ఉన్న భక్తి. దీన్ని వివరంగా మళ్ళీ పన్నెండవ అధ్యాయంలో చూస్తాము. ఈ మూడు రకాల భక్తిని – కర్మరూపభక్తి, ఉపాసన రూపభక్తి, వేదాంతవిచారరూపభక్తి అంటారు. ఈ విషయం చాలాసార్లు చూశాము.

ఒక సాధకుని ప్రయాణం – కర్మయోగానికి వచ్చి చిత్తశుద్ధి పొంది; ఉపాసనయోగానికి వచ్చి, చిత్త ఏకాగ్రత పొంది; జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి జ్ఞానం పొందితే మోక్షం పొందుతాడు.

ఈ మూడవస్థాయి భక్తిని శంకరాచార్యులు వివేకచూడామణిలో చక్కగా వర్ణించారు.

**స్వస్వరూప అనుసంధానం భక్తిరిత్యభిధీయతే** – వివేకచూడామణి

మూడవస్థాయి భక్తిలో కర్మ, ఉపాసన, సంఘసేవలు ఉండవు; అందులో వేదాంతవిచారణ ఉంటుంది.

**జ్ఞానాత్ ఏవ కైవల్యమ్**

ఉపనిషత్తులు జ్ఞానంవల్లనే మోక్షం వస్తుందని ఘోషిస్తున్నాయి. ఇక్కడ కృష్ణపరమాత్మ భక్తి వల్ల మోక్షం వస్తుంది అంటున్నాడు. అంటే జ్ఞానరూపభక్తివల్లనే మోక్షం వస్తుంది అని అర్థం చేసుకోవాలి. ఈ విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

**సంపశ్యన్ బ్రహ్మ పరమం యాతి నాన్యేన హేతునా**
**నాన్యః పంథా అయనాయ విద్యతే** – కైవల్యం 1.10

జ్ఞానం కాక, మోక్షం పొందటానికి వేరే మార్గం లేదు. అదే కైవల్యోపనిషత్తులో కర్మవల్ల, పుత్రులవల్ల, ధనంవల్ల మోక్షం పొందరు అని వస్తుంది. కృష్ణపరమాత్మ కూడా భక్తి అంతిమ దశ జ్ఞానయజ్ఞం అని చెప్పాడు.

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥** – 4.33

ద్రవ్యయజ్ఞాల కంటే జ్ఞానయజ్ఞం శ్రేష్ఠం. కర్మలన్నీ జ్ఞానంలోనే పరిసమాప్తమవుతాయి.

**కర్మ + ఉపాసన + జ్ఞానం = మోక్షం**

ఈ విషయాన్ని కృష్ణపరమాత్మే వివరంగా పన్నెండవ అధ్యాయంలో చెపుతాడు. అందుకని దాన్ని భక్తియోగం అన్నారు.

ఒక సాధకుడు తన భక్తి స్థాయిని మూడు దశల్లో పెంచుకురావాలి. అవి ఏకరూపభక్తి, అనేకరూపభక్తి, అరూపభక్తి. వీటిని ఇంతకుముందు కూడా చూశాము.

ఏకరూపభక్తిలో ఇష్టదైవంతో మొదలుపెడతాము. తర్వాత అనేకరూపభక్తి లేదా విశ్వరూపభక్తికి ఎదగాలి. అనేకరూపభక్తి అంటే అనేకదేవతలమీద భక్తి కాదు, తను కొలిచే ఇష్టదైవం ఒకచోట మాత్రమే కాదు, విశ్వమంతటా ఉన్నాడని పూజించటం. రుద్రంలో అంతా నువ్వే అని వస్తుంది. ఉదాహరణకు చెట్టు నువ్వే, మట్టి నువ్వే, ఆకుపచ్చ ఆకు నువ్వే, ఎండిన ఆకు కూడా నువ్వే అని వస్తుంది.

**సర్వం శివమయం జగత్**

అనేకరూపభక్తినుంచి అరూపభక్తికి రావాలి. భగవంతుడు శబ్దస్పర్శరూపరసగంధాలకు అందడు. అంటే ఇంద్రియ అగోచరం.

**ఏకరూప భక్తి → అనేకరూప భక్తి → అరూప భక్తి**

భక్తి అంటే **అహం బ్రహ్మ అస్మి** అనే జ్ఞానం. బ్రహ్మ గురించి తెలుసుకుంటే జ్ఞానం పూర్తికాదు; ఆ బ్రహ్మ నేనే అని తెలుసుకోవాలి.

**శివ ఏవ సదా జీవః జీవ ఏవ సదాశివః**

భక్తి మోక్షాన్ని ఇస్తుందంటే అద్వైతజ్ఞానంతో కూడిన భక్తి మోక్షాన్ని ఇస్తుంది. దీనికి నిదర్శనం ఏమిటి అంటే కృష్ణపరమాత్మే ఏడవ అధ్యాయంలో చెప్పాడు.

**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ** – 7.16

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే** – 7.17

భక్తుల గురించి చెపుతున్నప్పుడు అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందిన జ్ఞానీభక్తుడు శ్రేష్ఠుడు అన్నాడు.

అందువల్ల ఈ రెండు అంశాలను క్రోడీకరించి చూస్తే

**సాధకుని ప్రయాణం = కర్మ + ఉపాసన + జ్ఞానం**

**భక్తిలో దశలు = ఏకరూప భక్తి → అనేకరూప భక్తి → అరూప భక్తి**

**భక్తిలో సాధనలు = కర్మరూపభక్తి + ఉపాసనరూపభక్తి + వేదాంతవిచారరూపభక్తి**

**భక్తి = జ్ఞానం + అరూప భక్తి**

భక్తి అంటే అరూప ఈశ్వరుని గురించిన జ్ఞానం. ఆ ఈశ్వరుడు నేనే అని తెలుసుకోవటం.

ఇక్కడ ఈ శ్లోకాలలో అనేకరూప భక్తి గురించి వివరించాడు కృష్ణపరమాత్మ. అంతటా భగవంతుణ్ణి చూడటం కష్టం అంటే తేలిక అని ఎవరన్నారు? కాని కష్టపడ్డా ఫలితం దక్కుతుంది.

**5. భావనారూప భక్తి: శ్లోకాలు 20–29**

ఇంతవరకూ భక్తి ఎలా మోక్ష సాధనమో చూశాము. ఇప్పుడు అంటే 20–29 శ్లోకాల వరకూ భక్తిలో రెండు రకాలను చూస్తాము. అవి సకామభక్తి, నిష్కామభక్తి. వీటిని ఏడవ అధ్యాయంలో చూశాము. తొమ్మిదవ అధ్యాయానికీ, ఏడవ అధ్యాయానికీ చాలా దగ్గర పోలికలున్నాయని కూడా చూశాము కదా. భక్తిని మూడు స్థాయిల్లో విభజించవచ్చు. అవి మందభక్తి, మధ్యమభక్తి, ఉత్తమభక్తి.

**మందభక్తి** – మందభక్తిలో భగవంతుణ్ణి మార్గంగా ఉపయోగించుకుంటారు. ఏదైనా పొందాలంటే దానికి ఒక మార్గం, ఒక లక్ష్యం ఉంటుంది. ధర్మార్థ కామమోక్షాలలో చాలామందికి అర్థ, కామాలు లక్ష్యాలుగా ఉంటాయి. వాటిని పొందటానికి భగవంతుణ్ణి మార్గంగా భావిస్తారు. అంటే వాటికోసం భగవంతుణ్ణి పూజిస్తారు.

తోటి మనుష్యులను కూడా అలాగే ప్రేమిస్తారు చాలామంది. ఎదుటివ్యక్తి దగ్గర డబ్బు ఉన్నంతవరకూ అతణ్ణి ఇంద్రుడని, చంద్రుడని పొగుడుతారు. ఎప్పుడైతే అతని దగ్గర డబ్బు అయిపోతుందో అప్పుడు తుపాకీ గుండుకు కూడా దొరకరు ఈ భజన చేసేవారు.

భగవంతునిమీద ప్రేమ కూడా అలాగే ఉంటుంది. ఆయన మన కోరికలు తీరుస్తుంటే మంచివాడు, లేకపోతే లేదు.

**మధ్యమభక్తి** – భగవంతుణ్ణి వేరే లక్ష్యాలు పొందటానికి ప్రార్థన చెయ్యకూడదు. ఆయననే లక్ష్యంగా పెట్టుకోవాలి అని గుర్తిస్తాడు ఈ మధ్యమస్థాయి భక్తుడు. ఇప్పుడు మార్గం–లక్ష్యం వాటి స్థానాలు మారతాయి. అంతకు ముందు ప్రాపంచిక విషయాలను పొందటానికి, భగవంతుణ్ణి ప్రార్థిస్తే, ఇప్పుడు భగవంతుణ్ణి పొందటానికి, ప్రాపంచిక విషయాలను ఉపయోగిస్తాడు.

మందభక్తిని సకామభక్తి అనీ, మధ్యమభక్తిని నిష్కామభక్తి అనీ అంటారు. ఈ రెండు స్థాయిల భక్తి గురించీ కృష్ణపరమాత్మ చెప్పబోతున్నాడు.

కాని రెండింటినీ మించి ఇంకొక భక్తి ఉంది. దాన్ని ఉత్తమభక్తి అంటారు.

**ఉత్తమభక్తి** – మధ్యమభక్తిలో భగవంతుణ్ణి లక్ష్యంగా చూస్తామని చూశాము. ఇది మందభక్తి కన్నా గొప్పదే కాని వేదాంతం మధ్యమభక్తి కన్నా ఇంకొక మెట్టు పైకి ఎదగాలి అంటుంది. భగవంతుణ్ణి లక్ష్యంగా ఎందుకు పెట్టుకున్నావు అని అడుగుతుంది? ఎందుకంటే భగవంతుడూ, నువ్వూ ఒకటే కాబట్టి అని వివరిస్తుంది.

వేదాంతం ఇలా వివరిస్తుంది. భగవంతుణ్ణి ఎందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు? డబ్బునో, విజయాన్నో, పదవినో, ఆస్తినో ఎందుకు లక్ష్యంగా పెట్టుకోలేదు? ఎందుకంటే భగవంతుణ్ణి పొందితే, నాకు ఆనందం కలుగుతుంది అంటారు మీరు. అంటే లక్ష్యంమీద ప్రేమకన్నా, మీమీద మీకు ప్రేమ ఎక్కువ ఉంటుంది.

అందువల్ల మీరు అనుకున్న లక్ష్యం మీరు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోతే, లక్ష్యాన్ని మారుస్తారు. ఎందుకు? మీ ఆనందం మీకు ముఖ్యం. అంటే భగవంతునిమీద ప్రేమకన్నా కూడా మీమీద మీకు ప్రేమ ఎక్కువ అంటుంది.

అంటే మూడు స్థాయిలు చూశాము. మార్గంమీద ప్రేమకన్నా లక్ష్యంమీద ప్రేమ ఎక్కువ; లక్ష్యంమీద ప్రేమకన్నా మీమీద మీకు ప్రేమ ఎక్కువ. లక్ష్యాన్ని ఎందుకు ప్రేమిస్తున్నారు? మీకు ఆనందం ఇస్తుంది కాబట్టి. అందువల్ల ఉత్తమభక్తి స్థాయిభక్తిలో భగవంతుడు మార్గమూ కాదు, లక్ష్యమూ కాదు, మీరూ, భగవంతుడూ ఒకటే అనే ఐక్యజ్ఞానం.

భగవంతుడూ, మీరూ ఒకటే అని అర్థమయినప్పుడు భక్తి పరాకాష్ఠకు చేరుకుంటుంది. దాన్ని అద్వైతభక్తి, పరాభక్తి, జ్ఞానభక్తి అంటారు. దీని గురించి ఏడవ అధ్యాయంలో చెప్పాడు కృష్ణపరమాత్మ.

**ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** – 7.18

ఓ అర్జునా, అందరు భక్తులూ గొప్పవాళ్ళే కానీ, జ్ఞానీ భక్తుడు అత్యుత్తముడు. ఎందుకంటే అతనే నేను అన్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు భక్తిలో మూడు రకాలు ఏమిటి? సకామభక్తి, నిష్కామభక్తి, అద్వైతభక్తి. కృష్ణపరమాత్మ వాటిలో మొదటి రెండు రకాల భక్తుల గురించి మాట్లాడబోతున్నాడు.

20, 21 శ్లోకాల్లో సకామభక్తి గురించి చెప్పబోతున్నాడు. ఎందుకంటే ఎక్కువ మంది భక్తులు సకామభక్తులలోకి వస్తారు. ఎలా వ్యత్యాసం తెలుస్తుంది? వారికేమైనా ప్రత్యేక రంగు ఉంటుందా? అది పూజ చేసేటప్పుడు చెప్పే సంకల్పాన్ని బట్టి ఉంటుంది. సకామభక్తిలో –

**మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా ధనం, ధాన్యం, బహు పుత్రలాభం, శత సంవత్సరం –**

ఇలా కొనసాగుతుంది కోరికల పొట్లాం. అందులో పొరపాటున కూడా మోక్షం ఉండదు. కనీసం మోక్షం అపి (మోక్షం కూడా) అనవచ్చు కదా! ఉహూ, అనరు.

చిత్తశుద్ధికోసం చేస్తే నిష్కామపూజ, ధనంకోసం చేస్తే సకామపూజ అవుతాయి.

కాని ముందు చూసినట్టుగా, ఎక్కువమందికి సకామభక్తి ఉంటుంది. ఎందుకంటే వారికి సుఖాలు కావాలి. అందువల్ల స్వర్గలోకానికి వెళ్ళాలని కోరుకుంటారు. ఇప్పుడు అమెరికా భూతలస్వర్గం అయింది. ఎలాగైనా సరే అమెరికా వెళ్ళిపోవాలి. ముఖ్యంగా తల్లి కడుపుతో ఉంటే, అమెరికాలోనే పురుడు పోసుకోవాలి. అలా ఉంది మానవనైజం. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను చూద్దాము.

శ్లో. 20 **త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।**
**తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమ్ అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥**
త్రైవిద్యాః, మామ్, సోమపాః, పూతపాపాః, యజ్ఞైః, ఇష్ట్వా, స్వర్గతిమ్, ప్రార్థయంతే,
తే, పుణ్యమ్, ఆసాద్య, సురేంద్రలోకమ్, అశ్నంతి, దివ్యాన్, దివి, దేవభోగాన్ ॥

| | | | |
|---|---|---|---|
| త్రైవిద్యాః | = ఋగ్యజుస్సామ వేదములచే ప్రోక్తములైన సకామ కర్మలను ఆచరించువారును | ప్రార్థయంతే | = అర్థించుచుందురు |
| సోమపాః | = సోమరసపానము చేయువారును | తే | = ఆ పురుషులు |
| పూతపాపాః | = పాపరహితులును అగు పురుషులు | పుణ్యమ్ | = పుణ్యఫలరూపమైన |
| యజ్ఞైః | = యజ్ఞములద్వారా | సురేంద్రలోకమ్ | = స్వర్గలోకమును |
| మామ్ | = నన్ను | ఆసాద్య | = పొంది |
| ఇష్ట్వా | = పూజించి | దివి | = స్వర్గమునందు |
| స్వర్గతిమ్ | = స్వర్గలోకప్రాప్తిని | దివ్యాన్ | = దివ్యములైన |
| | | దేవభోగాన్ | = దేవభోగములను |
| | | అశ్నంతి | = అనుభవింతురు |

**త్రై-విద్యాః సోమపాః పూత-పాపాః మామ్ యజ్ఞై ఇష్ట్వా స్వర్గతిమ్ ప్రార్థయన్తే।**
**తే పుణ్యమ్ సురేన్ద్ర-లోకం ఆసాద్య, దివి దివ్యాన్ దేవ-భోగాన్ అశ్నన్తి ॥**

తా: ఋగ్యజుస్సామ వేదములచే ప్రోక్తములైన సకామకర్మలను ఆచరించువారును, సోమరసపానము చేయువారును, పాపరహితులును అగు పురుషులు యజ్ఞములద్వారా నన్ను పూజించి స్వర్గలోకప్రాప్తిని అర్థించుచుందురు. ఆ పురుషులు పుణ్యఫలరూపమైన స్వర్గలోకమును పొంది స్వర్గమునందు దివ్యములైన దేవభోగములను అనుభవింతురు.

ఎ) **సకామభక్తి** – ఇప్పుడు సకామభక్తి ఉన్నవారి గురించి చూస్తాము. వీరిని మందభక్తులు అనికూడా అంటారు. వీరు భగవంతుణ్ణి ప్రార్థిస్తారు నిజమే కాని భగవంతుడు ప్రత్యక్షమై ఏంకావాలో కోరుకోమంటే, ఏవేవో కోరుతారు కాని అసలైంది కోరరు. దాన్ని మోహం అంటారు.

**త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా** – వీరు గొప్ప భక్తులు. త్రైవిద్యా అంటే మూడు వేదాలు నేర్చుకున్నవారు. మూడు వేదాలు అంటే ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం. సోమపాః అంటే సోమయాగం చేసినవారు. సోమరసాన్ని అగ్నిలో ఆహుతిగా వేసి, వారు కూడా ప్రసాదంగా కొంత సోమరసాన్ని స్వీకరిస్తారు.

**సోమరసం పిబన్తి ఇతి సోమపాః**

సోమరసాన్ని యాగంలో ఒక భాగంగా తీసుకుంటారు. అది కూడా ప్రసాదంగా స్వీకరిస్తారు. అలా స్వీకరించటం వల్ల వారు పూతపాపా అవుతారు. అంటే పాపాలనుంచి విముక్తులు అవుతారు. చాలా పుణ్యాన్ని పొందుతారు. భగవంతుడు వారికి బ్లాంకు చెక్కు ఇస్తాడు. దానిమీద మీరు ఏంకావాలంటే అది రాసుకోండి; ప్రపంచం కావాలా, ఇస్తాను; భగవంతుడు కావాలా, ఇస్తాను అంటాడు.

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతస్తౌ సమ్పరీత్య వివినక్తి ధీరః ।**
**శ్రేయో హి ధీరోఽభిప్రేయసో వృణీతే ప్రేయో మన్దో యోగక్షేమాద్వృణీతే ॥** – కఠ 1.2.2

ప్రేయోమార్గం, శ్రేయోమార్గం అని రెండు మార్గాలున్నాయి. కాని వీరు ఏం కోరుకుంటారు?

**స్వర్గతిం ప్రార్థయంతే** – స్వర్గఫలాన్ని కోరుకుంటారు. గతి అంటే లక్ష్యం, స్వర్ అంటే స్వర్గం. అందువల్ల స్వర్గతిం అంటే స్వర్గానికి వెళ్ళాలని కోరుకుంటారు.

ఇలాంటి సందర్భాలలో ఒక విషయాన్ని ఎన్నడూ మర్చిపోకూడదు. మనం ఏదైనా కర్మఫలం పొందుతున్నామూ అంటే అది మనం కోరుకున్నదే. మనం చేసుకున్న వాటికి ఫలాన్ని భగవంతుడు ఇస్తాడు అంతే! జగత్తులో నలుగురినీ చూసి, భగవంతుని లీలలు అర్థంకావు అని వాపోతాము. ఎందుకంటే, చీమకి కూడా హాని చెయ్యని వ్యక్తి చాలా కష్టాల్లో కూరుకునిపోయి బాధపడుతుంటాడు; మరోవైపు అసలు మంచి అంటే ఏమిటో తెలియని దుర్మార్గుడు సుఖభోగాలలో తులతూగుతూ ఉంటాడు. ఇలాంటివి చూసి దేవుణ్ణి నిందిస్తూ ఉంటాము. కాని పాపం ఆయన చేతిలో ఏమీలేదు.

భగవంతుడు ఒక వ్యాపరస్తునివంటివాడు. తన దుకాణంలో అనేకవస్తువులు ఉంటాయి. ఎవరు వచ్చి ఏది కోరితే అది వాళ్ళకు అమ్ముతాడు వాపారస్తుడు. మనకు ఏం కావాలో మనమే అడగాలి; తల్లిదండ్రులు మన తరపున నిశ్చయించలేరు; గురువు నిశ్చయించలేడు; భగవంతుడు నిశ్చయించలేడు. భగవంతుడు మనం ఏది కోరితే అది ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాడు, మనమే సరియైనది కోరటం లేదు.

అందువల్ల మన విధికి భగవంతుణ్ణి నిందించి లాభంలేదు; నక్షత్రాలను నిందించి లాభంలేదు. 'తప్పు చెయ్యటం మానవనైజం; క్షమించటం భగవంతుని నైజం,' పాత సామెత. ఇప్పుడు 'తప్పు చెయ్యటం మానవ నైజం, ఆ తప్పును ఎదుటివారిమీదకు తొయ్యటం మరీ మానవనైజం.' మా పిల్లవాడు మంచివాడే, పక్కింటి పిల్లవాడితో చేరి చెడిపోయాడు అంటారు. పక్కింటివాడిని అడగండి, అతనూ అదే మాట అంటాడు. అందువల్ల అనవసరంగా ఎవరినీ నిందించకూడదు, భగవంతునితో సహా!

నాకు స్వర్గసుఖాలు పొందాలని ఉంది, స్వర్గం కావాలని ఎవరైనా అంటే భగవంతుడు మాత్రం ఏం చేస్తాడు? అతనిని బలవంతం చెయ్యలేడు. నిజానికి భగవంతుడు అతనికి నచ్చచెప్పి, మోక్షాన్ని ఇవ్వచ్చు కదా అనిపిస్తుంది కాని అది లాభంలేదు. నీకు స్వర్గం వద్దు, నేను మోక్షాన్ని ఇస్తాను అని భగవంతుడు అన్నా కూడా, నాకు స్వర్గమే కావాలని పేచీ పెడతాడు భక్తుడు.

ఒక చిన్న పిల్లవాడికి బంగారు బిస్కెట్టు, తినే బిస్కెట్టు చూపించి ఏది కావాలో కోరుకో అంటే ఏది కోరుకుంటాడు? ఖచ్చితంగా తినే బిస్కట్టే. పాపం ఆ పిల్లవాడికి తెలియదు బంగారు బిస్కెట్టు తీసుకుంటే దానితో లక్షలాది తినే బిస్కెట్లు కొనుక్కోవచ్చని. అంటే అతనికి నిత్యానిత్యవస్తువివేకం లేదు.

ఆ పిల్లవాణ్ణి చూసి మనం నవ్వుతాము కాని, మనం చేస్తున్నది మాత్రం ఏమిటి? భగవంతుడు బంగారు బిస్కెట్టు, ప్రపంచం తినే బిస్కెట్టు. భగవంతుణ్ణి కోరితే లక్షలకొద్దీ ప్రాపంచిక ఆనందాలను కొనగలమని తెలియటంలేదు మనకు. పిల్లవాడు మామూలు బిస్కెట్టుకోసం ఏడుస్తుంటే, తల్లి సరే ఇప్పుడు అదే ఇద్దాం, ఎప్పటికో అప్పటికి వాడికి బంగారు బిస్కెట్టు విలువ తెలియకపోతుందా అనుకుంటుంది. అలాగే భగవంతుడు

కూడా స్వర్గలోకాన్నే ఇవ్వటానికి నిర్ణయించుకుంటాడు. ఆ విధంగా మోక్షమనే బంగారు బిస్కెట్టును పోగొట్టు కుంటాడు సకామభక్తుడు.

**తే సురేంద్ర లోకమ్ ఆసాద్య** – వారు సురేంద్రలోకం పొందుతారు. సురేంద్రుడు అంటే ఇంద్రుడు. ఇంద్రలోకం అంటే స్వర్గలోకం పొందుతారు. ఎటువంటి స్వర్గలోకం?

**పుణ్యమ్** – పుణ్యఫలరూపం. అక్కడ ఆనందమే ఆనందం. సంవత్సరమంతా ఆటపాటలే ఉంటాయి. మనిషి లక్ష్యం ఏమిటి అంటే తిను, తాగు, ఆనందించు అంటాడు. హిందీలో కూడా ఇలాగే చెపుతారు – ఖావో, పీవో, మజా కరో.

**అశ్నంతి** – అనుభవిస్తారు. ఏమిటి?

**దివి దేవభోగాన్** – దేవలోకంలో ఉన్న భోగాలన్నీ అనుభవిస్తారు.

**దివ్యాన్** – దివ్యమైన భోగాలను అంటే అలౌకిక సుఖాలను అనుభవిస్తారు.

ఇంతవరకూ వింటే ఇదేదో బాగుంది కదా, సకామ భక్తులు బాగానే ఎన్నుకున్నారు; హాయిగా స్వర్గసుఖాలను అనుభవిస్తున్నారు. ఇది మరణం తర్వాత పొందుతారు నిజమే, కాని హాయిగా ఉంటారు కదా అనిపిస్తుంది. కాని ఇక్కడితో ఆగటం లేదు కృష్ణపరమాత్మ. దీన్ని తర్వాత వచ్చే శ్లోకంలో విశ్లేషించబోతున్నాడు.

శ్లో. 21 **తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।**
**ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే ॥**
తే, తమ్, భుక్త్వా, స్వర్గలోకమ్, విశాలమ్, క్షీణే, పుణ్యే, మర్త్యలోకమ్, విశంతి,
ఏవమ్, త్రయీధర్మమ్, అనుప్రపన్నాః, గతాగతమ్, కామకామాః, లభంతే ॥

| | | | |
|---|---|---|---|
| తే | = ఆ పురుషులు | విశంతి | = ప్రవేశింతురు |
| తమ్ | = ఆ | ఏవమ్ | = ఈ ప్రకారముగా |
| విశాలమ్ | = విశాలములైన | త్రయీధర్మమ్ | = మూడు వేదములలో చెప్పబడిన సకామ కర్మఫలములను |
| స్వర్గలోకమ్ | = స్వర్గలోక భోగములను | | |
| భుక్త్వా | = అనుభవించి | అనుప్రపన్నాః | = ఆశ్రయించువారును |
| పుణ్యే | = పుణ్యములు | కామకామాః | = భోగములను ఆశించువారై |
| క్షీణే | = క్షీణింపగనే | గతాగతమ్ | = స్వర్గమర్త్యలోకముల మధ్య రాకపోకలను |
| మర్త్యలోకమ్ | = మనుష్యలోకమును | లభంతే | = సాగింతురు. |

**తే తమ్ విశాలమ్ స్వర్గ–లోకమ్ భుక్త్వా, పుణ్యే క్షీణే (సతి) మర్త్య–లోకమ్ విశన్తి ।**
**ఏవమ్ త్రయీ–ధర్మమ్ అనుప్రపన్నాః కామ–కామాః గత–ఆగతమ్ లభన్తే ॥**

తా: ఆ పురుషులు ఆ విశాలములైన స్వర్గలోకభోగములను అనుభవించి పుణ్యములు క్షీణింపగనే మనుష్యలోకమును ప్రవేశింతురు. ఈ ప్రకారముగా మూడు వేదములలో చెప్పబడిన సకామకర్మఫలములను ఆశ్రయించువారును, భోగములను ఆశించువారై స్వర్గమర్త్య లోకముల మధ్య రాకపోకలను సాగింతురు. పుణ్యమువల్ల స్వర్గమునకు పోవుదురు. పుణ్యమును స్వర్గలోకాలలో అనుభవించి తిరిగి మర్త్యలోకమునకు వచ్చెదరు.

సకామకర్మ చేసినవారు ఎన్నుకున్న స్వర్గలోకం మంచిదే. అక్కడ వారు బాగానే స్వర్గసుఖాలు అనుభవిస్తారు. అది కూడా కొన్ని సంవత్సరాలు మాత్రమే కాదు, చాలా ఎక్కువకాలం అనుభవిస్తారు.

**తే తం భుక్త్వా స్వర్గలోకమ్** – వారు స్వర్గలోకఫలాలను అనుభవిస్తారు. కావాల్సిన సౌఖ్యాలు అన్నీ ఉంటాయి. అంతేకాదు దేవతలకు సిద్ధులు కూడా ఉంటాయి. సంకల్పమాత్రంచేతనే వారు కోరుకున్నది పొందగలరు. ఆ స్వర్గలోకం ఎంత పెద్దది? మన పట్టణాలలాగా, ఇరుకుగా ఉంటుందా?

**విశాలమ్** – చాలా విశాలంగా ఉంటుంది. ఒక్కొక్కరికీ రాజసౌధాలంత నివాసం ఉంటుంది. అటువంటి ఆనందాన్ని పొందుతారు.

ఇంతవరకూ సకామభక్తియొక్క సానుకూల అంశం చూశాము. సాధారణంగా మనుష్యులు సానుకూల అంశాలనే చూస్తారు. చాలామంది గులాబీపువ్వనే చూస్తారు కాని దానికింద ఉన్న ముల్లును పట్టించుకోరు. ఇప్పుడు కృష్ణపరమాత్మ ఆ ముల్లును వివరించబోతున్నాడు. స్వర్గలోకఫలం ఉచితంగా పొందలేదు. కష్టపడి సంపాదించుకోవాల్సి వచ్చింది. అక్కడ పొందిన ప్రతి మిల్లీగ్రాము ఆనందానికీ, పుణ్యమనే స్వర్గలోక డాలర్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.

ఆ భక్తుడు ఆ పుణ్యాన్ని ఎలా పొందాడు? కర్మవల్ల. ఎటువంటి కర్మవల్ల? సోమయాగాది కర్మలవల్ల. ఈ కర్మలవల్ల పొందిన ఈ ఫలం తక్కువగానే ఉంటుంది. అది అపరిమితంగా ఉండదు. పైగా విచారకరమైన విషయమేమిటంటే, స్వర్గలోకంలో పుణ్యక్షయం మాత్రమే అవుతుంది కాని, కొత్తగా పుణ్యాన్ని సంపాదించుకోలేరు. అమెరికాకు వెళ్ళాలన్నా కూడా మన రూపాయలను డాలర్లుగా మార్చుకుని వెళ్ళాలి. కాని అక్కడ చదువుకోవటానికి వెళ్ళే విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందుతారు లేదా వారు ఏమైనా ఉద్యోగాలు చేస్తారు, తద్వారా అమెరికన్ డాలర్లను సంపాదిస్తారు. కాని స్వర్గలోకంలో అలా కుదరదు. అది కర్మభూమి కాదు, భోగభూమి మాత్రమే. అంటే అక్కడ ఖర్చు మాత్రమే పెట్టగలరు. అందువల్ల పుణ్యం బ్యాంకులో ఉన్న పుణ్యమంతా క్షీణిస్తూ వస్తుంది. స్వర్గలోకానికి తీసుకువెళ్ళిన పుణ్యమంతా కరిగిపోగానే, వీసా అయిపోతుంది. కొండలైన కరిగిపోవు కూర్చుని తింటే అంటారు.

ఇక్కడ కూడా వీసా కాలం అయిపోగానే వెనక్కి రావాలి, ఇక్కడ ఏవో కొన్ని మార్గాంతరాలు ఉండవచ్చు కాని స్వర్గలోకంలో అలాంటి మార్గాంతరాలు లేవు.

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – పుణ్యం క్షీణించగానే, భూలోకానికి తిరిగివస్తాడు.

అంతకుముందు దేవతలతో ఉంటే, ఇప్పుడు దోమలతో సహజీవనం చెయ్యాల్సి ఉంటుంది. కృష్ణపరమాత్మ ఇంకా సుతారంగా హెచ్చరిస్తున్నాడు, పుణ్యం క్షీణిస్తే భూలోకానికి రావాల్సి ఉంటుందని. ఉపనిషత్తులు గట్టిగానే బెదిరిస్తాయి.

**నాకస్య పృష్ఠే తే సుకృతేఽనుభూత్వా ఇమం లోకం హీనతరం వా విశంతి** – ముండకం 1.2.10

ఇమంలోకం హీనతరం వా విశంతి అంటే ఈ లోకానికో, ఇంకా హీనతరమైన లోకాలకో తిరిగి రావాలి.

అయితే ఏమిటి నష్టం అని అడగవచ్చు మీరు. ఏ వస్తువైనా సరే, అది ఉంటే మీకు ఆనందం ఇస్తే, అది పోతే దుఃఖం కలిగిస్తుంది. మీరు మీకు ఇష్టమైన సినిమా చూస్తున్నారు, మంచి రసవత్తరమైన సన్నివేశంలో కరెంటు పోయింది, జనరేటరు కూడా పనిచెయ్యటం లేదు. మీకు తీవ్రమైన కోపం వస్తుంది. అంటే ఆనందం ఎంత ఎక్కువ ఉంటే, దానికి తగ్గట్టుగా కోపం లేదా దుఃఖం కూడా ఉంటుంది.

అందువల్ల అమెరికాలో ఆరు నెలలు ఉండివచ్చాక, కొంతమంది ఇండియాను విమర్శించటం మొదలు పెడతారు. ఇక్కడే పుట్టి పెరిగిన విషయం మర్చిపోయి, లెటర్స్ టు ది ఎడిటర్‌కి లెటర్సు కూడా రాస్తారు. ఎందుకు? అత్యంత గొప్ప స్థాయి ఆనందాన్ని చవిచూచాక, ఇక్కడికి వచ్చి కష్టాలు పడాలంటే తట్టుకోలేరు. అందువల్ల మర్త్యలోకం విశంతి అని చెప్పటంలో ఉద్దేశం దుఃఖలోకానికి వస్తారు అని.

ఇది తాగుడుకు అలవాటయిన వ్యక్తి పరిస్థితిలా ఉంటుంది. తాగిన మైకం ఉన్నంతవరకూ హాయిగా ఉంటాడు. ఆ మత్తు విడిపోగానే, మళ్ళీ ఎలాగోలా కొంత డబ్బు సంపాదించి, మందు కొనుక్కుని ఆ మత్తులో పడిపోవాలని చూస్తాడు. అలాంటి మత్తులో పడిపోతాడు సంసారి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ సంసారి కూడా కర్మ చేసి, పుణ్యలోకాలకు వెళ్ళి అక్కడ ఆనందం పొంది, అది పోయాక, మళ్ళీ వెనక్కి వచ్చి, మళ్ళీ కర్మచేసి మళ్ళీ వెళతాడు. ఆనందం పొందుతూ ఉంటాడు, పోగొట్టుకుంటూ ఉంటాడు. కర్మ, ఫలం, జన్మ పొందుతాడు, మళ్ళీ కర్మ, ఫలం, జన్మ పొందుతాడు.

**ఏవం త్రయీధర్మమనుప్రపన్నా** – ఈ విధంగా వేదాలలో చెప్పిన కర్మలనుచేసే ఈ భక్తులు ఎటువంటి భావనతో చేస్తారు?

**కామకామాః** – కేవలం ఆనందంకోసం చేస్తారు. కామకామాః అంటే విషయకోరికలు. మొదటి కామ అంటే విషయవస్తువులు; రెండో కామా అంటే కోరికలు. విషయవస్తువులమీద కోరికలకోసం అన్ని రకాల పూజలను చేస్తారు. ఆ పూజలవల్ల పొందిన పుణ్యాన్ని అశాశ్వతమైన ఆనందం పొందటానికి ఉపయోగిస్తారు. అందువల్ల వారి పరిస్థితి ఏమిటి?

**గతాగతం లభంతే** – గతం ఆగతం చ; గతం అంటే స్వర్గలోకగమనం, ఆగతం అంటే భూలోక ఆగమనం. మళ్ళీ స్వర్గలోకం వెళ్ళటం, మళ్ళీ భూలోకానికి తిరిగి రావటం. మధ్యలో నరకలోకానికి వెళ్ళటం.

మధ్యమధ్యలో భూలోకానికి రావాలి. ఎందుకంటే ఉన్న పధ్నాలుగు లోకాల్లోనూ 13 లోకాలూ భోగభూములే.

ఆ లోకాలలో కొత్తగా పుణ్యకర్మ కాని, పాపకర్మ కాని సంపాదించుకోలేరు. ఊర్ధ్వలోకాలలో పుణ్యం, అధోలోకాలలో పాపం క్షయమవుతాయి. కొత్తగా పుణ్యమో, పాపమో సంపాదించుకోవటానికి భూలోకానికే రావాలి. దీన్ని సంసారి జీవితచరిత్ర అంటారు.

శ్లో. 22 **అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥**
అనన్యాః, చింతయంతః, మామ్, యే, జనాః, పర్యుపాసతే,
తేషామ్, నిత్యాభియుక్తానామ్, యోగక్షేమమ్, వహామి, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యే, అనన్యాః | = అనన్య భక్తులైన | నిత్యాభి యుక్తానామ్ | = నిరంతరము నన్నే చింతించునట్టి |
| జనాః | = ఏ పురుషులు | తేషామ్ | = ఆ పురుషుల |
| మామ్ | = పరమేశ్వరుడనైన నన్ను | యోగక్షేమమ్ | = యోగక్షేమములను |
| చింతయంతః | = నిరంతరము చింతించుచు ఉండుదురో | అహమ్ | = నేనే స్వయముగా |
| పర్యుపాసతే | = నిష్కామభావముతో సేవింతురో | వహామి | = వహింతును |

**అనన్యాః చిన్తయన్తః యే జనాః మామ్ పర్యుపాసతే, తేషామ్**
**నిత్య–అభియుక్తానామ్ యోగ–క్షేమమ్ అహమ్ వహామి ।**

తా: అనన్య భక్తులైన ఏ పురుషులు పరమేశ్వరుడనైన నన్ను నిరంతరము చింతించుచు ఉండుదురో, నిష్కామభావముతో సేవింతురో, నిరంతరము నన్నే చింతించునట్టి ఆ పురుషుల యోగక్షేమములను నేనే స్వయముగా వహింతును.

బి) **నిష్కామభక్తి** – ఇంతకు ముందు రెండు శ్లోకాలలోనూ మందభక్తులు అంటే సకామభక్తుల గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. అంటే వారికి భగవంతుడు లక్ష్యం కాదు, మార్గం. ఇప్పుడు నిష్కామభక్తుల గురించి అంటే మధ్యమభక్తుల గురించి చెప్పబోతున్నాడు. వీరికి భగవంతుడు మార్గం కాదు, లక్ష్యం.

మార్గంమీద ప్రేమకన్నా, లక్ష్యంమీద ప్రేమ ఖచ్చితంగా ఎక్కువగానే ఉంటుంది. మీరు ఒక ఇల్లు కట్టించాలనుకుంటే, కాంట్రాక్టరుతో లావాదేవీలన్నీ నడుపుతారు కాని మీ ఆలోచనలన్నీ ఇంటిమీద ఉంటాయి. కాంట్రాక్టరు మీకు మార్గం, ఇల్లు మీ లక్ష్యం. మీరు లక్ష్యాన్ని ప్రేమిస్తారు కాని, మార్గాన్ని ప్రేమించరు. అంటే ఆ ఆలోచనలన్నీ ఇంటి చుట్టూనే ఉంటాయి. అతనితో వ్యవహారాలు నడుపుతారు కాని, అన్నీ ఇంటి గురించే ఉంటాయి.

అదే విధంగా మధ్యమ భక్తుడు ప్రపంచంతో వ్యవహారాలు నడుపుతాడు కాని అతని అంతిమలక్ష్యం భగవంతుడే. పురాణపరిభాషలో భగవంతుడు అంటే, వేదాంతపరిభాషలో మోక్షం అంటారు. దీన్ని తీవ్రముముక్షుత్వం అంటారు. ఇటువంటి భక్తుణ్ణి జిజ్ఞాసుభక్తుడన్నాడు కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలో.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి మనం. ఈ సకామ భక్తుడు, నిష్కామభక్తుడు కూడా అజ్ఞాని భక్తులలోకి వస్తారు. జ్ఞాని లేడు వీరిలో. జ్ఞానికి ఏ కోరికా ఉండదు. అతనికి మోక్షంమీద కూడా కోరిక ఉండదు, ఎందుకంటే అతనికి మోక్షం సిద్ధవస్తువు; సాధ్యవస్తువు కాదు. మోక్షమే పొందినప్పుడు, పరిమితి ఉన్న ధర్మార్థ కామాలమీద అతనికి శ్రద్ధ ఉండదు. అందువల్ల వీరిలోకి జ్ఞాని రాడు.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥** – 3.18

జ్ఞానీ భక్తుడు కోరికలు కోరడు.

ఇప్పుడు మనం నిష్కామభక్తుని గురించి చూస్తున్నాము అంటే అజ్ఞాని అయిన నిష్కామభక్తుని గురించి చూస్తున్నాము. నిష్కామభక్తిలో కూడా కోరిక ఉంటుంది. అలా అయితే అది నిష్కామభక్తి ఎలా అవుతుంది? నిష్కామభక్తిలో భగవంతునిమీద తప్ప వేరే దేనిమీదా కోరిక ఉండదు.

**నాస్తా ధర్మే న వసునిచయే నైవ కామోపభోగే యద్యద్భవ్యం భవతు**
**భగవన్పూర్వకర్మానురూపమ్ ఏతత్ప్రార్థ్యం మమబహుమతం**
**జన్మజన్మాంతరేఽపి త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు** – కులశేఖర ఆళ్వార్ –
ముకుందమాల – 5

నాకు ధర్మ, అర్థ, కామాలమీద కోరికలేదు. నా కర్మఫలంగా నాకు డబ్బు వచ్చినా రాకపోయినా ఫర్వాలేదు. నేను మాత్రం నిన్ను కోరేదేదైనా ఉంటే, అది నిన్నే.

నిష్కామభక్తిలో తక్కిన లక్ష్యాలను నిర్లక్ష్యం చెయ్యరు. ఉదాహరణకు మీరు ఢిల్లీ వెళ్ళాలంటే మీరు చెన్నైలో ఉంటే సెంట్రల్ స్టేషన్‌కి వెళతారు కాని, ఎగ్మూర్ వెళ్ళరు; టికెట్టు ఢిల్లీకి కొంటారు; సరియైన ప్లాట్‌ఫారమ్‌కే వెళతారు, సరియైన రైలే ఎక్కుతారు, మధ్య స్టేషన్లలో దిగినా, ఏదైనా కొనుక్కుంటున్నా, దృష్టి మీరు వెళ్ళే రైలు మీదే ఉంటుంది. అంటే దోవలో ఎన్ని పనులు చేస్తున్నా మీ అంతిమ లక్ష్యాన్ని మాత్రం మర్చిపోరు.

అలాగే ఎన్నో ఏళ్ళ ప్రయత్నం తర్వాత మీ అమ్మాయి పెళ్ళి కుదిరితే, వేరే పనులు మానరు కాని, అమ్మాయి పెళ్ళి విషయం మాత్రం మర్చిపోరు. అటువంటిదాన్ని అనన్యభక్తి అంటారు. అందువల్ల భగవంతునిమీద అనన్యభక్తి పెంచుకోమంటే, కుటుంబాన్ని నిర్లక్ష్యం చెయ్యమని కాదు అర్థం. సంసార భాద్యతలను సక్రమంగా నిర్వర్తించాలి, కాని జీవితలక్ష్యంగా పరమాత్మనే ఎంచుకోవాలి.

**అనన్యాః** – వేరే లక్ష్యం గురించి ఆలోచించకుండా;

**జనాః మాం పర్యుపాసతే** – జనాః అంటే నిష్కామభక్తులు లేదా మధ్యమభక్తులు లేదా జిజ్ఞాసుభక్తులు. నన్నే పూజిస్తారు.

అయితే యోగ, క్షేమాల విషయం ఏమిటి? యోగం అంటే **అప్రాప్తస్య ప్రాప్తిః** – లేనిదాన్ని పొందటం. అంటే కూడు, గుడ్డ, నివాసంలాంటివి పొందటం. క్షేమం అంటే **ప్రాప్తస్య రక్షణం** – పొందినదాన్ని రక్షించుకోవటం. మన జీవితంలో మనం చేస్తున్న పనులను వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ రెండే చేస్తూ ఉంటాము. లేనిదాన్ని పొందటానికి తాపత్రయం; పొందినదాన్ని నిలువుకునే తపన. ఉపనిషత్తులు, భగవద్గీతల గురించి ఆలోచించే తీరికే లేదు.

**దిన యామిన్యౌ సాయం ప్రాతః శిశిరవసంతౌ పునరాయాతః**
**కాలః క్రీడతి గచ్ఛత్యాయుః తదపి న ముంచత్యాశావాయుః** – భజగోవిందం 12

మనం అంతకంతకూ యమధర్మరాజుకు దగ్గర అవుతున్నాము. యోగక్షేమాల గురించి కొంతమేరకు పట్టించుకోవాలి నిజమే కాని మనుష్యులు శాశ్వతమైన రక్షణనివ్వలేరు. అందువల్ల మనం తీసుకోగలిగిన జాగ్రత్తలు తీసుకుని, మిగతా భారం దైవంమీద వెయ్యాలి. భగవంతుడు చూస్తాడు అంటే మనం బాధ్యతారహితంగా ప్రవర్తించాలని కాదు అర్థం, మన పరిధిలో ఉన్నంతవరకూ మనం చేసి, తక్కినది భగవంతునిమీద వెయ్యాలి. అలా చెయ్యటం వల్ల కలిగే లాభం ఏమిటి? భగవద్గీతబోధ వినటానికి మనకు కొంచెం ఖాళీ సమయం దొరుకుతుంది. ఒకవేళ యోగక్షేమాలు చక్కగా ఉన్నా కూడా అవి శాశ్వతం కాదు. మనం కూడా శాశ్వతం కాదు. అందువల్ల మన ధర్మం మనం నిర్వర్తించి, తక్కినది భగవంతునికి వదిలేయాలి.

భగవంతుడు ఖచ్చితంగా చూస్తాడా? ఇది ఒక శంక మనకు. ఎవర్నీ నమ్మలేని మనస్తత్వం. మనుష్యులు ఎలాగైతే అవసరమైన సమయంలో ఆదుకోకుండా పారిపోతారో, అలా భగవంతుడు కూడా చేస్తాడా? భగవంతుడు హామీపత్రం ఇస్తున్నాడు. ఎవరిమీదనైనా మీరు ఆధారపడాలనుకుంటే, నామీదే ఆధారపడండి అంటున్నాడు.

**యోగక్షేమం వహామ్యహమ్** – మీ యోగక్షేమాలను నేనే చూసుకుంటాను. చెన్నైలో పెద్ద ఎల్.ఐ.సీ. బిల్డింగ్ ఉండేది. ఒకసారి అదే కాలిపోయింది. భగవంతుడు మనకు పెద్ద ఎల్.ఐ.సీ. ఆయనే మన యోగక్షేమాలు చూసుకుంటానంటున్నాడు. కాని ఒక షరతు విధిస్తున్నాడు.

**తేషాం నిత్యాభియుక్తానామ్** – నన్నే నిరంతరం జపించేవారిని చూసుకుంటాను అంటున్నాడు. వారి లక్ష్యం భగవంతుడే అయివుండాలి. అభియుక్తః అంటే తపన ఉన్నవారు. తీవ్రముముక్షుత్వం ఉన్నవారు. ఇది చాలా అద్భుతమైన శ్లోకం. ప్రతివారికి అంతో ఇంతో అభద్రతాభావన ఉంటుంది. దాన్ని పోగొడుతున్నాడు కృష్ణపరమాత్మ.

నిజానికి గృహస్థుకు భద్రతా భావన ఉండాలి. అతనికి కుటుంబం, ఆస్తి, ఇల్లు అన్నీ ఉంటాయి. సన్యాసికి అభద్రతా భావం ఉండాలి, అవేవీ ఉండవు కాబట్టి. కాని అన్నీ ఉండి గృహస్థు అభద్రతా భావనకు లోనవుతాడు. ఇదంతా మనస్సుమీద ఆధారపడుతుంది. పిల్లలు ఉంటే మనకు రక్షణ ఉంటుందని ఆశిస్తాము. కాని వారు ఎదుగుతున్న కొద్దీ వారి రక్షణ గురించి కూడా మనమే ఆందోళన చెందుతాము. వారు మనకు రక్షణో, మనం వారికి రక్షణో అర్థం కాదు. ఇద్దరు బిచ్చగాళ్ళు ఒకరిమీద ఒకరు ఆధారపడలేరు. అందువల్ల అందరికీ భద్రతనిచ్చేది ఆ భగవంతుడే. ఎన్నాళ్ళు భద్రతనిస్తాడు? మూడు నెలలా, ఆరు నెలలా? జీవితకాలం ఇస్తాడు.

శ్లో. 23 **యేఽ ప్యన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।**
**తేఽ పి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ ॥**
యే, అపి, అన్యదేవతాః, భక్తాః, యజంతే, శ్రద్ధయా, అన్వితాః,
తే, అపి, మామ్, ఏవ, కౌంతేయ, యజంతి, అవిధిపూర్వకమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | యజంతే | = పూజింతురో |
| అపి | = అయినప్పటికిని | తే, అపి | = వారు కూడ |
| యే | = ఏ | మామ్, ఏవ | = నన్నే |
| భక్తాః | = సకామభక్తులు | యజంతి | = పూజించుచున్నారు కాని, వారి పూజలు |
| శ్రద్ధయాన్వితాః | = శ్రద్ధతో | | |
| అన్యదేవతాః | = ఇతర దేవతలను | అవిధిపూర్వకమ్ | = సత్యాన్ని గ్రహించనివి |

**అపి యే అన్య-దేవతా-భక్తాః శ్రద్ధయా అన్వితాః**
**యజన్తే, తే అపి హే కౌన్తేయ! అవిధి-పూర్వకమ్ మామ్ ఏవ యజన్తి ।**

తా: ఓ కుంతీసుతా! అయినప్పటికిని ఏ సకామభక్తులు శ్రద్ధతో ఇతర దేవతలను పూజింతురో వారు కూడ నన్నే పూజించుచున్నారు కాని, వారి పూజలు సత్యాన్ని గ్రహించనివి.

నిష్కామభక్తి గురించి కృష్ణపరమాత్మ పరోక్షంగా చెపుతున్నాడు. ఈ విషయం ఇంతకు ముందు కూడా చూశాము మనం. ఇక్కడ అంటే భగవద్గీతలో కృష్ణపరమాత్మ పారమార్థిక బ్రహ్మకు ప్రతీక. అంటే నిర్గుణ బ్రహ్మకు ప్రతీక. మనం కొలిచే తక్కిన దేవుళ్ళందరూ సగుణబ్రహ్మకు ప్రతీకలు. లక్ష్మీదేవిని సంపదకు, సరస్వతీ దేవిని విద్యకు కొలుస్తాము. అలా తక్కిన దేవతలకు నామరూపాలతో పాటు పరిమితులు కూడా ఉన్నాయి. కృష్ణపరమాత్మకు కూడా నామ, రూపాలు ఉన్నా కూడా, ఈ సందర్భంలో ఆయనను నిర్గుణపరబ్రహ్మకు ప్రతీకగా చూస్తాము.

ఏడవ అధ్యాయంలో కూడా ఈ విషయం చూశాము, అక్కడ చెక్కుబుక్ ఉదాహరణ చూశాము. చెక్కుబుక్‌లో ఏ కాగితం గొప్పది అని అడిగితే, ఏమీ రాయనంతవరకూ అన్నీ సమానమే. అందులో ఒకదానిలో వంద రూపాయలు, ఇంకోదానిలో లక్షరూపాయలు రాస్తే, ఖచ్చితంగా లక్ష రూపాయలు రాసివున్న కాగితానికే విలువ ఎక్కువ. అలాగే రాముడు, కృష్ణుడు, దేవి – అందరు దేవుళ్ళకూ సగుణరూపం ఉంటుంది. ఏ దేవుని రూపంమీద సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మను ఆవాహన చేస్తామో, ఆ రూపం గొప్పది. అందువల్ల భగవద్గీతలో కృష్ణపరమాత్మ పూర్ణం బ్రహ్మ.

అందువల్ల కృష్ణపరమాత్మ చెపుతున్నాడు, తక్కిన సగుణ బ్రహ్మలను పూజించేకన్నా, నన్ను పూజించండి. ఎందుకంటే అందరు దేవతలూ నాలోనే ఇమిడివున్నారు. అదెలా సాధ్యం? చిన్న తర్కం ఉపయోగిస్తే తేలిగ్గా అర్థమవుతుంది. అనంతంలో అశాశ్వతమైనవన్నీ వస్తాయి. దీనికి మూడు కారణాలు చూస్తాము.

1. మీరు ఏ దేవతకు పూజ చేసినా కూడా అది కృష్ణపరమాత్మకే చెందుతుంది. ఎందుకు? ఇక్కడ కృష్ణపరమాత్మను అనంతం బ్రహ్మగా చూస్తున్నాము కాబట్టి. అదే శివపురాణం చదివితే, ఏ దేవతకు పూజ చేసినా అది శివునికే చెందుతుంది; దేవీపురాణంలో ఏ దేవతకు పూజ చేసినా అది దేవికే చెందుతుంది.
2. ఏ దేవతకు పూజ చేసినా, పూజాఫలం కృష్ణపరమాత్మనుంచే వస్తుంది. ఏ దేవతకు పూజ చేసినా అది కృష్ణపరమాత్మకే చెందుతుంది కాబట్టి, ఫలం కూడా ఆయననుంచే వస్తుంది. కాకపోతే, ఏ దేవతకు పూజ చేస్తే ఆ దేవతద్వారా వస్తుంది.
3. వేరే దేవతల పూజ సకామభక్తి కిందకు వస్తుంది. వేరే దేవతలకు పూజ చేస్తే, అశాశ్వతఫలమే వస్తుంది. ఆ దేవతలకు శక్తి పరిమితం కాబట్టి, ఆ దేవతలు కూడా వారి శక్తి మేరకే ఫలాన్ని ఇస్తారు. కంటిడాక్టరు దగ్గరకు వెళ్ళి పన్ను చూడమంటే, నాకు తెలియదు, ఇంకొక డాక్టరు దగ్గరకు వెళ్ళమంటాడు. అలా దేవతలు కూడా వారి శక్తులను పంచుకున్నారు. సరస్వతీదేవి విద్యాధనం ఇస్తే, లక్ష్మీదేవి ఐశ్వర్యం ఇస్తుంది. అందువల్ల ఈ దేవతలకు చేసే పూజ సకామభక్తి కిందకు వస్తుంది. శాశ్వతఫలం కావాలంటే ఏం చెయ్యాలి? ఇందాక చూచినట్టు భగవద్గీతలో కృష్ణపరమాత్మ నిర్గుణబ్రహ్మకు సంకేతం కాబట్టి, శాశ్వతఫలం కావాలంటే కృష్ణపరమాత్మకు పూజ చెయ్యాలి.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. మనం తక్కిన దేవతలను చిన్నచూపు చూడటం లేదు. ఇప్పుడు మీరు శివానందలహరి చదివితే, శంకరాచార్యులు అక్కడ శివుడు నిర్గుణబ్రహ్మ అంటారు. తక్కిన దేవతలంతా వడ్లగింజలమీద ఉన్న పొట్టులా తేలిపోతారు అంటారు. అందువల్ల అక్కడ శివభక్తి నిష్కామభక్తి అవుతుంది; తక్కిన దేవతల భక్తి సకామభక్తి అవుతుంది. ఈ శ్లోకం చదివేటప్పుడు ఈ సూత్రాలను గుర్తుంచుకుంటే, తేలిగ్గా అర్థమవుతుంది.

**యే అపి అన్యదేవతా భక్తాః** – కొంతమంది భక్తులు నన్ను కాకుండా, తక్కిన దేవతలను కొలుస్తున్నారు. ఎలా కొలుస్తున్నారు?

**శ్రద్ధయాన్వితాః యజంతే** – చాలా శ్రద్ధగా కొలుస్తున్నారు. వారు ఎవరిని కొలిచినా, చివరికి నవగ్రహాలలో శనిగ్రహాన్ని కొలిచినా అది కృష్ణపరమాత్మకే చెందుతుంది.

**కౌంతేయ తేఽపి మామేవ యజంతి** – ఓ అర్జునా, వారు నన్నే కొలుస్తున్నారు. ఇంతకుముందు కూడా చూశాము. నదులన్నీ ఎక్కడ పుట్టినా, చివరకి సాగరంలోనే కలుస్తాయి; అలాగే అందరు దేవుళ్ళకు పెట్టిన నమస్కారాలన్నీ కేశవునికే వెళతాయి అని ఒక కృష్ణభక్తుడు అన్నాడు. అదే శివభక్తుడు రాసుంటే అన్నీ శివునికే వెళతాయని ఉండేవాడు. అలా ఏ దేవుణ్ణి కొలిచినా నాకే చెందుతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని సమస్య ఏమిటి?

**అవిధిపూర్వకమ్** – కాని వారికి ఈ నిజం తెలియదు. ఈ సందర్భంలో అవిధి అంటే అజ్ఞానం. వారికి తక్కిన దేవతలంతా నాలోనే ఇమిడి ఉన్నారనే సత్యం తెలియదు. వారు అజ్ఞానంలో ఉన్నారు. నన్ను పూజిస్తే తక్కిన దేవతలందరినీ పూజించినట్టు అని వారికి తెలియదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 24 **అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।**
**న తు మామభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే ॥**
అహమ్, హి, సర్వయజ్ఞానామ్, భోక్తా, చ, ప్రభుః, ఏవ, చ,
న, తు, మామ్, అభిజానంతి, తత్త్వేన, అతః, చ్యవంతి, తే ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | తే | = వారు |
| సర్వయజ్ఞానామ్ | = సకలయజ్ఞములకును | మామ్ | = పరమేశ్వరుడనైన నన్ను |
| భోక్తా | = భోక్తను | తత్త్వేన | = నా స్వరూపదృష్టితో |
| చ | = ఇంకా | న, అభిజానంతి | = తెలుసుకోలేకున్నారు |
| ప్రభుః, చ | = స్వామిని | అతః | = అందువలన |
| అహమ్, ఏవ | = నేనే | చ్యవంతి | = పతనమగుదురు అంటే పునర్జన్మను పొందుదురు |
| తు | = కాని | | |

**అహమ్, హి సర్వ–యజ్ఞానామ్ భోక్తా చ ప్రభుః ఏవ చ (అస్మి),**
**మామ్ తు తత్త్వేన న అభిజానన్తి, అతః తే చ్యవన్తి ।**

తా: ఎందుకంటే సకలయజ్ఞములకును భోక్తను ఇంకా స్వామిని నేనే. కాని వారు పరమేశ్వరుడనైన నన్ను నా స్వరూపదృష్టితో తెలుసుకోలేకున్నారు. అందువలన పతనమగుదురు అంటే పునర్జన్మను పొందుదురు.

ఇదే భావన ఇంకా కొనసాగుతున్నది.

**అహం సర్వయజ్ఞానాం భోక్తా** – ఏ దేవతకు ఏ పూజ చేసినా నేనే అందుకుంటాను. భోక్తా అంటే అందుకునే వ్యక్తి. మనం ఎవరికో డబ్బు పంపాలంటే పోస్టాఫీసులో డబ్బు ఇస్తాము. అది చేరాల్సిన వ్యక్తికి చేరుతుంది. అలా తక్కిన దేవతలకు చేసిన పూజలు, చేరాల్సిన కృష్ణపరమాత్మకు చేరుతాయి.

**ప్రభురేవ చ** – వారి కోరికలు తీర్చే శక్తి కూడా నాకు ఉంది. ఎవరికి పూజ చేసినా కృష్ణపరమాత్మకే చెందుతుంది, మళ్ళీ పూజాఫలం కూడా కృష్ణపరమాత్మనుంచే వస్తుంది కాని ఆ దేవతద్వారా వస్తుందని ఇంతకుముందు చూశాము కదా.

**న తు మామభిజానంతి** – కాని వారికి నా గురించి సరిగ్గా తెలియదు.

**(మాం) తత్త్వేన** – నా స్వరూపం తెలియదు. ఇంతకు ముందు శ్లోకంలో ఉన్న అవిధిపూర్వకమ్ పదాన్ని ఇక్కడ వివరిస్తున్నాడు. అవిధి అంటే అజ్ఞానం అని చూశాము. ఇక్కడ అది చెపుతున్నాడు. నా అసలు స్వరూపం వాళ్ళకు తెలియదు అంటున్నాడు. నా అసలు స్వరూపం తెలియదని చెప్పటంద్వారా, తనకు రెండు స్వరూపాలు ఉన్నాయని చెప్పకనే చెపుతున్నాడు. అవి సగుణ రూపం, నిర్గుణ రూపం.

సగుణరూపం అంటే కృష్ణునిగా అష్టమిరోజు అవతారం తీసుకున్న రూపం. దాన్ని మాయామానుషవేషం అంటారు. ఆ అవతారం ఎత్తినరోజు, స్వర్గారోహణ చేసిన రోజు ఉంటాయి. ఈ మాయామానుష వేషం సత్యం కాదని కృష్ణపరమాత్మే చెప్పాడు.

**అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్**
**పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్** – 9.11

నా మానవరూపం చూసి, మూఢులు నేను ఒక నామం, రూపం ఉన్న, పరిమితి ఉన్న దేవుణ్ణి అనుకుంటారు కాని నా అసలు రూపం వారికి తెలియదు.

అసలు రూపం నిర్గుణరూపం. సత్ చిత్ ఆనందస్వరూపం. మాం తత్త్వేన అంటే నా నిర్గుణస్వరూపం వారికి తెలియదు. నా పూర్ణస్వరూపం తెలియక, నా అపూర్ణస్వరూపాన్నే చూస్తారు. దానివల్ల ఏమవుతుంది?

వారు తక్కిన దేవతలను వదిలి, నన్ను కొలిచినా కూడా, అనంతంకోసం కోరరు. ఎందుకంటే వారికి నా పూర్ణత్వం గురించి తెలియదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఏమడుగుతారు? ఐదురూపాయలు ఇంక్రిమెంట్ కావాలి అని వరమడుగుతారు.

ఒకసారి ఒక పాలవర్తకుడు భగవంతునికోసం ఘోరతపస్సు చేశాడుట. భగవంతుడు ప్రత్యక్షమై 'భక్తా, నీ కోరిక ఏమిటి?' అని అడిగితే 'నాకు పాలు శాశ్వతంగా దొరికేచోటు చూపించు,' అన్నాడుట. భగవంతుడు 'తథాస్తు,' అని చెప్పాడుట. వెంటనే ఆ పాలవర్తకుని పక్కన ఒక పెద్దకొలను వెలిసిందట. అందులో స్వచ్ఛమైన, శుద్ధమైన పాలు ఉన్నాయట. పైగా భగవంతుడు ఇంకో అభయం కూడా ఇచ్చాడుట 'ఈ కొలను ఇలా ఎప్పుడూ నిండుగానే ఉంటుంది. నువ్వు ఎన్ని పాలు తీసినా ఇది తరగదు. అక్షయపాత్ర లాగా ఉంటుంది,' అని అంతర్ధానమయ్యాడట. మళ్ళీ వెంటనే ఆ భక్తుడు భగవంతుణ్ణి పిలిచాడుట. 'మళ్ళీ ఏమిటి నీ కోరిక?' అని అడిగితే, 'ఇంకో ముఖ్యమైన కోరిక కోరటం మర్చిపోయాను. ఇంత అమృతధారగా పాలు ఉంటే, నువ్వు ఇలా సమృద్ధిగా నీరు ఉన్న ఇంకొక కొలను కూడా ప్రసాదించాలి. అంత పాలు నేను అమ్మాలంటే, దానికి సరిపడా నీళ్ళు కూడా కావాలి,' అన్నాడుట.

ఇదీ మన పరిస్థితి – సాక్షాత్తూ భగవంతుడే ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోమంటే, అనంతత్త్వం కోరలేము. అనంతత్త్వం ఉచితంగా ఇస్తాను అని చెప్పినా కూడా మనం అశాశ్వతమైన, లౌకికవిషయాలు కోరుతాము. భగవంతుడు చెపుతాడుట, 'నా చేతులు నా రెండు జేబుల్లోనూ ఉన్నాయి, ఒకటి అనంతంలో, ఇంకొకటి అపూర్ణంలో. ఎవరేది అడిగితే అది ఇవ్వటానికి నేను సిద్ధంగా ఉన్నాను. కాని అందరూ నిరంతరం అపూర్ణాన్నే కోరుతున్నారు. పొరపాటున కూడా ఎవరూ మోక్షం పేరు ఎత్తటం లేదు.' అందువల్ల కృష్ణపరమాత్మ నిరాశ పడిపోతున్నాడు.

**చ్యవంతి తే** – వారు పతనమవుతున్నారు. నన్ను అనంతం గురించి కోరే అవకాశం ఉండికూడా, కేవలం వారి అజ్ఞానంవల్ల, కేవలం వారి అవివేకంవల్ల వారు అడగటం లేదు. అందువల్ల సంసారంలో పడిపోతున్నారు.

శ్లో. 25 **యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః ।**
**భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మామ్ ॥**
యాంతి, దేవవ్రతాః, దేవాన్, పితౄన్, యాంతి, పితృవ్రతాః,
భూతాని, యాంతి, భూతేజ్యాః, యాంతి, మద్యాజినః, అపి, మామ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| దేవవ్రతాః | = | దేవతలను పూజించువారు | భూతేజ్యాః | = | భూతప్రేతములను అర్చించువారు |
| దేవాన్ | = | దేవతలను | భూతాని | = | భూతప్రేతరూపములను |
| యాంతి | = | పొందుదురు | యాంతి | = | పొందుదురు |
| పితృవ్రతాః | = | పితరులను సేవించువారు | మద్యాజినః | = | నన్ను ఆరాధించు భక్తులు |
| పితౄన్ | = | పితృలోకములను | మామ్, అపి | = | నన్నే |
| యాంతి | = | పొందుదురు | యాంతి | = | పొందుదురు |

**దేవ–వ్రతాః దేవాన్ యాన్తి, పితృ–వ్రతాః పితౄన్ యాన్తి,**
**భూత–ఇజ్యాః భూతాని యాన్తి, మత్ యాజినః అపి మామ్ యాన్తి ।**

తా: దేవతలను పూజించువారు దేవతలను పొందుదురు. పితరులను సేవించువారు పితృలోకములను పొందుదురు. భూతప్రేతములను అర్చించువారు భూతప్రేతరూపములను పొందుదురు. నన్ను ఆరాధించు భక్తులు నన్నే పొందుదురు.

సరే మనుష్యులు అజ్ఞానులు, అవివేకులు. వారికి మోక్షం గురించి అడగాలని తెలియదు. కాని భగవంతునికి మోక్షం శ్రేష్ఠమైనదని తెలుసు కదా. అలాంటప్పుడు **భగవంతుడే స్వయంగా మోక్షాన్ని ఇవ్వచ్చు కదా?** ఈ సందేహం కలుగుతుంది ఎవరికైనా. అలా కుదరదు. దానికి రెండు కారణాలున్నాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

1. **మనిషికున్న ఫ్రీవిల్:** మనిషికీ, జంతువులకూ సమానంగా కొన్ని లక్షణాలున్నా మనిషి బుద్ధిజీవి. అందువల్ల జంతువులకన్నా శ్రేష్ఠం. జంతువులు బుద్ధిని ఉపయోగించలేవు. అవి లక్ష్యాలను ఎంచుకోలేవు. వాటిని కొన్నిపనులు చేసుకునేలా వాటిని సృష్టించాడు భగవంతుడు. ఉదాహరణకు కుక్కలు రోడ్డుమీద హడావుడిగా పరుగెడుతుంటాయి. వాటిని ఆపి మీరు ఎక్కడికెళుతున్నావని ఇంటర్వ్యూ చేస్తే వాటికేమీ గమ్యం ఉండదు. క్షణం ఖాళీ లేదు, దమ్మిడీ ఆదాయం లేదు అని సామెత. కుక్కలు అంతే. వాటికి క్షణం ఖాళీ లేదు.

కాని మనిషికి తనకు కావాల్సిందేమిటో ఎన్నుకునే ఫ్రీవిల్‌ని కూడా ఇచ్చాడు భగవంతుడు. భగవంతుడు ఏ లక్ష్యాలున్నాయో చెప్పగలడు కాని ఇలాగే చేయి అని నిర్దేశించడు. ఏ లక్ష్యం కావాలంటే ఏ మార్గంలో వెళ్ళాలో కూడా చెపుతాడు. కాని మనమేం చేస్తున్నాము? అంత గొప్పపుట్టుకతో పుట్టినా కూడా దాన్ని వినియోగించుకోవటం లేదు అంటే దాని అర్థం ఏమిటి? మనం ఒక ప్రకటన చేస్తున్నాము. ఏమిటది? 'ఓ దేవా, నేను పొరపాటున మనిషిజన్మకు వచ్చాను, నన్ను దయచేసి మళ్ళీ జంతుజన్మలోకి పంపించేయి.'

అందువల్ల మోక్షం కావాలా, వద్దా తేల్చుకోవాల్సింది మనం. పాపం భగవంతుడు నిస్సహాయంగా చూస్తాడు. మనం కోరితే, సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు. అంతేకాని మనమీద బలవంతంగా రుద్దడు.

2. **అయాచితంగా ఇస్తే, తిరస్కరిస్తాము:** ఒకవేళ భగవంతుడు మనకు బలవంతంగా ఇస్తే మనం తీసుకోము, తిప్పికొడతాము. ఇచ్చి పుచ్చుకోవాలంటే ఇద్దరు వ్యక్తులు ఉండాలి. ఇచ్చే వ్యక్తి ఉండాలి, తీసుకునే వ్యక్తి ఉండాలి. ఎవరైనా భగవద్గీతబోధ చేస్తామంటే వినే వ్యక్తులు ఒకళ్ళిద్దరైనా ఉండాలి. లేకపోతే చెప్పటానికి సిద్ధపడ్డ వ్యక్తి గోడలకు చెప్పుకోవాలి. భగవంతుడు మోక్షం ఇస్తానన్నాకూడా అది ఎవరికి కావాలి? ముందు మాకు నీళ్ళ సమస్య అధికంగా ఉంది, ముందు అది తీర్చు, తర్వాతెప్పుడైనా మోక్షం సంగతి చూసుకుందాం అనే ప్రమాదం ఉంది.

అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, మీకేం కావాలో మీరు ఎన్నుకుంటే దానిని తీర్చటానికి నేను సిద్ధంగా ఉన్నాను.

**దేవవ్రతాః దేవాన్ యాంతి** – దేవతలను పూజించేవారు, దేవలోకాలను చేరుకుంటారు. లేదా దానికి తగ్గ ఫలం పొందుతారు. ఉదాహరణకు లక్ష్మీదేవిని పూజించేవారు ఐశ్వర్యాన్ని పొందుతారు. అందువల్ల వ్యాపారం చేసేవారు, వారి బల్లమీద లక్ష్మీదేవి ఫోటో పెట్టుకుంటారు. అది కూడా ఎలాంటి ఫోటో? లక్ష్మీదేవి చేతిలో గిన్నె నిండా బంగారునాణేలు ఉంటాయి; అవి కూడా ఎలా? గిన్నె కొంచెం కిందికి వంగి, బంగారునాణేలు జలజలా రాసులలా కిందకి జారేలా ఉండాలి ఆ ఫోటోలో. అంటే ఆ రాసులు అలాగే వచ్చి అతని బల్లమీద రాలిపోవాలి. అలా ఏ దేవతకు పూజచేస్తే ఆ దేవతకు సంబంధించిన ఫలం పొందుతారు.

**పితృవ్రతాః పితౄన్ యాంతి** – పితృదేవతలకు పూజలు చేసేవారు పితృలోకాలకు వెళ్ళి అక్కడ సుఖాలను పొందుతారు.

**తం యథాయథా ఉపాస్తే, తదేవ భవతి** – ఉపనిషత్తు

ఏ దేవతను ఉపాసనచేస్తే ఆ దేవత అవుతారు. యద్భావం తద్భవతి అని కూడా అంటారు. ఏది కోరితే, అది పొందుతారు.

**భూతేజ్యాః భూతాని యాంతి** – భూతప్రేతపిశాచాలను పూజించినవారు అటువంటి రూపాలే పొందుతారు. కొంతమంది భూతవైద్యులు స్మశానాలకు వెళ్ళి పూజలు చేస్తారు.

**మద్యాజినః మాం యాంతి** – నన్ను పూజించేవారు నన్నే పొందుతారు. నన్ను అంటే సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మను. అంటే పూర్ణత్వం పొందుతారు. అంటే మోక్షం పొందుతారు.

శ్లో. 26 **పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ॥**
పత్రమ్, పుష్పమ్, ఫలమ్, తోయమ్, యః, మే, భక్త్యా, ప్రయచ్ఛతి,
తత్, అహమ్, భక్త్యుపహృతమ్, అశ్నామి, ప్రయతాత్మనః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | ప్రయచ్ఛతి | = సమర్పించుచున్నాడో |
| మే | = నాకు | ప్రయతాత్మనః | = నిర్మలబుద్ధి, నిష్కామభావముగల ఆ భక్తునిచే |
| భక్త్యా | = భక్తితో | | |
| పత్రమ్ | = పత్రమును గాని | భక్త్యుపహృతమ్ | = భక్తిపూర్వకముగా ఇవ్వబడిన |
| పుష్పమ్ | = పుష్పమును గాని | తత్ | = ఆ పత్ర, పుష్పాదులను |
| ఫలమ్ | = ఫలమును గాని | అహమ్ | = నేను |
| తోయమ్ | = జలమును గాని | అశ్నామి | = ప్రీతితో ఆరగింతును |

**యః పత్రమ్ పుష్పమ్ ఫలమ్ తోయమ్ భక్త్యా మే ప్రయచ్ఛతి,**

**(తస్య) ప్రయత–ఆత్మనః భక్తి–ఉపహృతమ్ తత్ అహమ్ అశ్నామి ।**

తా: ఏ పురుషుడు నాకు భక్తితో పత్రమును గాని, పుష్పమును గాని, ఫలమును గాని, జలమును గాని సమర్పించుచున్నాడో, నిర్మలబుద్ధి, నిష్కామభావముగల ఆ భక్తునిచే భక్తిపూర్వకముగా ఇవ్వబడిన ఆ పత్ర, పుష్పాదులను నేను ప్రీతితో ఆరగింతును.

మన శాస్త్రంలో సకామభక్తి, నిష్కామభక్తి – రెండింటి గురించీ ప్రస్తావన వస్తుంది. ఉదాహరణకు సంధ్యావందనం నిష్కామపూజ. అది చిత్తశుద్ధి, గురుప్రాప్తి, జ్ఞానప్రాప్తి, మోక్షప్రాప్తికోసం చేసేది. అదే పుత్రకామేష్టియాగం చేస్తే ఏ ఫలం పొందుతారు? పేరులోనే ఉంది – పుత్రులను పొందుతారు.

ఇలా రెండు రకాల పూజలూ ఉన్నాయి. మనకు ఉన్న కోరికనుబట్టి, దానికి సంబంధించిన పూజను ఎన్నుకుంటాము. సకామపూజ అయితే దానికి అనేక నియమనిబంధనలు ఉంటాయి. మనం ఎన్నుకున్న పూజ ఎప్పుడు చెయ్యాలి, ఎక్కడ చెయ్యాలి, ఎలా చెయ్యాలి, ఏ దేవతకు పూజ చెయ్యాలి, ఏ నైవేద్యం పెట్టాలి, ఏ రంగు దుస్తులు వేసుకోవాలి, ఎంతమంది ఋత్విక్కులు ఉండాలి, వారికి ఎంత దక్షిణ ఇవ్వాలి – ఇలా అనేక ఆంక్షలు ఉంటాయి. నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను, నా ఇష్టం వచ్చినంత ఇస్తానంటే కుదరదు. పైగా ఏదైనా నియమాన్ని ఉల్లంఘిస్తే, వెంటనే దానికి తగ్గ ప్రాయశ్చిత్తం చెయ్యాలి. ఒక్కొక్క ప్రాయశ్చిత్తానికి ఉన్న ఆస్తినంతా ఇచ్చివెయ్యాలి. ఎంత ఎక్కువ ఫలితాన్ని ఆశిస్తే, మనం అంత పెద్దకర్మను చెయ్యాల్సి ఉంటుంది. అంటే ప్రతి ఒక్క కర్మకూ దానికి తగ్గ ఫలం ఉంటుంది. ఎక్కువ దక్షిణ ఇస్తే ఎక్కువ ఫలం; ఎక్కువ మంత్రాలు చదివితే ఎక్కువ దక్షిణ ఇవ్వాలి.

దీన్ని బట్టి ప్రకృతిసూత్రం ఏమిటి? ఎక్కువ ఫలాన్ని ఆశిస్తే, పెద్దకర్మ చెయ్యాలి. అలాంటప్పుడు మోక్షం ఇంకా ఎక్కువ ఫలం కదా, దానికి ఇంకా పెద్దకర్మ చెయ్యాలా, ఇంకా ఎక్కువ దక్షిణ ఇవ్వాలా? ఇదీ మనకు కలిగే సందేహం. కాని కృష్ణపరమాత్మ ఏమంటున్నాడంటే, మీకు అత్యున్నత ఫలితం కావాలంటే దానికి చేసే పూజ అతి తేలిక.

సకామ భక్తిలోనే వంద ఆంక్షలు; నిష్కామభక్తిలో ఏ ఆంక్షలూ ఉండవు. మీరు ఎన్ని పొరపాట్లు అయినా చెయ్యవచ్చు. అలాగని కావాలని పొరపాట్లు చెయ్యకూడదు. ఉదాహరణకు మీరు విష్ణుసహస్రనామం ఒక ఫలితం ఆశించి పారాయణం చేసేటట్టయితే, అది ఎన్నిసార్లు, ఎలా పారాయణ చెయ్యాలో అలాగే చెయ్యాలి.

ఆ నియమాలను పాటించకపోతే సకామభక్తిలో ఆశించిన ఫలితాలు రాకపోగా, ఒక్కోసారి బెడిసికొట్టవచ్చు కూడా. అదే విష్ణుసహస్రనామాన్ని నిష్కామపూజగా చేస్తే అంటే చిత్తశుద్ధి, గురుప్రాప్తి, మోక్షప్రాప్తికోసం చేస్తే ఎన్ని పొరపాట్లు దొర్లినా ఫర్వాలేదు. నైవేద్యం పెట్టినా ఫర్వాలేదు. నైవేద్యం కుదరకపోతే ఒక పువ్వు పెట్టినా చాలు.

కాని దానికి నియమం ఏమిటి? మీ కోరిక లౌకికవిషయాల గురించి ఉండకూడదు. అది మోక్షం గురించి ఉండాలి.

**పత్రం పుష్పం ఫలం తోయం ప్రయచ్ఛతి** – ఒక నిష్కామభక్తుడు లేదా ముముక్షు భక్తుడు, భగవంతుణ్ణే లక్ష్యంగా పెట్టుకున్న భక్తుడు దేన్నైనా సమర్పించవచ్చు. పత్రం అంటే తులసి ఆకు లేదా బిల్వపత్రం; పుష్పం–ఏదైనా పువ్వు; ఫలం–ఏదైనా పండు; తోయం–కొంచెం నీరు. ఇవన్నీ కాదు, వీటిలో ఏదైనా భక్తుడు సమర్పించవచ్చు. కాని దానికి నియమం ఏమిటి?

**భక్త్యా (ప్రయచ్ఛతి)** – అతను నిష్కామభక్తుడై ఉండాలి. ఏడవ అధ్యాయంలో నాలుగు రకాల భక్తుల గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. వారు – ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు, జిజ్ఞాసుభక్తుడు, జ్ఞానీభక్తుడు. ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు సకామభక్తుల కిందకు వస్తారు. వారికి ఏవో కోరికలుంటాయి. ఇక్కడ జ్ఞానీభక్తుని గురించి మనం మాట్లాడటం లేదు. ఉన్న నలుగురిలో ముగ్గురిని తీసేస్తే, ఎవరు మిగిలారు? జిజ్ఞాసుభక్తుడు మిగిలాడు. దీన్ని పారిశేషన్యాయం అంటారు. ఈ జిజ్ఞాసుభక్తుడు అజ్ఞాని, సంసారి అయినా అతను మోక్షం కోరుతున్నాడు. అందువల్ల భక్త్యా ప్రయచ్ఛతి అంటే నిష్కామ భక్త్యా ప్రయచ్ఛతి అని కలుపుకోవాలి.

**ప్రయతాత్మనః** – అటువంటి భక్తునికి నిర్మలబుద్ధి ఉంటుంది. ఎందుకు? అతను లౌకికవిషయాలను కోరడు. రాగరహితంగా ఉంటాడు. నిష్కామత్వమే అతని నిర్మలత్వం. ప్రయత అంటే శుద్ధమైన; ఆత్మ అంటే ఇక్కడ మనస్సు. అందువల్ల ప్రయతాత్మనః అంటే శుద్ధమైన చిత్తం కలవాడు.

**అహమ్ అశ్నామి** – అతనికి నిష్కామభక్తి ఉంది కాబట్టి, నేను అతను ఏది ఇచ్చినా తీసుకుంటాను.

**భక్త్యుపహృతమ్** – ఎందుకంటే అతను భక్తిపూర్వకంగా దాన్ని సమర్పిస్తున్నాడు.

ఏడవ అధ్యాయంలో కూడా సకామభక్తికీ, నిష్కామభక్తికీ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూశాము. సకామభక్తిలో భగవంతుడు మార్గం, మన కోరికలు లక్ష్యం. లక్ష్యం చేరేవరకూ మాత్రమే మార్గాన్ని ప్రేమిస్తాము. లక్ష్యం చేరాక మార్గాన్ని వదిలేస్తాము. అంటే మార్గంమీద ప్రేమ అసలైన ప్రేమ కాదు. అవసరంకోసం చూపే ప్రేమ. ఒక బస్సు ఎక్కితే అది మనను మన గమ్యం చేర్చేవరకూ సరిగ్గా వెళ్ళాలని ప్రార్థిస్తాము. మనం దిగేశాక, అది ఏమైనా మనం బాధపడము.

కాని నిష్కామభక్తిలో అలా కాదు – లక్ష్యమే భగవంతుడు. భగవంతుని కోసమే పూజ చేస్తున్నాము. అదీ అసలైన భక్తి అంటే. అందువల్ల భక్త్యుపహృతమ్ అహమ్ అశ్నామి అంటున్నాడు. భక్తితో ఏది ఇచ్చినా స్వీకరిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? మనం ఇచ్చే పత్రం, పుష్పంలాంటివి చెంచాలాంటివి. చెంచాలో మనం

ప్రేమ నింపుతున్నాము. అందువల్ల ఆ చెంచా వెండి చెంచానా, బంగారం చెంచానా అనేది పట్టించుకోడు భగవంతుడు. ఆ పత్రం, పుష్పం అనే మాధ్యమంద్వారా మన ప్రేమను అందిస్తున్నాము. ఆ స్వచ్ఛమైన ప్రేమను గుర్తిస్తున్నాడు. అందువల్ల అది స్వీకరిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 27 **యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥**
యత్, కరోషి, యత్, అశ్నాసి, యత్, జుహోషి, దదాసి, యత్,
యత్, తపస్యసి, కౌంతేయ, తత్, కురుష్వ, మదర్పణమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | | |
| యత్ | = ఏ కర్మను | దదాసి | = దానము చేస్తావో |
| కరోషి | = ఆచరిస్తావో | యత్ | = దేనిని గురించి |
| యత్ | = ఏ పదార్థమును | తపస్యసి | = తపమొనరిస్తావో |
| ఆశ్నాసి | = తింటావో | తత్ | = ఆ కర్మలన్నింటినీ |
| యత్ | = ఏ హవ్యమును | మదర్పణమ్ | = నాకే |
| జుహోషి | = హోమకుండములో వేస్తావో | కురుష్వ | = అర్పించుము |
| యత్ | = దేనిని | | |

**హే కౌన్తేయ! యత్ కరోషి, యత్ అశ్నాసి, యత్ జుహోషి,**
**యత్ దదాసి, యత్ తపస్యసి, తత్ మత్ అర్పణమ్ కురుష్వ ।**

తా: ఓ కుంతీసుతా! ఏ కర్మను ఆచరిస్తావో, ఏ పదార్థమును తింటావో, ఏ హవ్యమును హోమకుండములో వేస్తావో, దేనిని దానము చేస్తావో, దేనిని గురించి తపమొనరిస్తావో ఆ కర్మలన్నింటినీ నాకే అర్పించుము.

ఒకవేళ ఎవరైనా నా దగ్గర పత్రం, పుష్పం, ఫలం, తోయం కూడా లేవు. నేను ఎక్కడో ఎడారిలో చిక్కుకు పోయాను అంటే, దానికి కూడా బెంగపడవద్దు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎక్కడున్నా మీరు అన్నం తింటారు కదా, నీళ్ళు తాగుతారు కదా, ఏదో ఒక పని చేస్తారు కదా. ఏది చేసినా నాకు అర్పించండి చాలు అంటున్నాడు.

**యత్కరోషి** – నువ్వు చేసే ఏ కర్మైనా సరే. ఆఫీసులో చేసే పని అయినా సరే, అది నాకు అర్పించు. అదే పూజ అయిపోతుంది.

**కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతి స్వభావాత్**
**కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి**

ఆఫీసులో ఉన్నా ఆ పనిని నాకు అర్పించు అని భగవంతుడే స్వయంగా చెప్పినా, మన శంక తీరదు. అయ్యో భగవంతుడు (ఫోటోలో) ఇంట్లో ఉన్నాడే, నేను ఆఫీసులో ఉన్నానే, ఎలా అర్పించను అనుకుంటాము. దేశపరిమితి మనకు వర్తిస్తుంది, భగవంతునికి వర్తించదు. మనం ఆఫీసులో ఉంటే, ఇంట్లో ఉండలేము. కాని భగవంతుడు

అలా కాదు; ఇంట్లో బయటా అంతటా ఉన్నాడు. భగవంతుడు సర్వవ్యాపకుడు. అందువల్ల భగవంతునికి అర్పించాలి.

**ఈశ్వర ప్రీత్యర్థమ్ సన్తు మయి సర్వాణి కర్మాణి సన్న్యస్య**

ఇది మన వైదికసంప్రదాయంయొక్క గొప్పతనం. మనం ఎక్కడైనా, ఎప్పుడైనా పూజ చెయ్యవచ్చు.

**యదశ్నాసి** – ఏం తిన్నా, అది భగవంతునికి అర్పించాలి. నాకు టైము లేదు, నేను పరుగులు పెట్టాలి. వండినవన్నీ పూజ గదిలోకి తీసుకువెళ్ళి నైవేద్యం పెట్టే తీరిక లేదు అన్నా పాపం భగవంతుడు ఏమీ అనుకోడు. అన్నీ మన కంచంలో పెట్టుకుని తినేముందు, గుటుక్కున మింగేయకుండా ఒక్క క్షణం శ్రద్ధగా కళ్ళు మూసుకుని భగవంతుణ్ణి ప్రార్థిస్తే చాలు.

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**

భగవంతుడు మన ఉదరంలో కూడా ఉన్నాడు. ఆయనకు భక్తిగా మనం తినబోయే అన్నం అర్పిస్తే చాలు. దాన్ని ప్రాణాగ్నిహోత్రం అంటారు. అందువల్ల కేవలం మనం భోజనం చేస్తూ కూడా, నేను నిత్యాగ్నిహోత్రుణ్ణి అని గొప్పలు చెప్పుకోవచ్చు.

**యజ్జుహోషి** – ఏ నిత్యకర్మలు చేస్తున్నా కూడా వాటిని పూజగా మలచుకోవచ్చు. సంధ్యావందనం కాని ఇంకేదైనా పూజ గాని భగవంతునికి అర్పించవచ్చు.

**యత్ దదాసి** – ఏ దానకర్మ చేసినా, దాన్ని కూడా పూజగా భావించవచ్చు. భూకంపంలో బాధితులకు మనం ఏదైనా ధనసహాయం చేసినా, అదీ పూజ కిందకే వస్తుంది. వారు కూడా భగవంతుని కిందకే వస్తారు. ఎందుకంటే వారిలో కూడా భగవంతుడు ఉన్నాడు. ఇదంతా కేవలం మన దృక్పథంలో మార్పు.

**యత్తపస్యసి కౌంతేయ** – అర్జునా, ఏ తపస్సు చేసినా కూడా, నా పూజగా భావించు. వళ్ళు తగ్గటానికి ఉపవాసం చేస్తున్నా, వేరే ఏ సందర్భంలో తినకుండా ఉన్నా, దాన్ని ఏకాదశిరోజు ఉన్న ఉపవాసంగా మలచుకోవాలి.

**తత్ మదర్పణమ్ కురుష్వ** – దాన్ని నాకు అర్పించు. వస్తురూపేణా కాదు; మనస్సులో అర్పించు అంటున్నాడు కృష్ణపరమాత్మ. దీనిని నిష్కామభక్తి అంటారు, ఇది మోక్షానికి దారి తీస్తుంది.

ఈ విధంగా నిష్కామభక్తుడు చేసే ప్రతి పనినీ ఈశ్వరుని పాదాలకు అర్పిస్తాడు. ఈశ్వరుని పాదాలు అంటే ప్రకృతి సూత్రాలతో సహా కూడిన మొత్తం జగత్తు. అతను చేసే కర్మలు జగత్తుకు అర్పిస్తే, ఈశ్వరుని పాదాలచెంత ఉన్న సూత్రాలే తిరిగి కర్మఫలంగా వస్తాయి. అంటే కర్మఫలం ఈశ్వరప్రసాదంగా వస్తుంది. అందువల్ల అతనికి ఎటువంటి కర్మఫలం వచ్చినా ఆనందమే.

నిష్కామ భక్తునికి భవిష్యత్తును గురించి బెంగ ఉండదు. బెంగ ఎప్పుడు వస్తుంది? ఇటువంటి భవిష్యత్తే రావాలని కోరుకున్నప్పుడు వస్తుంది. కాని అతను ఏది వచ్చినా ఈశ్వరుని ప్రసాదంగా చిరునవ్వుతో స్వీకరిస్తాడు.

అంటే ఈ శ్లోకంనుంచి మనం గ్రహించిన ఉపసిద్ధాంతం – నిష్కామభక్తుడు ఏ పనిచేసినా ఈశ్వరార్పణ భావనతో చేస్తాడు, ఏ ఫలం వచ్చినా ఈశ్వర ప్రసాదబుద్ధితో స్వీకరిస్తాడు. ఈ మాటలు ఎక్కడో విన్నట్టు లేదూ? కర్మయోగికి కూడా సరిగ్గా ఇవే మాటలు వాడాము.

**యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ** – 2.48

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

**కర్మయోగం = ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వర ప్రసాద బుద్ధి**

ఇక్కడ ఈ శ్లోకంలో కూడా

**నిష్కామ భక్తి = ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వర ప్రసాద బుద్ధి**

అందువల్ల **నిష్కామ భక్తి = కర్మయోగం.**

అలాంటప్పుడు రెండు పేర్లు ఎందుకు? వీటి మధ్య సూక్ష్మభేదం ఉంది. సాధనదృష్ట్యా కర్మయోగః, భావనదృష్ట్యా నిష్కామభక్తియోగః. అంటే కర్మయోగంలో చేసే కర్మవిషయం గురించి వస్తే, నిష్కామభక్తిలో చూపే భక్తి గురించి వస్తుంది. అందువల్ల కృష్ణపరమాత్మ తత్ కురుష్వ మదర్పణం అన్నాడు మదర్పణం అంటే ఈశ్వరార్పణం.

ఈశ్వరుడు ఎక్కడున్నాడు అని అడిగితే దానికి జవాబు చెప్పకూడదు. ఈశ్వరుడు ఎక్కడ లేడని ఎదురు ప్రశ్నించాలి. అలాగే ఎవరో ఇంగ్లీషులో వాట్ ఈజ్ గాడ్ అని అడిగినదానికి, వాట్ ఈజ్, ఈజ్ గాడ్ అని జవాబు చెప్పారు. ఉన్నది ఏదో అది ఈశ్వరుడు. నిష్కామభక్తునికి ఆలయం అవసరం లేదు. గుడికి వెళ్ళాల్సిన అవసరం లేదు. ఎక్కడున్నా దైవచింతనలో ఉంటాడు.

శ్లో. 28 **శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః ।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥**
శుభాశుభఫలైః, ఏవమ్, మోక్ష్యసే, కర్మబంధనైః,
సన్న్యాసయోగయుక్తాత్మా, విముక్తః, మామ్, ఉపైష్యసి ॥

| | | | |
|---|---|---|---|
| ఏవమ్ | = ఈ ప్రకారముగా | కర్మబంధనైః | = కర్మబంధములనుండి |
| సన్న్యాసయోగ | = సన్న్యాసయోగముతో | మోక్ష్యసే | = ముక్తుడవయ్యెదవు |
| యుక్తాత్మా | = యుక్తమైన ఆత్మకలవాడవై అనగా సమస్తకర్మలను భగవంతుడనైన నాకు అర్పించి | విముక్తః | = విముక్తుడవై నీవు |
| | | మామ్ (ఏవ) | = నన్నే |
| | | ఉపైష్యసి | = చేరగలవు |
| శుభాశుభఫలైః | = శుభాశుభఫలరూపములైన | | |

**ఏవమ్ (కృతే సతి) శుభ-అశుభ-ఫలైః కర్మ-బన్ధనైః**
**సంన్యాస-యోగ-యుక్త-ఆత్మా విముక్తః (భూత్వా) మోక్ష్యసే మామ్ ఉప-ఏష్యసి ।**

తా: ఈ ప్రకారముగా సన్న్యాసయోగముతో యుక్తమైన ఆత్మకలవాడవై అనగా సమస్తకర్మలను భగవంతుడనైన నాకు అర్పించి శుభాశుభఫలరూపములైన కర్మబంధములనుండి ముక్తుడవయ్యెదవు. విముక్తుడవై నీవు నన్నే చేరగలవు.

ఈ శ్లోకంలో నిష్కామ భక్తియొక్క ఫలాన్ని చూస్తాము. ఇదే కర్మయోగానికి కూడా వర్తిస్తుంది. కృష్ణపరమాత్మ మనం ఏ పూజచేసినా దానికి రెండు రకాల పుణ్యఫలం వస్తుంది అంటున్నాడు. పూజే కాదు, ఏ పనిచేసినా కూడా రెండు రకాల పుణ్యం వస్తుంది. అవి – లౌకిక పుణ్యం, ఆధ్యాత్మిక పుణ్యం. లౌకిక పుణ్యం అంటే అంతులేని ఐశ్వర్యం, మందీ మార్బలం, లంకంత ఇల్లు, సమృద్ధిగా నీరు లాంటివి వస్తాయి. స్వర్గలోకానికి వెళ్ళటం కూడా లౌకికపుణ్యం కిందకే వస్తుంది.

ఆధ్యాత్మిక పుణ్యం అంటే సంప్రదాయ బద్ధమైన కుటుంబంలో పుడతారు. ఈ రకం పుణ్యంలో నీటి సమస్య ఉండవచ్చు; దోమల బాధ ఉండవచ్చు, కాని కుటుంబంలో ఆధ్యాత్మిక చింతన ఉంటుంది; శాస్త్రం అందుబాటులో ఉంటుంది; గురువులు అందుబాటులో ఉంటారు. ఈ పైపై కష్టాలు చూసి, కొంతమంది మేము పాపం చేశాము అందువల్ల కష్టాలు అనుభవిస్తున్నాము అనుకుంటారు. కాని నిజానికి వారు చాలా పుణ్యం చేసుకున్నారు. అదీ ఆధ్యాత్మిక పుణ్యం. ఇది లౌకిక పుణ్యం కన్నా గొప్పది. ఎందుకంటే ఆధ్యాత్మికత ఎక్కువగా ఉన్న ఇంట్లో పుడితే, ఆ పిల్లలలో చిన్నప్పటినుంచి ఆ సంస్కారాలు పెరుగుతాయి. తక్కిన పిల్లలు ఏటికి ఎదురీదాల్సి ఉంటుంది. అందువల్ల శాస్త్రాన్ని లేదా గీతను అధ్యయనం చేయగలిగితే, మీరు చాలా ఆధ్యాత్మిక పుణ్యం చేసుకున్నారని అర్థం.

**దుర్లభం త్రయంఏవైతద్దేవానుగ్రహహేతుకమ్ ।**
**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః ॥** – వివేకచూడామణి 3

అందువల్ల మనిషిగా పుట్టటమే పుణ్యం ఉండటంవల్ల. మోక్షం పొందాలనే కోరిక వస్తే ఆధ్యాత్మిక పుణ్యం ఉండటంవల్ల. అందువల్ల భక్తి లౌకిక పుణ్యం కాని, ఆధ్యాత్మిక పుణ్యం కాని ఇస్తుంది. రెండూ కోరలేరు, ఏదో ఒకటే ఇస్తుంది. నిష్కామభక్తుడు ఆధ్యాత్మిక పుణ్యం కోరుతాడు, లౌకిక పుణ్యాన్ని కోరడు. అందువల్ల అతనికి లౌకిక పాపం కూడా అంటదు. అందువల్ల నిష్కామభక్తుడు పుణ్యపాపాలకు అతీతంగా ఎదుగుతాడు.

**శుభాశుభఫలైరేవం మోక్ష్యసే** – ఓ అర్జునా, నువ్వు శుభఫలంనుంచి, అశుభఫలంనుంచి విముక్తుడవు అవుతావు. అంటే నీకు పుణ్యపాపాలు అంటవు. పుణ్యం అంటే లౌకిక పుణ్యం అని తీసుకోవాలి. పాపం ఎందుకు అంటదు? నిష్కామభక్తిలో పూజావిధానంలో నియమాలను పాటించకపోయినా పాపం అంటదు అని చూశాము కదా!

విష్ణుసహస్రనామాన్ని నిష్కామభక్తితో పారాయణం చేశారనుకోండి, అందులో పదాలను మీరు సరిగ్గా పలకకపోయినా, భగవంతుడు వాటిని తనే దిద్దుకుని అందుకుంటాడు. కాని అదే పారాయణాన్ని మీరు సకామభక్తితో చేస్తే, మీరు ప్రతిపదాన్ని సరిగ్గా పలకాలి. ఉన్న నియమాలన్నీ పాటించాలి. చెయ్యాల్సిన పనిని చెయ్యకపోతే ప్రత్యవాయపాపం అంటుకుంటుంది, కాని నిష్కామభక్తునికి ఈ ప్రత్యవాయపాపం అంటుకోదు.

పాపం అంటుకోకపోతే మంచిది, పుణ్యం కూడా అంటుకోదు అంటే అదెలా మంచి అవుతుంది? పాపం ఇనుపసంకెళ్ళు అయితే, పుణ్యం బంగారుసంకెళ్ళు. పుణ్యం క్షయం చేసుకోవటానికి కూడా పునర్జన్మ ఎత్తక తప్పదు.

తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ – ఉపనిషత్తుల్లో వస్తుంది, జ్ఞాని పుణ్యపాపాలు రెండింటినీ వదిలించు కుంటాడు. ఆ విధంగా ఇక్కడ నిష్కామభక్తుడు ముక్తి పొందుతాడు అంటే పుణ్యపాపాలకు అతీతంగా ఎదుగుతాడు.

**సన్న్యాసయోగయుక్తాత్మా** – కృష్ణపరమాత్మ అటువంటి నిష్కామభక్తునికి బిరుదు ప్రధానం చేస్తున్నాడు. ఏమని? సన్న్యాసయోగయుక్తాత్మా అని. అతను సన్న్యాసి, యోగి – రెండూ అవుతాడు. ఇది ఇద్దరికీ వర్తిస్తుంది.

అతను సమాజంలో ఉంటూ, కర్మ చేస్తూ, సన్న్యాసి ఎలా అవుతాడు? ఎందుకంటే అతను లౌకికసుఖాలను వదులుకుని, పూజను ఆంతర ఎదుగుదలకోసం వినియోగించుకుంటున్నాడు. అందువల్ల అతను కాషాయాంబర వేషధారి కాకపోయినా, కామత్యాగం చేసినందువల్ల సన్న్యాసి అవుతాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః ॥** – 6.1

**యం సన్న్యాసమితి ప్రాహుః యోగం తం విద్ధి పాండవ ।**
**న హ్యసన్న్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన ॥** – 6.2

ప్రాపంచిక సుఖాల గురించిన ఆందోళన వదులుకోగలిగితే, అదే గొప్ప సన్న్యాసం. కాని వాటి గురించిన ఆందోళన పడకపోతే నాకు భద్రత ఏది?

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।** – 9.22

నిష్కామ భక్తునికి తెలుసు, ఎంత డబ్బు ఉన్నా అది భద్రతా భావాన్ని ఇవ్వదని. నిజంగా డబ్బే శాంతిభద్రతలను ఇచ్చేటట్టయితే, ఈ లోకంలో ఐశ్వర్యవంతులందరూ ఆనందంగానూ, బీదవారందరూ బాధపడుతూనూ ఉండాలి. కాని అలా జరగటం లేదు. అంటే ఆనందం బాహ్యవస్తువులలో లేదు, మనస్సులో ఉంది. అందువల్ల తన భారాన్ని భగవంతునిమీద వేస్తాడు నిష్కామభక్తుడు. అందువల్ల సన్న్యాసి అవుతాడు.

యోగి ఎలా అవుతాడు? యోగం అంటే ఇక్కడ కర్మ చెయ్యటం. అంటే ఇతను కర్మ చేస్తాడు కాని లౌకిక సుఖాలను కోరడు; ఆంతర ఎదుగుదలను కోరుతాడు. అందువల్ల అతను యోగి అవుతాడు; అటువంటి వ్యక్తికి ఏమవుతుంది?

**విముక్తః** – త్వరలోనే విముక్తి పొందుతాడు. ఇటువంటి నిష్కామభక్తుడు లేదా కర్మయోగి త్వరలోనే విముక్తి పొందుతాడు. ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి. కర్మయోగంవల్ల మోక్షం పొందుతాడు అంటే జ్ఞానయోగం అవసరం లేదా? చాలామంది ఈ అవకాశంకోసం వేచివుంటారు. వారికి జ్ఞానయోగం చిరాకు. అందువల్ల భాష్యకారులు ఇక్కడ జాగ్రత్తగా వ్యాఖ్యానిస్తారు.

కర్మయోగి లేదా నిష్కామ భక్తుడు మోక్షం పొందుతాడు అంటే, ప్రత్యక్షంగా మోక్షం పొందడు. **జ్ఞానయోగం ద్వారా** విముక్తి పొందుతాడు అని కలుపుకోవాలి.

కర్మయోగం వల్ల చిత్తశుద్ధి పొంది, వేదాంతవిచారణమీద శ్రద్ధ ఏర్పడి, గురువును పొంది, గురువుద్వారా జ్ఞానాన్ని పొంది, మోక్షం పొందుతాడు.

**సత్త్వ చిత్తశుద్ధి → గురుప్రాప్తి →జ్ఞానప్రాప్తి → మోక్షం.**

**మాముపైష్యసి** – మోక్షం పొంది నాలో ఐక్యం అవుతావు. నాలో ఐక్యం అవుతావు వాక్యాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. భగవంతుడు ఎక్కడో ఉన్నాడు, ఈ భక్తుడు నెమ్మదిగా వెళ్ళి, వెళ్ళి భగవంతుణ్ణి ఆలింగనం చేసుకుంటాడు లాంటి ఆలోచనలు పెట్టుకోకండి. భగవంతుడు మనకు దూరంగా లేడు; మనం భగవంతునికి దూరంగా లేము.

ఐక్యం అంటే ఏమిటి? భగవంతుడు మనకు దూరంగా ఉన్నాడనే అపోహను వదులుకోవటమే ఐక్యం. ఐక్యం అంటే బాహ్యంగా ఐక్యం కాదు; భావనలో ఐక్యం. అపోహను ఎలా వదులుకుంటాము? జ్ఞానంద్వారా. జ్ఞానంవల్ల భగవంతుడు నాకు దూరంగా, నాకు భిన్నంగా ఉన్నాడనే అపోహ పోతుంది. భగవంతుడు నాకు దూరంగా లేడు, నాకు చాలా దగ్గరగా ఉన్నాడు, నాలోనే ఉన్నాడు; నిజానికి నేనే ఆ బ్రహ్మను అని తెలుసుకుంటాము.

**అహం బ్రహ్మ అస్మి, తత్త్వమేవ, త్వమ్ ఏవ తత్**

నేనే ఆ బ్రహ్మను; ఆ బ్రహ్మ నేనే. అందువల్ల మాముపైష్యసి అంటే నన్ను పొందుతాడు.

శ్లో. 29 **సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥**
సమః, అహమ్, సర్వభూతేషు, న, మే, ద్వేష్యః, అస్తి, న, ప్రియః,
యే, భజంతి, తు, మామ్, భక్త్యా, మయి, తే, తేషు, చ, అపి, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేను | యే | = ఏ భక్తులు |
| సర్వభూతేషు | = సమస్తప్రాణులందును | మామ్ | = నన్ను |
| సమః | = సమభావముతో ఉంటాను | భక్త్యా | = భక్తితో |
| మే | = నాకు | భజంతి | = భజింతురో |
| ద్వేష్యః | = ఎవరిమీదా ద్వేషమూ | తే | = వారు |
| న, అస్తి | = లేదు | మయి | = నాయందు ఉంటారు |
| ప్రియః | = (నాకు) ఒకరు ఎక్కువనీ | చ | = ఇంకా |
| అస్తి | = లేదు | అహమ్, అపి | = నేనును |
| తు | = కాని | తేషు | = వారియందు ఉంటాను |

**అహమ్ సర్వ-భూతేషు సమః, మే ద్వేష్యః ప్రియః చ న అస్తి,**
**(పరం)తు యే మామ్ భక్త్యా భజన్తి, తే మయి, (చ) అహమ్ అపి తేషు (చ)।**

తా: నేను సమస్త ప్రాణులందును సమభావముతో ఉంటాను. నాకు ఎవరిమీదా ద్వేషమూ లేదు, ఒకరు ఎక్కువనీ లేదు. కాని ఏ భక్తులు నన్ను భక్తితో భజింతురో వారు నాయందు ఉంటారు ఇంకా నేనును వారియందు ఉంటాను.

నిష్కామభక్తుడు తనలో ఐక్యం అవుతాడని కృష్ణపరమాత్మ ముందు శ్లోకంలో చెప్పాడు. అంటే సకామభక్తుడు తనలో ఐక్యం అవడని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. ఇద్దరు పిల్లలు ఉంటే, ఒక పిల్లవాడు తెలివైనవాడని మెచ్చుకుంటే, రెండోవాడు బాధపడిపోతాడు. అలా భగవంతుడు కూడా పక్షపాతం చూపిస్తున్నాడా అని అనుమానం వస్తుంది. ఎందుకు కొంతమందికే మోక్షం వస్తోంది, కొంతమందికి రావటం లేదనే ప్రశ్న వేధిస్తూ ఉంటుంది చాలామందిని.

ఒక ఆలయంలో ఒక భక్తుడు రోజూ భగవంతుని ముందు నిల్చుని మొరపెట్టుకునేవాడుట, 'ఓ దేవా, నన్ను నీలో ఐక్యం చేసుకో, నాకు నీలో ఐక్యం అవాలని ఉంది.' అలా చెపుతూ గుడి మూసే సమయం అయినా కూడా వెళ్ళేవాడు కాదుట. పూజారి గుడి ముయ్యాలి, బయటకు వెళ్ళమని ఎన్ని రకాలుగా నచ్చచెప్పినా అతను కదిలేవాడు కాదుట.

ఇలా లాభం లేదని ఒకరోజు పూజారి భగవంతుడి వెనక్కి వెళ్ళి, భగవంతుడు మాట్లాడినట్టుగా, 'ఓ భక్తా! నీ భక్తికి మెచ్చాను. నీ కోరిక తీరుస్తాను. తథాస్తు! రేపు నువ్వు వచ్చినప్పుడు నిన్ను నాలో ఐక్యం చేసుకుంటాను. మళ్ళీ నువ్వు రేపు ఇంటికి తిరిగి వెళ్ళవు,' అన్నాడు. ఇంక అతను మర్నాటినుంచీ తుపాకీగుండుకి దొరికితే ఒట్టు.

అందువల్ల కృష్ణపరమాత్మ చెపుతున్నాడు, 'మీకు మోక్షం కావాలా వద్దా అని నిర్ణయించేది నేను కాదు; నేను మీకు మోక్షం ఇవ్వటానికి సిద్ధమే. కాని నేను ఇద్దామనుకున్నా అందుకోవటానికి మీరు సిద్ధంగా లేరు.'

స్వామీజీ తన భక్తులను ఒకసారి సాధన క్యాంపుకు తీసుకువెళ్ళినప్పుడు, ఒక భక్తునిచేత అన్ని గదుల్లోనూ ఇలా చెప్పించారుట, 'స్వామీజీ మీకు మోక్షం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారు. కాకపోతే మోక్షం కావాలనుకున్నవారు ఈ క్యాంపు అయిపోయాక కూడా ఇక్కడే ఉండిపోవాలి.' దానికి సిద్ధపడ్డవారి పేర్లు తీసుకురమ్మంటే ఒక్కరు కూడా పేరు ఇవ్వలేదు. ఏవో కుంటిసాకులు ఇచ్చారుట ప్రతి ఒక్కరూ. ఇంటికి వెళ్ళి కొన్ని పనులు చక్కబెట్టి మూడు నెలల తర్వాత వస్తామని, ఒక నెల తర్వాత వస్తామని తప్పించుకున్నవారే అందరూ. అందువల్ల ఇక్కడ కృష్ణపరమాత్మకు ఒకరు ఎక్కువా, ఇంకొకరు తక్కువా కాదు.

**సర్వభూతేషు అహం సమః** – నాకు అందరు జీవులు సమానమే. నేను ఎవరినీ ఎక్కువ దీవించటం లేదు, తక్కువ దీవించటం లేదు.

**దృశా ద్రాఘీయస్య దరదలితనీలోత్పలరుచా**
**దవీయాంసం దీనం స్నపయ కృపయా మామపి శివే ।**
**అనేనాయం ధన్యో భవతి న చ తే హానిరియతా**
**వనే వా హర్మ్యే వా సమకరనిపాతో హిమకరః ॥** – సౌందర్యలహరి 15

చంద్రుని వెన్నెల కాంతి అన్నిటిమీదా సమానంగా పడుతుంది– అది అశుద్ధమైన ప్రదేశం కాని, అందమైన ఇల్లు కాని. అలాగే కృష్ణపరమాత్మ కూడా తన దీవెనలను ఒకరిమీద ఎక్కువగానూ, ఇంకొకరిమీద తక్కువగానూ కురిపించలేదు.

మరి ఎక్కడ వ్యత్యాసం ఉంది? మన ప్రయత్నంలో ఉంది. ఆ దీవెనలను పొందటానికి మనం ఎంత ప్రయత్నం చేస్తామనే దానిమీద ఆధారపడివుంది. మనం ఒక ఇల్లు కడుతున్నప్పుడు, నాలుగు గోడలు కట్టగానే, మధ్యభాగంలో ఆకాశం (స్పేస్) ఏర్పడుతుంది. మనం గోడలు కట్టేది గోడమీద శ్రద్ధతోనా, ఇంటిమీద శ్రద్ధతోనా? హాలు, పడకగదిలాంటివి కావాలని కడతాము. గోడ కట్టాక, ఆకాశాన్ని రమ్మని ప్రత్యేకించి పిలువనవసరం లేదు. గోడ కడుతూనే ఒక గది ఏర్పడిపోతుంది. అలాగే ఈశ్వరకృపను ప్రత్యేకించి కోరనవసరం లేదు, మనం ప్రయత్నం చేయగానే, దాంతోపాటు దానంతట అదే ఈశ్వరకృప కూడా వస్తుంది.

**న మే ద్వేష్యోఽస్తి** – నాకు ఎవరిమీదా ద్వేషం లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరైనా ప్రియమైన వారు ఉన్నారా?

**న ప్రియః** – నాకు ప్రియమైనవారు కూడా ఎవరూ లేరు. భగవంతునికి ప్రియమైనవారు, అప్రియమైనవారు అనే తారతమ్యాలు లేవు; అయితే కొంతమందికి మోక్షం కలిగి, మరికొంతమందికి ఎందుకు మోక్షం కలగటం లేదు? ఆ వ్యత్యాసం భక్తులలో ఉంది, భగవంతుని కృపలో లేదు.

భగవంతుని కృప మెండుగా ఉంది, అందరికీ అందుబాటులో ఉంది. దాన్ని అందుకోవటంలో భేదం ఉంది. భగవంతుణ్ణి లక్ష్యంగా కోరుకుంటున్నామా లేదా అనేది మన చేతిలో ఉంది.

**యే మాం భక్త్యా భజంతి** – ఎవరైతే నన్ను భక్తితో పూజిస్తారో;

**మయి తే** – వారు నాలో ముందే ఉన్నారు;

**తేషు చాపి అహమ్** – నేను వారిలో ఉన్నాను.

యే భజంతి అంటే ఆ వివేకవంతులు; ఆ సాధనచతుష్టయసంపన్నులు. నిష్కామభక్తులను ముముక్షుభక్తులుగా ఏడవ అధ్యాయంలో కూడా చూశాము. వారు నాలో ఉన్నారు, నేను వారిలో ఉన్నాను అంటే మా మధ్య భేదం లేదని అర్థం. అంటే ఆ భక్తులు భగవంతునికీ, భక్తునికీ మధ్య దూరం లేదని అర్థం చేసుకుంటారు.

దీన్నిబట్టి మోక్షం నాలుగు పురుషార్థాలలో ఒకటి కాబట్టి, మోక్షాన్ని భక్తుడు స్వయంగా కోరాలి కాని భగవంతుడు తనకు తోచినట్టు ఇవ్వడని అర్థమవుతున్నది.

దీనితో సకామభక్తికీ, నిష్కామభక్తికీ మధ్య ఉన్న వ్యత్యాసం గురించిన వివరణ ముగిసింది. ఇది 20–29 శ్లోకాల వరకూ చూశాము.

కృష్ణపరమాత్మ ఒకదానిని విమర్శించి ఇంకొకదాన్ని మెచ్చుకోవటం లేదు. ఇక్కడ ఒక విషయాన్ని గ్రహించాలి మనం. కృష్ణపరమాత్మ సకామభక్తిని కించపరచటం లేదు. అది పాపకర్మ కాని, నిషిద్ధకర్మ కాని కాదు. అంతకు ముందు కూడా చూశాము. మూడు రకాల కర్మలు ఉంటాయని.

సాత్త్వికకర్మ ఒక వ్యక్తిని ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయికి తీసుకువెళితే; తామసకర్మ ఆధ్యాత్మికంగా కిందకు తోస్తుంది; రాజసిక కర్మ పైకీ తీసుకువెళ్ళదు, కిందకీ తీసుకువెళ్ళదు. ఉన్నచోటే ఉంచుతుంది. సకామకర్మను ఈ రాజసిక కర్మతో పోల్చవచ్చు. అది కూడా ఒక భక్తుణ్ణి కిందకీ తొయ్యదు, పైకీ తీసుకువెళ్ళదు.

కృష్ణపరమాత్మ కామ్యకర్మలను వెంటనే వదిలివేయమని చెప్పటం లేదు. ఈ భాగం వినగానే చాలా మందికి ఒక సందేహం వస్తుంది. నేను అబ్బాయి ఉద్యోగంకోసం ఫలానా పూజ చేస్తున్నాను; అమ్మాయి పెళ్ళి కావటానికి ఫలానా వ్రతం చేస్తున్నాను; అనారోగ్యం తొలగటానికి ఫలానా పారాయణం చేస్తున్నాను; ఫలానా కోరిక తీరితే తిరుపతి వస్తానని మొక్కుకున్నాను – వీటిని చెయ్యాలా, వద్దా అనే సందేహం కలుగుతుంది.

కామ్యకర్మలను ఒక్కసారిగా వదులుకోలేము కాని క్రమేపీ వాటినుంచి ఎదగాలి, నిషిద్ధకర్మలను తక్షణం వదిలివేయాలి. అవి పాపకర్మలు. కామ్యకర్మలు పాపకర్మలు కావు కాని వాటివల్ల ఆధ్యాత్మిక ఉన్నతి కలుగదు అని చూశాము కదా. అందువల్ల సకామ కర్మలను నెమ్మదిగా తగ్గించుకుంటూ వచ్చి వాటి స్థానంలో నిష్కామకర్మలు లేదా సాత్త్వికకర్మలు చెయ్యాలి. కోరిక కోరకుండా ఉండలేము అంటే జ్ఞానవైరాగ్యసిద్ధి పొందటానికి; లేదా చిత్తశుద్ధికోసం; లేదా శాస్త్రవిచారణ చెయ్యటానికి; లేదా నిదిధ్యాసనప్రాప్తికోసం; లేదా జ్ఞాననిష్ఠ పొందటానికి, శాస్త్రాన్ని మర్చిపోకుండా ఉండటానికి కోరవచ్చు.

గృహస్థుగా మనకు అనేక బాధ్యతలు ఉంటాయి; ఆ బాధ్యతా నిర్వహణలో అనేక ఆటంకాలు కలుగుతాయి; ఆ ఆటంకాలు తొలగటానికి భగవంతుని సహాయం కోరటం అనివార్యం. అందులో తప్పేం లేదు, కాని

నెమ్మదిగా దానినుంచి ఎదిగి, నిష్కామభక్తికి రావాలి. ఇప్పుడే చూశాము నిష్కామభక్తిలో కూడా కోరిక ఉంటుంది, కాని అది లౌకిక సుఖాల గురించిన కోరిక కాదు. అందువల్ల నిష్కామభక్తి అంటే ప్రాపంచిక కోరికలు ఉండవు కాని మోక్షాన్ని కలుగజేసే ఆధ్యాత్మిక కోరిక ఉంటుంది. ఒకవేళ ప్రాపంచిక సుఖాలను కోరినా కూడా, దాన్ని ఆధ్యాత్మిక సాధనకోసం వినియోగిస్తే అది సకామభక్తి కిందకు రాదు.

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః।**
**భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః। స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః।** – శాంతి పాఠం

ఈ శాంతి పాఠంలో శారీరక ఆరోగ్యంకోసం ప్రార్థిస్తున్నాము. కళ్ళు, చెవులు, తక్కిన అంగాలు బాగుంటేనే కొన్ని సంవత్సరాలపాటు వేదాంత శ్రవణం చెయ్యగలుగుతాము. అలాగే ధనం కోరినా కూడా ఆ ధనాన్ని పంచమహాయజ్ఞాలు చెయ్యటానికి వినియోగిస్తే, అది సకామభక్తి అవదు. ఎందుకంటే పంచమహాయజ్ఞాలు చెయ్యటంద్వారా మనకు చిత్తశుద్ధి కలుగుతుంది. అంటే, ఒక్కముక్కలో చెప్పాలంటే ఏ కోరిక కోరినా దానిద్వారా చిత్తశుద్ధి, జ్ఞానం కలుగుతుందంటే అది నిష్కామభక్తి లేదా ముముక్షుభక్తి కిందకు వస్తుంది.

సకామ భక్తికీ, నిష్కామభక్తికీ మధ్య ఉన్న ఇంకొక ముఖ్య వ్యత్యాసాన్ని కృష్ణపరమాత్మ వివరించాడు. సకామభక్తిలో అన్ని వివరాలూ అక్షరాలా పాటించి తీరాలి. కాని నిష్కామభక్తిలో అవసరం లేదు. అందువల్ల పత్రం, పుష్పం, ఫలం, తోయం భక్తిగా సమర్పిస్తే చాలు అన్నాడు. మహాభారతకథలో విదురుడు ఎలా భక్తిపారవశ్యంలో భగవంతునికి అరటిపండుని వలచి పెట్టాడో, ఆ పారవశ్యంలో తనకు తెలియకుండా ఎలా పండును కింద పడేసి, తొక్కను భగవంతునికి అర్పించాడో, అయినా భగవంతుడు దాన్ని ఎలా ఆప్యాయంగా స్వీకరించాడో చూస్తాము.

**మార్గావర్తితపాదుకా పశుపతేరఙ్గస్య కూర్చాయతే**
**గణ్డూషామ్బునిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే ।**
**కిఞ్చిద్భక్షితమాంసశేషకబలం నవ్యోపహారాయతే**
**భక్తిః కిం న కరోత్యహో వనచరో భక్తావతంసాయతే ॥** – సౌందర్యలహరి 63

కన్నప్ప గొప్ప భక్తుడు. కాని అతని భక్తిపారవశ్యంలో అతను ఏం చేస్తున్నాడో అతనికి తెలియటం లేదు. నోటి నిండా నీరు నింపుకుని దాన్ని భగవంతునిమీద ఉమ్మేవాడు. అతని ఉద్దేశంలో భగవంతునికి అభిషేకం చేస్తున్నాడు. అతను వేటగాడు అయివుండి, గొప్ప భక్తుడిగా మారాడు. ఇలాంటి భక్తుల కథలెన్నో పురాణాల్లో చూస్తాము.

ఇలా నిష్కామభక్తి ప్రత్యేక పద్ధతిలో పూజ చెయ్యటంలోనే కాదు, ప్రత్యేక జీవనవిధానంలో కూడా కనిపిస్తుంది అని చూశాము. అంటే ఈశ్వరార్పణ బుద్ధితో కర్మ చేసి, ఈశ్వరప్రసాదబుద్ధితో కర్మఫలాన్ని స్వీకరిస్తాడు. ఇదీ ఈ భాగం సారాంశం.

### 6. భక్తి స్తుతి: శ్లోకాలు 30–34

ఈ శ్లోకాల్లో అంటే 30–34 వరకూ, భక్తిని స్తుతిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటా గొప్పతనం? భక్తిని ఏ వయస్సులోనైనా మొదలుపెట్టవచ్చు; జ్ఞానానికి రావాలంటే కొన్ని సాధనలు అవసరం, కాని భక్తికి అలాంటి అధికారిత్వం అవసరం లేదు. ఎందుకు?

భక్తిలోనే ఎన్నో దశలున్నాయి. అందులో మొదటిదశ ఆర్తభక్తి అని ఏడవ అధ్యాయంలో చూశాము. అసలు ఎవరికైనా దానితో మొదలవుతుంది భక్తి. పరీక్షల ముందు భక్తితో భగవంతునికి పూజ చేస్తారు – దాని ఫలితం కనబడగానే భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకుంటారు. భక్తులకు మానసిక ఆరోగ్యమే కాక, శారీరక ఆరోగ్యం కూడా బాగుంటుందని ఒక సర్వేలో తేలింది. భగవంతునిమీద ఆధారపడటంవల్ల వారికి మానసిక స్థైర్యం పెరుగుతుంది. అది క్యాన్సర్‌లాంటి తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్నా కూడా నిలదొక్కుకునే ధైర్యం ఇస్తుంది. అప్పుడు మందు బాగా పనిచేస్తుంది. ఈ భక్తిని సునాయాసంగా అలవరచుకోవచ్చు. దీన్ని ఆర్తభక్తి అంటారు. ఇది మొదటిస్థాయి.

నిజానికి పన్నెండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ భక్తిని ఐదుస్థాయిల్లో విభజించి, అన్నిటికన్నా ఉన్నతమైన స్థాయినుంచి వివరించబోతున్నాడు. అంత ఎత్తుకు ఎదగలేకపోయినా మొదటిస్థాయి భక్తి ఎవరైనా చూపించగలరు.

ఈ స్థాయిలకు తగ్గట్టుగానే భగవంతుణ్ణి కూడా మూడుస్థాయిల్లో వివరించాడు కృష్ణపరమాత్మ. అవి ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు అని చూశాము. అలా మన స్థాయిని బట్టి, ఏదో ఒక భక్తిని ఎన్నుకోవచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇంకొక ముఖ్య విషయాన్ని కూడా ఇక్కడ నొక్కివక్కాణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటది? ఇంచుమించు మనుష్యులందరూ ఏదో ఒక అపరాధభావనతో కృంగిపోతారు. నేను చాలా పొరపాట్లు చేశాను, నేను చాలా పాపాలు చేశాను అని బాధపడుతూ ఉంటారు చాలామంది. ఎందుకంటే వారి అంతరాత్మ వారి తప్పులను వారికి ఎత్తి చూపుతూ ఉంటుంది.

దయానందస్వామి అంటారు, 'ఏది మంచో, ఏది చెడో ఎవరికీ ప్రత్యేకించి నేర్పించనవసరం లేదు. ఆ మాత్రం ఇంగితజ్ఞానం అందరికీ ఉంటుంది.' దొంగకు కూడా తాను చేస్తున్నది తప్పని తెలుసు. ఎలా తెలుసు? తప్పు అనుకుంటున్నాడు కాబట్టి ఎవరూ చూడకుండా దొంగతనం చేస్తున్నాడు. అందువల్ల అంతరాత్మ మంచి–చెడులను ఎత్తిచూపే ఇంగితజ్ఞానంమీద ఆధారపడి నిర్ణయం చేస్తుంది. ఏది మంచి, ఏది చెడు? మనకు ఏది ఇతరులు చెయ్యకూడదని కోరుకుంటామో అది చెడు. అది మనమూ చెయ్యకూడదు.

అందువల్ల భగవంతుడు మన చివరిరోజు మన మంచిచెడ్డలు బేరీజు వేస్తాడో లేదో కాని, మన అంతరాత్మ నిరంతరం మనం చేసిన చెడు ఎత్తి చూపుతూనే ఉంటుంది. అలా అది చూపించినప్పుడల్లా, మనలో అపరాధ భావన పేరుకుపోతుంది. అది కొంతమందిలో ఎంత ఎక్కువగా ఉంటుందంటే, వారు గుడికి కాని, స్వామీజీల దగ్గరకు కాని వెళ్ళటానికి ధైర్యం చెయ్యరు.

ఆ విధంగా అపరాధభావన, ఆధ్యాత్మిక ఎదుగుదలకు పెద్ద ఆటంకం. ఈ అపరాధ భావన ఎంతగా పేరుకుపోతుందంటే, 'నేను ఆధ్యాత్మిక సాధనకు పనికిరాను, విజయం పొందలేను,' అని నిశ్చయించేసుకుంటారు వారు. ఈ విషయాన్ని మనం ఆరవ అధ్యాయంలో కూడా చూశాము. మనకు ఏదైనా పని చెయ్యాలంటే నాలుగుకృపలు కావాలి. ఆత్మకృప, ఈశ్వరకృప, గురుకృప, శాస్త్రకృప.

ఆత్మకృప అంటే అపరాధభావన లేని మనస్సు. ఆత్మస్థైర్యం. నేను పొరపాటు చేసినా కూడా, ఆ పొరపాటు సరిదిద్దుకుని ఆధ్యాత్మికంగా ఎదగగలను అనే ధైర్యం ఉండటం. **ప్రతి సాధువుకూ ఒక గతం ఉంటుంది; ప్రతి పాపికీ ఒక భవిష్యత్తు ఉంటుంది.** అందువల్ల కృష్ణపరమాత్మ అందరిలోనూ ధైర్యం నూరిపోయటానికి పూనుకున్నాడు.

భగవంతుని సహాయం తీసుకోవటానికి నిశ్చయించుకుంటేనే మనము సాధుపురుషులము అవుతాము. భక్తి మనలో అణకువ భావాన్ని పెంచుతుంది. మనకు ఫ్రీవిల్ ఎంతగా ఉన్నా, మన చేతిలో లేని అంశాలు ఎన్నో ఉన్నాయని తెలియజేస్తుంది. మనిషి ఎంత గొప్పవాడైనా కూడా అతనికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఎప్పుడైతే మన పరిమితిని గ్రహిస్తామో, అప్పుడే భగవంతుని సహాయం తీసుకోవటానికి చెయ్యి చాస్తాము.

తెలివి అంటే అవసరమైనప్పుడు సహాయం కోరటం అని దయానందస్వామీజీ అద్భుతంగా చెపుతారు. అది ప్రాపంచిక విజయానికే అయినా కూడా అది ఒక గొప్ప అడుగే. భగవంతుణ్ణి ఆధ్యాత్మిక ఎదుగుదలకు మాత్రమే సహాయం కోరాలని నియమం లేదు.

నిజానికి భగవంతుణ్ణి సహాయం కోరితే మనలో మార్పు వస్తుంది. ఆత్మస్థైర్యం పెరుగుతుంది. అది చూసి భక్తి పెరుగుతుంది; భక్తి పెరిగితే మన ఆత్మస్థైర్యం ఇంకా పెరుగుతుంది. అలా ఇది ఒక వృత్తంలా కొనసాగుతుంది. ఇది చెడు వృత్తం కాదు; మంచి వృత్తం. ఎక్కువ భక్తి – ఎక్కువ శక్తి – ఎక్కువ భక్తి – ఎక్కువ శక్తి. ఇన్నాళ్ళూ చెడ్డవిషయాలకు బానిస అయ్యాము. ఇప్పుడు భగవంతునికి బానిస అవుతున్నాము. ఈ బానిసత్వంనుంచి కూడా బయటపడాలా? అది వేరే విషయం. బానిసత్వం అనుకుంటే దాన్నించి కూడా తర్వాత బయటపడాలి. కాని అది మంచి అనుబంధంగా తీసుకోవచ్చు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను చూద్దాము.

శ్లో. 30 **అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ ।**
**సాధురేవ స మంతవ్యః, సమ్యగ్వ్యవసితో హి సః ॥**
అపి, చేత్, సుదురాచారః, భజతే, మామ్, అనన్యభాక్,
సాధుః, ఏవ, సః, మంతవ్యః, సమ్యక్, వ్యవసితః, హి, సః ॥

| | | | |
|---|---|---|---|
| సుదురాచారః, అపి | = మిక్కిలి దురాచారుడైనను | హి | = ఎందుకంటే |
| అనన్యభాక్ | = అనన్యభావముతో నా భక్తుడై | సః | = అతడు |
| మామ్ భజతే, చేత్ | = నన్ను భజించినట్లయితే | సమ్యక్ | = యథార్థముగా |
| సః సాధుః, ఏవ | = అతడు సత్పురుషుడుగానే | వ్యవసితః | = నిశ్చయబుద్ధి గలవాడు |
| మంతవ్యః | = భావింపదగినవాడు | | |

**సు–దుః–ఆచారః అపి మామ్ అనన్య–భాక్ భజతే చేత్,**
**సః సాధుః ఏవ మన్తవ్యః, సః హి సమ్యక్ వ్యవసితః (అస్తి) ।**

తా: మిక్కిలి దురాచారుడైనను అనన్యభావముతో నా భక్తుడై నన్ను భజించినట్లయితే అతడు సత్పురుషుడుగానే భావింపదగినవాడు. ఎందుకంటే అతడు యథార్థముగా నిశ్చయబుద్ధి గలవాడు.

**సుదురాచారః అపి** – గొప్ప పాపి కూడా గొప్ప భక్తితో ఉండవచ్చు. దురాచారుడు అంటేనే పాపి; సుదురాచారుడు అంటే గొప్ప పాపి. అంటే అతను పంచమహాపాతకాలతో సహా అనేక పాపాలు చేసి ఉండవచ్చు. అయినా అతను బెంగపడనవసరం లేదు. కాని ఒక షరతు. ఏమిటది?

**భజతే మామనన్యభాక్** – అనన్యభక్తితో నన్ను పూజిస్తే చాలు. అనన్యభక్తి అంటే సర్వస్య శరణాగతి కోరటం. ఏరోజు భగవంతుని దగ్గరకు వచ్చాడో, ఆరోజే అతను మారటానికి నిశ్చయించుకున్నట్టు అర్థం.

దయానంద స్వామీజీ అద్భుతంగా అంటారు – 'ఎవరూ ఎవరినీ మార్చలేరు.' నేను నిన్ను మార్చలేను, కాని నువ్వు మారటానికి నిశ్చయించుకుంటే, ఎవరూ ఆపలేరు. నువ్వు మారటానికి నిశ్చయించుకుంటే, మార్పు జరిగి తీరుతుంది; దానికి నేను తోడ్పడగలను అంటాడు భగవంతుడు. ఇదీ సూత్రం.

అందువల్ల ఒక వ్యక్తి మారదామని నిశ్చయించుకుంటేనే చాలు, అతను సాధువుతో సమానం అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే మారాలని తీసుకున్న నిర్ణయమే అతని జీవితంలో పెద్దమార్పు తీసుకువస్తుంది.

ఎవరో అన్నారు, 'నువ్వు ఎక్కడ నిల్చున్నావన్నది కాదు ముఖ్యం; నువ్వు ఎటు తిరిగి నిల్చున్నావన్నది ముఖ్యం.' భగవంతునికి అత్యంత సమీపంలో నిల్చుని కూడా, వెనక్కి తిరిగి నిల్చుని, వెనక్కి నడిస్తే, భగవంతునికి దూరంగా నడుస్తావు. అదే, భగవంతునికి చాలా దూరంగా నిల్చుని కూడా, భగవంతునివైపు నడిస్తే, భగవంతునికి చేరువ అవుతావు. అందువల్ల ఎక్కడ నిల్చున్నామన్నది ముఖ్యం కాదు, ఎటు నడుస్తున్నామన్నది ముఖ్యం.

**సాధురేవ స మంతవ్యః** – అతన్ని సాధువుగా పరిగణింపవచ్చు. ఎందుకు?

**సమ్యగ్వ్యవసితో హి సః** – ఎందుకంటే అతను జీవితంలో సరియైన నిర్ణయం తీసుకున్నాడు. అతని జీవితాన్ని పునఃనిర్మించుకున్నాడు, ఏది ముఖ్యమో తెలుసుకున్నాడు. అందువల్ల సాధువు అయ్యాడు. వాల్మీకి అలా గొప్ప ఋషి అయ్యాడు. సమ్యక్ వ్యవసితః అంటే నిశ్చయం చేసుకున్నవాడు. వ్యవసాయ అంటే నిశ్చయం; వ్యవసితః అంటే నిశ్చయం చేసుకున్నవాడు. ఏమిటా నిశ్చయం? దేవుని సహాయం పొందుతానని చేసుకున్న నిశ్చయం. అలాంటి వ్యక్తికి ఏమవుతుంది? దాన్ని రాబోయే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 31 **క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।**
**కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥**
క్షిప్రమ్, భవతి, ధర్మాత్మా శశ్వత్, శాంతిమ్, నిగచ్ఛతి,
కౌంతేయ, ప్రతిజానీహి, న, మే, భక్తః, ప్రణశ్యతి ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | శాంతిమ్ | = పరమశాంతిని |
| (సః) | = (అతడు) | నిగచ్ఛతి | = పొందును |
| క్షిప్రమ్ | = అతి త్వరలో | మే, భక్తః | = నా భక్తుడు |
| ధర్మాత్మా | = ధర్మాత్ముడు | న, ప్రణశ్యతి | = ఎన్నడు నష్టపోడు అని |
| భవతి | = అగును | ప్రతిజానీహి | = నిశ్చయముగా తెలుసుకొనుము |
| శశ్వత్ | = శాశ్వతమైన | | |

**హే కౌన్తేయ! (సః) క్షిప్రమ్ ధర్మ-ఆత్మా భవతి, శశ్వత్**
**శాన్తిమ్ నిగచ్ఛతి, మే భక్తః న ప్రణశ్యతి, (ఇతి త్వం) ప్రతిజానీహి ।**

తా: ఓ కుంతీసుతా! (అతడు) అతి త్వరలో ధర్మాత్ముడు అగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును. నా భక్తుడు ఎన్నడు నష్టపోడు అని నిశ్చయముగా తెలుసుకొనుము.

సహాయంకోసం భగవంతుణ్ణి అర్థించే భక్తుడు –

**(సః) క్షిప్రం ధర్మాత్మా భవతి** – అతను అచిరకాలంలోనే ధర్మాత్ముడు అవుతాడు. ఆత్మ అంటే ఇక్కడ మనస్సు. ధర్మాత్మ అంటే అర్థ, కామాల కన్నా ధర్మానికి ఎక్కువ విలువనిచ్చే వ్యక్తి అవుతాడు. అర్థ, కామాలను పూర్తిగా వదులుకోడు, కాని వాటికి ఎక్కువ విలువనివ్వడు. అతనికి అర్థ, కామాలు ఊరగాయ లాంటివి. కొందరు ఆవకాయను అన్నంలో కలుపుకుని, పెరుగు నంచుకుంటారు. మరికొందరు పెరుగన్నంలో ఆవకాయ నంచుకుంటారు. నిజానికి రెండవ పద్ధతి పాటించాలి. ఈ భక్తులు అర్థ, కామాలను పెరుగన్నంలో నంచుకునే ఊరగాయలా చూస్తారు. ధర్మం అంటే విలువలు, మోక్షం.

క్షిప్రం అంటే తొందరగా. అతను త్వరలోనే ఆర్తభక్తిదశనుంచి, అర్థార్థీభక్తిదశకు ఎదిగి, క్రమేపీ జిజ్ఞాసుభక్తికి ఎదుగుతాడు. అంటే భక్తిని తాను అంతర్గతంగా ఎదగటానికి ఉపయోగిస్తాడు. అందువల్ల ధర్మాత్ముడు అవుతాడు అంటే అంతర్గతంగా ఎదగటానికి ప్రయత్నించే జిజ్ఞాసుభక్తుడు అవుతాడు.

జిజ్ఞాసుభక్తికి ఎదిగితే, తర్వాత దశకు తేలికగా చేరతాడు. ఏమిటది? జ్ఞానీభక్తి. జిజ్ఞాసుభక్తుడు అంటే ఈశ్వరజ్ఞానం గురించిన ఇచ్ఛ ఉన్న భక్తుడు. అతను శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యంగా దొరకవనీ, భగవంతుడే శాంతి, భద్రత, ఆనందాలను ఇస్తాడనీ గ్రహిస్తాడు. మతపరంగా భగవంతుడు అంటాము; వేదాంతపరిభాషలో బ్రహ్మ అంటాము. బ్రహ్మ అని దీర్ఘం తీస్తే చతుర్ముఖబ్రహ్మ లేదా సగుణబ్రహ్మ; బ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ.

**అథాఽతో బ్రహ్మ జిజ్ఞాసా** – బ్రహ్మసూత్రాలు 1

బ్రహ్మను తెలుసుకోవాలన్న జిజ్ఞాస బయలుదేరుతుంది. ఎప్పుడైతే ఆ జిజ్ఞాస బయలుదేరుతుందో, అప్పుడే ఎక్కడినుంచో శాస్త్రం వస్తుందని కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలో చెప్పాడు. ఒక పువ్వు పరిమళించగానే, ఆ సువాసనకు ఆకర్షింపబడి, తేనెటీగ ఎక్కడ్నుంచో వెతుక్కుంటూ వస్తుంది; 'నేను వికసిస్తున్నాను, నువ్వు వచ్చి

నా మకరందాన్ని గ్రోలు,' అని పుష్పం తేనెటీగకు ఆహ్వానపత్రిక పంపనవసరం లేదు. అలాగే మీరు సాధన చతుష్టయసంపన్నులనే పువ్వుగా పరిమళించగానే, గురువే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాడు.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥** – 10.10

ఎందుకంటే భగవంతుని సూత్రం ఒకటుంది. అది – సహజమైన కోరిక తీరాలి. దాహం వెయ్యటం సహజమైన కోరిక, దానికి భగవంతుడు నీరు ఏర్పాటు చేశాడు. ఆకలి సహజమైన కోరిక, భగవంతుడు ఆహారాన్ని సమకూర్చాడు. గాలి పీల్చటం సహజమైన కోరిక, భగవంతుడు గాలిని సమకూర్చాడు. అలాగే ఈశ్వరజ్ఞానతృష్ణ ఉంటే, భగవంతుడే గురువును ఏర్పరచాలి. అందువల్ల శాస్త్రం వస్తుంది, గురువు వస్తాడు, నేర్చుకునేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతుంది; జ్ఞానం కలుగుతుంది, జ్ఞానీ భక్తుడిగా మారతావు అని హామీ ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి** – జ్ఞానీ భక్తుడవు అయిన మరుక్షణమే, నువ్వు జ్ఞానివి అవుతావు. జ్ఞానం ఏమిస్తుంది? జ్ఞాని ఎలా ఉంటాడో తన బోధ మొదట్లోనే చెప్పాడు. నిజానికి దానితోనే తన బోధను మొదలుపెట్టాడు.

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః** – 2.11

జ్ఞాని దేని గురించీ బాధపడడు. అంటే అతని జీవితంలో దుఃఖం ఉండదు. అందువల్ల ఇక్కడ శాంతిం నిగచ్ఛతి అన్నాడు. శాంతిని పొందుతాడు. అది కూడా ఎలాంటి శాంతి? ఇప్పుడొచ్చి తర్వాత మాయమయిపోయే శాంతి కాదు. శశ్వత్ శాంతిమ్ – శాశ్వతమైన శాంతి. జీవితంలో ఏ ఒడిదుడుకులు ఎదురైనా చెక్కు చెదరని శాంతిని పొందుతాడు.

ఇవన్నీ అర్జునుడు నమ్ముతాడా లేక ఇవేవో గాలికి ఎగిరిపోయే హామీలు అనుకుంటున్నాడా అని అనుమానం వస్తుంది కృష్ణపరమాత్మకు. అందుకని ఇక్కడ హామీపత్రాన్ని జతచేస్తున్నాడు. ఇది చాలా ముఖ్యమైన వాక్యం.

**కౌంతేయ ప్రతిజానీహి** – అర్జునా, నేను ఇచ్చిన మాటను నమ్ము. నువ్వు నమ్మటమే కాదు, అందరికీ చెప్పు. ఏమిటది?

**న మే భక్తః ప్రణశ్యతి** – నా భక్తుడెన్నడూ ఆధ్యాత్మికంగా కిందపడడు. జాగ్రత్తగా చూడండి – ఆధ్యాత్మికంగా కిందపడడు. **లౌకికంగా జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కోక తప్పదు.** అవి ప్రారబ్ధకర్మవల్ల వస్తాయి. కాని ఆధ్యాత్మికంగా అంతకంతకూ ఎదుగుతూ వస్తాడే కాని, కిందకి పడే ప్రసక్తే లేదు. న మే భక్త ప్రణశ్యతి – ఇది నా మాట. అందువల్ల నా భక్తుడివి కమ్ము.

శ్లో. 32 **మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తేఽపి యాంతి పరాం గతిమ్ ॥**
మామ్, హి, పార్థ, వ్యపాశ్రిత్య, యే, అపి, స్యుః, పాపయోనయః,
స్త్రియః, వైశ్యాః, తథా, శూద్రాః, తే, అపి, యాంతి, పరామ్, గతిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | తే, అపి | = వారందరు |
| పార్థ! | = ఓ పార్థా! | మామ్ | = నన్ను |
| స్త్రియః, వైశ్యాః | = స్త్రీలు, వైశ్యులు | వ్యపాశ్రిత్య | = శరణు పొంది |
| శూద్రాః, తథా | = శూద్రులు అలాగే | పరామ్, గతిమ్ | = పరమగతినే |
| పాపయోనయః | = నాస్తికులు | యాంతి | = పొందుదురు |
| యే, అపి, స్యుః | = ఎవ్వరైననూ | | |

**హే పార్థ! యే అపి హి పాప-యోనయః స్త్రియః వైశ్యాః తథా**
**శూద్రాః స్యుః తే అపి మామ్ వ్యపాశ్రిత్య, పరామ్ గతిమ్ యాన్తి ।**

తా: ఎందుకంటే, ఓ పార్థా! స్త్రీలు, వైశ్యులు, శూద్రులు, అలాగే నాస్తికులు ఎవ్వరైననూ వారందరు నన్ను శరణు పొంది పరమగతినే పొందుదురు.

ఇక్కడ ఏవైనా లోటుపాట్లు ఉన్నవారు కూడా తలుచుకుంటే తన భక్తులు అయి, మోక్షం పొందవచ్చని సూచిస్తున్నాడు. లోటుపాట్లు అంటే ఏదైనా బలహీనత ఉన్నవారు. అది శారీరక బలహీనత కావచ్చు; మానసిక బలహీనత కావచ్చు; బుద్ధిపరమైన బలహీనత కావచ్చు, వాతావరణ పరమైన బలహీనత కావచ్చు; తల్లిదండ్రుల పరమైన బలహీనత కావచ్చు. ప్రహ్లాదుడు తండ్రిపరంగా అవస్థ పడ్డాడు. నారాయణాయ నమః అనటానికి వీల్లేదు, హిరణ్యకశిపతే నమః అనమని ఆంక్షలు విధించాడు హిరణ్యకశిపుడు. అయినా అతను ఎలా మోక్షం పొందాడో మనకు తెలిసిన విషయమే.

**పార్థ! మాం హి వ్యపాశ్రిత్య తే అపి పరాం గతిమ్ యాంతి** – ఓ పార్థా! ఏవైనా బలహీనతలు ఉన్నవారు కూడా నన్ను శరణు కోరితే, వారు కూడా పరమగతిని పొందుతారు. తే అపి అంటే ఏదో ఒక బలహీనత ఉన్న వ్యక్తులు. వారు కూడా పరమగతిని పొందుతారు. పరమగతి అంటే మోక్షం. మోక్షం పొందుతారు. ఎప్పుడు? వారి మీదే వారు ఆధారపడటం మానేసి, భగవంతునిమీద ఆధారపడ్డప్పుడు. వారు అసలే ఏదో ఒక సమస్య ఉన్నవారు, వారు వారిమీదే ఆధారపడితే, వారి లక్ష్యాన్ని పొందలేరు.

మాం వ్యపాశ్రిత్య – నన్ను శరణు పొందుతున్నారు. వారు తెలివైన పని చేస్తున్నారు. మనంతట మనం నడవలేనప్పుడు ఏం చెయ్యాలి? కర్ర పట్టుకోవటమో, ఎవరిదైనా చెయ్యి పట్టుకోవటమో చెయ్యాలి. వ్యపాశ్రిత్య అంటే ఆధారపడాలి.

**లక్ష్మీనరసింహ మమ దేహి కరావలంబమ్**

శంకరులవారు అనేక కరావలంబ స్తోత్రాలు రచించారు. శంకరాచార్యుల వారికేమీ అవస్థలు లేవు, ఆయనకు పూర్వజన్మసుకృతం ఉంది. అన్నీ అనుకూల పరిస్థితులు ఉన్నాయి. అయినా అందరికీ జీవితం సుగమంగా ఉండదు కాబట్టి జనశ్రేయస్సుకోసం ఆయన అనేక కరావలంబ స్తోత్రాలు రచించారు. కరావలంబం అంటే ఆధారం. అలాంటి ఆధారం తీసుకుని, బలహీనులు కూడా మోక్షం పొందవచ్చు.

అటువంటి బలహీనులు ఎవరు? కృష్ణపరమాత్మ ఉదాహరణకు నలుగురిని తీసుకున్నాడు. ముందు దీని వాచ్యార్థం చూద్దాము. అది చూసి మండిపడకండి; ఇందులోని గూఢార్థం తర్వాత చూద్దాము.

1. **పాపయోనయః** – పాపుల ఇంట్లో పుడతారు. ఇందాక చూసినట్టుగా ప్రహ్లాదుడు రాక్షసుని ఇంట్లో పుట్టాడు. అటువంటి చోట ఏటికి ఎదురీదాలి. ఆధ్యాత్మికచింతనను తల్లిదండ్రులు పిల్లలకు లేతవయస్సులోనే అలవాటు చెయ్యాలి. నిజానికి తల్లిగర్భంలో ఉండగానే ఆధ్యాత్మికతను పెంపొందించుకుంటాడని శాస్త్రం చెబుతుంది. అలాంటిది తల్లిదండ్రులు నాస్తికులయితే ఆ పిల్లల పరిస్థితి ఏమిటి? అతను ఏదో పాపం చేసివుంటేనే, అలాంటి ఇంట్లో పుడతాడు.
2. **స్త్రియః** – స్త్రీలు. స్త్రియః పాపయోనిః అనకూడదు. పాపయోనిః వేరు, స్త్రియః వేరు. పాపయోనిః అంటే నాస్తికుల ఇంట్లో పుట్టినవారు అని చూశాము. ఎందుకు స్త్రీలను పేర్కొన్నాడో తర్వాత చూద్దాము.
3. **వైశ్యాః** – వైశ్యులు.
4. **శూద్రాః** – శూద్రులు.

నాలుగు వర్ణాల్లో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు వస్తారని చూశాము. అందులో ఇద్దరిని ఇక్కడ పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ.

ఈ నలుగురూ ఏటికి ఎదురీదాలి. ఎందుకు స్త్రీలను, వైశ్యులను, శూద్రులను పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ? దానికి కారణం ఇది. వేదాంతం అంటే ప్రాథమికంగా జ్ఞానసముపార్జన. జ్ఞానం పొందాలంటే బుద్ధి చాలా పదునుగా ఉండాలి, తెలివితేటలు బాగుండాలి. బుద్ధి సూక్ష్మశరీరానికి చెందినది; స్థూలశరీరానికి చెందినది కాదు. అందువల్ల మనం అర్హత గురించి మాట్లాడేటప్పుడు అది స్థూలశరీరానికి చెందినది కాదు, సూక్ష్మశరీరానికి చెందినది.

తత్త్వబోధలో జ్ఞానం పొందటానికి అధికారి ఎవరు అని చర్చ వచ్చినప్పుడు అతని ఎత్తు, బరువు, ఆడా, మగాలాంటి అంశాలు లెక్కలోకి రాలేదు. అధికారి సాధనచతుష్టయసంపన్నుడై ఉండాలని చూశాము. అంటే ఆ లక్షణాలు దేనికి చెందినవి? బుద్ధికి చెందినవి.

అందువల్ల ఇక్కడ స్త్రీలు, వైశ్యులు, శూద్రుల మాట ఎత్తినప్పుడు శారీరకంగా స్త్రీత్వం, శారీరకంగా వైశ్యత్వం, శారీరకంగా శూద్రత్వం గురించి చెప్పటం లేదు. మూడు రకాల అంతర్గత వ్యక్తిత్వాల గురించి చెపుతున్నాడు కృష్ణపరమాత్మ. అంటే స్వభావ స్త్రీత్వం, స్వభావ వైశ్యత్వం, స్వభావ శూద్రత్వం గురించి చెపుతున్నాడు.

1. **స్వభావ స్త్రీత్వం** – స్వభావరీత్యా భావోద్రేకాలకు గురికావటం. భావోద్రేకాలు ఎక్కువ ఉన్నవారు, తార్కికంగా ఆలోచించలేరు. అంటే వారి మనస్సు, బుద్ధి కన్నా బలంగా ఉండి, బుద్ధిమీద అధికారం చెలాయిస్తుంది. వారి మనోమయకోశం, విజ్ఞానమయకోశంమీద అధికారం చూపుతుంది. శాస్త్రం ప్రకారం విజ్ఞానమయకోశం అదుపులో మనోమయకోశం ఉండాలి. అంటే బుద్ధి అదుపులో మనస్సు ఉండాలి. మనస్సు బుద్ధిని తన అధీనంలో పెట్టుకుంటే, వేదాంతజ్ఞానం పొందటం కష్టమవుతుంది.

ఏమిటా సమస్య?

ఎ) **మనుష్యులతో సంగత్వం:** మనస్సు బలంగా ఉన్నవారికి అనుబంధాలు, ఆత్మీయతలమీద మమకారం ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రాథమిక సమస్య. వారు ఎవరినో గాఢంగా ప్రేమిస్తారు; ఎదుటివారు కూడా తనను గాఢంగా ప్రేమించాలనుకుంటారు. అలా ఎవరితోనైనా చిక్కటి అనుబంధం పెనవేసుకుని ఉండాలని కోరుకుంటారు. కాని వేదాంతంలో చెప్పే అంశం – సంగత్వంనుంచి, బంధంనుంచి బయటపడాలని. అహం అసంగం బ్రహ్మాస్మి. అసంగోహం, అసంగోహం, పునః పునః.

**న మృత్యుర్న శజ్కా న మే జాతిభేదః ।**
**పితా నైవ మే నైవ మాతా న జన్మ ।**
**న బన్ధుర్న మిత్రం గురుర్నైవ శిష్యః ।**
**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ ॥** నిర్వాణషట్కమ్ – 5

నాకు దేనితోనూ సంగత్వం లేదు. సంగత్వం అంటే బంధం. వేదాంతంలో ఈ బంధాలకు అతీతంగా ఎదగాలి. కాని భావోద్రేకాలు ఎక్కువగా ఉన్న మనస్సు తొందరగా ఈ బంధాలను వదులుకోదు. కష్టపడి ప్రాపంచిక బంధాలను వదులుకున్నా, గురువుతో కాని, భగవంతునితో కాని సంగత్వం కోరుకుంటుంది.

బి) **భగవంతునితో సంగత్వం:** వారి భావోద్రేకాలను అరికట్టటానికి ఒక ఇష్టదైవం ఉండాలి వారికి. అంటే భగవంతుణ్ణి తల్లిగానో, తండ్రిగానో, కొడుకుగానో భావించి, ఏ కష్టం వచ్చినా భగవంతునితో మొర పెట్టుకుంటారు. అంటే సగుణబ్రహ్మ, అది కూడా ఏకరూప భగవంతుని స్థాయినుంచి ఎదగలేరు. కాని వేదాంతబోధ ఏమిటి? నిర్గుణబ్రహ్మ గురించి తెలుసుకోవాలి. వైరాగ్యం పెంచుకోవాలి. కాని ఇటువంటి మనస్థత్వం ఉన్నవారు త్వరగా వైరాగ్యం పెంచుకోలేరు; నిర్గుణబ్రహ్మకు రాలేరు. అందువల్ల స్త్రిః అంటే స్త్రీ సహజమైన భావోద్రేకాలు ఉన్నవారు అని అర్థం. అది స్త్రీ అవచ్చు, పురుషుడు అవచ్చు.

2. **స్వభావ వైశ్యత్వం** – నాలుగవ అధ్యాయంలో వైశ్యుల గురించి వివరించినప్పుడు, వారికి రాజసిక మనస్సు ఉంటుందని చూశాము. వారు ఎక్కువగా బాహ్యముఖంగా ఉంటారు. ఎంతసేపూ డబ్బు ఇంకా ఇంకా సంపాదించాలనే తపన ఉంటుంది. వారిలో వ్యాపారబుద్ధి ఉంటుంది. ఋషీకేష్ లాంటి పుణ్యక్షేత్రానికి వెళ్ళినా కూడా, అక్కడ రుద్రాక్షవ్యాపారం చేస్తే, డబ్బు బాగా వస్తుంది అనుకుంటారు. మళ్ళీ ఇది జాతివైశ్యులకే చెందదు. పుట్టినది బ్రాహ్మణుడిగా పుట్టినా, ఈ వ్యాపారబుద్ధి ఉండవచ్చు కొందరిలో. అందువల్ల ఇక్కడ కూడా జాతివైశ్యుల గురించి మాట్లాడటం లేదు, గుణవైశ్యుల గురించి చూస్తున్నాము.

3. **స్వభావ శూద్రత్వం** – నాలుగవ అధ్యాయంలో శూద్రులకు తమోగుణం ప్రధానంగా ఉంటుందని చూశాము. తమోగుణం ఉన్నవారు బద్ధకంగా, పశుప్రవృత్తిలో ఉంటారు. పశుప్రవృత్తి అంటే ఏదో సాధించాలనే తపన ఉండదు. తిను, తాగు, ఆనందించు అనే సిద్ధాంతాన్ని నమ్ముకుని జీవితాన్ని ఆషామాషీగా గడిపేస్తారు. మళ్ళీ అదే సూత్రం ఇక్కడా వర్తింపజేయాలి. శూద్రుడు అంటే జాతిశూద్రుడా? బ్రాహ్మణ పుట్టుక పుట్టినా, శూద్రబుద్ధి

ఉండి, జీవితాన్ని ఆటపాటలతో గడిపేస్తే అతను కూడా శూద్రుని కిందకే వస్తాడు. అందువల్ల శూద్రుడు అంటే జాతిశూద్రుడు కాదు; గుణశూద్రుడు.

కాని ఈ నలుగురు కూడా ఎటువంటి బలహీనత ఉన్నా కూడా, తనను అంటే భగవంతుణ్ణి శరణు పొందితే, వారి పరిస్థితి మారుతుందని కృష్ణపరమాత్మ చెపుతున్నాడు. స్త్రీలకు త్వరగా బంధాలకు అతీతంగా ఎదగటానికి ఇష్టముండదు, ముఖ్యంగా పిల్లలతో బంధాలను వదులుకోవాలన్న భావననే తట్టుకోలేరు.

ఒక స్త్రీ అందిట 'నాకు మోక్షం కావాలంటే నేను నా కొడుకుమీద ఉన్న బంధం తెంచుకోవాలా? అయితే నాకు మోక్షమే వద్దు. అలా అయితే నేను మోక్షంమీద ఉన్న బంధాన్ని తెంచుకుంటాను.' సిగరెట్లు తెగ కాల్చేవాడు, ఏ వారపత్రిక తిరగేసినా పొగత్రాగటం హానికరం అనే ప్రకటనలు పదేపదే చూడసాగాడు. కొన్నాళ్ళకు అవి చదివీ చదివీ మానేశాను అన్నాడుట. అమ్మయ్య ఇతను సిగరెట్టు అలవాటు మానుకున్నాడు అన్నమాట అని మురిసిపోయే లోపే, 'ఆ వార్తాపత్రికలను చదవటం మానేశాను,' అన్నాడు. అలా మోక్షం అన్నా వదులుకోవటానికి సిద్ధపడతారు కాని బంధాలను వదులుకోవటానికి సిద్ధపడరు కొంతమంది.

అటువంటివారికి మధ్యే మార్గాన్ని సూచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. మీ బంధాలు వదులుకోకండి, భగవంతుడినైన నాతో బంధం పెంచుకోండి. నెమ్మదిగా నేనే మిమ్మల్ని ఈ బంధాలనుంచి ఎదిగేలా చేస్తాను.

**తేఽపి యాంతి పరాం గతిమ్** – అటువంటి వారిని నేను పరమగతికి తీసుకువెళతాను. ఈ శ్లోకం సారాంశం ఏమిటి? భక్తి ఉంటే బలవంతులను కాని, బలహీనులను కాని ఉద్ధరిస్తుంది.

శ్లో. 33 **కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా ।**
**అనిత్యమసుఖం లోకమ్ ఇమం ప్రాప్య భజస్వ మామ్ ॥**
కిమ్, పునః, బ్రాహ్మణాః, పుణ్యాః, భక్తాః, రాజర్షయః, తథా,
అనిత్యమ్, అసుఖమ్, లోకమ్, ఇమమ్, ప్రాప్య, భజస్వ, మామ్ ॥

| | | | |
|---|---|---|---|
| పుణ్యాః | = పుణ్యాత్ములైన | కిమ్, పునః | = చెప్పవలసినది ఏమున్నది? |
| బ్రాహ్మణాః | = బ్రాహ్మణులును | అసుఖమ్ | = సుఖరహితమైన |
| తథా | = అలాగే | అనిత్యమ్ | = క్షణభంగురమైన |
| రాజర్షయః | = రాజర్షులైన | ఇమమ్ | = ఈ |
| భక్తాః | = భక్తులు భగవంతుణ్ణి శరణు వేడి పరమపదమును పొందుదురను విషయములో | లోకమ్ | = మనుష్యలోకమును |
| | | ప్రాప్య | = పొంది |
| | | మామ్ | = నన్ను |
| | | భజస్వ | = భజింపుము |

**కిమ్ పునః పుణ్యాః భక్తాః బ్రాహ్మణాః తథా రాజర్షయః?**
**(తస్మాత్ త్వం) అనిత్యమ్ అసుఖమ్ ఇమమ్ లోకమ్ ప్రాప్య, మామ్ భజస్వ ।**

తా: పుణ్యాత్ములైన బ్రాహ్మణులును, అలాగే రాజర్షులైన భక్తులు భగవంతుని శరణు వేడి పరమపదమును పొందుదురను విషయములో చెప్పవలసినది ఏమున్నది? సుఖరహితమైన క్షణభంగురమైన ఈ మనుష్యలోకమును పొంది నిరంతరము నన్ను భజింపుము.

గుణవైశ్యులు, గుణశూద్రులు వారికి మానసిక బలహీనత ఉన్నా కూడా, మోక్షం పొందగలిగితే, ఇంక గుణబ్రాహ్మణులు, గుణక్షత్రియుల గురించి చెప్పేదేముంది?

గుణబ్రాహ్మణుడు సత్త్వగుణప్రధానంగా ఉంటాడు. పుట్టినప్పటినుంచి అతనికి ఆధ్యాత్మిక చింతన మెండుగా ఉంటుంది. అర్థకామాల వెంట పరుగులు తీయడు. అతను పూర్వజన్మలో సాధన చెయ్యటంవల్ల ఇప్పుడు గుణబ్రాహ్మణుడు అవుతాడు. గుణక్షత్రియుడు రజోగుణ ప్రధానంగా ఉంటాడు. గుణవైశ్యుడు కూడా రజోగుణప్రధానంగా ఉంటాడని చూశాము కదా, అయితే వీరిద్దరికీ మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి?

ఇద్దరూ బాహ్యముఖంగా ఎక్కువ పనులు చేస్తూ ఉంటారు కాని గుణక్షత్రియుడు నిస్వార్థంగా ఆ పనులు చేస్తే, గుణవైశ్యుడు స్వార్థంతో చేస్తాడు. స్వార్థంతో పనులు చేసే వ్యక్తి ఆధ్యాత్మికంగా ఎదగలేడు. గుణవైశ్యుడు లౌకికంగా ధనం బాగా సంపాదిస్తాడు కాని దానధర్మాలకు ఒక్క నయాపైసా కూడా ఖర్చు పెట్టడు. సంపాదించినదంతా తనకోసమే అనుకుంటాడు. ఎవరైనా దానం చెయ్యమని అడిగితే, అదుగో మా పక్కింటాయన దగ్గరకు వెళ్ళండి, ఆయన పెద్ద దానకర్ణుడు అని పైనుంచి సలహా ఇస్తాడు. అందువల్ల గుణవైశ్యుడు ప్రాపంచిక లాభాలు పొందవచ్చేమో కాని ఆధ్యాత్మిక ఎదుగదల ఉండదు.

గుణక్షత్రియుడు కూడా ఎప్పుడూ పనులు చేస్తూ ఉంటాడు కాని, తన స్వార్థంకోసం కాకుండా, సమాజం మేలుకోరి చేస్తూ ఉంటాడు. అటువంటి వ్యక్తికి త్వరగా చిత్తశుద్ధి కలుగుతుంది. అతను కర్మయోగిగా మారతాడు; గుణవైశ్యుడు కేవల కర్మఠుడిగా ఉండిపోతాడు. గుణక్షత్రియుడు కర్మయోగంనుంచి జ్ఞానానికి వచ్చి మోక్షం పొందటానికి ఎంతోకాలం పట్టదు.

అందువల్ల గుణబ్రాహ్మణుడు, గుణక్షత్రియుడు తక్కిన ఇద్దరికన్నా మెరుగైన పరిస్థితిలో ఉన్నారు. వారి భక్తి వారికి తోడ్పడుతుంది.

**కిం పునః** – గుణవైశ్యుడు, గుణశూద్రులే మోక్షం పొందగా లేనిది గుణబ్రాహ్మణుడు, గుణక్షత్రియుల గురించి చెప్పేదేముంది?

**పుణ్యాః బ్రాహ్మణాః** – గుణబ్రాహ్మణుడు. పుణ్య అంటే సాత్త్విక మనస్సు ఉన్నవారు; ధార్మిక ప్రవర్తన ఉన్నవారు.

**రాజర్షయః** – గుణక్షత్రియుడు.

**భక్తాః** – వీరు భక్తులు. వీరి గురించి చెప్పేదేముంది? వీరు మోక్షం పొందుతారు. దీన్ని బట్టి మనకు అర్థమయ్యింది ఏమిటి? మనము బలవంతులం లేదా బలహీనులం అనే విషయం పక్కనపెట్టి, భక్తిమార్గంలో అడుగుపెడితే, తక్కినది భగవంతుడే చూసుకుంటాడు.

**మాం భజస్వ** – నన్ను ప్రార్థించు. మొదట్లో ఆర్తభక్తుడిగా ఉన్నా కూడా ఫర్వాలేదు. ఎక్కడో అక్కడ మొదలు పెడితేనే చాలు.

కొంతమంది ఇప్పుడు ఊపిరి పీల్చుకునే తీరిక కూడా లేదు, రిటైరయ్యాక చూస్తాను అనుకుంటారు. కాని కృష్ణపరమాత్మ అప్పటిదాకా నువ్వు బ్రతికి ఉంటావని నమ్మకం ఏమిటి అంటున్నాడు.

**అనిత్యం లోకం ప్రాప్య** – అనిత్యలోకం పొందావు నువ్వు. అందువల్ల మంచి పనులను వాయిదా వెయ్యకు. అందువల్ల ఇప్పుడే మొదలుపెట్టు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉపనిషత్తులు, గీత వినే తీరిక లేదు అంటే ఫర్వాలేదు; పొద్దున్నే లేచి, చక్కగా స్నానం చేసి, కాఫీ తాగే ముందు దేవుని ముందు నిల్చుని భక్తిగా నమస్కారం చెయ్యండి. శారీరక, భావపర, మానసిక, ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం ఒక నిముషం, కనీసం అరనిముషం శ్రద్ధగా ప్రార్థన చెయ్యండి. కాని మొదలుపెట్టండి. మీరు అనిత్యలోకంలో ఉన్నారు. అది కూడా ఎలా ఉంది?

**అసుఖమ్** – అనేక కష్టాలతో నిండివుంది. అందువల్ల మీరు చూపాల్సిన భక్తిని వాయిదా వేయకండి; రేపేం పొంచివుందో మీ ఊహకు అందదు. ఆరోగ్యసమస్యలు ముంచుకు రావచ్చు; భగవద్గీత చదువుదాము అనుకుంటే కన్ను సరిగ్గా కనపడకపోవచ్చు; పోనీ విందాము అంటే చెవి పని చెయ్యకపోవచ్చు. అందువల్ల అశాశ్వతమైన, దుఃఖభూయిష్టమైన ఈ జగత్తులో మీరు చెయ్యగలిగిన మంచి పని, ఇప్పుడే ఇక్కడే చెయ్యండి. ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపి, కొంచెం సమయాన్ని దానికోసం కేటాయించండి. తక్కినది భగవంతుడే చూసుకుంటాడు. చివరి శ్లోకంతో ముక్తాయింపు పలుకుతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 34 **మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః ॥**
మన్మనాః, భవ, మద్భక్తః, మద్యాజీ, మామ్, నమస్కురు,
మామ్, ఏవ, ఏష్యసి, యుక్త్వా, ఏవమ్, ఆత్మానమ్, మత్పరాయణః ॥

| | | | |
|---|---|---|---|
| మన్మనాః | = నాయందు మనస్సు కలవాడవు | నమస్కురు | = నమస్కరింపుము |
| భవ | = కమ్ము | ఏవమ్ | = ఈ విధముగా |
| మద్భక్తః | = నా భక్తుడవు | ఆత్మానమ్ | = ఆత్మను |
| (భవ) | = కమ్ము | యుక్త్వా | = (నాయందే) నిలిపి |
| మద్యాజీ | = నన్ను పూజించు వాడవు | మత్పరాయణః | = మత్పరాయణుడవై |
| (భవ) | = కమ్ము | మామ్, ఏవ | = నన్నే |
| మామ్ | = నన్ను (నాకు) | ఏష్యసి | = పొందగలవు |

**(త్వం) మత్-మనాః మత్-భక్తః మత్-యాజీ (చ) భవ,**
**మామ్ మత్-పరాయణః (సన్) నమస్కురు ఏవమ్ ఆత్మానమ్ యుక్త్వా మామ్ ఏవ ఏష్యసి ।**

తా: నాయందు మనస్సు కలవాడవు కమ్ము, నా భక్తుడవు కమ్ము, నన్ను పూజించు వాడవు కమ్ము, నన్ను (నాకు) నమస్కరింపుము. ఈ విధముగా ఆత్మను (నాయందే) నిలిపి మత్పరాయణుడవై నన్నే పొందగలవు.

భక్తుని జీవనవిధానం ఎలా ఉండాలో ఈ శ్లోకంలో అద్భుతంగా వర్ణించాడు కృష్ణపరమాత్మ. చాలా అద్భుతమైన శ్లోకం. ఒక భక్తుడు ఎలా ఉంటాడో, ఎలాంటి జీవితాన్ని గడుపుతాడో తెలుసుకోవాలంటే, ఈ ఒక్క శ్లోకం చదివితే చాలు.

ఇక్కడ ఐదు అంశాలు చెప్పబడ్డాయి. అవి భక్తుని ఎదుగుదల చూపిస్తాయి. ఆ ఎదుగుదల అర్థం చేసుకోవటానికి ఈ శ్లోకంలో వరుసక్రమాన్ని మార్చుకుని చూద్దాము.

1. **మద్భక్తః (భవ)** – నామీద భక్తి పెంపొందించుకో. ఇది సాధనభక్తి. నాలుగు రకాల భక్తులు చూశాము. ఆర్తభక్తి, అర్థార్థీభక్తి, జిజ్ఞాసుభక్తి, జ్ఞానీభక్తి. మొదటి రెండు అంటే ఆర్తభక్తి, అర్థార్థీ భక్తిలో భగవంతుణ్ణి సాధనగా చూస్తారు, ప్రాపంచిక విషయాలను సాధ్యంగా చూస్తారు. ఫర్వాలేదు. అలా భగవంతుణ్ణి సాధనగా చూసినా కూడా అందుకోవటానికి భగవంతుడు సిద్ధమే. ఆయనకు తెలుసు, మనుష్యులు కోరేది ప్రాపంచిక విజయాలనేనని.

**ధనం ధాన్యం పశుం బహు పుత్రలాభం శత సంవత్సరం**

ఇలా ఏవో కోరుతారు. అందువల్ల భగవంతుణ్ణి సాధనగా వాడినా కూడా ఫర్వాలేదు. దీన్ని సకామభక్తి అంటారనీ, సకామభక్తికి కూడా ఫలితాలు వస్తాయనీ చూశాము. ఇంతకుముందు కూడా చూశాము, భక్తి ఉన్న వ్యక్తికి శాంతి ఉంటుంది. అది ఎటువంటి భక్తి అయినా సరే అటువంటి వారిని కూడా స్వీకరిస్తాడు భగవంతుడు.

2. **మత్పరాయణః** – నన్నే నీ అంతిమలక్ష్యంగా చేసుకో. ఇది సాధ్యంమీద భక్తి. ఇది రెండవదశ భక్తి. అంటే భగవంతుణ్ణి సాధనగా చూసే దశనుంచి సాధ్యంగా చూసే దశకి ఎదగటం. మనం వెంపర్లాడే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యప్రపంచంలో లేవని ఒక దశలో అర్థం చేసుకుంటాము. ఎన్ని ఉన్నా, ఏ భూకంపం లాంటిదో వస్తే ఒక్క క్షణంలో, లేదా అరక్షణంలో అన్నీ మటుమాయ మయిపోతాయని తెలుసుకుని, భగవంతునివైపు దృష్టి మరల్చాలి. మత్పరాయణంలో పరం అయణం అంటే జీవితంయొక్క అంతిమలక్ష్యం. అందువల్ల భగవంతుడు సాధన దశనుంచి సాధ్యం దశకు వచ్చాడు.

3. **మన్మనా భవ** – నన్ను నీ లక్ష్యంగా ఎన్నుకున్నాక, ఏకాగ్రత వీడకు. ఇది ముముక్షుభక్తి. గృహస్థుగా ఏ లౌకిక వ్యవహారం నడిపినా – అంటే ఇల్లు కట్టుకున్నా, డబ్బు సంపాదిస్తున్నా, పిల్లలను కన్నా, వారి బాగోగులు చూస్తున్నా, ఎన్ని పనులు చేయాల్సివున్నా వీటన్నిటి వెనక మనిషిగా మన జీవన లక్ష్యం ఏమిటో మర్చిపోకూడదు. ఈ పనులు మానమనటం లేదు, కాని సుప్తచేతన మనస్సులో, భగవంతుని చింతన ఎప్పుడూ ఉండాలి. మన్మనా భవ అంటే సుప్తచేతన మనస్సులో నిరంతరం పెట్టుకో. సంగీతవిద్వాంసుడు తను పాడే పాటలో లీనమైనా, ఎలా తంబూర శ్రుతిని వింటూనే ఉంటాడో అలా మన ప్రయత్నం లేకుండానే భగవంతుని చింతన ఎప్పుడూ ఉండాలి. అంటే ముముక్షుభక్తికి ఎదగాలి. గమ్యాన్ని ఎన్నడూ మర్చిపోకూడదు.

4. **మద్యాజీ (భవ)** – నువ్వు చేసే ప్రతి పనినీ నాకే అంకితం చెయ్యి. ఇది నిష్కామభక్తి.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్** – 9.27

ఏం చేసినా, ఏం తిన్నా, ఏ దానం చేసినా నాకే అర్పించు అన్నాడు అంతకు ముందు. అలా చెయ్యటంవల్ల ప్రతి పనీ కూడా ఆధ్యాత్మిక సాధనగా అవుతుంది. అన్నం వడ్డించగానే తినకుండా, భక్తితో ఈశ్వరుణ్ణి తలుచుకుని తింటే, అది యజ్ఞంగా మారుతుంది. ఇంతకుముందు కూడా చూశాము ఏం చేసినా ఈశ్వరార్పణభావనతో చెయ్యాలి. అంటే నిష్కామభక్తి లేదా కర్మయోగం పాటించాలి.

5. **మాం నమస్కురు** – నన్నే శరణు వేడు, నా దీవెనలు కోరు. ఇది ఈశ్వర అనుగ్రహం కోరే భక్తి. పై నాలుగు దశలూ పాటిస్తూ వస్తే, సహజంగా ఆధ్యాత్మికంగా ఎదుగుతాము. కాని ఒక్కోసారి అలా ఎదిగినప్పుడు గర్వం వచ్చే ప్రమాదముంది. గర్వం వచ్చిన మనిషి పతనమవుతాడు. అందుకని జీవితంలో ఏ విజయం సాధించినా, అది ఈశ్వరుని అనుగ్రహంవల్లనే పొందామని గ్రహించాలి. అంతేకాదు భవిష్యత్తులో కలగబోయే విజయాలకు కూడా ఈశ్వర అనుగ్రహం కావాలని గుర్తుంచుకోవాలి. మాం నమస్కురు అంటే కేవలం నమస్కారం చెయ్యటం కాదు, నన్ను శరణు వేడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ముందు దశలో మద్యాజీ అంటే నీ ఫ్రీవిల్‌ను ఉపయోగించు అని అర్థం; మాం నమస్కురు అంటే ఈశ్వర అనుగ్రహం కూడా కోరు అని అర్థం. ఈ విషయం చాలాసార్లు చూశాము. మన భవిష్యత్తును నిర్దేశించేది ఏది? ఫ్రీవిల్లా, ఈశ్వరకృపా? ఇక్కడ భగవంతుడే ఆ సందేహాన్ని తీర్చాడు. ఫ్రీవిల్, ఈశ్వరకృప రెండూ అవసరమే.

ఇప్పుడు ఈ ఐదుదశలను టూకీగా చూద్దాము. అవి –

| | | |
|---|---|---|
| **1.** మద్భక్తః భవ | **– నామీద భక్తి పెంపొందించుకో** | **– అది సాధనమీద భక్తి** |
| **2.** మత్పరాయణః | **– నన్నే నీ అంతిమ లక్ష్యంగా చేసుకో** | **– అది సాధ్యంమీద భక్తి** |
| **3.** మన్మనా భవ | **– నన్ను నీ లక్ష్యంగా ఎన్నుకున్నాక, ఏకాగ్రత వీడకు** | **– అది ముముక్షు భక్తి** |
| **4.** మద్యాజీ భవ | **– నువ్వు చేసే ప్రతి పనినీ నాకే అంకితం చెయ్యి** | **– అది నిష్కామ భక్తి** |
| **5.** మాం నమస్కురు | **– నన్నే శరణు వేడు, నా దీవెనలు కోరు** | **– అది ఈశ్వర అనుగ్రహం కోరే భక్తి** |

ఈ ఐదు నియమాలూ పాటిస్తే ఏం జరుగుతుంది?

**ఏవమ్ ఆత్మానం యుక్త్వా** – ఇటువంటి భక్తితత్పరతతో కూడిన జీవితం గడిపితే,

**మామ్ ఏవ ఏష్యసి** – నువ్వు నన్నే పొందగలవు. అంటే మోక్షం పొందగలవు.

అందువల్ల భక్తి ఏ దశలో మొదలుపెట్టినా, నెమ్మదిగా ఎదిగి, దైవకృపవల్ల మోక్షం పొందుతారు. దీన్నే ఇంకో విధంగా చెప్పాలంటే ఏకరూప ఈశ్వరభక్తితో మొదలుపెట్టి, అనేకరూప ఈశ్వరభక్తి స్థాయికి ఎదిగి, అక్కడ్నుంచి అరూప ఈశ్వరభక్తికి ఎదగాలి. కాని ఇలా ఎదగటానికి ప్రప్రథమంగా భక్తికి శ్రీకారం చుట్టాలి.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మావిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే రాజవిద్యారాజగుహ్యయోగోనామ నవమోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీ మద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు రాజవిద్యారాజగుహ్యయోగము అనే నవమోధ్యాయము.

## స్వామీజీ ఆణిముత్యాలు

యోగ, క్షేమాల విషయం ఏమిటి? యోగం అంటే **అప్రాప్తస్య ప్రాప్తిః** – లేనిదాన్ని పొందటం. అంటే కూడు, గుడ్డ, నివాసంలాంటివి పొందటం. క్షేమం అంటే **ప్రాప్తస్య రక్షణం** – పొందినదాన్ని రక్షించుకోవటం. మన జీవితంలో మనం చేస్తున్న పనులను వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ రెండే చేస్తూ ఉంటాము. లేనిదాన్ని పొందటానికి తాపత్రయం; పొందినదాన్ని నిలువుకునే తపన. ఉపనిషత్తులు, భగవద్గీతల గురించి ఆలోచించే తీరికే లేదు.

భగవంతుడు చూస్తాడు అంటే మనం బాధ్యతారహితంగా ప్రవర్తించాలని కాదు అర్థం, మన పరిధిలో ఉన్నంతవరకూ మనం చేసి, తక్కినది భగవంతునిమీద వెయ్యాలి. అలా చెయ్యటం వల్ల కలిగే లాభం ఏమిటి? భగవద్గీతబోధ వినటానికి మనకు కొంచెం ఖాళీ సమయం దొరుకుతుంది. ఒకవేళ యోగక్షేమాలు చక్కగా ఉన్నా కూడా అవి శాశ్వతం కాదు. మనం కూడా శాశ్వతం కాదు. అందువల్ల మన ధర్మం మనం నిర్వర్తించి, తక్కినది భగవంతునికి వదిలేయాలి.

భగవంతుడు ఖచ్చితంగా చూస్తాడా? ఇది ఒక శంక మనకు. ఎవర్నీ నమ్మలేని మనస్తత్వం. మనుష్యులు ఎలాగైతే అవసరమైన సమయంలో ఆదుకోకుండా పారిపోతారో, అలా భగవంతుడు కూడా చేస్తాడా? భగవంతుడు హామీపత్రం ఇస్తున్నాడు. ఎవరిమీదనైనా మీరు ఆధారపడాలనుకుంటే, నామీదే ఆధారపడండి అంటున్నాడు.

**యోగక్షేమం వహామ్యహమ్** – మీ యోగక్షేమాలను నేనే చూసుకుంటాను.

# అధ్యాయము 9 – రాజవిద్యారాజగుహ్యయోగము సారాంశము

తొమ్మిదవ అధ్యాయం, ఏడవ అధ్యాయానికి చాలా దగ్గరగా ఉంది, ఎనిమిదవ అధ్యాయానికి పూర్తి భిన్నంగా ఉంది.

ఎనిమిదవ అధ్యాయంలో సగుణ ఉపాసన గురించి చూశాము. సగుణ ఉపాసనలో రెండు దశలున్నాయి.

1. సగుణ ఉపాసన చేసి, చిత్త ఏకాగ్రత పొంది, నిర్గుణ జ్ఞానానికి వచ్చి, నిర్గుణబ్రహ్మ జ్ఞానం పొంది, ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందటం.
2. జీవితాంతం సగుణ ఉపాసన చేసి, మరణించాక బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ నిర్గుణబ్రహ్మ జ్ఞానం పొంది, అప్పుడు క్రమముక్తి పొందటం.

ఎనిమిదవ అధ్యాయంలో మొదటి రకం ఉపాసన చూడము. అంటే సగుణ ఉపాసకుడు నిర్గుణ జ్ఞానానికి రాడు. సగుణ ఉపాసకుడు ఏ కారణంవల్లనో, ఉపాసనలోనే ఉంటూ, మరణకాలంలో కూడా ఈశ్వరుణ్ణి జపిస్తూ మరణిస్తే, అతను శుక్లగతిలో బ్రహ్మలోకానికి వెళతాడు. అంటే అతను ఇక్కడ, జీవించి ఉండగా జ్ఞానాన్ని పొందడు. అందువల్ల జీవన్ముక్తి కూడా పొందడు.

బ్రహ్మలోకానికి వెళ్ళాక, అక్కడ సాక్షాత్తూ చతుర్ముఖబ్రహ్మద్వారా జ్ఞానాన్ని పొందాలి. అంటే అక్కడ వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే మోక్షం పొందుతాడు. అక్కడ పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి, శిష్యుడు సంసిద్ధంగా ఉంటాడు, గురువు సాక్షాత్తూ చతుర్ముఖబ్రహ్మ కాబట్టి జ్ఞానం తేలికగా పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు.

కాని కృష్ణపరమాత్మ మనకు క్రమముక్తిని సూచించటం లేదు. ఎందుకు? క్రమముక్తి కోరితే మనం మోక్షాన్ని వాయిదా వేస్తున్నాము. క్రమముక్తి జీవించి ఉండగా రాదని చూశాము. అందువల్ల కృష్ణపరమాత్మ మనం జీవించి ఉండగానే ఇప్పుడే, ఇక్కడే మోక్షం పొందాలని చెపుతున్నాడు. **జీవన్ ఏవ ముక్తి** – అంటే జీవించి ఉండగానే ముక్తి. అందువల్ల దీన్ని జీవన్ముక్తి అంటారు. దీన్ని సద్యోముక్తి అని కూడా అంటారు. సద్యః అంటే తక్షణం. ఇప్పుడు ఇన్‌స్టంట్ కాఫీ, ఇన్‌స్టంట్ ఇడ్లీ లాంటివి వచ్చాయి. అలా మోక్షం కూడా ఇన్‌స్టంట్‌గా వస్తుంది. ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్లు ఉన్నట్టుగా మనకు ఫాస్ట్ లిబరేషన్ రెస్టారెంటు ఉంది.

దీనికి ఏం చెయ్యాలి? ఎనిమిదవ అధ్యాయంలో చెప్పకుండా వదిలేసిన మొదటి రకం సగుణ ఉపాసన చెయ్యాలి. అంటే కొన్నాళ్ళు సగుణ ఉపాసన చేసి, దానిద్వారా జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొంది, ఈ జన్మలోనే నిర్గుణ జ్ఞానానికి రావాలి. బ్రహ్మలోకం వెళ్ళేదాకా వాయిదా వేయకూడదు. నిర్గుణబ్రహ్మజ్ఞానానికి రావాలంటే వేదాంతవిచారణ చెయ్యాలి. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. ఉపనిషత్తు లేదా వేదాంతం బోధించేది నిర్గుణబ్రహ్మ గురించే.

**యత్తదద్రేశ్యమగ్రాహ్యమగోత్రమవర్ణమచక్షుఃశ్రోత్రం తదపాణిపాదమ్ ।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః ॥**– ముండకం1.1.6

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగన్ధవచ్చ యత్ ।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే ॥** – కఠ 1.3.15

ఉపనిషత్తు వర్ణించేది సగుణ ఈశ్వరుణ్ణి కాదు, నిర్గుణ ఈశ్వరుణ్ణి. నిర్గుణ ఈశ్వరుణ్ణి ఉపనిషత్తు పరిభాషలో నిర్గుణబ్రహ్మ అంటారు. ఈ జ్ఞానాన్ని జ్ఞానయోగం అంటారు. జ్ఞానయోగంవల్ల ఒక వ్యక్తి నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందుతాడు.

ఏడవ అధ్యాయంలో నిర్గుణ ఈశ్వరుణ్ణి పరాప్రకృతి అనీ, సగుణ ఈశ్వరుణ్ణి అపరాప్రకృతి అనీ అన్నాడు కృష్ణపరమాత్మ. పరాప్రకృతి భగవంతునియొక్క ఉన్నత స్వరూపమనీ, ఆ జ్ఞానం పొందిన వ్యక్తి ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతాడనీ, తర్వాత విదేహముక్తి పొందుతాడనీ చూశాము.

ఆ విధంగా ఏడవ అధ్యాయంలో సద్యోముక్తి గురించి చెప్పి, ఎనిమిదవ అధ్యాయంలో క్రమముక్తి గురించి చెప్పి, మళ్ళీ తొమ్మిదవ అధ్యాయంలో సద్యోముక్తికి వచ్చాడు కృష్ణపరమాత్మ. అంటే 7, 9 అధ్యాయాలు నిర్గుణ ఈశ్వరజ్ఞానం గురించి చెపుతాయి.

నిర్గుణ ఈశ్వరజ్ఞానం అనగానే, 'అమ్మో, అది అర్థం చేసుకోవటం చాలా కష్టం, నిర్గుణం అంటే చాలా సూక్ష్మంగా ఉంటుంది,' అనేస్తారు కొందరు. అందువల్ల ఈ అధ్యాయం మొదట్లో కృష్ణపరమాత్మ నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందటం చాలా తేలిక అని చెపుతాడు. ఎవరికి కష్టం? నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందటానికి సిద్ధంగా లేనివారికి కష్టం. ఎప్పుడైతే మనస్సును సంసిద్ధం చేస్తారో, అప్పుడే నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందటం ఒలిచి ఉన్న అరటిపండును తిన్నంత తేలిక.

నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందటానికి మనస్సును ఎలా సంసిద్ధం చెయ్యాలి? కృష్ణపరమాత్మే మార్గం చూపించాడు. అందువల్ల తొమ్మిదవ అధ్యాయం సగుణ ఈశ్వర ఉపాసన, మనస్సును సంసిద్ధపరచటం, నిర్గుణ ఈశ్వరజ్ఞానం, మోక్షం – వీటి గురించి చెప్పింది. ఈ నేపథ్యంతో ఈ తొమ్మిదవ అధ్యాయాన్ని చూద్దాము.

తొమ్మిదవ అధ్యాయాన్ని ప్రధానంగా ఆరు భాగాలుగా విభజించవచ్చు. అవి –

| | |
|---|---|
| **1. ఉపోద్ఘాతం** | **– శ్లోకాలు 1-3** |
| **2. నిర్గుణ ఈశ్వరస్వరూపం** | **– శ్లోకాలు 4-10** |
| **3. సంసార కారణం** | **– శ్లోకం 11** |
| **4. సంసార నివృత్తి ఉపాయం** | **– శ్లోకాలు 12-19** |
| **5. భావనరూపభక్తి** | **– శ్లోకాలు 20-29** |
| **6. భక్తిస్తుతి** | **– శ్లోకాలు 30-34** |

**1. ఉపోద్ఘాతం: శ్లోకాలు 1-3**

మొదటి మూడు శ్లోకాల్లో విషయాన్ని ప్రవేశపెట్టాడు కృష్ణపరమాత్మ. ఏమిటా విషయం? ఈశ్వరజ్ఞానం. ఈశ్వరుని స్వరూపం రెండుగా ఉందని ఏడవ అధ్యాయంలో చూశాము. అవి అపరాప్రకృతి, పరాప్రకృతి. ఈశ్వరజ్ఞానం అంటే నిర్గుణ ఈశ్వరజ్ఞానం లేదా పరాప్రకృతి జ్ఞానం. సంసిద్ధంగా లేని మనస్సుకు అది అర్థం కాదు కాబట్టి ఈ విద్య వారికి రహస్యంగా మిగిలిపోతుంది. అందువల్ల ఈ విద్యను రాజగుహ్యం అన్నాడు కృష్ణపరమాత్మ.

కాని నిర్గుణ ఈశ్వరజ్ఞానం ఒక్కటే మోక్షాన్ని ఇవ్వగలదు, వేరే ఏదీ ఇవ్వలేదు కాబట్టి, ఈ విద్యను రాజవిద్య అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే జ్ఞానాలలోకెల్లా ఉత్తమమైన జ్ఞానం. అందువల్ల ఈ అధ్యాయానికి రాజవిద్యా రాజగుహ్య యోగము అని పేరు వచ్చింది. అంటే నిర్గుణ ఈశ్వరజ్ఞానం. ఈ అధ్యాయంలో విషయం నిర్గుణ ఈశ్వరజ్ఞానం.

ఈ జ్ఞానం పొందటానికి ఒక ముఖ్యమైన అర్హత కావాలని చెప్పాడు కృష్ణపరమాత్మ. అది శ్రద్ధ. ఇది కొత్త విషయంలో జ్ఞానం కాబట్టి, మీకు విషయం అర్థం కాకపోయినా గురువును కాని, శాస్త్రాన్ని కాని తోసిపుచ్చకూడదు. అది అర్థం అయ్యేంతదాకా ఓపిక పట్టాలి.

**అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప ।**

**అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥** - 9.3

ఈ జ్ఞానాన్ని తోసిపుచ్చితే నష్టపోయేది ఎవరు? మీరే! ఋషులు నష్టపోరు, గురువు నష్టపోడు. మీరే నష్టపోతారు. అందువల్ల మీరు శ్రద్ధగా నేర్చుకోవాలి.

**2. నిర్గుణ ఈశ్వర స్వరూపం: శ్లోకాలు 4-10**

నిర్గుణ ఈశ్వరుణ్ణి వేదాంతంలో బ్రహ్మ అంటారు. 4 నుంచి 10 శ్లోకాల వరకూ బ్రహ్మస్వరూపం గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. ఇది ఈ అధ్యాయంలో ముఖ్యాంశం. ఈ బ్రహ్మస్వరూపాన్ని కూడా ఉపనిషత్తులలోంచి చెప్పాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ తన బోధను తనకు తోచినట్టు, స్వంతంగా చెప్పలేదు. ఉపనిషత్తుల సారాన్ని చెప్పాడు.

**భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం** అని ప్రతి అధ్యాయం చివర్లో వస్తుంది. బ్రహ్మవిద్యను చెప్పే ఈ భగవద్గీత ఉపనిషత్తుల సారము.

**బ్రహ్మస్వరూపం**

ఎ) **అవ్యక్తం** - అవ్యక్తః అహం అస్మి. అవ్యక్తం అంటే ఇంద్రియ అగోచరం. అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం, అగంధం బ్రహ్మ. అందువల్ల ఎవరైనా నాకు భగవద్దర్శనం అయిందంటే అతని మాటను నమ్ముతాము కాని ఆ దర్శనం అపరాప్రకృతి దర్శనం అంటాము. కంటికి కనిపించాడు అంటే నిర్గుణబ్రహ్మ కాదు. ఎందుకంటే నిర్గుణబ్రహ్మ ఇంద్రియ అగోచరం. ఇక్కడ వాడిన పదం అవ్యక్తం.

బి) **సర్వవ్యాపకం – సర్వగతః అహం అస్మి.** సర్వగతం. అందువల్ల మన ఇష్టదైవం అపరాప్రకృతిలోకి వస్తాడు. భగవంతుడు వైకుంఠంలో ఉన్నాడు, కైలాసంలో ఉన్నాడు, బ్రహ్మలోకంలో ఉన్నాడు అంటే ఆయనకు దేశపరిమితి విధిస్తున్నాము. అంటే అర్థం చేసుకోండి, అపరాప్రకృతిని విమర్శించటం లేదు, కాని అక్కడే ఆగి పోవద్దంటున్నాము.

**సగుణ ఈశ్వర ప్రార్థన చెయ్యందే నిర్గుణ ఈశ్వరజ్ఞానం అసంభవం**
**నిర్గుణ ఈశ్వరజ్ఞానానికి రానిదే సగుణ ఈశ్వర ప్రార్థన అసంపూర్ణం**

అందువల్ల సగుణ ఈశ్వరప్రార్థన చేసి, ఎప్పుడో ఒకప్పుడు నిర్గుణ ఈశ్వరజ్ఞానానికి రావాలి. నిర్గుణ ఈశ్వరుడు సర్వగతం లేదా సర్వవ్యాపకం.

సి) **మిథ్యా జగదధిష్ఠానం –** మూడు రకాల సత్యాలు ఉన్నాయని చూశాము. మన స్వప్నం ప్రాతిభాసిక సత్యం; జగత్తు వ్యావహారిక సత్యం; నిర్గుణబ్రహ్మ పారమార్థిక సత్యం. ప్రాతిభాసిక సత్యంనుంచి వ్యావహారిక సత్యానికి లేస్తే, ప్రాతిభాసిక సత్యం వీగిపోతుంది. తేలికమాటల్లో చెప్పాలంటే స్వప్నంనుంచి జాగ్రదావస్థకు లేస్తే, స్వప్నం వీగిపోతుంది. అలాగే ఈ వ్యావహారిక సత్యంనుంచి పారమార్థిక సత్యానికి లేస్తే, వ్యావహారిక సత్యం వీగిపోతుంది. తేలికమాటల్లో చెప్పాలంటే, ఈ జగత్తు కూడా స్వప్నం లాంటిదే. దీన్ని స్వప్నం–2 అనవచ్చు. ఈ స్వప్నంనుంచి పరమాత్మ ఉన్నత స్వరూపానికి అంటే నిర్గుణ స్వరూపానికి లేస్తే ఈ జగత్తు వీగిపోతుంది. జగత్తు వీగిపోతుంది అంటే మిథ్య అవుతుంది. బ్రహ్మ సత్యం అవుతుంది.

**ఈ మిథ్యా జగత్తుకు సత్యబ్రహ్మ అధిష్ఠానం.** ఇదే భావన లలితా సహస్రనామంలో చూస్తాము.

**మిథ్యా జగదదిష్ఠాన ముక్తిదా ముక్తిరూపిణీ**
**లాస్యప్రియా లయకరీ లజ్జా రంభాది వందితా**

డి) **సృష్టి స్థితి లయ కారణం – మమ ఆత్మా భూత భావనః భూత భృన్నచ.** బ్రహ్మ ఈ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి।**
**తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా ॥** – తైత్తిరీయం 3.1

ఇ) **అసంగత్వం –** భగవంతుడు తాను జగదాధారం అన్నాడు; మొత్తం జగత్తు నాలో ఉంది అన్నాడు. అలాంటప్పుడు జగత్తులో ఉండే అశుద్ధం బ్రహ్మకు అంటుతుందా? మామూలుగా మనం కొత్తదుస్తులు వేసుకుని, మన ఒడిలో ఒక మురికి వస్తువును పెట్టుకుంటే, ఆ మురికి వెంటనే మన కొత్తదుస్తులకు అంటుతుంది. అలా జగత్తులోని పుణ్యపాపాలు బ్రహ్మకు అంటవా అంటే నేను అన్నిటికీ ఆశ్రయాన్ని కాని నాకేమీ అంటవు అన్నాడు. దీన్ని అసంగత్వం అంటారు.

దీనికి కృష్ణపరమాత్మ ఆకాశం ఉదాహరణ ఇచ్చాడు. ఆకాశవత్ అసంగ స్వరూపః. ఆకాశానికి కూడా రూపు లేదు; ఆకాశం కూడా సర్వవ్యాపకం. ఆకాశం కూడా అన్నిటికి ఆధారం. కాని ఆకాశం కూడా అసంగం.

**యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥** – 9.6

ఎఫ్) **అకర్తా, అభోక్తా** – అంతకుముందు బ్రహ్మ జగత్తుకు సృష్టి స్థితి లయ కారణం అన్నాడు. బ్రహ్మ సృష్టికర్త అంటే బ్రహ్మ కర్మ చేసినట్టు వస్తుంది. అప్పుడు ఆయన కర్త అవుతాడు. కర్త అయితే భోక్తృత్వం కూడా ఉండాలి. కర్త తను చేసిన కర్మఫలం అనుభవించాలి. దాన్ని భోక్తృత్వం అంటారు.

**తాని కర్మాణి మాం న నిబధ్నంతి**

నేను కర్మలు చేస్తున్నా కూడా ఆ కర్మలు నన్ను బంధించవు అన్నాడు.

**కర్మసు అసక్తం** – ఆ కర్మలతో నేను బంధం పెంచుకోవటం లేదు అన్నాడు. అందువల్ల బ్రహ్మ అకర్తా, అభోక్తా.

జి) **సాక్షీభూతం** – ఈశ్వరుడు జగత్తును సృష్టించాడంటే, కర్తా, భోక్తా అవాలి. ఆయన కర్త, భోక్తా అయితే పుణ్యపాపాలు అనుభవించాలి అనుకుంటాము. కాని కృష్ణపరమాత్మ నేను ప్రయత్నపూర్వకంగా ఏదీ చెయ్యటం లేదు, నా సమక్షంలో పనులు అవుతాయి అన్నాడు. **మయా అధ్యక్షేణ** అన్నాడు. దీన్ని సాక్షీభావం అంటారు.

ఒక గదిలో కాంతి ఉంటే, ఆ గదిలో జరిగే పనులన్నిటినీ కాంతి ప్రకాశింపజేస్తుంది. ఆ గదిలో మంచిపనులు జరగవచ్చు, చెడుపనులు జరగవచ్చు. కాని ఆ పనులయొక్క మంచి కాని, చెడు కాని కాంతికి అంటదు. అలాగే ఈశ్వరుడు సాక్షీభూతంగా చూస్తాడు.

### 3. సంసార కారణం: శ్లోకం 11

ఎందుకు మనకు సమస్యలు వస్తున్నాయి? సంసార కారణం ఈశ్వర అజ్ఞానం. ఈశ్వరుడు అంటే నిర్గుణ ఈశ్వరుడు అని మర్చిపోకూడదు. ఉన్నతస్థాయి ఈశ్వరుడు, నిర్గుణ ఈశ్వరుడు, పరాప్రకృతి ఇవన్నీ పర్యాయ పదాలు.

**సంసార కారణం కిమ్? బ్రహ్మ అజ్ఞానమ్ ఏవ సంసార కారణమ్**

నిర్గుణబ్రహ్మ అజ్ఞానం సంసారానికి కారణం అని ఒక తీర్మానం చేసేస్తే చాలదు. దానికి తర్కం జోడించాలి.

నిర్గుణం అంటే ఏమిటి? గుణాలు లేనిది. నిర్గుణం కానిది సగుణం. అంటే అపరాప్రకృతి. ఎప్పుడైతే గుణాల గురించి చెపుతామో, అప్పుడే వాటికి హెచ్చుతగ్గులు ఉంటాయి. శరీరమే తీసుకోండి, కొన్ని రోజులు నిలువుగా పెరుగుతాము; తర్వాత అడ్డంగా పెరుగుతాము. జుట్టు ఊడిపోతుంది, రంగు తగ్గుతుంది. అసలు ఏ మార్పూ లేని వస్తువు ఏదైనా చెప్పగలరా? అందువల్ల అపరాప్రకృతికి దేశ, కాల, వస్తు పరిమితులు ఉన్నాయి.

అంటే అవి ఒకరోజు వస్తాయి, ఇంకోరోజు మాయమవుతాయి. శాశ్వతంగా లేని వస్తువులు భద్రతను ఇవ్వగలవా? కాలం వాటిని నాశనం చేసేటట్టయితే అవి ఎలా శాశ్వతానందాన్ని ఇస్తాయి?

**మా కురు ధన జన యౌవన గర్వమ్ హరతి నిమేషాత్కాలః సర్వమ్** – భజగోవిందం

మనకు పరాప్రకృతి గురించి తెలియకపోతే ఏం చేస్తాము? అపరాప్రకృతినుంచే శాంతి, భద్రత, ఆనందాలను పొందటానికి ప్రయత్నిస్తాము. నిముషంలో మాయమయ్యే, కనుమరుగయ్యే వస్తువులమీద మమకారం పెంచుకుని, వాటిమీద ఆధారపడతాం. కాని అవి శాశ్వతం కాదు. ఒకవేళ అవి శాశ్వతంగా ఉన్నా మనం శాశ్వతం కాదు.

అశాశ్వతమైన ఈ అపరాప్రకృతిమీద ఆధారపడి, అది మనకు భద్రతను ఇవ్వకపోతే బాధపడతాము, నిరాశకు లోనవుతాము, ఆఖరికి భగవంతుణ్ణి నిందించటానికి కూడా వెనుకాడము.

అందువల్ల సంసారానికి కారణం ఏమిటి? తప్పుగా ఎదురు చూడటం. శాశ్వతం కాని వస్తువులనుంచి శాశ్వతత్వాన్ని ఆశించటం. ఎందుకంటే పరాప్రకృతి గురించి మనకు తెలియదు కాబట్టి. అందువల్ల సంసార సమస్యకు కారణం – బ్రహ్మ అజ్ఞానం. బ్రహ్మ గురించిన అజ్ఞానం.

**4. సంసార నివృత్తి ఉపాయం: శ్లోకాలు 12-19**

12 నుంచి 19 శ్లోకాల వరకూ సంసారనివృత్తి మార్గం చెప్పబడింది. ఒక్కముక్కలో చెప్పాలంటే భక్తి – సంసారనివృత్తికి మార్గం. కాకపోతే భక్తి అంటే ఏమిటో సరిగ్గా అర్థం చేసుకోవాలి. భక్తి అంటే ఒక సాధన కాదు, భక్తి అంటే అనేక స్థాయిల్లో సాధనలు. చివరికి ఆ భక్తి జ్ఞానంలో ముగియాలని గుర్తుంచుకోండి. ఎందుకు? సమస్య అజ్ఞానం. అజ్ఞానం సమస్య అయితే, పరిష్కారం ఏముంటుంది? జ్ఞానమే అవుతుంది.

**అవిరోధితయా కర్మ నావిద్యాం వినివర్తయేత్**
**విద్యాఽవిద్యాం నిహంత్యేవ తేజస్తిమిరసంఘవత్** – ఆత్మబోధ 3

ఈ విషయాన్ని శంకరులవారు ఆత్మబోధలో అందంగా వర్ణించారు. ఒకవేళ చీకటి సమస్య అయితే, దాన్ని ఎలా తొలగించాలి? అందరూ కలిసి, ఆ గది ఊడిస్తే, చీకటి పోతుందా? పన్నెండు గంటలు నిర్విరామంగా కరసేవ చేసినా, నీరసం రావటం తప్ప ఫలితం ఉండదు. యోగాసనం చేస్తే చీకటి పోతుందా? విష్ణుసహస్రనామం చేస్తే చీకటి పోతుందా? అర్థం చేసుకోండి – యోగాసనాన్ని, విష్ణుసహస్రనామాన్ని కించ పరచటం లేదు. అవి గొప్పవే, సందేహం లేదు, కాని ఇక్కడి ప్రశ్న – అవి చేస్తే చీకటి పోతుందా? పోదు. అయితే ఏం చెయ్యాలి? చాలా తేలిక. చిన్నదీపం వెలిగించాలి.

అలాగే ఇక్కడ సమస్య అజ్ఞానం. అది పోవాలంటే జ్ఞానం పొందాలి. అది కూడా నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొందాలి. దాని బదులు భక్తి పదం వేసాడంటే భక్తిలో అనేక దశలు ఉన్నాయనీ, చివరిదశ జ్ఞానమనీ అర్థం చేసుకోవాలి.

ఈ భక్తిలో మూడు స్థాయిల్లో సాధనలు ఉన్నాయి. వీటిని వివరంగా మళ్ళీ 12వ అధ్యాయంలో చర్చిస్తాడు కృష్ణపరమాత్మ. కాని ఇక్కడ ఈ విధంగా చెప్పబడ్డాయి. అవి కర్మరూపభక్తి, ఉపాసనరూపభక్తి, వేదాంతవిచారరూపభక్తి.

ఎ) **కర్మరూప భక్తి** – మొదటి స్థాయి భక్తి కర్మయోగంలా ఉండాలి. మీరు చేసే ప్రతిపనిని భగవంతునికి అర్పించాలి. మీరు మామూలుగా చేసే పనులే చెయ్యండి, కాని వాటిని ఈశ్వరార్పణభావనతో చెయ్యండి అన్నాడు.

బి) **ఉపాసనరూప భక్తి** – బాహ్యాముఖంగా పరుగులు తీసే మనస్సును అంతర్ముఖం చెయ్యాలి. రజోగుణం ఎక్కువ ఉన్నవారు ఎప్పుడూ కర్మ చేస్తూనే ఉంటారు. అది స్వార్థపూరితకర్మ కావచ్చు, నిస్వార్థమైన కర్మ కావచ్చు. కాని ఈ కర్మ తెలివిగా వీరిని ఎంతసేపూ బాహ్యాముఖంగా ఉంచుతుంది. వారు క్షణం ఖాళీగా కూర్చోలేరు. అందువల్ల వారికి కూర్చుని వేదాంత శ్రవణం చేసే తీరిక ఉండదు.

సంఘసేవ చెయ్యటం మంచిదే, కాదనటం లేదు; కాని మీరు చెయ్యగలిగినన్నాళ్ళు చేశారు; ఇంక మీరు పక్కకు తప్పుకుని, తర్వాత తరానికి అవకాశం ఇవ్వండి. మీ మనస్సును బాహ్యంగా చూడటం మానేసి అంతర్గతంగా చూడగలిగేటట్టు చేసుకోండి.

**అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభాః** – లలితా సహస్రనామం

బహిర్ముఖంగా ఉన్నవారు వేదాంతాన్ని అర్థం చేసుకోలేరు. అందువల్ల వారు బాహ్యాముఖంనుంచి అంతర్ముఖులవ్వాలి. ఇది కూడా భక్తే. సగుణ ఈశ్వర ఉపాసన చెయ్యాలి.

సి) **వేదాంతవిచారరూపభక్తి** – దీన్ని జ్ఞానయోగరూపభక్తి అని కూడా అంటారు. వేదాంతవిచారణ శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా చేస్తారు. నిజానికి మీరు భగవద్గీత బోధ వింటున్నా కూడా మీరు జ్ఞానరూపభక్తిని పాటిస్తున్నట్టే అర్థం. నాలుగవ అధ్యాయంలో దీనిని జ్ఞానయజ్ఞం అన్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానయజ్ఞం అనటమే కాదు, ఈ జ్ఞానయజ్ఞమే అన్ని రకాల యజ్ఞాల కన్నా గొప్పది అన్నాడు.

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥** – 4.33

అందువల్ల మీరు జ్ఞానలక్షణభక్తికి రావాలి. ఈ మూడు స్థాయిల భక్తీ దాటితే జ్ఞానీభక్తుడు ఈశ్వరజ్ఞానం పొందుతాడు. ఈశ్వరజ్ఞానం అంటే నిర్గుణ ఈశ్వరజ్ఞానం అని చూశాము.

అందువల్ల భక్తి మోక్షాన్ని ఇస్తుందంటే, మూడు స్థాయిల సాధనతో కూడిన భక్తి అని అర్థం చేసుకోవాలి. కేవలం భజన చేస్తే జ్ఞానం రాదు – అది మొదటి స్థాయి భక్తి; కేవలం ధ్యానం చేస్తే జ్ఞానం రాదు – అది రెండవ స్థాయి భక్తి; వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తేనే జ్ఞానం వస్తుంది. అది మూడవ స్థాయి భక్తి. అది ఎవరో చెప్పినది కాదు, సాక్షాత్తూ కృష్ణపరమాత్మే చెప్పాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

కృష్ణపరమాత్మ కూడా స్వంతంగా చెప్పటం లేదు, ఉపనిషత్తులను ఆధారంగా చేసుకుని చెపుతున్నాడు అని చూశాము.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥** – ముండకం

అందువల్ల ఈ మూడు దశలను పాటించిన భక్తుడు జ్ఞానం పొంది, తద్వారా మోక్షం పొందుతాడు.

ఆ విధంగా మోక్షం పొందటానికి మూడు దశల భక్తి ఉండాలి. కాని ఏ దశలోకి రావాలన్నా కూడా, ఆ వ్యక్తి బాగా పుణ్యం చేసుకుని ఉండాలి. పుణ్యం చేసుకుని ఉండకపోతే జ్ఞానానికీ, ఉపాసనకీ రావటం మాట దేవుడెరుగు, కర్మకే రాలేరు. అలా సంసారంలో పడి తిరుగుతూ ఉంటారు.

**మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।**
**రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥** – 9.12

అందువల్ల మోహంలో పడి కొట్టుమిట్టాడుతున్నవారు ఏ స్థాయికీ రాలేరు; కాని బాగా పుణ్యం చేసుకున్నవారు జ్ఞానరూపభక్తి స్థాయికి ఎదుగుతారు.

ఈ భక్తిని **సాధనరూప భక్తి** అంటారు.

**5. భావనారూప భక్తి: శ్లోకాలు 20-29**

20 నుంచి 29 శ్లోకాల వరకూ రెండు రకాల భక్తి గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. ముందు చూసినది సాధనరూపభక్తి అయితే, ఇప్పుడు చూసేది భావనారూప భక్తి. ఇవి రెండు – సకామభక్తి, నిష్కామభక్తి. ఈ రెండు రకాల భక్తిలో ఏమిటి వ్యత్యాసం ఉంది? అది సంకల్పం చెప్పటంలో మారుతుంది.

**మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం**

ఇంతవరకూ రెండింటికీ ఒకటే, తర్వాత మారుతుంది. మనకు రెండు మార్గాలు ఉన్నాయి. అవి శ్రేయోమార్గం, ప్రేయోమార్గం అని కఠోపనిషత్తులో చూశాము. శ్రేయోమార్గాన్ని ధీరులు ఎన్నుకుంటే, ప్రేయోమార్గాన్ని మందబుద్ధి ఉన్నవారు ఎన్నుకుంటారు అని వస్తుంది ఆ మంత్రంలో.

ఎ) **సకామ భక్తి** – ధీరులు అంటే వివేకం ఉన్నవారు. మందబుద్ధి అంటే వివేకం లేనివారు. సకామకర్మ చెయ్యటం పాపం కిందకి రాదు, అతను దాని ఫలితం కూడా పొందుతాడు అని కృష్ణపరమాత్మ చెప్పాడు.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – 9.21

విశాలమైన స్వర్గలోకానికి వెళ్ళి అక్కడ స్వర్గసుఖాలు పొందుతారు అని ఒకపక్క ఊరిస్తూనే, కాని పుణ్యం తీరగానే భూలోకం వచ్చి పడతారని చెప్పాడు. వారు వైకుంఠపాళి ఆట ఆడినట్టు ఉంటుంది వారి పరిస్థితి. వైకుంఠపాళిలో మొదట్లోనే పెద్దనిచ్చెన ఎక్కి పైకి వెళతాడు. అలా టకటకా రెండు నిచ్చెనలెక్కేసరికి దాదాపు చివరికి చేరుకుంటాడు. కాని పక్కనే పొంచివుంటుంది ఒక పెద్దపాము. దాని నోట పడితే అది ధన్‌మని చాలా కిందకి తెచ్చేస్తుంది. అలా పైకి ఎక్కుతూ, దిగుతూ ఎప్పుడో ఆట గెలుస్తాడు. జీవితమనే ఆట అలా వృత్తంలా సాగుతూనే ఉంటుంది. స్వర్గలోకం వెళుతూ, ఆనందాలు అనుభవిస్తూ, భూలోకానికి వచ్చి కష్టాలు పడుతూ మళ్ళీ స్వర్గలోకానికి వెళుతూ ఉంటారు. అంటే పునరపి జననం, పునరపి మరణం అనే వృత్తంలో పడి తిరుగుతూ ఉంటారు.

బి) **నిష్కామ భక్తి** – నిష్కామభక్తి ఉన్నవారు, వారు కోరుకునే శాంతి, భద్రత, ఆనందాలు జగత్తు ఇవ్వలేదనీ, నిత్యవస్తువు మాత్రమే ఇవ్వగలదనీ తెలుసుకుంటారు. అది పరాప్రకృతివల్లనే సాధ్యమని అర్థంచేసుకుంటారు. అందువల్ల వారు ఏదైనా భక్తిగా కోరినా, పరాప్రకృతి జ్ఞానానికి సంబంధించిన విషయాలే కోరుకుంటారు. వారికి మనస్సు సిద్ధంగా లేకపోతే, 'ఓ దేవా, నా మనస్సును బ్రహ్మజ్ఞానానికి సిద్ధం చెయ్యి,' అని వారు ప్రార్థిస్తారు. అటువంటి ప్రార్థన సంధ్యావందనంలో వస్తుంది.

మహేరణాయ చక్షసే అంటే బ్రహ్మజ్ఞానానికి ఏవి కావాలో నాకు తెలియదు. ఓ దేవా, నువ్వే నాకు అవన్నీ సమకూర్చు. దానికి తల్లి ఉదాహరణ వస్తుంది ఆ మంత్రంలో. పిల్లవాడికి ఏ వయస్సులో ఎటువంటి ఆహారం పెట్టాలో, ఎంతమేరకు పెట్టాలో తల్లికి తెలుసు. ముందు తల్లి తన పాలనే ఇస్తుంది. నెమ్మదిగా పిల్లవాడు ఎదుగుతున్న కొద్దీ అతని ఆహారనియమాలు మారుస్తూ వస్తుంది. ఎంత అద్భుతం!

ఓ దేవా, నాకు చిత్తశుద్ధి లేకపోతే చిత్తశుద్ధిని కలిగించు; గురువును ఏర్పరచు; జ్ఞానం పొందటానికి అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరచు; జ్ఞానం పొందటానికి బోధకు వెళ్ళటం మొదలెట్టితే, చివరిదాకా వెళ్ళేలా అవకాశం కల్పించు; నాకు బోధ అర్థం కాకపోతే అది అర్థమయ్యేలా చెయ్యి; అర్థమయ్యి, నా మెదడులో నిలవకపోతే బోధ నిలిచేలా చెయ్యి.

ఇవన్నీ నిష్కామభక్తి కిందకే వస్తాయి. చిత్తశుద్ధి కోరినా, బోధ నిలిచేలా చెయ్యమన్నా కూడా నిష్కామభక్తి కిందకే వస్తాయి.

నిష్కామభక్తి గురించి చెప్పాక, కృష్ణపరమాత్మ సకామభక్తిని పాటించటం చాలా కష్టమని చెప్పాడు. దానికి శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువ. నిష్కామభక్తికి శ్రమ తక్కువ, ఫలితం ఎక్కువ. కాని మూఢులు కష్టమైన సకామభక్తిని పాటించి, పరిమితి ఉన్న ఫలాన్ని పొందుతున్నారు; తెలివైన నిష్కామభక్తులు తేలికగా అనంతాన్ని పొందుతున్నారు.

ఎందుకు సకామభక్తి కష్టం? కోరిక కోరి పూజ చేస్తే దానికి వంద విధినిషేధాలు ఉంటాయి. ఏ దేవునికి ఏ పూజ చెయ్యాలి, ఎప్పుడు చెయ్యాలి, ఎలా చెయ్యాలి. ఏ నైవేద్యం పెట్టాలి లాంటి నియమాలు ఎన్నో ఉంటాయి. ఏదైనా పొరపాటు చేస్తే, దానికి ప్రాయశ్చిత్త మంత్రం ఉంటుంది.

ఏదైనా మంత్రం సరిగ్గా చదవకపోతే దానికి ప్రాయశ్చిత్త మంత్రం చదవాలి. కాని వచ్చిన చిక్కేమిటంటే, ఆ ప్రాయశ్చిత్తమంత్రం చదవటమే రాదు; దానికి ఇంకో ప్రాయశ్చిత్తమంత్రం చదవాల్సి ఉంటుంది. అది అలా నిరంతరంగా సాగుతుంది. అందువల్ల సకామభక్తిలో అనేక నియమాలు ఉంటాయి. కాని నిష్కామభక్తిలో ఇవేమీ అవసరం లేదు.

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ॥** – 9.26

ఆ విధంగా సకామభక్తికి, నిష్కామభక్తికి మధ్య ఉన్న భేదాలను ఎత్తి చూపాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? మనమందరం సకామభక్తి స్థాయినుంచి నిష్కామభక్తి స్థాయికి ఎదగాలని కృష్ణపరమాత్మ ఆశ. కాని నాకు చాలా బాధ్యతలున్నాయి; దానికి తగ్గ కోరికలు ఉన్నాయి అంటే ఫర్వాలేదు, నెమ్మదిగానే రండి; కాని ఆ కోరికలను తగ్గించుకుంటూ రండి. కాని ఎప్పుడో ఒకప్పుడు నిష్కామభక్తికి రండి అన్నాడు.

**6. భక్తి స్తుతి: శ్లోకాలు 30–34**

చివరి భాగంలో భక్తిని స్తుతించాడు కృష్ణపరమాత్మ. భక్తిలో అనేకదశలున్నాయి కాబట్టి, అది నిచ్చెన లాంటిది. మొట్టమొదటి మెట్టు కర్మ లక్షణభక్తి. తర్వాత ఉపాసన లక్షణభక్తి. ఆ తర్వాత జ్ఞానలక్షణభక్తి వస్తాయి. ఇన్ని దశలు ఉన్నాయి కాబట్టి, ఒక సాధకుడు ఏ దశలోనైనా మొదలుపెట్టవచ్చు. ముందు కర్మయోగంలో మొదలుపెట్టినా తప్పులేదు, సకామకర్మ చేసినా తప్పులేదు; కాని దాన్ని కూడా ఈశ్వరునికి అర్పించాలి. దీని గురించి మరింత వివరంగా పన్నెండవ అధ్యాయంలో చూస్తాము. అందువల్ల ఏ స్థాయిలో మొదలుపెట్టినా ఫర్వాలేదు.

ఇంకొక అడుగు ముందుకేశాడు కృష్ణపరమాత్మ. ఎవరైనా అనేక పాపాలు చేసివున్నా, పంచమహాపాపాలు చేసివున్నా, అపరాధభావంతో కృంగిపోకుండా భక్తిమార్గంలోకి అడుగు పెట్టమన్నాడు. అపరాధభావం మనిషిని చాలా కృంగదీసి, అతను భక్తిలోకి రాకుండా చేస్తుంది. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే గురువు, దైవం ప్రోత్సహించగలరే కాని సాధకుడే స్వయంగా ప్రయత్నించాలి. మీరు ఏదైనా పరుగుపందెంలో పాల్గొంటే, మీరే పరుగులు తీయాలి. మీ చుట్టూ ఉన్నవారు అరుపులు, కేకలతో మిమ్మల్ని ప్రోత్సహించగలరు. అంతే! అలాగే మీకు జీవితంలో నాలుగు కృపలు కావాలి. అవి గురుకృప, ఈశ్వరకృప, శాస్త్రకృప, ఆత్మకృప. తక్కిన మూడూ తేలిగ్గా దొరుకుతాయి కాని ఆత్మకృపే త్వరగా రాదు. ఆత్మకృప అంటే మీమీద మీకు నమ్మకం ఉండాలి. నమ్మకం ఉండాలంటే అపరాధభావన ఉండకూడదు. ఎప్పుడైతే తప్పు చేశానని అర్థమైందో, అప్పుడే ఆ మార్గాన్ని వదిలి, భక్తిమార్గంలోకి అడుగుపెట్టమని చెప్పాడు కృష్ణపరమాత్మ. మారదామని నిశ్చయించుకుని, ప్రయత్నం చేస్తే, ఆ నిర్ణయమే మిమ్మల్ని సాధువులుగా చేస్తుంది.

**అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ ।**
**సాధురేవ స మంతవ్యః, సమ్యగ్వ్యవసితో హి సః ॥** – 9.30

తర్వాత ఇంకొక రకం వారి గురించి చెప్పాడు. కొంతమందికి పుట్టుక వల్లనో, మనస్సు వల్లనో ఏవైనా సమస్యలు ఉన్నా కూడా వారు కూడా భక్తిమార్గంలోకి మళ్ళితే మోక్షం పొందవచ్చు. ఇటువంటి వారిని నలుగురిని పేర్కొన్నాడు. వారు – పాపయోనయః స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః – 9.32.

నాస్తికుల ఇంటిలో పుట్టినవారు; స్త్రీలమాదిరిగా బంధాలు ఉన్నవారు; వైశ్య, శూద్రులలాగ రజోగుణం ఉన్నవారు. వీరు జ్ఞానం పొందటం కష్టం. అటువంటి వారు కూడా ప్రయత్నం చేసి భక్తిమార్గం వైపు మళ్ళితే, తప్పకుండా మోక్షం పొందుతారు.

అందువల్ల ఓ అర్జునా, ముందుగా భక్తుడివి కమ్ము అన్నాడు. ఆఖరిశ్లోకంలో ఆ భక్తిలో ఐదు దశలను వర్ణించాడు. అవి –

| | | |
|---|---|---|
| 1. **మద్భక్తః భవ** | – నామీద భక్తి పెంపొందించుకో | – ఇది సాధనమీద భక్తి |
| 2. **మత్పరాయణః** | – నన్నే నీ అంతిమ లక్ష్యంగా చేసుకో | – ఇది సాధ్యంమీద భక్తి |
| 3. **మన్మనా భవ** | – నన్ను నీ లక్ష్యంగా ఎన్నుకున్నాక, ఏకాగ్రత వీడకు | – ఇది ముముక్షుభక్తి |
| 4. **మద్యాజీ భవ** | – నువ్వు చేసే ప్రతిపనినీ నాకే అంకితం చెయ్యి | – ఇది నిష్కామభక్తి |
| 5. **మాం నమస్కురు** | – నన్నే శరణు వేడు, నా దీవెనలు కోరు | – ఇది ఈశ్వరానుగ్రహం కోరే భక్తి |

మద్యాజీ అంటే నీ ఫ్రీవిల్‌ను ఉపయోగించు అని అర్థం; మాం నమస్కురు అంటే ఈశ్వర అనుగ్రహం కూడా కోరు అని అర్థం.

**మామ్ ఏవ ఏష్యసి** – ఈ ఐదుదశలూ పాటిస్తే, నువ్వు నన్నే పొందగలవు. ఈ విధంగా భక్తిని స్తుతించటం ద్వారా కృష్ణపరమాత్మ ఈ అధ్యాయాన్ని ముగించాడు. జ్ఞానయోగం అన్ని విద్యలలోకి శ్రేష్ఠమైనది కాబట్టి రాజవిద్య; అందరికీ పరాప్రకృతి గురించి తెలియదు కాబట్టి రాజగుహ్యం అయింది. అందువల్ల ఈ అధ్యాయం పేరు **రాజవిద్యా రాజగుహ్య యోగము**.